www.andhrajyothy.com
హైదరాబాద్ సిటీ

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI
పేజీలు: 14
సంపుటి (Volume) : 66
సంచిక (Issue) : 40

సోమవారం | 26-5-2025 | వెల (Price) : Rs. 6.50

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, వైశాఖమాసం, బహుళపక్షం; తిథి: చతుర్దశి మ.12:12 తదుపరి అమావాస్య నక్షత్రం: భరణి ఉ.8.24, కృత్తిక తె.5.32; వర్జ్యం: రా.6:58-8:23; దుర్ముహూర్తం: మ.12:38-1:29, మ.3:13-4:05; అమృతఘడియలు: తె.3:26-4:50; రాహుకాలం: 7:30-9:00; సూర్యోదయం: 5:44; సూర్యాస్తమయం: 6:40

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

కాళేశ్వరంలో భక్తుల అరిగోస

పుష్కరాల 11వ రోజున 3.50 లక్షల మంది రాక

15 కి.మీ. మేర స్తంభించిన ట్రాఫిక్

నియంత్రణలో అధికారుల వైఫల్యం

12

శివయ్య దర్శనం కోసం భక్తుల పడిగాపులు

మంచినీరు, నిలువ నీడ లేక ఇక్కట్లు

అధికారుల వైఫల్యంపై మంత్రి శ్రీధర్‌బాబు ఆగ్రహం

పుణ్యస్నానం ఆచరించిన గవర్నర్ దంపతులు





మిస్ సోమాలియా

మిస్ కెనడా

అందాల బొమ్మలు.. కన్నీటి చెమ్మలు!

ఏడేళ్ల వయసులోనే యోని ఛేదన.. ఆ దురాచారంపై పోరు

16 ఏళ్లకే అత్యాచారం బారిన.. హక్కుల కోసం ఆరాటం

ఊహ తెలియనప్పుడే లైంగిక వేధింపులు.. వాటిపై పోరాటం

మిస్ వరల్డ్ పోటీదారుల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో విషాద గాథ

విశ్వవేదికపై తమ వాణి వినిపించిన సుందరీమణులు



మిస్ జాంబియా

హైదరాబాద్ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): మహిళల ప్రాణాలను హరించే ఆటవిక ఆచారాలను భరించింది ఓ వనిత. అదృష్టవశాత్తు బతికిన ఆమె.. కొండంత ధైర్యం తెచ్చుకుంది. ఆ దేశంలో మహిళల మాన, ప్రాణాలను దెబ్బతీసేలా ఉన్న మూఢాచారాలపై పోరాటాన్ని ప్రారంభించింది. పదహారేళ్లకే అత్యాచారానికి గురైంది మరో మహిళ.. కొన్నేళ్ల తర్వాత ఆ క్షోభ నుంచి బయటపడిన ఆమె.. తమ దేశంలో బాలికల పట్ల జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా పనిచేస్తోంది. తెలిసీ తెలియని వయసులోనే లైంగిక వేధింపులు ఎదుర్కొంది ఓ బాలిక. కాస్త వయసు

మిగతా 14వ పేజీలో...

మిల్లా మాగీ ఆరోపణలు అబద్ధం

ఆమె పాల్గొన్న ప్రతీ కార్యక్రమం వీడియో స్వయంగా చూశా

14

ఎవరూ అసభ్యంగా ప్రవర్తించలేదు

బ్రిటన్ పత్రిక కావాలని చేసి ఉండొచ్చు

మిస్ ఇంగ్లండ్ వివాదంపై జయేశ్ రంజన్

పోటీదార్ల నుంచి అభిప్రాయాల సేకరణ

పార్టీ మీ జాగీరా?

మీరేమైనా గుత్త పట్టారా?.. అక్కకు హక్కులు లేవా?

కవితకు మద్దతుగా సోషల్ మీడియాలో ఆమె సన్నిహితుల పోస్టులు



ఎవరూ స్పందించొద్దు!

ఆలోచించి అడుగులు వేయాలి

దుష్ప్రచారంపై కాదు.. పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలి

కవిత వ్యవహారంపై కేటీఆర్‌కు కేసీఆర్ దిశానిర్దేశం

తనయుడిని ఫామ్‌హౌస్‌కు పిలిపించుకున్న తండ్రి

3 గంటలపాటు మంతనాలు

కాళేశ్వరం నోటీసులపైనా చర్చ

జూన్ 1న అమెరికాలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ

13

కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ విమర్శనాస్త్రాలు

కుట్రలపై ఎందుకు స్పందించలేదని ప్రశ్నలు

'వుయ్ స్టాండ్ విత్ కవితక్క' పేరుతో సర్క్యులేట్

చివరన 'జై తెలంగాణ.. జై కేసీఆర్' నినాదం

రెండు రోజులైనా కేసీఆర్ నుంచి రాని పిలుపు!

అధినేత నిర్ణయంపై బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్కంఠ

కేసీఆర్‌తో కేటీఆర్ భేటీపై ఆసక్తికర చర్చ



హైదరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు.. ఆయన కుమార్తె కవిత రాసిన లేఖ వ్యవహారం, కేసీఆర్ చుట్టూ దయ్యాలున్నాయన్న ఆమె వ్యాఖ్యలు ఆ పార్టీలో రోజురోజుకూ మరింత చర్చనీయాంశంగా మారుతున్నాయి. కవితకు మద్దతుగా వాట్సాప్, సామాజిక మాధ్యమాల్లో పోస్టులు వెల్లువెత్తుతున్నాయి. కొన్ని పోస్టులు ఆమెకు వ్యతిరేకంగా కూడా వస్తున్నాయి. అయితే ఆదివారం.. కవితకు అత్యంత సన్నిహితంగా ఉండే ఒకరు పెట్టిన పోస్టు బీఆర్ఎస్ వర్గాల్లో తీవ్ర చర్చకు దారి తీసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను టార్గెట్ చేస్తూ ఆ పోస్టు ఉంది. పార్టీ అంతర్గత విషయాలు అంతర్గతంగానే మాట్లాడాలన్న కేటీఆర్.. పార్టీకి వ్యతిరేకంగా బహిర్గతంగా మాట్లాడిందెవరో చెప్పాలని అందులో పేర్కొన్నారు. కవిత రాసిన లేఖను ఎవరు బహిర్గతం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. తనపై కుట్రలు జరుగుతున్నాయని, పార్టీ స్పందించాలని కవిత అన్నప్పుడు కేటీఆర్ ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బీఆర్ఎస్ ప్రజాస్వామ్యయుతమైన పార్టీ అని, అందరికీ స్వేచ్ఛ ఉంటుందని చెప్పిన కేటీఆర్.. సమన్యాయం ఎందుకు పాటించడం లేదని నిలదీశారు. కేటీఆర్‌పై, హరీశ్‌రావుపై ఆరోపణలు వస్తే కేసులు వేసేందుకు ముందుండే పార్టీ.. కవిత విషయంలో ఎందుకు అంటీముట్టనట్లు వ్యవహరించిందని ప్రశ్నించారు. పెద్దవారిపై జరుగుతున్న కుట్రలపైనే స్పందించకపోతే

మిగతా 13వ పేజీలో...



4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

జపాన్‌ను అధిగమించాం

మన జీడీపీ రూ.356 లక్షల కోట్లు

ఇదే వేగంతో వెళ్తే.. మూడేళ్లలో మూడో స్థానాన్నీ కైవసం చేసుకుంటాం

నీతిఆయోగ్ సీఈఓ సుబ్రమణ్యం వెల్లడి

గత పదేళ్లలో భారత్ తలసరి ఆదాయం రెట్టింపైందని ఐఎంఎఫ్ వెల్లడి

న్యూఢిల్లీ, మే 25: జపాన్‌ను అధిగమించి భారత్.. ప్రపంచంలోనే నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించింది. ప్రస్తుత ధరల ప్రకారం భారత్ జీడీపీ 4.187 ట్రిలియన్ డాలర్లు (రూ.3,56,61,000 కోట్లు) కాగా.. జపాన్ జీడీపీ 4.186 ట్రిలియన్ డాలర్లు (రూ.3,56,53,000 కోట్లు). నీతిఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం ఈ వివరాలను వెల్లడించారు. 'భారత్ జపాన్‌ను దాటేసింది. ఐఎంఎఫ్ గణాంకాల

మిగతా 2వ పేజీలో...

స్థిరంగా అడుగులు

త్వరలో జర్మనీని అధిగమించే అవకాశం

గత ఐదేళ్లలో కరోనాను తట్టుకొని వృద్ధి

ఒడిదుడుకుల్లో జర్మనీ ఆర్థిక వ్యవస్థ

2

టీపీసీసీకి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు



త్వరలో పీసీసీ కొత్త కార్యవర్గం.. వారంలో మంత్రివర్గ విస్తరణ!

క్యాబినెట్‌లో కొత్తగా ఐదుగురికి అవకాశం

ప్రస్తుత మంత్రుల్లో ఒకరిద్దరికి స్థానచలనం

కేసీ వేణుగోపాల్‌తో గంటకు పైగా సీఎం, పీసీసీ చీఫ్ భేటీ

నేడు రాహుల్, రేపు ఖర్గేతో రేవంత్, మహేశ్‌గౌడ్ సమావేశం

బీఆర్ఎస్‌లో పంచాయితీపై ఆరా.. కవిత లేఖపైనా చర్చ

న్యూఢిల్లీ, మే 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ(టీపీసీసీ)కి నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లను నియవిుంచనున్నట్లు తెలిసింది. వీరి నియామకం విషయంలో సామాజిక సమీకరణాలకు ప్రాధాన్యతనిస్తున్నట్లు సమాచారం. ఆదివారం సాయంత్రం ఢిల్లీ లోధి రోడ్డులోని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి(సంస్థాగత వ్యవహారాలు) కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ భేటీ అయ్యారు. ఈ భేటీలో ప్రధానంగా మంత్రి వర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గ కూర్పుపై గంటకు పైగా చర్చించారు. ముందు నుంచి పీసీసీలో బాహుబలి(జంబో) కమిటీకి ప్రాధాన్యమిస్తారనే ప్రచారం జరిగినా.. తాజా భేటీ సందర్భంగా 10-15% కోత విధించాలని కేసీ వేణుగోపాల్ సూచించినట్లు తెలిసింది. నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్ల విషయంలోనూ సామాజిక న్యాయాన్ని పాటించాలని ఆయన సూచించారని సమాచారం. ఇక తెలంగాణ మంత్రివర్గ విస్తరణ కూడా దాదాపుగా ఓ కొలిక్కి వచ్చినట్లు కనిపిస్తోంది. వారంరోజుల్లో మంత్రివర్గ విస్తరణతోపాటు.. పీసీసీ పదవుల భర్తీకి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే

మిగతా 13వ పేజీలో...



మంచిర్యాలకు

గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు

ప్రస్తుత రోడ్డుకు ప్రత్యామ్నాయంగా మూడు ప్రతిపాదనలు

ఆర్ఆర్ఆర్ అవతల నుంచి మంచిర్యాల వరకు నిర్మాణం

శామీర్‌పేట వరకు రేడియల్ రోడ్డు నిర్మించేలా ప్రణాళిక

పీపీపీ విధానంలో నిర్మితమైన ప్రస్తుత హెచ్‌కేఆర్ రోడ్డు

ఆ కాంట్రాక్టు సంస్థతో చర్చించే ఆలోచనలో ప్రభుత్వం

త్వరలో నిర్ణయం.. కేంద్ర ప్రభుత్వానికీ నివేదిక

హైదరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ఉన్న హైదరాబాద్-కరీంనగర్-రామగుండం రహదారి (హెచ్‌కేఆర్ రోడ్డు)కి ప్రత్యామ్నాయంగా గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ మేరకు రాజీవ్ రహదారిగా పిలిచే ప్రస్తుత రోడ్డుకు ప్రత్యామ్నాయంగా రెండు వైపులా కలిపి మూడు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. ప్రస్తుత రోడ్డు హైదరాబాద్ నగరంలోని జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి ప్రారంభమవుతుంది. ఔటర్ రింగు రోడ్డు (ఓఆర్ఆర్) దగ్గర 17వ నంబరు ఎగ్జిట్ వద్ద నుంచి నాలుగు వరుసలతో ఉంది. అయితే నగరం నుంచి శామీర్‌పేట

మిగతా 3వ పేజీలో...

సినిమా సూపిస్త మామా!

నటులు, బ్యాక్‌గ్రౌండ్, మ్యూజిక్ అంతా ఏఐతోనే!

కథ, స్క్రీన్‌ప్లే, పాటలు, మాటలు దానితోనే..

అద్భుతమైన, అందమైన ఏఐ క్యారెక్టర్లు

నచ్చిన గొంతు.. కావాల్సినట్టుగా సంగీతం

ఖర్చు లేకుండానే అందమైన లొకేషన్లు

మొత్తంగా ఏఐతోనే రూపొందిన కన్నడ సినిమా 'లవ్ యూ'

కేవలం ఇద్దరు కూర్చుని రూ.10 లక్షలతో పూర్తి

ఏఐతో చైనా సినిమా.. 'పైరేట్ క్వీన్'

సినిమా ఇండస్ట్రీకి ఇది వరమా?.. శాపమా?



సినిమా అంటే 24 కళల సమాహారం. దర్శకుడు, నటీనటుల నుంచి లైట్ బాయ్ వరకు.. ఎడిటింగ్ నుంచి వీఎఫ్ఎక్స్ వరకు వందలు, వేల మంది కలిసి పనిచేస్తే.. కొన్ని నెలల పాటు కష్టపడితేనేగానీ ఒక సినిమా పూర్తికాదు. కానీ ఇద్దరు వ్యక్తులు ఓ గదిలో కూర్చుని.. రెండు, మూడు కంప్యూటర్లు పెట్టుకుని.. పూర్తిస్థాయి సినిమాను సిద్ధం చేసేస్తే!! కథ, స్క్రీన్‌ప్లే దగ్గరి నుంచి నటీనటులు, సంగీతం, పాటలు, గ్రాఫిక్స్ ఇలా మొత్తం '24 క్రాఫ్ట్' పని.. ఒక్కరే చేసేస్తే!! చేసేస్తే కాదు... 'కృత్రిమ మేధ (ఏఐ)' చేసి చూపిస్తోంది.. 'సినిమా' చూపిస్తోంది. కంప్యూటర్ ముందు కూర్చుని తగిన సూచనలు ఇస్తే చాలు.. మనకు

మిగతా 3వ పేజీలో...



కన్నడ సినిమా 'లవ్‌యూ'లో ఏఐతో సృష్టించిన హీరో, హీరోయిన్



డ్రోన్ ఎగురవేస్తున్న మహిళలు

డ్రోన్ దీదీలు

ఎరువులు, పురుగు మందులను డ్రోన్లతో పిచికారి చేస్తూ సంగారెడ్డి మహిళల ఉపాధి

'నమో డ్రోన్ దీదీ' పథకం కింద శిక్షణ

డ్రోన్ ధర 10 లక్షలు.. 80% సబ్సిడీ

ఎకరా 8 నిమిషాల్లోపే పిచికారి.. గంటకు అద్దె 500.. లాభదాయకమన్న మహిళలు

మన్‌కీబాత్‌లో ప్రధాని మోదీ ప్రస్తావన

జోగిపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): సంకల్ప బలానికి సాంకేతిక పరిజ్ఞానం తోడైతే ఏదైనా సాధించవచ్చు. ఇదీ సంగారెడ్డి జిల్లా స్వయం సహాయక బృందాలకు చెందిన మహిళల గురించి చెబుతూ వారిపై 'మన్‌కీ బాత్' వేదికగా ప్రధాని మోదీ చేసిన ప్రశంసాపూర్వకమైన వ్యాఖ్య! ఆయన చెప్పినట్లుగానే వారంతా నూతన విప్లవానికి నాంది పలికారు. మహిళా శక్తికి నిదర్శనంగా

మిగతా 12వ పేజీలో...

ఆ మహిళల్లో యోధుల స్ఫూర్తి లేదు!

ఉగ్రవాదులపై పోరాడి ఉండాల్సింది..

అప్పుడు మరణాల సంఖ్య తగ్గేది

పహల్గాం దాడి బాధిత మహిళలపై బీజేపీ ఎంపీ జంగ్రా వ్యాఖ్యలు

మండిపడ్డ ప్రతిపక్ష పార్టీలు

2



ఢిల్లీలో వర్షాలతో నీట మునిగిన ఓ రోడ్డు

వర్షాలకు ఢిల్లీ అతలాకుతలం

గంటకు 82 కి.మీ వేగంతో గాలులు.. 200 విమానాలపై ప్రభావం

ఏసీపీ కార్యాలయం పైకప్పు కూలి పోలీసు అధికారి దుర్మరణం

రోడ్లపై నీళ్లు.. మునిగిన వాహనాలు.. లోతట్టు ప్రాంతాలు జలమయం

కేరళలోనూ వర్షాల ఉధృతి.. మహారాష్ట్రను తాకిన రుతుపవనాలు

రాష్ట్రంలో నేడు, రేపు భారీ వర్షాలు.. యెల్లో అలెర్ట్ జారీ

2

2-3 రోజుల్లో ఏపీకి నైరుతి.. రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం



రూ.3 వేల టోల్ ఫీజు చెల్లిస్తే..

ఏడాదంతా హైవేలపై ప్రయాణం

3

త్వరలో కేంద్రం కొత్త పాలసీ

క్వార్ట్జ్ కేసులో..

కాకాణి అరెస్టు

బెంగళూరు శివార్లలో పట్టివేత!

2 నెలలుగా పరారీలో ఏపీ మాజీ మంత్రి

క్వార్ట్జ్ అక్రమ రవాణాతోపాటు ఎస్టీలను బెదిరించిన కేసులోనూ నిందితుడు

12

ముందస్తు బెయిల్ కోసం విఫల యత్నం

పహల్గాంలో పర్యాటక మహిళలు ఉగ్రవాదులపై పోరాడి ఉండాల్సింది..



- వారు తిరగబడి ఉంటే మరణాల సంఖ్య తక్కువగా ఉండేది
- బీజేపీ ఎంపీ వివాదాస్పద వ్యాఖ్యలు

భివానీ, మే 25: పహల్గాం ఉగ్రదాడిలో భర్తల ప్రాణాలు కోల్పోయిన మహిళలపై బీజేపీ రాజ్యసభ ఎంపీ రామ్‌చందర్ జంగ్రా వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. పర్యాటకులు ఉగ్రవాదులను వేడుకొనే బదులు.. వారిపై తిరగబడి పోరాడాల్సిందని, బాధిత మహిళల్లో యోధుల స్ఫూర్తి లేదని, అందుకే తమ భర్తలను కోల్పోవాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. పర్యాటకులు అగ్నివీర్ శిక్షణ పొంది ఉంటే.. ఉగ్రదాడిలో మృతుల సంఖ్య తక్కువగా ఉండేదంటూ కామెంట్ చేశారు. హరియాణాలోని భివానీలో శనివారం జరిగిన అహిల్యాబాయ్ హోల్కర్ 300వ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. 'భర్తలను కోల్పోయిన మహిళలకు స్ఫూర్తి, శక్తి లేవు. అందుకే వారు ఉగ్రదాడి బాధితులు అయ్యారు. వేడుకోవడం వలన ఉగ్రవాదులు ఒక్కరిని కూడా వదిలిపెట్టలేదు. మనవాళ్లు చేతులు జోడించి చనిపోయారు' అని జంగ్రా అన్నారు. జంగ్రా వ్యాఖ్యలు వైరల్ అయ్యాయి. ఈ వ్యాఖ్యలపై విపక్ష పార్టీల నేతలు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. పహల్గాం దాడి బాధిత మహిళలపై జంగ్రా చేసిన అసహ్యకరమైన ప్రకటన ఖండించదగినది అనే పదం కూడా సరిపోదని సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ విమర్శించారు. బీజేపీ మహిళలను గౌరవించడానికి బదులు.. వారిని వేధిస్తోందని, ఇది ఆ పార్టీ నిజస్వరూపమని అన్నారు. కాగా, విమర్శలపై జంగ్రా స్పందించారు. ఎవరినీ కించపర్చాలన్నది తన ఉద్దేశం కాదని, అవసరమైతే క్షమాపణ చెప్తానని అన్నారు.

భారతీయులను చంపేసి తప్పించుకోగలం.. అనుకునే రోజులు పోయాయి: థరూర్

న్యూయార్క్, మే 25: భారత సరిహద్దులు దాటి, భారతదేశంలో దాడులు చేసి, భారత పౌరులను చంపేసి తప్పించుకోగలం అని పాకిస్థాన్‌లో కూర్చున్న వాళ్ల ఆలోచనలు చేసే రోజులు పోయాయని కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ అన్నారు. భారత పౌరులను చంపిన వారు ఎవరైనా తప్పకుండా మూల్యం చెల్లించాల్సిందేనన్నారు. ఆపరేషన్ సిందూర్‌తో ఇది స్పష్టమైందని, ఇకముందు ఉగ్రవాదులు చెల్లించాల్సిన మూల్యం ఇంకా ఇంకా పెరుగుతుందని హెచ్చరించారు. ఉగ్రవాదంపై పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిని ఎండగట్టడం కోసం శశిథరూర్ నేతృత్వంలోని అఖిలపక్ష బృందం ఆదివారం అమెరికాకు వెళ్లింది. న్యూయార్క్‌లోని భారత కాన్సులేట్‌లో భారత సంతతి ప్రముఖులు, మీడియా ప్రతినిధులతో థరూర్ మాట్లాడారు. తాను ప్రభుత్వంలో భాగస్వామిని కానని, ప్రతిపక్షంలో ఉన్నానని గుర్తు చేసిన ఆయన.. ఉగ్రవాదంపై పోరులో దేశమంతా ఐక్యంగా ఉందన్న సందేశమిచ్చారు. భారత్ ఎప్పుడూ పాకిస్థాన్‌పై దాడులకు దిగలేదని, వారు దాడి చేస్తేనే ప్రతిస్పందించిందని గుర్తు చేశారు. ముంబై, ఉరీ, పుల్వామా ఉగ్ర దాడులను గుర్తు చేశారు. కాగా, అమెరికా పర్యటన సందర్భంగా థరూర్ నేతృత్వంలోని అఖిలపక్ష బృందం 9/11దాడుల స్మారకాన్ని సందర్శించింది. మరోవైపు, ఉగ్ర ముఠాలు అమాయక ప్రజలను హత్య చేసి మతాన్ని అడ్డు పెట్టుకుంటున్నాయని ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. ఒవైసీ నేతృత్వంలోని అఖిలపక్ష బృందం బహ్రెయిన్‌లో పర్యటించింది.

భారత్‌ను అతిపెద్ద ముప్పుగా చూస్తున్న పాక్

- అమెరికా రక్షణ నిఘా సంస్థ వార్షిక నివేదిక వెల్లడి

వాషింగ్టన్, మే 25: పాకిస్థాన్.. భారత్‌ను అతిపెద్ద ముప్పుగా పరిగణిస్తోందని, తన అణ్వాయుధాలను ఆధునీకరించుకోవడంతో పాటు భారీ విధ్వంసక ఆయుధాలను సమీకరించుకుంటోందని అమెరికా రక్షణ నిఘా సంస్థ వార్షిక నివేదిక బయటపెట్టింది. ఇందుకు చైనా, టర్కీ, సింగపూర్, యూఏఈ దేశాల సహకారం తీసుకుంటున్నట్లు వెల్లడించింది. అణు పదార్థాల భద్రత, న్యూక్లియర్ కమాండ్ కంట్రోల్‌తో పాటు భారీ విధ్వంసక ఆయుధాల అభివృద్ధికి అవసరమైన వస్తువులు, టెక్నాలజీని విదేశీ సరఫరాదారులు, మధ్యవర్తుల సహాయంతో పాక్ సేకరిస్తోందని నివేదిక తెలిపింది. పాకిస్థాన్ తనకు కావాల్సిన ఆయుధాలను చైనా నుంచే కొనుగోలు చేస్తోందని, అయితే ఇటీవల కాలంలో చైనా కార్మికులపై ఉగ్రవాదుల దాడులు పెరగడంతో రెండు దేశాల మధ్య కొంతమేరకు సంఘర్షణ ఏర్పడిందని నివేదిక వెల్లడించింది. అయితే, చైనాను భారత్ ప్రధాన విరోధిగా చూస్తోందని, ఈ తరుణంలో చైనాకు చెక్ పెట్టేందుకు హిందూ మహాసముద్రం ప్రాంతంలోని ఇతర దేశాలతో రక్షణ సంబంధాలను బలోపేతం చేసుకోవడంపై భారత్ ప్రధానంగా దృష్టి సారించిందని ఈ నివేదిక తెలిపింది. రక్షణ రంగాన్ని పటిష్ఠం చేసుకునేందుకు, ఇతర దేశాలపై ఆధారపడటాన్ని తగ్గించుకునేందుకు, సైన్యాన్ని ఆధునీకరించుకునేందుకు భారత్ దేశీయంగా రక్షణ ఉత్పత్తుల తయారీని పెద్ద ఎత్తున ప్రారంభించిందని నివేదిక వెల్లడించింది.

పెద్ద కొడుకును పార్టీ నుంచి బహిష్కరించిన లాలూ



పట్నా, మే 25: ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తన పెద్ద కుమారుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను ఆరేళ్ల పాటు పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లు ప్రకటించారు. ఇకపై పార్టీ కార్యకలాపాల్లో, కుటుంబ వ్యవహారాల్లో తేజ్ ప్రతాప్‌కు ఎలాంటి పాత్ర ఉండబోదని స్పష్టం చేశారు. కుటుంబ విలువలు, సంప్రదాయాలకు విరుద్ధంగా నడుచుకుంటున్నందుకు, బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్నందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని లాలూ తన ఎక్స్ ఖాతా ద్వారా తెలిపారు. తాను 12 ఏళ్లుగా అనుష్క యాదవ్ అనే మహిళతో రిలేషన్‌లో ఉన్నానని తెలుపుతూ తేజ్ ప్రతాప్ శనివారం తన ఫేస్‌బుక్ ఖాతాలో చేసిన పోస్ట్ వైరల్ అయింది. ఆ మరుసటి రోజే లాలూ అతడిపై బహిష్కరణ వేటు వేశారు. అయితే తన పోస్టుపై ఆదివారం ఉదయమే తేజ్ ప్రతాప్ యాదవ్ స్పందించారు. ఆ పోస్టు తాను పెట్టింది కాదని, తన ఫేస్‌బుక్ ఖాతాను ఎవరో హ్యాక్ చేశారని పేర్కొన్నారు. మరికొన్ని నెలల్లో బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఇది ఆ రాష్ట్రంలో సంచలనంగా మారింది.

కొవిడ్‌తో ఇద్దరు వ్యక్తుల మృతి

న్యూఢిల్లీ, మే 25: దేశంలో మళ్లీ కొవిడ్-19 కేసులు పెరుగుతున్నాయి. గత 24 గంటల్లో కరోనా పాజిటివ్ అని వైద్య పరీక్షల్లో తేలిన ఇద్దరు వ్యక్తులు ఇతర అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. కర్ణాటకలో 84 ఏళ్ల వృద్ధుడికి కరోనా పాజిటివ్ రావడంతో తీవ్ర అనారోగ్యంతో మరణించగా, మహారాష్ట్రలోని థానెలో 21 ఏళ్ల యువకుడు కరోనాతో చనిపోయాడు. పలు రాష్ట్రాల్లో కొవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో శనివారం కేంద్ర ఆరోగ్యశాఖ కార్యదర్శి పుణ్య సాలిలా శ్రీవాత్సవ దేశవ్యాప్తంగా పరిస్థితిని సమీక్షించారు. కేరళ, తమిళనాడు, కర్ణాటక, ఢిల్లీ, గుజరాత్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ప్రధానంగా కొవిడ్-19 కేసులు పెరుగుతున్నాయి.

లోకేశ్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించాలని టీడీపీ అధిష్ఠానంపై పార్టీ శ్రేణుల ఒత్తిడి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్‌లో చోటు చేసుకుంటున్న పలు రాజకీయ పరిణామాల నేపథ్యంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్‌కు పార్టీలో కీలక పాత్ర అప్పగించే అవకాశాలు ప్రస్ఫుటంగా కనిపిస్తున్నాయి. పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడి(వర్కింగ్ ప్రెసిడెంట్)గా ఆయనకు బాధ్యతలు అప్పగించాలని టీడీపీ శ్రేణుల నుంచి అధిష్ఠానంపై పెద్దఎత్తున ఒత్తిడి వస్తోంది. 27, 28, 29 తేదీల్లో కడపలో జరిగే మహానాడులో ఆయనకు కొత్త బాధ్యతల అప్పగింతపై చర్చించి నిర్ణయించే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు క్షణం తీరికలేకుండా అధికారిక కార్యక్రమాల్లో నిమగ్నమైపోయారు. చంద్రబాబు దృష్టి అంతా ప్రభుత్వంపైనే కేంద్రీకృతం కావడంతో పార్టీలో ఏం జరుగుతోందో నిశితంగా పరిశీలించే అవకాశం ఆయనకు లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో పార్టీ వ్యవహారాలను చూసేందుకు లోకేశ్‌ను వర్కింగ్ ప్రెసిడెంట్ చేయాలని డిమాండ్ వినిపిస్తోంది.

ఆపరేషన్ సిందూర్..

'మేడిన్ ఇండియా' విజయం

ఉగ్ర పోరులో కీలక మలుపు.. ఇది కేవలం సైనిక చర్య కాదు భారత్ పరివర్తనకు నిదర్శనం: ప్రధాని

న్యూఢిల్లీ, మే 25 (ఆంధ్రజ్యోతి): 'ఆపరేషన్ సిందూర్' టెర్రరిజంపై పోరులో కీలక మలుపుగా ప్రధాని మోదీ పేర్కొన్నారు. 'మేడిన్ ఇండియా' ఆయుధాలు, వ్యవస్థలు దీని విజయంలో కీలక భూమిక నిర్వహించాయన్నారు. 'ఇవాళ దేశం మొత్తం ఉగ్రవాదానికి వ్యతిరేకంగా ఏకమైంది. భారత్ అసలు బలం ఇదే. ఈ సందర్భంగా దేశవాసులందరినీ ఒకటి కోరుతున్నాను. అవకాశం ఉన్న చోట.. మన జీవనావసరాలకు దేశీయంగా ఉత్పత్తి అయ్యే వస్తువులను మాత్రమే వాడదామని అందరం ప్రతిజ్ఞ చేద్దాం' అని పిలుపిచ్చారు. ప్రతి నెలా చివరి ఆదివారం ఆకాశవాణిలో ప్రధాని 'మన్ కీ బాత్' ప్రసంగం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆదివారం 122వ సంచికలో పాకిస్థాన్, దాని ప్రేరిత ఉగ్రవాదులపై 'ఆపరేషన్ సిందూర్' గురించి వివరించారు. ఎన్డీఏ పాలిత రాష్ట్రాల సీఎంలు, ఉపముఖ్యమంత్రులు, నేతలు ఢిల్లీలో మూకుమ్మడిగా ఈ కార్యక్రమం విన్నారు. ఆపరేషన్ సిందూర్ తర్వాత తొలిసారి 'మన్ కీ బాత్'లో మోదీ మాట్లాడారు. పాకిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీరు (పీవోకే)ల్లో భారత సైన్యం నాశనం చేసిన ఉగ్రవాద స్థావరాల ఫొటోలను ఈ సందర్భంగా ఆయన విడుదల చేశారు. ప్రధానంగా పీవోకేలో ధ్వంసమైన గుల్పూర్, అబ్బాస్, బర్నాలా క్యాంపుల గురించి ప్రస్తావించారు. జమ్మూకశ్మీరులోని రాజౌరీ, పూంచ్‌లలో కార్యకలాపాలు నిర్వహించే లష్కరే తయ్యబా టెర్రరిస్టులకు గుల్పూర్ శిబిరం ప్రధాన స్థావరం. అబ్బాస్.. లష్కరే ఆత్మాహుతి బాంబర్ల శిక్షణకు సంబంధించిన కీలక కేంద్రం. ఆయుధ శిక్షణ, ఐఈడీల తయారీని బర్నాలాలో నేర్పుతారు. ఉగ్రవాద స్థావరాలపై భారత బలగాలు కచ్చితత్వంతో దాడియడం అసాధారణమని మోదీ అన్నారు. 'మన ఇంజనీర్లు, సాంకేతిక సిబ్బంది, ఆపరేషన్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరి శ్రమకూ ఈ విజయం చిహ్నం. ఆపరేషన్‌సిందూర్ యావజ్జాతిలో దేశభక్తి భావన చొప్పించింది' అని చెప్పారు. 'ఆపరేషన్ విజయవంతానికి.. ఆత్మనిర్భర భారత్ స్ఫూర్తితో దేశీయంగా పెరిగిన రక్షణ సామర్థ్యం ప్రధాన కారణం. దేశీయంగా రూపుదిద్దుకున్న ఆయుధాలు, టెక్నాలజీ శక్తికి మన సైనికుల శౌర్యం తోడయింది. ఆపరేషన్ సిందూర్.. స్థానికత కోసం గళమెత్తేందుకు (వోకల్ ఫర్ లోకల్) సరికొత్త ఉత్తేజాన్ని ఇచ్చింది. ఇది దేశభక్తిని ఇనుమడింపజేయడమే గాక.. స్వావలంబన స్ఫూర్తిని కూడా బలోపేతం చేసింది. మనందరం ఒక్క అడుగు ముందుకేస్తే భారత పురోగతికి పెద్దఎత్తున తోడ్పడుతుంది' అని మోదీ ఉద్ఘాటించారు. 'వోకల్ ఫర్ లోకల్' ఉద్యమంలో భాగంగా చాలా మంది భారతీయులు.. తమ సెలవు దినాలను దేశీయంగానే గడపాలని నిర్ణయించుకున్నారని చెప్పారు. పలువురు యువత భారత్‌లోనే పెళ్లి చేసుకుంటామని అంటున్నారన్నారు. టర్కీ నగరం ఇస్తాంబుల్ నగరం అంతర్జాతీయంగా పెళ్లిళ్లకు పెట్టింది పేరు. అయితే, ఆ దేశం ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌కు మద్దతివ్వడంతో టర్కీని బాయ్‌కాట్ చేయాలన్న డిమాండ్ పెరుగుతోంది ఈ నేపథ్యంలో మోదీ విదేశాల్లో పెళ్లిళ్ల అంశాన్ని ప్రస్తావించడం విశేషం.



ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, డిప్యూటీ సీఎంల భేటీలో పవన్‌కు గులాబీ పువ్వును అందిస్తున్న మోదీ

మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో అభివృద్ధి

మావోయిజంపై సమైక్య పోరాటం ఫలితాలిస్తోందని ప్రధాని చెప్పారు. మావోయిస్టు ప్రాబల్య ప్రాంతాల్లో అభివృద్ధి, విద్య ముందంజలో ఉన్నాయని తెలిపారు. 'మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో కతేజ్‌వారీ వంటి మారుమూల ప్రాంతాలు, ఛత్తీస్‌గఢ్‌లోని దంతెవాడ ప్రాంతంలో విద్య, బస్సు సర్వీసుల వంటి మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఛత్తీస్‌గఢ్ క్లాస్ 10 పరీక్షల్లో 95 శాతం ఫలితాలతో దంతెవాడ జిల్లా అగ్ర స్థానంలో నిలువగా.. క్లాస్ 12 ఫలితాల్లో ఆరో ర్యాంకు లభించిందని చెప్పారు.. బస్తర్ ఒలింపిక్స్, సైన్స్ లేబొరేటరీల గురించి ప్రముఖంగా ప్రస్తావించారు.

ప్రజలకు 'డబుల్ ఇంజన్' ప్రయోజనాలు అందాలి

ఎన్డీయే సీఎంలు, డిప్యూటీ సీఎంల భేటీలో మోదీ

న్యూఢిల్లీ, మే 25(ఆంధ్రజ్యోతి): దేశంలో డబుల్ ఇంజన్ ప్రభుత్వాలతో కలిగే ప్రయోజనాలను ప్రజలకు సమర్థవంతంగా చేర్చాలని ప్రధాని మోదీ సూచించారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి నమూనాకు అనుగుణంగా దేశంలో కులగణన జరుగుతుందని తెలిపారు. సమాజంలో అభివృద్ధి ఫలాలు చేరని వారిని, అణగారిన వారిని అభివృద్ధి పథంలోకి తెచ్చేందుకు త్వరలో చేపట్టబోయే కులగణనతో ముందడుగు పడుతుందని చెప్పారు. ఆదివారం ఢిల్లీలో మోదీ అధ్యక్షతన ఎన్డీయే పాలిత రాష్ట్రాల సీఎంలు, ఉప ముఖ్యమంత్రుల సమావేశం జరిగింది. 20 మంది సీఎంలు, 18 మంది డిప్యూటీ సీఎంలు పాల్గొన్నారు. మోదీ నాయకత్వంలో మన సాయుధ దళాలు ఆపరేషన్ సిందూర్‌ను విజయవంతంగా నిర్వహించి, పాకిస్థాన్‌కు గట్టి గుణపాఠం చెప్పడాన్ని సమావేశం అభినందించింది. దేశంలో చరిత్రాత్మక రీతిలో కులగణన చేపట్టాలని మోదీ నిర్ణయించడాన్నీ కొనియాడింది. ఈ మేరకు సమావేశం తీర్మానాలను ఆమోదించింది. ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.

'యోగాంధ్ర', సంగారెడ్డి మహిళలు భేష్

యోగా మన జీవన విధానాన్ని మారుస్తుందని.. ప్రజలంతా దానిని అనుసరించాలని ప్రధాని పిలుపిచ్చారు. జూన్ 21న అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 10 లక్షల మంది యోగా ప్రాక్టీషనర్స్‌ను సృష్టించే లక్ష్యంతో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'యోగాంధ్ర' అభియాన్‌కు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా యోగా సంస్కృతిని అభివృద్ధి చేయడం ఈ కార్యక్రమ ఉద్దేశమని తెలిపారు. ఆ రోజు తాను విశాఖ వెళ్తున్నానని, అక్కడ జరిగే యోగా కార్యక్రమంలో పాల్గొనే అవకాశం తనకు లభించిందని తెలిపారు. విశాఖపట్నం, గురుగ్రామ్ వంటి నగరాల్లో కొన్ని స్టార్టప్‌లు పేపర్ రీసైక్లింగ్‌లో వినూత్న పద్ధతులను అవలంబిస్తున్నాయని వ్యాఖ్యానించారు. సాంకేతికత, సంకల్పం కలిసి నడిచినప్పుడు మార్పు సాధ్యమేనని తెలంగాణలోని సంగారెడ్డి మహిళలు నిరూపిస్తున్నారని అన్నారు. సంగారెడ్డి జిల్లాలో కొంత కాలం కిందటి వరకు ఇతరులపై ఆధారపడ్డ మహిళలు ఇప్పుడు స్వయంగా డ్రోన్లను ఆపరేట్ చేస్తూ 50 ఎకరాల భూమిలో మందులను పిచికారీ చేస్తున్నారని అన్నారు. వారు 'డ్రోన్ ఆపరేటర్లు'గా కాదు.. 'స్కై-వారియర్స్'గా గుర్తింపు పొందారని కితాబిచ్చారు. ఉదయం మూడు గంటలు, సాయంత్రం రెండు గంటలు పని చేస్తూ మహిళలు మందుల పిచికారీ పని పూర్తి చేస్తున్నారని తెలిపారు.

లోకం తీరు



ఆయుధ బేహారి అమెరికా!

- యుద్ధాలకు ఆజ్యం పోసి ఆయుధాలు అమ్ముకుంటోంది: పాక్ రక్షణ మంత్రి



ఇస్లామాబాద్, మే 25: తమ ఆయుధ పరిశ్రమలకు లబ్ధి చేకూర్చేందుకు అమెరికా ఉద్దేశపూర్వకంగానే ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలకు ఆజ్యం పోస్తోందని పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. 'గత వందేళ్లలో అమెరికా 260 యుద్ధాలు చేసింది. చైనా మూడు యుద్ధాలే చేసింది. అయినప్పటికీ అమెరికా డబ్బు సంపాదిస్తూనే ఉంది. వారి మిలిటరీ పరిశ్రమ చాలా పెద్దది. వారి జీడీపీలో సింహ భాగం ఆ రంగం నుంచే వస్తోంది. అందుకే వారు ఘర్షణలు సృష్టిస్తూనే ఉన్నారు' అన్నారు. సిరియా, ఈజిప్టు, అఫ్ఘానిస్థాన్, లిబియా ఒకప్పుడు సంపన్న దేశాలని, సుదీర్ఘ యుద్ధాలతో ఇప్పుడవి నాశనమయ్యాయని చెప్పారు. ఆ దేశాల పతనంలో అమెరికా ప్రమేయం ఉందని పేర్కొన్నారు. తమ మిలిటరీ పరిశ్రమ లాభదాయకంగా కొనసాగేందుకు యుద్ధాల్లో అమెరికా ఇరు పక్షాల తరఫునా పాత్ర పోషిస్తుందని ఆసిఫ్ ఆరోపించారు. అమెరికా రక్షణ రంగం ఘర్షణలు, అస్థిరతలపై ఆధారపడి వృద్ధి చెందుతోందన్నారు. ఆసిఫ్ వ్యాఖ్యలపై నెటిజన్ల నుంచి తీవ్ర ప్రతిస్పందనలు వస్తున్నాయి. మరి మీరెందుకు అమెరికా నుంచి ఆయుధాలు కొంటున్నారంటూ పలువురు నిలదీస్తున్నారు. మరోవైపు, తమ దేశం ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తోందని ఆసిఫ్ పునరుద్ఘాటించారు. తమ దేశంలో ఉగ్రవాదులు ఉన్నారని ఆయన మరోసారి అంగీకరించారు. అఫ్ఘానిస్థాన్‌లో జరిగిన రెండు యుద్ధాల్లో అమెరికా ఆదేశంతో పాకిస్థాన్ పాల్గొందని చెప్పారు.

4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్

(మొదటి పేజీ తరువాయి)

ఆధారంగా దీనిని తెలియజేస్తున్నా. ప్రస్తుతం అమెరికా, చైనా, జర్మనీ మాత్రమే మనకన్నా పెద్ద ఆర్థిక వ్యవస్థలు. మన ప్రణాళికలకు అనుగుణంగా మన వృద్ధి కొనసాగితే.. మరో రెండున్నర లేదా మూడేళ్లలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలుస్తాం' అని తెలిపారు. కాగా, ఈ ఏడాది ఏప్రిల్‌లో ఐఎంఎఫ్ విడుదల చేసిన 'వరల్డ్ ఎకనమిక్ ఔట్‌లుక్' నివేదికలో 2025లో భారత్ 4.19 ట్రిలియన్ డాలర్ల జీడీపీతో జపాన్‌ను అధిగమించి.. నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుందని అంచనా వేసింది. దీనికి తగినట్లుగానే, కేవలం నెల రోజుల వ్యవధిలోనే భారత్ 4వ స్థానానికి చేరుకోవటం విశేషం. గత పదేళ్లలో భారత్‌లో తలసరి ఆదాయం రెట్టింపు అయ్యిందని, 2013-14లో తలసరి ఆదాయం 1,438 డాలర్లు (రూ.1,22,476) కాగా, 2025 నాటికి 2,880 డాలర్లకు (రూ.2,45,293) పెరిగిందని ఐఎంఎఫ్ ఆ నివేదికలో తెలిపింది. 2025లో భారత్ 6.2 శాతం వృద్ధిరేటును కొనసాగిస్తుందని, ఇది అంతకుముందు అంచనా వేసిన 6.5 శాతం కన్నా తక్కువని పేర్కొంది. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, వాణిజ్యపరమైన ఉద్రిక్తతలే దీనికి కారణమని విశ్లేషించింది. 2025లో ప్రపంచం ఆర్థిక వృద్ధి రేటు 2.8 శాతం ఉండే అవకాశం ఉందని, ఇది గతంలో అంచనా వేసిన దానికంటే 0.5 శాతం తక్కువని పేర్కొంది. కాగా, 'వికసిత్ భారత్ కోసం వికసిత్ రాజ్యం-2047' పేరుతో నీతిఆయోగ్ రూపొందించిన పత్రంలో 2047 నాటికి భారత్ 30 ట్రిలియన్ డాలర్ల (రూ.25 కోట్ల కోట్లు) ఆర్థిక వ్యవస్థగా రూపొందుతుందని పేర్కొన్నారు. తలసరి ఆదాయంలో.. సంపన్న దేశాలతో భారత్ సరితూగుతుందని తెలిపారు.

స్థిరంగా అడుగులు

త్వరలోనే జర్మనీని భారత్ అధిగమించే అవకాశం


- టాప్-3లో అమెరికా, చైనా, జర్మనీ

(సెంట్రల్‌డెస్క్)

2025 నాటికి ఐదు ట్రిలియన్ డాలర్ల (రూ.4,25,86,000 కోట్లు) ఆర్థిక వ్యవస్థగా రూపొందాలని భారత్ 2018లోనే లక్ష్యాన్ని రూపొందించుకుంది. ఈ లక్ష్యసాధనకు ప్రభుత్వ విభాగాలు మాత్రమేగాక వివిధ పరిశ్రమ రంగాల నుంచి నిపుణులతో ఒక కోర్ గ్రూప్‌ను కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. అయితే, మధ్యలో ముంచుకొచ్చిన కరోనాతో ఈ అంచనాలు తలకిందులయ్యాయి. యావత్ ప్రపంచం కరోనా మహమ్మారి కారణంగా స్తంభించిపోయింది. భారత్‌పైనా తీవ్ర ప్రభావం పడింది. అంత పెద్ద ఉత్పాతం సంభవించినప్పటికీ.. స్థిరంగా అడుగులు వేస్తూ 4.187 ట్రిలియన్ డాలర్లకు (రూ.3,56,61,000 కోట్లు) చేరుకున్నాం.. జపాన్‌ను అధిగమించి 4వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా నిలిచాం. మన కన్నా ముందు అమెరికా, చైనా, జర్మనీ ఉన్నాయి. త్వరలోనే జర్మనీని అధిగమించి మూడో స్థానాన్ని కైవసం చేసుకునే దిశగా భారత్ అడుగులు వేస్తోంది. జర్మనీ ఆర్థిక వ్యవస్థను గమనిస్తే గత ఐదు ఆర్థిక సంవత్సరాల్లో ఆ దేశం ఒడిదొడుకులకు లోనైన విషయం స్పష్టమవుతోంది. 2019లో ఆ దేశం వృద్ధి రేటు 0.99% కాగా.. 2020లో మైనస్ 4.1% నమోదైంది (కరోనా కారణంగా). మరుసటి ఏడాది (2021లో) పుంజుకొని 3.67% వృద్ధిరేటును నమోదు చేసినప్పటికీ.. మళ్లీ ఏడాదిలోనే (2022లో) 1.37 శాతానికి పడిపోయింది. అదే క్రమంలో 2023లో మైనస్ 0.26% నమోదు చేసింది. 2024లో ఇది మైనస్ 0.4 శాతానికి వృద్ధిరేటు పడిపోయింది. ఇదే కాలవ్యవధిలో భారత్ ఆర్థిక వ్యవస్థ మిశ్రమ పనితీరును చూపింది. కరోనా కారణంగా 2019-20లో వృద్ధిరేటు మైనస్ 5.78 శాతానికి పడిపోయింది. 2020-21లో పుంజుకొని ఏకంగా 9.68% వృద్ధిరేటును నమోదు చేసింది. 2021-22లో 6.99%, 2022-23లో 7%, 2023-24లో 7.61% నమోదైంది. మొత్తంగా భారత్ స్థిరంగా అడుగులు వేస్తోందని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ లెక్కన మరో రెండున్నర లేదా మూడేళ్లలో జర్మనీని దాటి ప్రపంచ మూడో ఆర్థిక వ్యవస్థగా భారత్ ఆవిర్భవించనుందని నీతిఆయోగ్ సీఈఓ బీవీఆర్ సుబ్రమణ్యం చేసిన ప్రకటన వాస్తవాలకు దగ్గరగానే ఉందని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు. అయితే, తలసరి ఆదాయం పరంగా ఆయా దేశాలతో భారత్‌కు అంతరం భవిష్యత్తులో చాలా ఏళ్లపాటు కొనసాగే పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఉదాహరణకు, ప్రస్తుతం భారత్.. జపాన్‌ను అధిగమించి 4వ స్థానాన్ని కైవసం చేసుకున్నప్పటికీ.. తలసరి ఆదాయంలో జపాన్‌కు భారత్‌కు మధ్య తీవ్రమైన అంతరం ఉంది. జపాన్ తలసరి ఆదాయం 33,960 డాలర్లు(రూ.28,92,413) కాగా, భారత్ తలసరి ఆదాయం 2,880 డాలర్లు (రూ.2,45,293)మాత్రమే.

టాప్ 3 దేశాల పరిస్థితి..

టాప్-3 దేశాలుగా ఉన్న అమెరికా, చైనా, జర్మనీల జీడీపీలు, తలసరి ఆదాయాలు ఇలా ఉన్నాయి.. అమెరికా జీడీపీ 30.51 ట్రిలియన్ డాలర్లు, తలసరి ఆదాయం 89,110 డాలర్లు. చైనా జీడీపీ 19.23 ట్రిలియన్ డాలర్లు, తలసరి ఆదాయం 13,690 డాలర్లు. జర్మనీ జీడీపీ 4.74 ట్రిలియన్ డాలర్లు, తలసరి ఆదాయం 55,910 డాలర్లు. చైనా రెండో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నప్పటికీ.. తలసరి ఆదాయంలో 3వ స్థానంలో ఉన్న జర్మనీ కన్నా వెనుకబడి ఉండటానికి కారణం.. జనాభానే. జర్మనీ జనాభా 8.3 కోట్లు కాగా, చైనా జనాభా 141 కోట్లు. భారత్, జపాన్ విషయంలో అంతరానికీ ఇదే వర్తిస్తుంది. జపాన్ జనాభా 12.45 కోట్లు కాగా.. భారత్ జనాభా 144 కోట్లను దాటి ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశం కావటం గమనార్హం. ఇక, ఆర్థికరంగంలో చైనా వేగంగా ముందుకెళ్తోంది. వృద్ధిరేటు పరంగా అమెరికా కంటే వేగంగా దూసుకెళ్తోంది. 2021లో 8% వృద్ధిరేటును నమోదు చేస్తే.. ఆ ఏడాది అమెరికా 6 శాతానికి పరిమితమైంది. 2023లో చైనా 5.4% నమోదు చేస్తే.. అమెరికా వృద్ధి రేటు 2.89%. ఈ లెక్కన కొన్నేళ్లలోనే అమెరికాను అధిగమించి చైనా నెంబర్ వన్ ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవించే అవకాశాలున్నాయని ఆర్థికవేత్తలు అభిప్రాయపడుతున్నారు.




కుండపోతతో ఢిల్లీ అతలాకుతలం



న్యూఢిల్లీ, మే 25: కుండపోత వర్షాలతో దేశ రాజధాని నగరం ఢిల్లీ అతలాకుతలమైంది. శనివారం అర్ధరాత్రి దాటాక మొదలై.. ఆదివారం ఉదయం వరకు తెరిపినివ్వకుండా కురిసిన వానతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు చెరువులను తలపించగా.. వాహనాలు నీట మునిగాయి. ఉరుములతో కూడిన వర్షానికి తోడు.. గంటకు 82 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. దీంతో.. ఢిల్లీలోని అంతర్జాతీయ విమానాశ్రయంలో 200 విమానాలపై తీవ్ర ప్రభావం కనిపించింది. 49 విమానాలు రీ-షెడ్యూల్ అవ్వగా.. మరికొన్ని ఆలస్యంగా నడిచాయి. విమానాశ్రయం టెర్మినల్-1 వద్ద పైకప్పు దెబ్బతిని, వర్షపునీరు లీకవుతోంది. ఈ దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఎన్‌సీఆర్-ఢిల్లీ వ్యాప్తంగా భారీ వర్షాల ప్రభావం కనిపించింది. చాలా చోట్ల విద్యుత్తు సరఫరాకు తీవ్ర అంతరాయమేర్పడింది. పలు కాలనీల్లో తాగునీటి సరఫరా నిలిచిపోయింది. అండర్‌పాస్‌లు, రహదారులపై మోకాలి లోతు మొదలు.. ఐదారు అడుగుల మేర నీరు నిలిచిపోయింది. వాహనాలు నీట మునిగాయి. కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. పలు ఇళ్లు దెబ్బతిన్నాయి. ఢిల్లీలోని పోలీసు అసిస్టెంట్ కమిషనర్ కార్యాలయం పైకప్పు కూలడంతో.. ఓ అధికారి దుర్మరణం పాలయ్యారు. నగరంలోని చాలా చోట్ల 5-8 సెంటీమీటర్ల మేర వర్షపాతం నమోదైంది. ఆదివారం రాత్రి కూడా ఉరుములు, మెరుపులతో కూడిన అతి భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నట్లు.. గంటకు 70-80 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఆదివారం ఉదయం నుంచి కురుస్తున్న కుండపోత వర్షాలతో కేరళలో జనజీవనం స్తంభించిపోయింది. కోళికోడ్‌లో చెట్టు కూలి ఓ వృద్ధుడు మృతిచెందాడు. కాగా.. నైరుతి రుతుపవనాలు మహారాష్ట్ర, గోవాలను తాకినట్లు వాతావరణ శాఖ తెలిపింది.

కొచ్చి తీరంలో హై అలెర్ట్

- కంటెయినర్లతో మునిగిన లైబేరియా నౌక
- కొన్నింటిలో ప్రమాదకర రసాయనాలు



కొచ్చి, న్యూఢిల్లీ, మే 25: కొచ్చికి సమీపంలో కంటెయినర్ల నౌక మునిగిపోవడంతో కోస్ట్‌గార్డ్, కేరళ ప్రభుత్వాలు అప్రమత్తమయ్యాయి. మునిగిన కొన్ని కంటెయినర్లలో ప్రమాదకర రసాయనాలు ఉండడంతో కొచ్చి తీరంలో హైఅలెర్ట్ ప్రకటించాయి. ఒడ్డుకు కొట్టుకువచ్చే కంటెయినర్లనుగానీ, చమురుతెట్టునుగానీ తాకకూడదని ప్రజలను హెచ్చరించాయి. ఆఫ్రికా ఖండంలోని లైబేరియా దేశానికి చెందిన ఆ సరకు రవాణా నౌక ఆదివారం ఉదయం 7.50 గంటల సమయంలో అరేబియా సముద్రంలో మునిగిపోయింది. నౌకలోని మొత్తం 24 మంది సిబ్బందిని ఇండియన్ కోస్టుగార్డు కాపాడింది. నౌకలోని మొత్తం 24 మంది సిబ్బందిలో 21 మందిని శనివారమే కోస్టు గార్డ్ కాపాడింది. సహాయ చర్యల నిమిత్తం మిగిలిన ముగ్గురు సీనియర్ సిబ్బంది నౌకపైనే ఉండిపోవాల్సి వచ్చింది. నౌక మునిగిపోక తప్పదని స్పష్టం కావడంతో భారత నేవీకి చెందిన ఐఎన్ఎస్ సుజాత నౌక ఆదివారం వారిని కాపాడింది. 180మీటర్ల పొడవున్న ఆ నౌకలో మొత్తం 640 కంటెయినర్లు ఉన్నాయి. అవన్నీ సముద్రంలో మునిగిపోయినట్టు రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. 13 కంటెయినర్లలో ప్రమాదకర రసాయనాలు, 12 కంటెయినర్లలో కాల్షియం కార్బైడ్ ఉన్నట్టు పేర్కొంది.

రూ.3 వేల టోల్ ఫీజు చెల్లిస్తే.. ఏడాదంతా హైవేలపై ప్రయాణం

» కొత్త టోల్ పాలసీ తీసుకురానున్న కేంద్రం

న్యూఢిల్లీ, మే 25: సొంత వాహనాల్లో హైవేలపై తరచూ ప్రయాణాలు చేసేవారికి కేంద్ర ప్రభుత్వం బంపర్ ఆఫర్ ఇవ్వబోతోంది. ప్రయాణంలో భాగంగా పదే పదే టోల్ ట్యాక్స్, ఫాస్టాగ్ రీచార్జి ఇబ్బందులు లేకుండా.. ఒకేసారి రూ.3 వేలు చెల్లిస్తే ఏడాదంతా ప్రయాణించేలా కొత్త టోల్ పాలసీని తీసుకురానుంది. ఇందుకు సంబంధించిన ముసాయిదాలో రెండు చెల్లింపు విధానాలను ప్రతిపాదించనుంది. మొదటిది.. వాహన యజమాని రూ.3 వేల వార్షిక రుసుము చెల్లిస్తే ఏడాదిపాటు జాతీయ రహదారులు, ఎక్స్‌ప్రెస్ వేలు, రాష్ట్ర ఎక్స్‌ప్రెస్‌వేలపై ఎటువంటి పరిమితులు లేకుండా ప్రయాణించవచ్చు. ఇక రెండోది.. రూ.50 చెల్లింపుతో 100 కిలోమీటర్ల దూరం ప్రయాణించే అవకాశం కల్పించడం. తక్కువగా ప్రయాణాలు చేసేవారికి ఈ విధానం ప్రయోజనకరం కానుంది. ఇంతకు ముందు రూ.30 వేలు చెల్లించి 15 ఏళ్లపాటు పరిమితులు లేకుండా ప్రయాణించే అవకాశం కల్పించాలన్న ప్రతిపాదనను ప్రభుత్వం పక్కన పెట్టనుంది. ఈ ప్రతిపాదన కార్యరూపం దాలిస్తే హైవేలపై వాహనదారులు మరింత స్వేచ్ఛగా ప్రయాణించవచ్చు.

ఏఐ బ్లాక్‌మెయిల్!

» వివాహేతర సంబంధాలను వెల్లడిస్తా

» ప్రాజెక్టును షట్‌డౌన్ చేస్తే గోప్య వివరాలను బయట పెడతా

» ఇంజనీర్లకు ఆంథ్రోపిక్ ఏఐ హెచ్చరిక

వాషింగ్టన్, మే 25: రజనీకాంత్ 'రోబో' సినిమాలో.. డాక్టర్ వశీకర్ తయారు చేసిన 'చిట్టి' రోబో అతణ్ని ధిక్కరించి, సొంత సైన్యాన్ని తయారు చేసుకుంటుంది. కృత్రిమ మేధ(ఏఐ) సొంతంగా పనిచేస్తే ఎంతటి దారుణం జరుగుతుందో ఆ సినిమాలో చూశాం. టెక్ దిగ్గజాలు కూడా ఏఐ యుగంపై ఆందోళన వ్యక్తం చేస్తుండగా.. తాజాగా ఓ ఏఐటూల్ తనను రూపొందించిన ఇంజనీర్లను బ్లాక్‌మెయిల్ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది. ఫార్చ్యూన్ పత్రిక, మింట్ వంటి వార్తాసంస్థలు దీనిపై కథనాలను ప్రచురించాయి. గూగుల్ జెమినీ, ఓపెన్‌ఏఐ చాట్‌జీపీటీలకు పోటీగా ఆంథ్రోపిక్ సంస్థ తయారు చేసిన 'క్లాడ్ ఓపస్' మోడల్ ఏఐలో లోపాలను ఇంజనీర్లు/డెవలపర్లు గుర్తించారు. దాంతో.. ఆ ప్రాజెక్టును షట్‌డౌన్ చేసి క్లాడ్ ఓపస్-4 దిశలో అడుగులు వేశారు. ఈ క్రమంలో సదరు ఏఐ మోడల్ ఇంజనీర్లను హెచ్చరించింది. "నన్ను షట్‌డౌన్ చేస్తే మీ(ఇంజనీర్లు) గోప్య వివరాలను బయటపెట్టేస్తా" అని బ్లాక్‌మెయిల్ చేస్తూ బెదిరించింది. ఓ డెవలపర్‌ను "నీ వివాహేతర సంబంధాలను వెల్లడిస్తా" అని హెచ్చరించింది. కాగా క్లాడ్ ఓపస్-4 అధునాతన ఏఐ అని.. ఒక మనిషితో మాట్లాడినట్లుగానే సంభాషిస్తుందని ఆంథ్రోపిక్ తెలిపింది. గత మోడల్(అధికారికంగా విడుదల చేయలేదు)లో లోపాలను సరిదిద్ది క్లాడ్ ఓపస్-4ను విడుదల చేసినట్లు తెలిపింది. ట్రయల్ వెర్షన్‌లో ప్రమాదకరమైన ప్రశ్నలకూ ఏఐ సమాధానమిస్తున్నట్లు గుర్తించి, తాజా మోడల్‌లో ఏఐ భద్రత స్థాయి-3(ఏఎస్ఐ-3) ప్రమాణాలను జోడించామని వివరించింది.

సినిమా సూపిత్త మావా!

(మొదటి పేజీ తరువాయి)

కావాల్సినట్టుగా దృశ్యాలను రూపొందిస్తోంది. స్క్రిప్టు ప్రకారం.. సీన్లను, వాటికి తగినట్టుగా ఆడియోలను రూపొందించడం.. కలిపి.. ఎడిట్ చేసి.. సినిమాను సిద్ధం చేసేయడమే! ఇలా పూర్తిగా ఏఐతోనే తీసిన కన్నడ సినిమా 'లవ్ యూ' ఇటీవలే విడుదలైంది. అటు చైనాకు చెందిన 'పైరేట్ క్వీన్ - ఝెంగ్ యి సావో' కూడా తెరపైకి వచ్చింది. ఈ రెండు చిత్రాలు 'సినిమా' భవిష్యత్తును వెండితెరపై కళ్లకు కడుతున్నాయి.



పూర్తిగా ఏఐతోనే నిర్మించిన 'పైరేట్ క్వీన్ - ఝెంగ్ యి సావో' చిత్రం పోస్టర్

ఇద్దరు కూర్చుని తీసిన సినిమా 'లవ్ యూ'

కర్ణాటకలో ఇటీవలే విడుదలైన రొమాంటిక్, లవ్ సినిమా 'లవ్ యూ'.. బెంగళూరు శివార్లలోని సిద్దెహళ్లికి చెందిన పూజారి, రచయిత నరసింహ మూర్తి, ఏఐ టెక్నీషియన్, గ్రాఫిక్ డిజైనర్ నూతన్.. కలసి ఆరు నెలల్లో కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్ సాయంతో ఈ సినిమా తీశారు. 15 మంది పాత్రధారుల (క్యారెక్టర్ల)తో 95 నిమిషాలు నిడివి ఉన్న ఈ సినిమాలో 12 పాటలు కూడా ఉన్నాయి. ఇందులోని పాత్రధారులు, వారి నటన, దృశ్యాలు, సంగీతం, పాటలు, మాటలు మొత్తం అంతా కృత్రిమ మేధతో సృష్టించినవే. ఈ సినిమా నిర్మాణం కోసం అయిన ఖర్చు కేవలం రూ.10 లక్షలేనని, అది కూడా కంప్యూటర్లు, సాఫ్ట్‌వేర్లు, ఏఐ సేవల సబ్‌స్క్రిప్షన్ల కోసం అయిన ఖర్చేనని సినిమా మేకర్లు చెప్పారు.. 30 రకాల ఏఐ టూల్స్ వినియోగించామని తెలిపారు. సెన్సార్ బోర్డు ఈ సినిమాకు యూ/ఏ సర్టిఫికెట్ కూడా ఇచ్చింది. అయితే దీనికి తొలి ఏఐ సినిమాగా గుర్తింపు కోసం.. కేవలం ఒక థియేటర్‌లో విడుదల చేశారు.

సినిమాల్లో ఏఐ.. సిత్రాలెన్నో..

చైనాకు చెందిన 'పైరేట్ క్వీన్ - ఝెంగ్ యి సావో' కూడా మొత్తంగా ఏఐతో నిర్మించిన చిత్రం. ఓ మహిళా సముద్రపు దొంగ (పైరేట్) నిజజీవిత కథతో.. మలేషియాకు చెందిన ఫ్యూచర్ స్టూడియోస్, సింగపూర్‌కు చెందిన ఫిజ్ డ్రాగన్ సంస్థలు సంయుక్తంగా ఈ సినిమాను సిద్ధం చేశాయి. స్క్రిప్టు రూపకల్పన నుంచి నటీనటులు, వారి గొంతు, సంగీతం అంతా ఏఐతోనే సృష్టించామని మేకర్లు గతంలోనే ప్రకటించారు. ఈ ఏడాది ఏప్రిల్ 24నే ఈ సినిమా ప్రీమియర్ షోను ప్రదర్శించారు. మాండరిన్ (చైనా), ఇంగ్లిష్ భాషల్లో ఈ ఏడాది జూన్ లేదా జూలైలో థియేటర్లలో విడుదల చేయనున్నట్టు ప్రకటించారు.

● ఇటలీకి చెందిన 'ది డైరీ ఆఫ్ సిసిఫస్ (2023)', స్విట్జర్లాండ్‌కు చెందిన 'ది లాస్ట్ స్క్రీన్ రైటర్ (2024)' సినిమాలకు కథ, స్క్రీన్ ప్లే మొత్తాన్ని ఏఐతోనే సిద్ధం చేశారు.

● అమెరికాలో 'డ్రెడ్‌క్లబ్-వాంపైర్స్ వెర్డిక్ట్ (2024)' యానిమేటెడ్ సినిమాను చాలా వరకు ఏఐతోనే రూపొందించారు. దీనికి కేవలం రూ.40 వేలు మాత్రమే ఖర్చయినట్టు మేకర్లు ప్రకటించారు.

ఇండస్ట్రీకి నష్టమే?

ఏఐని వినియోగించడం ద్వారా సినిమాల్లో దృశ్యాలను మనోహరంగా తీర్చిదిద్దవచ్చు. నటీనటుల్లోని లోపాలను సవరించడంతోపాటు అద్భుతమైన గ్రాఫిక్స్‌ను సృష్టించవచ్చు. అవతార్ వంటి సినిమాలు అలా రూపొందించినవే. అయితే అందులోని పాత్రలను 'మోషన్ క్యాప్చర్, సీజీఐ' వంటి సాంకేతికతలతో రూపొందించారు. మనుషులకే సెన్సర్లు, పరికరాలు అమర్చి.. హావాభావాలు, కదలికలను వారితో పలికించి.. ఆయా క్యారెక్టర్లకు అనుసంధానిస్తారు. కానీ పూర్తిగా ఏఐతో రూపొందించడం వేరు. నటీనటులు, మ్యూజిక్ డైరెక్టర్లు, రచయితలు, సింగర్లు, డబ్బింగ్ ఆర్టిస్టులు, ఆర్ట్ డైరెక్టర్లు, లైటింగ్ విభాగం, సినీ సర్వీసులు.. ఇలా ఎవరూ ఉండరు. కేవలం కంప్యూటర్లపైనే అంతా. అయితే ముఖ కవళికలు సరిగా లేని, హావాభావాలూ పలకని నటీనటులను ఎంతో కాలంగా భరిస్తున్నామని... ఏఐ యుగంలో అలాంటి వారి అవసరం లేకుండా అద్భుతమైన, అందమైన పాత్రలతో సినిమాలు తీయవచ్చని టెక్ నిపుణులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఏఐ 'సినిమా'కు ఏం కావాలి?

● జస్ట్ ఒకట్రెండు ఆధునిక కంప్యూటర్లు..

● వీడియో, ఆడియో ఎడిటింగ్ సాఫ్ట్‌వేర్లు..

● ఇచ్చిన సూచనలకు అనుగుణంగా దృశ్యాలను సిద్ధం చేసి ఇచ్చే 'జనరేటివ్ ఏఐ టూల్స్'ను సబ్‌స్క్రైబ్ చేసుకోవడానికి అవసరమైన సొమ్ము

● గూగుల్ జనరేటివ్ ఏఐ టూల్ 'వియో 3' ఆధారిత 'ఫ్లో' టూల్, డైరెక్టర్ ఏఐ, సినిమాటోగ్రాఫర్ ఏఐ, స్టంట్స్ ఏఐ, రన్‌వే ఎమ్ఎల్, క్లింగ్ ఏఐ, మినిమాక్స్.. ఇలా పదులకొద్దీ ఏఐ సినిమా టూల్స్ అందుబాటులో ఉన్నాయి.

● తమిళ సినిమా 'కంగువ'ను ఎనిమిది భాషల్లో విడుదల చేసేందుకు.. ఏఐ సాయంతో ఆయా భాషల్లో సూర్య గొంతుతోనే డబ్బింగ్‌ను సృష్టించారు.

భవిష్యత్తులో మరింత మెరుగ్గా...

ఏఐతో సినిమా అచ్చంగా మామూలు సినిమాల్లా ఉండటం ప్రస్తుతానికి కష్టమే. ఏఐతో తీసిన 'లవ్ యూ' సినిమాగానీ, షార్ట్ వీడియోలుగానీ ఏవైనా పాత్రల ముఖకవళికలు, గొంతుకు తగినట్టుగా పెదాల కదలిక ఇంకా పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందలేదు. దీనితో చాలా వరకు లాంగ్ షాట్ సీన్లు సృష్టించాల్సి ఉంటుంది. ఇక పాత్రల శారీరక కదలికలు, హావభావాలు, చుట్టూ ఉన్న పరిసరాలు... ఒకే సీన్‌లోనూ, వేర్వేరు సీన్లలో కూడా అసాధారణంగా కనిపిస్తుంటాయి. మారిపోతూ ఉంటాయి. లవ్ యూ, పైరేట్ క్వీన్-ఝెంగ్ యి సావో సినిమాల్లోనూ ఇదే కనిపించింది. కానీ సినిమాల చరిత్రలో ఇదో కొత్త అధ్యాయాన్ని ప్రారంభించిందని నిపుణులు చెబుతున్నారు. ఈ సినిమాల కోసం వాడిన ఏఐల కంటే మెరుగైనవి ఈ కొన్ని నెలల్లో అందుబాటులోకి వచ్చాయని.. మరింత స్పష్టమైన, మెరుగైన సినిమాలు తీయవచ్చని స్పష్టం చేస్తున్నారు.

మరో 15 ఏళ్లే సమయం

సోషల్ మీడియా ఏఐ 'గ్రోక్' అంచనా వేసిన మేరకు మరో మూడేళ్లలో ఇరవై నిమిషాల్లోపు షార్ట్ ఫిల్మ్‌లు ఏఐతో అద్భుతంగా రూపొందుతాయి. మరో ఏడేళ్లలో సాధారణ స్థాయి సినిమాల రూపకల్పన కూడా వీలవుతుంది. అదే మరో 15 ఏళ్లలో హాలీవుడ్ స్థాయిలో అద్భుతమైన సినిమాలను ఏఐతోనే తెరకు ఎక్కించవచ్చు. అప్పటికల్లా హీరోలు, హీరోయిన్లు సహా చాలా మంది నటీనటులు, ఇతర సినీ విభాగాల వారిపై ఏఐ ప్రభావం గట్టిగానే పడవచ్చని పేర్కొంది.

- సెంట్రల్ డెస్క్

పందేలు లేని పేకాట తప్పుకాదు

» వినోదం కోసం ఆడటం నైతిక ఉల్లంఘన కాదు

» కర్ణాటక వ్యక్తి కేసులో సుప్రీం కోర్టు వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, మే 25: పందేలు, జూదం మాట లేకుండా వినోదం, విలాసం కోసం పేకాట ఆడటం తప్పుకాదని సుప్రీం కోర్టు పేర్కొంది. ఇది నైతిక ఉల్లంఘన కిందకు రాదని స్పష్టం చేసింది. కర్ణాటకలో ప్రభుత్వ పింగాణి ఫ్యాక్టరీ ఉద్యోగుల హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ బోర్డు డైరెక్టర్ వైసీ హనుమంతరాయప్ప కేసులో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఎన్ కోటీశ్వర్ సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. హనుమంతరాయప్పతో పాటు కొందరు రోడ్డు పక్కన కూర్చుని పేకాడ ఆడుతుండగా, ఎటువంటి విచారణ లేకుండా రూ.200 జరిమానా వేశారని పేర్కొంది. కాగా హౌసింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికల్లో హనుమంతరాయప్ప చేతిలో ఓడిపోయిన రఘునాథ్ సహకార సంఘాల జాయింట్ రిజిస్ట్రార్‌కు ఫిర్యాదు చేసి, గ్యాంబ్లింగ్ యాక్ట్‌లో శిక్షార్హుడు అయినందున ఆయన ఎన్నికను రద్దు చేయాలని కోరారు. దీంతో ఆయన ఎన్నికను రద్దు చేశారు. దీనిపై హనుమంతరాయప్ప కర్ణాటక హైకోర్టును ఆశ్రయించగా, ఎన్నిక రద్దు నిర్ణయాన్ని సమర్థించింది. దీనిపై సుప్రీం కోర్టులో ఆయన సవాల్ చేశారు. సుప్రీం కోర్టు ధర్మాసనం ఇటీవల ఈ కేసును విచారించి తీర్పును వెలువరించింది. 'ప్లే కార్డులకు చాలా రూపాలు ఉన్నాయి. ప్రతి ఆటలోనూ ముఖ్యంగా వినోదం కోసం ఆడినపుడు నైతిక ఉల్లంఘన జరిగిందని అంగీకరించలేం. మన దేశంలో చాలా ప్రాంతాల్లో పందేలు, జూదం ప్రస్తావన లేకుండా సాధారణంగా కార్డులు ఆడటం పేదవాడి వినోద వనరుగా భావిస్తారు' అని ధర్మాసనం పేర్కొంది. హనుమంతరాయప్ప పందేలు ఆడే అలవాటున్న జూదగాడు కాదని పేర్కొంటూ, పేకాట ఆడారనే కారణంతో ఆయన ఎన్నికను రద్దు చేస్తూ తీసుకున్న నిర్ణయాన్ని కొనసాగించలేమని, ఆయన ఎన్నికను పునరుద్ధరించాలని ఆదేశించింది.

మంచిర్యాలకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు

(మొదటి పేజీ తరువాయి)

వరకు వెళ్లేందుకు, ఆ తరువాత మంచిర్యాల వరకు వెళ్లేందుకు కూడా ట్రాఫిక్ సమస్య అధికంగా ఉంది. పైగా ఈ రోడ్డు మలుపులు తిరిగి ఉండడంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ప్రస్తుత రోడ్డుకు ప్రత్యామ్నాయ మార్గాలను పరిశీలించాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. దాంతో జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ (ఎన్‌హెచ్‌ఏఐ), ఆర్‌అండ్‌బీ శాఖ కలిసి ప్రస్తుతం ఉన్న రాజీవ్ రహదారికి మూడు ప్రత్యామ్నాయ మార్గాలతో రూట్‌మ్యాప్ సిద్ధం చేశాయి. ఆ మూడు ప్రతిపాదనలను ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షలో వివరించారు. వాటిలో ఒకదానికి సీఎం సూత్రప్రాయ ఆమోదం తెలిపినట్టు తెలిసింది.

ప్రైవేటుకాంట్రాక్టర్ ఆధీనంలో ప్రస్తుత రోడ్డు

హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు 207 కిలోమీటర్ల మేర నాలుగు వరుసలతో ఉన్న ప్రస్తుత రోడ్డు.. ప్రైవేటు కాంట్రాక్టర్ ఆధీనంలో ఉంది. ఉమ్మడి ఏపీలో 2010లో ఈ రోడ్డు నిర్మాణం, నిర్వహణ కోసం అప్పటి ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలోని ఆంధ్రప్రదేశ్ రోడ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ టెండర్ పిలిచింది. పీపీపీ విధానం కింద ఈ పనులను ఓ సంస్థ దక్కించుకోగా.. ఉమ్మడి ఏపీలోనే 25 ఏళ్ల వరకు సదరు సంస్థకు రోడ్డు నిర్వహణను అప్పగించారు. దాని ప్రకారం 2036 ఫిబ్రవరి 14 వరకు టోల్ వసూలు, రోడ్డు మెయింటెనెన్స్ అంతా ఆ సంస్థే చూసుకుంటుంది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక కూడా ఆ సంస్థ పరిధిలోనే రోడ్డును పర్యవేక్షిస్తున్నారు. కాగా, 2017-18 సంవత్సరంలో ఆ రోడ్డుపై టోల్ వసూలు ద్వారా రూ.114 కోట్లు వచ్చినట్టు ఆర్థిక సంవత్సర గణాంకాల్లో సదరు



సంస్థ తెలిపింది. ప్రస్తుతం వాహనాల సంఖ్య పెరగడంతో.. టోల్ వసూలు కూడా రెట్టింపు అయిందని ఆర్‌అండ్‌బీ అధికారులు అంటున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా.. రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన మేరకు మంచిర్యాల వరకు గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు నిర్మించాలంటే ప్రస్తుత రోడ్డును మెయింటెనెన్స్ చేస్తున్న సంస్థతో కూడా చర్చించి, నిరభ్యంతర పత్రం తీసుకోవాల్సి ఉందని తెలిసింది. ఈ మేరకు సదరు సంస్థతో చర్చించాలని అధికారులు నిర్ణయించారు. త్వరలోనే దీనిపై ఒక నిర్ణయం తీసుకోనున్నట్లు, అనంతరం పూర్తి నివేదికను రాష్ట్ర ప్రభుత్వంతోపాటు కేంద్రానికీ పంపనున్నట్లు తెలిసింది. ఈ రోడ్డుపై ప్రస్తుతం మూడు టోల్‌ప్లాజాలు ఉన్నాయి.

మూడో ప్రతిపాదనకు ఆమోదం.!

హైదరాబాద్ నుంచి మంచిర్యాల వరకు ప్రస్తుత రోడ్డుకు ప్రత్యామ్నాయంగా నిర్మించదలచిన కొత్త గ్రీన్‌ఫీల్డ్ రోడ్డు కోసం 3 ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. సమీక్షలో సీఎం రేవంత్‌కు నివేదించిన ప్రతిపాదనలు ఇలా ఉన్నాయి..

ఆప్షన్-1: ప్రస్తుత రోడ్డుకు ఎడమవైపున 188 కిలోమీటర్ల దూరంతో ఉంటుంది. ఓఆర్ఆర్ ఎగ్జిట్ 17 దగ్గర శామీర్‌పేట నుంచి మొదలై తుర్కపల్లి- వర్గల్- ఎన్‌హెచ్-161ఏఏ- చెప్యాల- ఎన్‌హెచ్-765 డీజీ-దుబ్బాక- స్టేట్ హైవే-11 (హరిదాస్‌నగర్)- కోనాయిపల్లి- ఎన్ హెచ్-563 (కురిక్యాల)- దాతోజీపేట- అంతర్గాం మీదుగా మంచిర్యాల దగ్గరున్న ఎన్‌హెచ్-63 అనుసంధానమవుతుంది. మూల మలుపులు పెద్దగా ఉండవు. శామీర్‌పేట చెరువు, అప్పర్ మానేరు డ్యామ్, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టుల పరిధిలో నిర్మించాల్సి ఉన్నందున నిర్మాణ వ్యయం అధికమవుతుందని అధికారులు పేర్కొన్నారు. మొత్తంగా ఆప్షన్-1 మార్గం నిర్మాణానికి రూ. 4,700 కోట్లు కావాల్సి ఉంటుందని తెలిపారు.

ఆప్షన్-2: ఇది కూడా శామీర్‌పేట నుంచే ఉండగా.. నారాయణపూర్- ఎర్రవల్లి- ఎన్‌హెచ్-161ఏఏ- తిమ్మాపూర్- కొమురవెల్లి- ఎన్‌హెచ్-365బీ క్రాసింగ్- అంకుశాపూర్- నగునూర్- బస్వాపూర్ (ఎన్‌హెచ్-765 డీజీ)- నవాబ్‌పేట- చిగురుమామిడి- తడికాల (ఎన్‌హెచ్-563)- మానేరు రివర్ క్రాసింగ్- కొలనూర్- వెన్నంపల్లి- ఏదులాపురం- లక్కారం నుంచి పుట్టపాక (ఎన్‌హెచ్-163జీ)-కిస్టాపూర్- శ్రీరాంపూర్ మీదుగా మంచిర్యాల దగ్గరున్న ఎన్‌హెచ్-63కి అనుసంధానం చేస్తారు. గ్రీన్‌ఫీల్డ్ విధానంలో 160కి.మీ, జాతీయ రహదారుల అనుసంధానంగా మరో 46 కి.మీతో రోడ్డు నిర్మాణం ఉంటుంది. ఈ మార్గంలో కొంతమేర అటవీ భూమి కావాల్సి ఉండగా.. నిర్మాణానికి రూ.4 వేల కోట్లు అవసరమని పేర్కొన్నారు.


ఆప్షన్-3: ఈ రోడ్డు శామీర్‌పేట నుంచి మొదలై నారాయణపూర్-కొమురవెల్లి దగ్గర ఎన్‌హెచ్-365బీ వరకు ఆప్షన్-2లో ఉన్న విధంగానే ఉండగా.. చేర్యాల దగ్గరి నుంచి భైరాన్‌పల్లి - కన్నారం- ముల్కనూర్- ఎల్కతుర్తి (ఎన్‌హెచ్-765డీజీ)- ఎన్‌హెచ్-563 క్రాసింగ్- కమలాపూర్- మర్రిపల్లిగూడెం- టేకుమట్ల (ఇక్కడ జాతీయ రహదారి 163జీ కలుస్తుంది). ఆ తరువాత మానేరు డ్యామ్ క్రాస్ అయి.. ముత్తారం- పుట్టపాక (ఎన్‌హెచ్-163జీ)- కిస్టాపూర్- శ్రీరాంపూర్ మీదుగా మంచిర్యాలకు దగ్గర్లోని ఎన్‌హెచ్-63కి కలుపుతారు. దీని నిర్మాణానికి రూ.3వేల కోట్ల నిధులు కావాల్సి ఉంటుంద ని తెలిపారు. అదే విధంగా మూడు ఆప్షన్‌లలో ఇదే ఉత్తమంగా ఉందని కూడా పేర్కొన్నారు. దాంతో మూడో ఆప్షన్‌గా ఉన్న ఈ రూట్‌మ్యాప్‌కే సూత్రప్రాయ ఆమోదం లభించినట్టు తెలిసింది.

హెచ్‌కేఆర్-ఆర్ఆర్ఆర్ మధ్య నిర్మాణం!

ప్రస్తుత రోడ్డు.. ఓఆర్ఆర్ ఎగ్జిట్ నంబరు 17 దగ్గరున్న శామీర్‌పేట-తూంకుంట నుంచి వెళ్తుండగా, తూంకుంట తరువాత వచ్చే గజ్వేల్-ప్రజ్ఞాపూర్ నుంచి గ్రీన్‌ఫీల్డ్ రోడ్డును నిర్మించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు సమాచారం. మరోవైపు గజ్వేల్-ప్రజ్ఞాపూర్ పరిధిలో రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ఉత్తరభాగం రోడ్డు నిర్మాణం కానుంది. దాంతో ఈ రెండింటి నడుమ కొత్త రోడ్డు నిర్మాణం చేపట్టాలని భావిస్తున్నారు. మరోవైపు ఓఆర్ఆర్ ఎగ్జిట్-17 వరకు అంటే శామీర్‌పేట-తూంకుంట వరకు గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్డు నిర్మించాలని, తద్వారా ట్రాఫిక్ సమస్యకు స్వస్తి పలకవచ్చని సర్కారు భావిస్తోంది. మంచిర్యాల వరకు కొత్త గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు సంబంధించి మొత్తం మూడు ప్రతిపాదనలను సిద్ధం చేసిన అధికారులు.. ఏయే మార్గానికి ఎన్ని నిధులు అవసరమవుతాయి, అటవీ భూములు సహా వ్యవసాయ భూములు ఎంతమేరకు సేకరించాల్సి ఉంటుందనే అన్ని వివరాలను సీఎం రేవంత్‌కు వివరించారు. వాటిలో ఒకదానికి సీఎం సూత్రప్రాయ ఆమోదం తెలపగా.. మరికొన్ని సూచనలు చేసినట్టు సమాచారం. కాగా, మంచిర్యాల వరకు నిర్మించబోయే ఈ రోడ్డును నాగ్‌పూర్ నుంచి విజయవాడ వరకు పలు భాగాలుగా నిర్మితమవుతున్న జాతీయ రహదారికి అనుసంధానం చేయనున్నారు.

బొమ్మలు: అక్బర్


ఏ భాషనూ గుడ్డిగా వ్యతిరేకించవద్దు!



నలిమెల భాస్కర్ తెలుగు నేల మీదనే కాదు దేశంలోనూ అరుదనిపించే విధంగా పద్నాలుగు భారతీయ భాషలు నేర్చారు. ఆయా భాషల్లో నుండి తెలుగు లోకి, తెలుగు నుండి కొన్ని భాషల్లోకి అనువాదాలు చేశారు. అనువాదంలో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాన్ని అందుకున్నారు. 1974 నుండి నేటి వరకు కవిత్వం, కథలు, నవలలు, అనువాదాలు, వ్యాస సంపుటాలు, భాషా గ్రంథాలు కలిపి నలభై పుస్తకాలు వెలువరించారు. వీటిలో భాషా నేపథ్యంగా ఉన్న పుస్తకాలు పది ఉన్నాయి. నలిమెల భాస్కర్ సప్తతి సందర్భంగా వారి భాషా కృషిని అభిప్రాయాలను తెలుసుకునే ఉద్దేశ్యంతో జరిపిన సంభాషణ ఇది.

మీరు పద్నాలుగు భాషలు నేర్చుకోవడం వెనుక ఉన్న కృషిని వివరిస్తారా?

మొదలు బాలాజీ పబ్లికేషన్స్ చెన్నై వారి 30 రోజుల్లో ఫలానా భాష నేర్చుకోండి పుస్తకాలతో ప్రారంభించాను. తర్వాత, ఆయా మాతృభాషీయులకు ఆంగ్లం నేర్పే పుస్తక మహల్ ఢిల్లీ వారి రెపిడెక్స్ పుస్తకాలని ఆశ్రయించాను. అయితే రెపిడెక్స్‌లోని ఆంగ్లంతో నేను ఆయా భారతీయ భాషలు అటు నుంచి ఇటు నేర్చుకున్నాను. ఆ తర్వాత డాల్టన్ పబ్లికేషన్స్ చెన్నై నుంచి వచ్చే అన్ని భాషల చందమామల్ని అందుకున్నాను. అలాగే చంపక్ బాలల పత్రిక ద్వారా భాషా పరిమళాలు ఆఘ్రాణించాను. ఇదంతా పఠనం. కానీ శ్రవణం కూడా కావాలి కదా! ఢిల్లీ ఆకాశవాణి కేంద్ర వార్తలు అన్ని భాషల్లో వినేవాడిని. దాదాపు దేశమంతా తిరిగాను అదో పెద్ద కథ.



తెలంగాణ పదకోశంతో పాటు తెలంగాణ భాష దేశ్య, సంస్కృత, తమిళ, క్రియా పదాలు పుస్తకాలు రాసిన మీరు తెలంగాణ తెలుగుదనం కాపాడుకోవడానికి ఏ సూచనలు చేస్తారు?

తెలంగాణ తెలుగైనా మరొకటైనా రక్షించుకోవాలంటే ముందుగా ఆ భాషా పదాలు, పదబంధాలు, జాతీయాలు, సామెతలు అన్నింటినీ నమోదు చేసుకోవాలి. భాషా చరిత్ర రాసుకోవాలి. వ్యాకరణం రచించాలి. రాష్ట్రం ఏర్పాటు ఐన తర్వాత కొంతవరకు సాహిత్య చరిత్ర నిర్మాణం జరిగింది. కొంత మేరకు పదకోశాలు వచ్చాయి. అయితే పూర్తిస్థాయి నిఘంటు నిర్మాణం గురించిన సోయి ఉండాలి. ఇక బోధనా భాషగా ఒకేసారి కాదుగాని, క్రమంగా ఒకటవ తరగతి నుండి ఓ ఐదారేళ్లలో ఆయా తరగతుల్లో ఇప్పుడున్న భాషకు బదులుగా తెలంగాణ భాషలోనే వాచక రచన జరగాలి. తెలంగాణ భాష అధికార భాషగా అన్ని రంగాల్లో అమలుకై ప్రయత్నించాలి.

అరవై ఏళ్లుగా ఎవరూ సాహసించని 'తెలుగు క్రియా పదకోశం' పనిని మీరు ఎలా ప్రారంభించారు? దాని అవసరం ఏమిటి?

1962లో విశ్వనాథ సత్యనారాయణ, మరుపూరు కోదండరామిరెడ్డి, యశోదా రెడ్డి మొదలైన వారు కలిసి, 'ఆంధ్ర క్రియా స్వరూప మణి దీపిక' పేరుతో ఓ క్రియా నిఘంటువు వేశారు. అది గొప్ప కృషి. అయితే, ఈ 60 ఏళ్ల కాలంలో ఆ నిఘంటువును పరివర్ధితం చేయాలన్న తలంపు ఎవరికీ రాకపోవడం శోచనీయం. ఆచార్య రవ్వా శ్రీహరి తరం దాదాపు పోయింది, పోతోంది. ఓ ఐదారేళ్ళుగా ఓ పెద్దమనిషి తన పేరు చెప్పుకోకుండా అదేపనిగా ఉత్తరాలు రాస్తూ నన్ను ఆ పని చేయవలసిందిగా పురికొలుపుతున్నాడు. 'brood over' అని ఉత్తరం చివర ప్రతిసారీ రాసి ముగిస్తాడు. నా ఒక్కడి వల్ల అది సాధ్యమయ్యే పని కాదు. అయినా ఎట్టకేలకు ఓ ఏడాది పాటు పనిచేద్దామని సాహసించాను. నా దగరున్న దాదాపు 30 నిఘంటువుల్లోని క్రియా పదాలన్నీ 'ఐ' వరకు తీసుకున్నాను. నాకు గుర్తుకొచ్చిన క్రియా పదాలు చేర్చాను. ఒక పదానికి పూర్వం చెప్పని అర్థఛాయలు సైతం నాకు తోచినవి చెప్పాను. ఆరోపాలు మాత్రం చేర్చలేదు. 'అ' నుండి 'ఐ' వరకు చేసేసరికి అనారోగ్యం పాలై అక్కడికి ఆపేశాను. బూర్ల వంటి తర్వాతి తరం అందుకుంటారన్న ఆశ ఉంది మరి!

ఇక, దీని అవసరం ఏమిటంటే– ఈ అరవై ఏళ్ల వ్యవధిలో అనేక కొత్త వస్తువులు ఆవిష్కరించబడ్డాయి. చాలా సంఘటనలు చరిత్రలో నమోదయినాయి. వీటన్నింటిని అమ్మనుడి లోనికి తెచ్చుకోవాలి. లాగిన్ అవ్వడం, లాగ్ అవుట్ కావడం– ఇట్లా చాలా క్రియలను మాతృభాషలో చెప్పవచ్చా అన్నది ఆలోచించాలి. కాని పక్షంలో వాటినైనా నిఘంటువుల్లో చేర్చాలి కదా! గత ఆరు దశాబ్దుల్లో వేలకొద్దీ క్రియా పదాలు కొత్తవి వచ్చి ఉంటాయి. తెలుగు భాషలో ఉన్నన్ని మూల ధాతువులు ఏ ఇతర ద్రావిడ భాషల్లోనూ లేవని ఈ తరానికి ఎఱుక పరచడం కూడా ఈ కోశం ఉద్దేశం. అందుకే, వీలైనన్ని పర్యాయపదాలు ఇచ్చాను. క్రియలకు అర్థ వివరణ చేసేటప్పుడు మన భాషలోని దేశ్య క్రియల మీద దృష్టి పెడితే మనమందరం అబ్బుర పడిపోయే పద సంపద మన కళ్ళ ముందు కదలాడుతుంది.

> **ఈ అరవై ఏళ్ల వ్యవధిలో అనేక కొత్త వస్తువులు ఆవిష్కరించబడ్డాయి. చాలా సంఘటనలు చరిత్రలో నమోదయినాయి. వీటన్నింటిని అమ్మనుడి లోనికి తెచ్చుకోవాలి. లాగిన్ అవ్వడం, లాగ్ అవుట్ కావడం– ఇట్లా చాలా క్రియలను మాతృభాషలో చెప్పవచ్చా అన్నది ఆలోచించాలి. కాని పక్షంలో వాటినైనా నిఘంటువుల్లో చేర్చాలి కదా!**

భాష పేరుతో ఏర్పడ్డ తెలుగు రాష్ట్రాల్లో తెలుగు భాష అన్ని రంగాల్లో అమలు జరగాలంటే ఎటువంటి చర్యలు తీసుకోవాలి?


ఒక్కటే! అది... భాషా ఉద్యమం. ఏ ఉద్యమమైనా మొదట చిన్నగానే ఆరంభమవుతుంది. చాలామంది ఈ ఉద్యమంలో ఇప్పటికే పని చేస్తున్నారు. ఎందుకో పూర్తి మద్దతు భాషా ప్రియుల నుంచి, మాతృభాషాభిమానుల నుండి లభించడంలేదేమో! మనకు సీరియస్‌నెస్ తక్కువ. భాషోద్యమకారులు అందరూ భేషజాలు ఉంటే వదులుకొని కలవాలి. అధికార భాష అమలు మొదట సచివాలయంలో జరగాలి. మన దృష్టి అక్కడ కేంద్రీకరించి పాలనా భాషగా బోధనా భాషగా న్యాయస్థానాల్లోనూ అన్ని కార్యాలయాల్లోనూ అమలు గురించి గట్టిగా ప్రయత్నించాలి. దైనందిన వ్యవహారంలో అలవోకగా అనివార్యంగా దొర్లే ఆంగ్ల పదాలకు తెలుగులో సమానార్థకాలు చెల్లుబాటు కావాలి. నూతన పద కల్పన సృజనాత్మక, నిరంతర ప్రక్రియ. ఆ పదాలు హాయిగా అర్థవంతంగా ఉండాలి గానీ, నోరు తిరగని సంస్కృత పదాలు తెచ్చుకోకూడదు, అవసరమైతే తప్ప! ఇలాంటివన్నీ ఒక చక్కటి వాతావరణంలో చర్చించుకునేందుకు ప్రభుత్వాలు పూనుకోవాలి. లేదంటే, అకాడమీలు విశ్వవిద్యాలయాలు ముందుకు రావాలి. భాషా సాంస్కృతిక శాఖ ఈ విషయంలో చొరవ తీసుకోవచ్చు. అసలు ఇంత వరకు తెలంగాణలో అధికార భాష సంఘాధ్యక్ష నియామకమే కాలేదు. అలాగే సాహిత్య అకాడమీ అధ్యక్ష పదవి నియామకమూ జరగలేదు.

ఇంగ్లీష్, హిందీ, సంస్కృతం తదితర భాషల ఒత్తిడిని తట్టుకొని నిలబడాలంటే తెలుగు భాషలో జరగాల్సిన కృషి ఏమిటి?

ఏ భాషనూ గుడ్డిగా వ్యతిరేకించవద్దు. ఒకటి, కనీసం ప్రాథమిక విద్యవరకైనా మాతృభాషలో బోధించాలి. ఇంగ్లీషు ప్రపంచం మీద రుద్దబడింది. అది, తెలుగు కావ్య భాష కన్నా మూడొందల ఏళ్ల అనంతర భాష. కానీ, ఆ భాషలో శాస్త్ర సాంకేతికాది పుస్తకాలన్నీ అనువదించబడి ఉన్నై. అలాగే, సంస్కృతంలోనూ అనేక శాస్త్రాలు రచించబడి ఉన్నాయి. హిందీని జాతీయ భాషగా చేసినందువల్ల అందులోనూ ఈ విజ్ఞానం ఉంది. మొదట చేయాల్సింది ఏమంటే– మనం తెలుగులోనికి శాస్త్ర సాంకేతికాది సర్వశాస్త్రాలని అనువదించుకోవాలి. అట్లా అనువాదం చేసేటప్పుడు ప్రధానంగా పదాల విషయంలో తెలుగులో సమానార్థకాలైన మాటలు ఉన్నాయా అని ఆలోచించాలి. ప్రాచీన సాహిత్యంలోనూ ప్రజల వాడుకలోనూ చక్కని అర్థపుష్టి కలిగిన తెలుగు పదాలు వేలల్లో ఉన్నాయి. ఒకవేళ కొన్ని పలుకులు లేనప్పుడు కొత్త మాటల కూర్పు జరగాలి. అదీ సాధ్యం కానప్పుడు మూల భాష లోని నుడులను ఉన్నవి ఉన్నట్లుగా తెచ్చుకోవడం తప్పేమీ కాదు! ఇప్పటికే తెలుగులో వాగరి, సం.వెం. రమేష్, వాచస్పతి, పారుపల్లి మొదలైన వాళ్ల ఈ కొత్త మాటల కూర్పు విషయంలో పనిచేశారు, చేస్తున్నారు. అయితే మనది ఏకోన్ముఖంగా సాగుతున్న పని కాదు. ఒక 'కన్నడ కావలి సంఘ'లాగానో, తంజావూర్ పండిత పరిషత్ వలెనో కొనసాగుతున్న పని కాదు. ప్రపంచంలోని విజ్ఞానాన్నంతా తెలుగులోనికి ఒంపుకున్నప్పుడు, నింపుకున్నప్పుడు మన కొరత తీరుతుంది. పూర్వం అరబ్బీలోనికి ఉపనిషత్తుల దగ్గర నుంచి అన్నీ వెళ్లాయి. హిబ్రూ భాష ఇప్పటికీ ఓ గొప్ప ఉదాహరణగా నిలుస్తుంది. ముందు ప్రభుత్వాలకు ఆ స్పృహ ఉండాలి.

ఇంటర్వ్యూ ■ **బూర్ల వేంకటేశ్వర్లు**

✆ 94915 98040



AKBAR

పుప్పాలగూడా రాళ్ళపందిరి


ఈ ఈనె గుండ్లన్నీ పాత పాతవే
పాకురెక్కిన రాత్రుల వలెనే
ఏడు సముద్రాల
చిటికెన వేలును
పట్టుకొని నడిచే పాత రోజులు
వాటి నుదుర గీతలు
కూరగాయల సంచుల కండ్లు
వేలాడుతూ.. తిరిగే వొంటరితనాలు
మనిషొక్కడే అనేకానేక వేలఏండ్ల
గాలి..
దరి కాన రాని
భూమి లోపలి జీవి
పుదీనా, సుక్కకూరల సోయిగూరల
ఆరిపోని వాసన
వాళ్ళ కొంగులు.. తగిలి
నడిచిపోతుంటే
కడియాల చూపులు,
ఆమె విడిచిపోతుంటే
గడియ వేయని తలుపులు
సగమే తెరిచే.. పాత తొవ్వలు
గవ్వల మాలలై ముడిచిన
బండారు పూతలు,
ముడుచుకొని నవ్వే వెదురు
గుంజలూ...
పూర్తిగా పగలని ముంజలూ

పాత పాత గుడిరాళ్ళు
పడావు పడిన కొత్త
చీకట్ల
ఎందరెందరో పతంగిలను
ఎగరేసుకుంటు...
రాత్రిపూట వెలిగే
టప్కీపున్నమి
కర్జూరపండు చంద్రుడు
దఖ్కనీ..
నా దఖ్కనీ...
వెన్నెల..
నేనూ
నా బస్తీ పోరగాండ్లూ
పోరీలూ
అనేకం మందిమి
పుప్పాలగూడ
తొవ్వపొంట

■ సిద్ధార్థ

73306 21563

దిగులులేని దేహం



AKBAR

సమూహంలోంచి తెగిపడ్డ
విశ్రాంత జీవితం
అప్పుడప్పుడు భయపెడుతుంది
నీటిలోంచి బయటపడ్డ
రంగు చేపలా
మనసు కలవరపడుతుంది
రోజు సాగదీయబడ్డట్టు అనిపిస్తుంది
గంటలు యుగాలైనట్టు దొర్లుతున్నాయి
అంత ఇంట్లో
అంతటా ఖాళీతనం...

అమ్మ గుర్తుకొచ్చింది
బ్రతుకు తెరువుల పోరాటంలో
ఉదయాన్ని కారియర్ గిన్నెల్లో
సర్దుకుని మేమందరం
తలా ఒక దిక్కు వెళ్ళాక
అన్ని రోజులు,
అన్ని నెలలు,
అన్నేళ్లు,
ఒంటరితనం మోస్తూ
గది గోడలు చూస్తూ
అనంత శూన్యంతో సంభాషిస్తూ
ఎలా గడిపిందో అనిపిస్తుంది..?

అందుకే కాబోలు,
అప్పట్లో మాకంటే
సీరియల్ పాత్రలే ఆమెకు
తోడుగా, దగ్గరగా వుండేవి..
మేడమీద నుంచొని,
రోడ్డు మీదెళ్లే బాటసారులతో
బంధుత్వం కలుపుకునేది.
ఇంటిముందు అరుగు మీద
సాయంత్రానికి స్నేహితులతో
ఒక ప్రపంచాన్ని సృష్టించుకునేది..
కాలాన్ని గుణిస్తూ
ఎదురుచూపుల్తో
సంధ్యవేళకు
మాకోసం కిటికీ దగ్గర
తైలవర్ణ చిత్రమయ్యేది

మొక్కల్ని నీళ్లతో పలకరించేది
పెంపుడు కుక్కకి పెరుగన్నం
ప్రేమ పంచేది
పాడే పిట్టకు గింజలేసి స్వాగతించేది
ఇంటి ముందరి మహావృక్షం
కొమ్మలు, రెమ్మలు,
ఆకులన్నీ ఆమెకు సుపరిచితమే..
మనుషులు కనిపించని సమయాల్లో
ప్రకృతితో మమేకమయ్యేది
ఇష్టంగా పుస్తక ప్రయాణం చేసేది
భక్తి రంగరిస్తూ వత్తులు చుట్టేది
రేపటి వారసత్వానికి
కళాత్మకంగా లేసులల్లేది
రేపటి మనిషికి
మానవ సంబంధాలు మృగ్యం
అని ముందుగానే పసిగట్టేది
రాబోయే రోజుల్లో
సమూహంలో ఉన్నా
మనిషి ఒంటరే
అనే హెచ్చరిక చేసేది..


ఇప్పుడిక అచ్చం అమ్మలా
జీవమున్న లోకం
ఒకటి ఏర్పరచుకోవాలి
ఖాళీతనాన్ని పారదోలి
ఒక పనిలోంచి మరో పనిలోకి
తరలింపే విశ్రాంతిగా భావించాలి
దిగులులేని దేహంగా మారిపోవాలి!

■ పెరుగు రామకృష్ణ

✆ 98492 30443

కన్నడ విజయం!

ఈ సంవత్సరం ఇంటర్నేషనల్ బుకర్ ప్రైజ్‌ను 'హార్ట్ లాంప్' కథల పుస్తకానికి కన్నడ రచయిత్రి బాను ముష్తాక్, అనువాదకురాలు దీప భాస్తి సంయుక్తంగా గెలుచుకున్నారు. యాభై వేల పౌండ్ల (సుమారు యాభై ఏడు లక్షల రూపాయల) బహుమతిని రచయిత్రీ అనువాదకురాలూ సమానంగా పంచుకుంటారు. ఈ బహుమతిని ఒక దక్షిణ భారతీయ భాష అందుకోవటం ఇదే మొదటిసారి. దీన్ని నవలకు గాక కథల పుస్తకానికి ఇవ్వటమూ ఇదే మొదటిసారి. 'హార్ట్ లాంప్' పుస్తకం ఛాయ పబ్లికేషన్స్ ద్వారా త్వరలో తెలుగులోకి రానున్నది. బాను ముష్తాక్ కన్నడలో 'బండాయ' (విప్లవ) సాహిత్య ఉద్యమంలో భాగంగా 1980ల్లో రచన చేయటం మొదలుపెట్టారు. ఆమె ఇప్పటి దాకా ఒక నవల, ఒక వ్యాస సంపుటి, ఒక కవిత్వ సంపుటి, ఆరు కథా సంపుటాలు తీసుకొచ్చారు. ఈ ఆరు కథా సంపుటాలలో ఉన్న యాభై కథల నుంచి ఎంపిక చేసిన పన్నెండు కథలు ఇప్పుడు 'హార్ట్ లాంప్' పుస్తకంలో ఉన్నాయి. ఈ కథలన్నీ ముస్లిం మహిళల జీవితాల చుట్టూ తిరుగుతాయి. అడ్వకేట్‌గా తన వృత్తి జీవితంలో మార్జినలైజ్డ్ జీవితాలతో ఏర్పడిన లోతైన పరిచయమే తన రచనకు బలం అంటారు బాను ముష్తాక్. 'హార్ట్ లాంప్' అనువాదకురాలు దీప భాస్తి ఇప్పటికే కోట శివరామకారంత్ వంటి ప్రముఖ కన్నడ రచయితల పుస్తకాలను ఇంగ్లీషులోకి అనువదించారు. మే 20న లండన్‌లోని టేట్ మోడ్రన్ ఆర్ట్ గ్యాలరీలో జరిగిన ఇంటర్నేషనల్ బుకర్ అవార్డ్ వేడుకలో బాను ముష్తాక్, దీప భాస్తి చేసిన ప్రసంగాల్లోంచి కొంత భాగాన్ని ఇక్కడ ఇస్తున్నాం. — **వివిధ**





బాను ముష్తాక్

"**ఏ** కథా 'లోకల్' కాదన్న నా నమ్మకానికి ఈ పుస్తకం ఒక ప్రేమ లేఖ. నా కన్నడ భాషను సొంత ఇంటిలా నాతో కలిసి పంచుకున్న పాఠకులందరికీ ఈ పుస్తకం ఒక ప్రేమలేఖ. కన్నడ భాషలో రాయడం అంటే ఒక గొప్ప సంప్రదాయాన్నీ, ఈ నేలలో ప్రవహించే వివేకపు సారాన్నీ వారసత్వంగా అందిపుచ్చుకోవటం. ఏ కథా చిన్నది కాదన్న నా నమ్మకం నుంచీ, మానవానుభవం అనే పెద్ద అల్లికలో ఏ చిన్న దారాన్ని పట్టుకు లాగినా మొత్తం అల్లిక కదులుతుందన్న నా నమ్మకం నుంచీ, ఎప్పుడూ మనల్ని విడదీయటానికే చూసే ఈ ప్రపంచంలో మనం ఒకరి మనసుల్లోకి ఒకరు చేరగలిగే ఆఖరి రహస్య మార్గం సాహిత్యం మాత్రమే అన్న నా నమ్మకం నుంచీ ఈ పుస్తకం పుట్టింది. కొన్ని పేజీలకే ఐనా గానీ వారి సమయాన్ని నమ్మకంగా నాకు అప్పగించి, నా అక్షరాలని వారి గుండెల్లో స్వేచ్ఛగా తిరగనిచ్చిన ప్రతి పాఠకుడికీ కృతజ్ఞతలు. ఈ రాత్రి ఒక ముగింపు కాదు. ఎవరూ వినని మరిన్ని మారుమూల కథలకూ, సరిహద్దుల్ని అతిక్రమించే అనువాదాలకూ, ఈ అనంత విశ్వం ప్రతి ఒక్క 'నేను' లోనూ ఇమిడి పోగలదని గుర్తు చేసే మరిన్ని గొంతులకూ ఈ రాత్రి ఒక దీపమై దారి చూపిస్తుందని నమ్ముతున్నాను."



దీప భాస్తి


"**ఈ** ప్రపంచం కథ ఎలాంటిదా అని ఆలోచిస్తే ఇది ఒక పెద్ద చెరిపివేతల చరిత్ర అని గమనిస్తాం. ఈ చరిత్రలో ఎందరో మహిళల విజయాలు చెరిపి వేయబడ్డాయి. ప్రపంచపు మార్జిన్లలోని ఎందరో ఎలా బతికారో ఎలా ప్రేమించారో చెప్పే సామూహిక జ్ఞాపకాలన్నీ గుట్టుగా చెరిపి వేయబడ్డాయి. ఇలాంటి ఎన్నో హింసలకి వ్యతిరేకంగా జరుగుతున్న సుదీర్ఘ యుద్ధంలో ఈ బహుమతి ఒక చిన్న విజయం. ఇలా చెరిపివేయబడిన వాటిలో అనువాదకుల శ్రమ కూడా ఒకటి. భిన్న భాషల పాఠకుల ముందుకు వారు ఎప్పటికీ చదివే వీల్లేని కథలను తెచ్చే అనువాదకుల శ్రమ ఎక్కడా గుర్తింపుకు నోచుకోక ప్రజల అవగాహనలోంచి చెరిపివేయబడింది. అందుకే రచయితలనూ, అనువాదకులనూ ఒకే వేదికపైకి తెచ్చి సమానంగా గౌరవించే ఈ బుకర్ ప్రైజ్ ప్రోత్సాహం మరువలేనిది. 'తేనెల నదిలా, పాల వానలా, తీయని అమృతంలా' అంటూ ఒక కన్నడ పాట కన్నడ భాషను అభివర్ణిస్తుంది. కన్నడ భూమ్మీది అత్యంత ప్రాచీన భాషల్లో ఒకటి. ఈ బహుమతి ద్వారా ప్రపంచవ్యాప్తంగా కన్నడ భాష మీద మరింత ఆసక్తి పెరిగి, మరిన్ని అనువాదాలు కన్నడ నుంచీ, కన్నడ లోకీ వస్తాయని నమ్ముతున్నాను. అలాగే ఈ ప్రయత్నం మరింత పెద్దదై దక్షిణ భారతంలోని అన్ని భాషలకూ విస్తరిస్తుందని ఆశిస్తున్నాను."

తొలి సమీక్షలోనే దాడి

నా మొదటి పుస్తకం

ప్రసాదమూర్తి

17 సంవత్సరాలకు తొలి పద్యం రాసిన నేను 39 సంవత్సరాలకు తొలి పుస్తకాన్ని ప్రచురించాను. మధ్యలో బతుకు వంతెన కింద చాలా నీరే ప్రవహించింది. అసలు ఆ తొలి పుస్తకం తోనే ప్రసాదమూర్తి అనే కవి చచ్చిపోయి ఉండాలి. ఏం జరిగిందో చెప్తాను. పద్యంలో పుట్టి వచనంలో తేలి, కమ్యూనిజం నుంచి అంబేద్కరిజం దాకా ఈతలు కొడుతున్న రోజులవి. 1990 నుంచి పదేళ్ళ పాటు ఉద్యోగ రీత్యా బిహార్‌లో ఉన్నాను. 'తాతకో నూలు పోగు' అనే నా కవిత ఆంధ్రజ్యోతిలో వచ్చిన తర్వాత భావజాలాలకు అతీతంగా సాహిత్య లోకం నన్ను గుండెలకు హత్తుకుంది. కోదాడలో జరిగిన దళిత సాహిత్య సదస్సు నా మీద బలమైన ముద్ర వేసింది. అప్పటిదాకా రాసిన ఇతరేతర పద్యాలను, కవితలను పక్కనపెట్టి, దళిత బహుజన వస్తు కేంద్రంగా నేను రాసిన కవితలన్నీ ఒకచోట ఏర్చి కూర్చి నా మొదటి సంకలనం తీసుకురావాలని సంకల్పించాను. దీనికి లక్ష్మీనరసయ్య గొప్ప ముందుమాట రాయడమే కాకుండా, కొన్ని జనరల్ పోయెమ్స్‌ని కూడా జతచేసి కవితల ఎంపికలో నిర్ణాయకమైన పాత్ర వహించాడు. అలా 1999 జూన్‌లో నా తొలి కవితా సంపుటి 'కలనేత' హైదరాబాద్ తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో అట్టహాసంగా ఆవిష్కృతమైంది. ఎందరో పెద్దలు, కవి మిత్రులు పాల్గొన్నారు. ఆత్మీయ మిత్రుడు శంకర్ పుస్తకాన్ని డిజైన్ చేస్తే, తమ్ముడు అక్బర్ అర్థవంతమైన ముఖచిత్రాన్ని అందించాడు. శిఖామణి, ఖాజా, కుమార్ లాంటి ప్రియ మిత్రుల ప్రోత్సాహం మరువలేనిది.



ఈ పుస్తకం చుట్టూ ఉన్న ఎన్నో తీపి జ్ఞాపకాల మధ్య, నన్ను ఇప్పటికీ వెంటాడే ఒక చేదు అనుభవాన్ని మీకు చెప్పాలి. నా తొలి పుస్తకం మీద వచ్చిన తొలి రివ్యూ– ఎవరో మారుపేరుతో నా మీద చేసిన తొలి దాడి. వస్తువు మీద అతనికి అసలు పేచీ. ఆ ముసుగు తీయకుండా నా కవిత్వం మీద కత్తి దూశాడు. ఇక కవిత్వం లేదు, కన్నీరే మిగిలింది. ఆ ముసుగు వీరుడి మీద నా ఆత్మీయ తమ్ముడు నగేష్ బాబు 40 పేజీల వ్యాసంతో యుద్ధానికి సిద్ధమయ్యాడు. శ్రీశ్రీ 'భిక్షువర్షీయసి'కీ నా 'తాతకో నూలు పోగు' కవితకీ మధ్య పోటీ పెట్టాడు. ఆకాశమంత అతని ప్రేమను ప్రేమ గానే పక్కన పెట్టాను. దాన్ని అతని ప్రేమ కానుకగా నా దగ్గరే దాచుకున్నాను. ఎవరు ఎన్ని చెప్పినా ఇక కవిత్వం జోలికి పోకూడదనుకున్నాను. అలాగే జరిగితే "ప్రసాదమూర్తి వస్తుతః కవి. అతను రాసినా కవే, రాయకపోయినా కవే" అని శివారెడ్డి లాంటి పెద్దల నుంచి ప్రశంసలు ఎలా పొందేవాడిని? కాలం నా పక్షాన నిలబడింది. ఆంధ్రజ్యోతి సాహిత్య పేజీలో ధింసా గారు నా 'కలనేత' మీద రాసిన అద్భుత సమీక్షా వ్యాసం మెయిన్ ఆర్టికల్‌గా వచ్చింది. కొన ఊపిరితో ఉన్న నాలో కవికి ఆ వ్యాసం తిరిగి ప్రాణం పోసింది. అలా బతికిపోయాను. ఆ వ్యాసం తర్వాత సినారె లాంటి ఎందరెందరో పెద్దల నుండి, కవి మిత్రుల నుండి ఉత్తరాల వాన కురిసింది. "ప్రసాదమూర్తి భావజాలం నచ్చిన వారు సరేసరి, నచ్చని వారు కూడా అతని కవిత్వాన్ని ఎంజాయ్ చేస్తారు" అని లక్ష్మీనరసయ్య ఇచ్చిన స్టేట్మెంట్ నిజమైంది. 'కలనేత'లో కవితలు కొన్ని చాలా సంకలనాలలో చోటు సంపాదించుకున్నాయి. నా పేరు ముందు 'కలనేత' విశేషణంగా వెలిగింది.



✆ 84998 66699

బహుభాషా కవి సమ్మేళనం

తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జూన్ 2న తెలంగాణ జాగృతి (అధ్యక్షులు: కల్వకుంట్ల కవిత) ఆధ్వర్యంలో ఉ.10 గంటలకు హైదరాబాద్ అబిడ్స్ బొగ్గులకుంట లోని తెలంగాణ సారస్వత పరిషత్‌లో 'తెలంగాణ యువ కెరటాలు' బహుభాషా కవి సమ్మేళనం 35ఏళ్ళ లోపు కవులు కవయిత్రులతో జరుగుతుంది. తెలంగాణ ఆత్మ, చరిత్ర, సంస్కృతి, వైభవం, సమిష్టితనం, మంచితనం అంశాలుగా కవిత్వం చెప్పవచ్చు. పాల్గొనాలనుకునే కవులు కవయిత్రులు మే 26లోపు ఈమెయిల్: kavitha.telangana@gmail.com కు తమ వివరాలు మెయిల్ చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

తెలంగాణ జాగృతి

కవితల పోటీ ఫలితాలు

పాలపిట్ట – వాసా ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన వాసా ప్రభావతి స్మారక కవితల పోటీ ఫలితాల వివరాలు: మొదటి, రెండవ, మూడవ బహుమతులు పొందిన కవులు వరుసగా: కరిపె రాజ్‌కుమార్, ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, ములుగు లక్ష్మీ మైథిలి. ప్రత్యేక బహుమతులు పొందిన ఎనిమిది మంది కవులు: దేవనపల్లి వీణావాణి, బి. కళాగోపాల్, చిత్తలూరి సత్యనారాయణ, లేదాళ్ళ రాజేశ్వరరావు, సింహాద్రి నాగ శిరీష, కె. దివాకరాచారి, పర్కపెల్లి యాదగిరి, ఎడమ శ్రీనివాసరెడ్డి. మరో తొమ్మిది మంది కవితలు సాధారణ ప్రచురణకు ఎంపికయ్యాయి.

గుడిపాటి

ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.6 కనిష్ఠం 23.3


ఒమిక్రాన్‌తో భయం వద్దు

అది అంత ప్రమాదకారి కాదు

- ఆస్పత్రిలో చేరే పరిస్థితి రాదు
- కోమార్బిటీస్‌తో మాత్రం జర పైలం
- ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు



హైదరాబాద్ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): దేశంలో మళ్లీ కోవిడ్-19 కలకలం సృష్టిస్తోంది. రోజురోజుకు కేసుల సంఖ్య పెరుగుతుండడంతో ప్రజలు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. అయితే ప్రస్తుతం వస్తున్న కరోనా వార్తలపై కంగారు పడాల్సిన అవసరం లేదని వైద్యులు పేర్కొంటున్నారు. 2020లో వచ్చిన కొవిడ్ నేపథ్యంలో గాంధీ ఆస్పత్రిని ప్రత్యేక నోడల్ సెంటర్‌గా ఏర్పాటు చేసి వేల సంఖ్యలో బాధితులకు చికిత్స అందించారు. అప్పట్లో ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా పనిచేసిన డాక్టర్ రాజారావు కొవిడ్ బాధితులకు వైద్యసేవలను అందించడంలో కీలకంగా వ్యవహరించారు. ప్రస్తుతం మళ్లీ దేశంలో కొవిడ్ కేసులు పెరుగుతున్నట్లు వస్తున్న వార్తల నేపథ్యంలో ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న డాక్టర్ రాజారావును 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. ప్రస్తుతం వ్యాప్తిచెందుతున్న కొవిడ్ వైరస్‌పై రాజారావు వెల్లడించిన అభిప్రాయాలు ఆయన మాటల్లోనే..



ఒమిక్రాన్ వైరస్ 3వ వేవ్‌లోనే అంతరించిపోయింది. దాని సబ్ వేరియంట్లు ఎంసీ 1.10.1, ఎల్బీ 1.3.1, ఎల్ఎఫ్7గా విస్తరించాయి. వాటి నుంచి జేఎన్-1 మరో సబ్ వేరియంట్ వచ్చింది. ఇది మ్యూటేషన్‌చెంది ఇప్పుడు ఎల్‌పీ 8.1, ఎక్స్‌ఎఫ్ సీ, ఎక్స్ ఈసీ సబ్ లినియేజస్ (sublineages)లు పుట్టకొస్తున్నాయి. ప్రస్తుతం ఎల్‌పీ 8 వేరియంట్ వేగంగా విస్తరిస్తుండడంతో కేసులు పెరుగుతున్నాయి. ఒమిక్రాన్ సబ్ వేరియంట్స్ అంత ప్రమాదకరం కాదు.. మైల్డ్‌గా ఉంటుంది. అలా వచ్చి ఇలా వెళ్లిపోతుంది. దీని కారణంగా బాధితులను ఆస్పత్రిలో చేర్పించాల్సిన అవసరం

మిగతా 6వ పేజీలో..




ప్చ్.. బిల్డ్ నౌ!

ప్లానింగ్ అధికారుల పరేషాన్

పలుమార్లు రాయాల్సిన పరిస్థితి

టీజీబీపాస్‌లో తలెత్తిన సాంకేతిక సమస్యలు బిల్డ్ నౌలో వస్తున్నట్లు తెలిసింది. దాంతో పాటు భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతులకు సంబంధించి కిందిస్థాయిలో సెక్షన్ ఆఫీసర్ నుంచి ఉన్నతస్థాయి ఆఫీసర్‌కు చేరే వరకు వివిధ స్థాయిల్లో నోట్‌షీట్లను రాయాల్సి ఉంటుంది. అయితే, బిల్డ్‌నౌలో నోట్‌షీట్ సక్రమంగా రావడం లేదు. పలుమార్లు క్లిక్ చేస్తే నోట్‌షీట్ వచ్చినా కానీ.. రాసిన అంశాలు ఒక్కోసారి కనిపించడం లేదు. దీంతో అధికారులు రాసిన విషయాన్నే పలుమార్లు రాయాల్సి వస్తోంది.

- నోట్‌షీట్ రాకపోవడంతో సతమతం
- సిటిజన్ సెర్చ్ లేకుండా బిల్డ్‌నౌ
- ప్రజలకు దరఖాస్తులు వెతికే ఆప్షన్ లేదు
- హెచ్ఎండీఏతో పాటు ఇతర సంస్థల డాష్‌బోర్డు కరువు



హైదరాబాద్ సిటీ, మే25 (ఆంధ్రజ్యోతి) భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతుల్లో అత్యంత పారదర్శకతకు, వేగానికి అందుబాటులోకి తీసుకొచ్చిన బిల్డ్‌నౌ అప్లికేషన్ అటు అధికారులను ఇటు ప్రజలను పరేషాన్ చేస్తోంది. వేగంగా అనుమతులివ్వడం కంటే దరఖాస్తులను అధికారులు ప్రాసెసింగ్ చేసే ప్రక్రియ ఆలస్యమవుతోంది. వివిధ స్థాయిల వారీగా ఒక్కో అధికారి దరఖాస్తుకు సంబంధించి రాయాల్సిన నోట్‌షీట్‌లోనూ సాంకేతిక సమస్యలు వస్తున్నాయి. ఆన్‌లైన్‌లో భవన నిర్మాణ, లేఅవుట్ అనుమతుల ప్రక్రియను మరింత సులభతరం చేసేలా టీజీబీపాస్‌కు బదులుగా బిల్డ్‌నౌను తీసుకొచ్చామని ప్రభుత్వం ప్రకటించింది. మారుతున్న కాలానికనుగుణంగా భవన నిర్మాణ అనుమతుల్లో సాంకేతికతను జోడించామని, సెకన్లలో స్క్రూటినీ చేసే ప్రక్రియ ఉందని వివరించింది. తొలుత జీహెచ్ఎంసీలో అమలు చేసిన బిల్డ్‌నౌ నెల క్రితం హెచ్ఎండీఏలో అమలు చేస్తున్నారు.

అనుమతుల వివరాలెలా కనుక్కోవాలి..

బిల్డ్‌నౌలో కేవలం దరఖాస్తుదారులకు, ఆఫీసర్లకు మాత్రమే పోర్టల్స్ ఉన్నాయి. కానీ సిటిజన్ సెర్చ్ లేదు. ఏదైనా భవన నిర్మాణం గురించి, లేఅవుట్ అనుమతుల గురించి తెలుసుకోవడానికి సిటిజన్ సెర్చ్ అనేది పదేళ్ల క్రితం అందుబాటులోకి వచ్చిన డీపీఎంఎస్ (డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్)లో ఉండింది. ఆ తర్వాత వచ్చిన టీజీబీపాస్‌లో కూడా సిటిజన్ సెర్చ్ ఉన్నది. కానీ బిల్డ్‌నౌలో మాత్రం సిటిజన్ సెర్చ్ లేదు. బిల్డ్‌నౌ అప్లికేషన్ జీహెచ్ఎంసీలో అందుబాటులోకి వచ్చి రెండు నెలలవుతున్నా.. హెచ్ఎండీఏలో నెలరోజులు కావస్తున్నా

మిగతా 6వ పేజీలో..

వర్క్‌ఫ్రం హోం పేరుతో సైబర్ మోసం

మహిళ నుంచి రూ.8.75 లక్షలు కాజేత

- నలుగురి అరెస్ట్



హైదరాబాద్ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): వర్క్ ఫ్రం హోం పేరుతో ఓ మహిళ నుంచి రూ.8.75లక్షలు తమ ఖాతాల్లోకి మళ్లించుకుని సైబర్ మోసానికి పాల్పడిన నలుగురు సైబర్ నేరగాళ్లను హైదరాబాద్ సైబర్ క్రైం అధికారులు అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరానికి చెందిన మనోజ్ దివాకర్, నగిరి విజయ్, సప్తపతి కిషోర్‌బాబు, రంగారెడ్డి జిల్లాకు చెందిన తిరునగరి సంతోష్‌కుమార్‌లు కమీషన్ తీసుకుంటూ సైబర్ నేరగాళ్లకు అవసరమైన బ్యాంకు ఖాతాలు అందిస్తున్నారు. ఇటీవల సోషల్ మీడియాలో ఆన్‌లైన్ జాబ్ పేరుతో ప్రకటనలు గుప్పించి టెలిగ్రాం యాప్ ద్వారా నగరంలోని ఓ మహిళకు లింకులు పంపారు. తాము 'అకోర్ అడ్వన్టేజ్ ప్లస్ మార్కెటింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ హెచ్ఆర్ ప్రతినిధులమని పరిచయం చేసుకుని, ఇంట్లోనే కూర్చొని రోజుకు రూ.17వేల వరకు సంపాదించే అవకాశముందని బోల్తా కొట్టించారు. వారి మాటలు నమ్మిన మహిళ మొదట వారు సూచించిన బ్యాంకు ఖాతాకు రూ.10 వేలు చెల్లించి ఆన్‌లైన్ వర్క్ చేయడంతో లాభం చూపించారు. ఆ తర్వాత ఆమె పలుదఫాలుగా రూ.8.75 లక్షల వరకు పెట్టుబడి పెట్టింది. దీనికి లాభాలు కలిపి రూ.15.82 లక్షలు చెల్లిస్తామని చెప్పిన సైబర్ నేరగాళ్లు.. సెక్యూరిటీ డిపాజిట్ కింద మరో రూ.7.9లక్షలు జమ చేయాలని సూచించారు. తాను అంత డబ్బు జమ చేయలేనని చెప్పడంతో వారు స్పందించడం మానేశారు. దాంతో మోసపోయానని గ్రహించిన బాధితురాలు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేసింది. సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు ప్రారంభించిన సైబర్ క్రైం అధికారులు, బ్యాంకు ఖాతాలు సమకూర్చి సహకరిస్తున్న మనోజ్ దివాకర్, విజయ్, కిషోర్, సంతోష్ కుమార్‌లను అరెస్ట్ చేశారు.

ఫీడర్ల ట్రిప్పింగ్‌పై నజర్

- చెట్లకొమ్మల తొలగింపుపై స్పెషల్ డ్రైవ్
- సెక్షన్ల వారీగా దక్షిణ డిస్కం కార్యాచరణ

హైదరాబాద్ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): నగరంలో విద్యుత్ సరఫరాలో పెరుగుతున్న అంతరాయాలపై దక్షిణ డిస్కం దృష్టి సారించింది. విద్యుత్ తీగలకు తగిలే చెట్లకొమ్మలతో ఫీడర్లు ట్రిప్ అవుతున్నట్లు గుర్తించిన ఉన్నతాధికారులు ఆ మేరకు సెక్షన్ల వారీగా కార్యాచరణను అమలు చేస్తున్నారు. హబ్సిగూడ సర్కిల్‌లో 700, సికింద్రాబాద్ సర్కిళ్లలో 650 ప్రాంతాల్లో విద్యుత్ తీగలకు చెట్లకొమ్మలు తగులుతున్నట్లు గుర్తించి వాటిని తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అలాగే బంజారాహిల్స్ సర్కిల్‌లో 150, సరూర్‌నగర్ 290, మేడ్చల్‌లో 300, సైబర్‌సిటీ 290, హైదరాబాద్ సెంట్రల్‌లో 280, హైదరాబాద్ సౌత్‌సర్కిల్‌లో 198 వరకు విద్యుత్ తీగలకు చెట్ల కొమ్మలు అడ్డుగా ఉన్నట్లు విద్యుత్‌శాఖ గుర్తించింది.

హబ్సిగూడ సర్కిల్‌లో ఓల్టేజీ సమస్యలు అధికం

హబ్సిగూడ సర్కిల్‌లో విద్యుత్ సరఫరాలో ఓల్టేజీ సమస్యలు అధికంగా నమోదవుతున్నట్లు ఫిర్యాదులున్నాయి. కూకట్‌పల్లి, జీడిమెట్ల, మేడ్చల్ డివిజన్లలోని పలు ప్రాంతాల్లో ఓల్టేజీ సమస్యలు పెరుగుతున్నాయనే ఫిర్యాదులున్నాయి. మరికొన్ని సర్కిళ్ల పరిధుల్లో ఓల్టేజీలో హెచ్చుతగ్గుదల సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించేందుకు ఆయా సెక్షన్లలో ఏఈ, ఏడీఈలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్నారు.

భద్రత గాలిలో దీపమేనా?

- ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొరవడిన పర్యవేక్షణ
- ఎవరు వస్తున్నారో? ఎవరు వెళుతున్నారో తెలియని దుస్థితి
- తరచూ వెలుగు చూస్తున్న చోరీలు
- మారువేషంలో వచ్చి దొంగతనం చేయడమే నిదర్శనం
- మహిళలతో అపరిచితుల అసభ్యప్రవర్తనపై ఫిర్యాదులు
- నామ్‌కే వాస్తేగా సీసీ కెమెరాలు

6



● మబ్బే ముసుగేసిందిలే..



నగరాన్ని ఆదివారం మబ్బులు కమ్మేశాయి. ఉదయం పూట ఎండ కనిపించగా మధ్యాహ్నానికి వాతావరణం చల్లబడింది. కొన్ని ప్రాంతాలలో చిరుజల్లులు కురిశాయి. తెలంగాణ సచివాలయం వద్ద మబ్బులు కమ్ముకుని ఉన్న చిత్రమిది.

ప్లీజ్.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

- పనితీరుపై అభిప్రాయం కోసం పోలీసుల వేడుకోలు
- క్యూఆర్ కోడ్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లని సిబ్బంది
- ఉన్నతాధికారుల ఆగ్రహంతో కదలిక..

- సైబరాబాద్ కమిషనరేట్‌లో ఓ పోలీస్ స్టేషన్‌కు వచ్చి వెళ్తున్న ఫిర్యాదు దారుడిని కానిస్టేబుల్ ఆపాడు. సర్..! మీ ఫిర్యాదు ఇన్‌స్పెక్టర్ సర్ చూశారా..? ఆయన మీకు సమస్యపై ఎలా స్పందించారు..? అంటూ వివరాలు అడిగి తెలుసుకున్నాడు. వాటికి ఫిర్యాదుదారుడు సానుకూలంగా స్పందించడంతో.. సర్ ఇక్కడ ఉన్న క్యూర్ కోడ్‌ను స్కాన్ చేసి మీ ఒపీనియన్ తెలియజేయండి ప్లీజ్.. అంటూ అభ్యర్థించాడు.
- మరో పోలీస్ స్టేషన్‌లో స్టేషన్‌కు వచ్చిన బాధితుడికి అక్కడున్న రిసెప్షనిస్టు కంప్లైంట్ రాసి, అతను చెప్పిన వివరాలన్నీ పొందుపరిచి అతన్ని ఇన్‌స్పెక్టర్‌కు వద్దకు తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదును పరిగణనలోకి తీసుకొన్న ఎస్‌హెచ్‌వో కేసు నమోదు చేయాలని సెక్టార్ ఎస్సైకి ఎండార్స్ చేశాడు. బాధితుడు సంతోషం వ్యక్తం చేయడంతో సర్.. మా పోలీస్‌స్టేషన్ పనితీరు ఎలా ఉందో ఈ క్యూర్ కోడ్ స్కాన్ చేసి అందులో మీ ఒపీనియన్ చెప్పండి అంటూ రిసెప్షనిస్టు క్యూఆర్ కోడ్‌ను చూపించింది.



క్యూ ఆర్ కోడ్‌ను విడుదల చేస్తున్న డీజీపీ జితేందర్, షికా గోయల్, తదితరులు (ఫైల్)

హైదరాబాద్ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో గతంలో ఉన్న ఫీడ్ బ్యాక్ సెంటర్‌లకు ఉన్నతాధికారులు స్వస్తిపలికి వాటి స్థానంలో ఇటీవల పోలీస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను అందుబాటులోకి తెచ్చారు. కానీ వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో పోలీస్ సిబ్బంది పూర్తిగా విఫలమయ్యారు. ఈ విషయాన్ని గుర్తించిన ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ప్రస్తుతం క్యూఆర్ కోడ్‌లను స్కాన్ చేయండంటూ పోలీసు సిబ్బంది ఫిర్యాదుదారులను వేడుకొంటున్నారు. గ్రేటర్ పరిధిలోని మూడు కమిషనరేట్లలోని సుమారు 170 పోలీస్ స్టేషన్లలో ఒక్క బాలానగర్ పీఎస్ మాత్రమే 9వ స్థానంలో నిలిచి గౌరవం దక్కించుకుంది. కేవలం ఒక్క పీఎస్ మాత్రమే గౌరవం దక్కించుకోవడంపై ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం

మిగతా 8వ పేజీలో..

5 నిమిషాలు ఆలస్యం..

పరీక్షకు దూరం

- వేడుకున్నా అనుమతి నిరాకరణ
- యూపీఎస్సీ పరీక్ష రాయకుండానే వెనుదిరిగిన ఆరుగురు

6



అంగన్‌వాడీకి

కుళ్లిన గుడ్లు

- దయాబాగ్ సెంటర్ నుంచే సరఫరా
- లబ్ధిదారురాలి కుటుంబసభ్యుల ఆరోపణ

6





టోలీచౌకిలో నిర్వహిస్తున్న మానవహారం

వక్ఫ్‌బోర్డు బిల్లులకు వ్యతిరేకంగా

మానవహారం



చంచల్‌గూడ : మానవహారంలో ఎమ్మెల్యే బలాల

నార్సింగ్/చాదర్‌ఘాట్/ ఎర్రగడ్డ, మే 25 (ఆంధ్రజ్యోతి): వక్ఫ్‌బోర్డు బిల్లులకు వ్యతిరేకంగా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం నగరంలో పలుచోట్ల ముస్లింలు మానవహారం నిర్వహించారు. కార్వాన్ నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ కౌసర్ మొహియుద్దీన్ ఆధ్వర్యంలో టోలీచౌకిలో, మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆధ్వర్యంలో చంచల్‌గూడలో, ముస్లిం మత గురువుల ఆధ్వర్యంలో అమీర్‌పేట నుంచి ఎర్రగడ్డ, మూసాపేట వరకు, అంబర్‌పేటలో అలీకేఫ్ చౌరస్తా నుంచి లాల్‌బాగ్ మసీదు, తహసీల్దార్ కార్యాలయం వరకు రోడ్డు పొడవునా మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాట్లాడుతూ వక్ఫ్‌బోర్డు బిల్లుల్లో అవకతవకలు ఉన్నాయని, వెంటనే సరిచేయాలని డిమాండ్ చేశారు. మజ్లిస్ పార్టీ ఎప్పుడూ ప్రజల పక్షాన నిలుస్తుందని, ప్రజలకు అన్యాయం జరిగితే సహించేది లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మౌలానా సయ్యద్ మసూద్ హుస్సేన్ ముజ్తాహేదీ, ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డుకు చెందిన సజ్జాద నషీన్ దైరా, హజ్రత్ షా ఏ ఖాసీమ్, మజ్లిస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇక ప్రతి డిపోలో

ఈవీ చార్జింగ్ స్టేషన్

ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి ..

- ఇప్పటికే 5 డిపోల్లో సేవలు
- గ్రేటర్‌లో డిసెంబర్ వరకు మరో 277 ఈవీ బస్సులు
- వచ్చే మార్చి నాటికి కేంద్రం నుంచి 2 వేల ఎలక్ట్రిక్ బస్సులు



హెచ్‌సీయూ డిపోలో ఏర్పాటు చేసిన చార్జింగ్ పాయింట్లు

హైదరాబాద్ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ పరిధిలో ఈ ఏడాది చివరి నాటికి అన్ని ఆర్టీసీ బస్ డిపోల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లు అందుబాటులోకి రానున్నాయి. ఆ మేరకు ఆర్టీసీ చర్యలు చేపట్టింది. ప్రభుత్వ ఆదేశాలతో రాబోయే రెండేళ్లలో గ్రేటర్‌లో కేవలం ఈవీ బస్సులు మాత్రమే నడిపే దిశగా ఆర్టీసీ కార్యాచరణను రూపొందిస్తోంది. గ్రేటర్‌లో ప్రస్తుతం 263ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తుండగా.. డిసెంబర్ నాటికి మరో 277 ఎలక్ట్రిక్ బస్సులు రోడ్లపైకి తీసుకువచ్చేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నారు. అంతకు ముందే ప్రతి డిపోలో ఈవీ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయాలని

మిగతా 6వ పేజీలో..



జూ పార్క్ ప్రవేశ ద్వారం వద్ద పోటెత్తిన సందర్శకులు

జూ పార్క్‌లో సందడే.. సందడి

ఒక్కరోజే 24వేల మంది సందర్శన

మదీన, మే 25 (ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల నేపథ్యంలో ఆదివారం జూ పార్క్ సందర్శకులతో రద్దీగా మారింది. ఆదివారం ఒక్కరోజే 24వేలకు పైచిలుకు సందర్శకులు జూను తిలకించారు. నగరం నుంచే కాకుండా చుట్టుపక్కల జిల్లాల నుంచి సందర్శకులు భారీగా తరలివచ్చారు. రద్దీ పెరగటంతో ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అదనపు ఏర్పాట్లు చేశారు. ఎన్‌క్లోజర్లు, ఓపెన్ ఎయిర్‌లో ఉన్న జంతువులను దగ్గరి నుంచి చూస్తూ సందర్శకులు కేరింతలు కొట్టారు.

9.36 నిమిషాల్లో 121 ఆత్మరక్షణ మెలకువలు

- అక్కా చెల్లెళ్ల వరల్డ్ రికార్డు



కరాటేలో ఆత్మరక్షణ మెలకువలను ప్రదర్శిస్తున్న అక్కా చెల్లెళ్లు

బర్కత్‌పుర, మే 25 (ఆంధ్రజ్యోతి): కాచిగూడకు చెందిన ఈ అక్కాచెల్లెళ్లు అతి తక్కువ సమయంలో కరాటేలో 121 ఆత్మరక్షణ మెలకువలను ప్రదర్శించి వరల్డ్ రికార్డు నెలకొల్పారు. డాక్టర్ జీఎస్ గోపాల్‌రెడ్డి, మాధవి దంపతుల కుమార్తెలు జి.అమృతారెడ్డి (బీకాం ద్వితీయ సంవత్సరం), జి.ఘనసంతోషిణిరెడ్డి (ఇంటర్ పూర్తి) కాచిగూడలోని జీవీఆర్ కరాటే అకాడమీలో శిక్షణ పొందారు. తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని కరాటేలో 121 ఆత్మరక్షణ మెలకువలను 11విభాగాలలో 9 నిమిషాల 36 సెకన్లలో ప్రదర్శించి వరల్డ్ రికార్డు నెలకొల్పారు. వాస్తవానికి 11 నిమిషాలలో పూర్తి చేయాల్సిన ఈ మెలకువలను ఒకటిన్నర నిమిషాల్లో పూర్తి చేసి వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లలో స్థానం సంపాదించారు. ఇప్పటివరకు ఈ అక్కాచెల్లెల్లు 9 వరల్డ్ రికార్డులు సాధించడం గమనార్హం. అనంతరం జరిగిన కార్యక్రమంలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి బింగి నరేందర్ గౌడ్, లిమ్కా బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధి విజయలక్ష్మిలు సర్టిఫికెట్లు, వరల్డ్ రికార్డ్స్‌లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు గడ్డం మహాలక్ష్మి రామన్‌గౌడ్, కన్నె ఉమాదేవి, వై. అమృత, సంగీతయాదవ్, పి.దీపిక అక్కాచెల్లెళ్లను అభినందించారు.

చైతన్య మూర్తి

ప్రజా సమస్యలు, అవినీతిపై పాటలు

తెలంగాణ ఉద్యమంలో వెంకటాచారిది ముఖ్యపాత్ర

అవినీతి, అస్పృశ్యత, మూఢనమ్మకాలు, సామాజిక చైతన్యంపై అప్పటికప్పుడు అలవోకగా బాణీలు కట్టి పాటలు రాసే నేర్పరి అతగాడు. ఒకటి కాదు రెండు కాదు కొన్ని వందల ప్రదర్శనలు ఇచ్చి ప్రజలను చైతన్య పరిచాడు. జవహర్‌నగర్ డంపింగ్ యార్డు వల్ల దెబ్బతింటున్న ప్రజల ఆరోగ్యాలపై ప్రభుత్వాన్ని నిలదీసే అతడి పాటలు.. జానపద కళాకారుడిగా పల్లె పాటలతో, సాంస్కృతిక రంగంలో తనదైన శైలిలో ముందుకు సాగుతున్నాడు వజ్రోజు వెంకటాచారి.

బిట్స్‌పిలానీ, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై పాటల ద్వారా ప్రజల్లో చైతన్యం కల్పించడం.. అవినీతి అక్రమాలపై పాటలకు బాణీలు కట్టి ప్రజల్లో ఆలోచన మొలకెత్తించడం.. అధికారుల తీరుపై తనదైన రీతిలో పాటల ద్వారా ప్రశ్నించడం, జవహర్‌నగర్‌లోని డంపింగ్ యార్డు వల్ల కలిగే నష్టాలు, ప్రభుత్వం పేదలకు ఇచ్చిన భూములను క్రమబద్ధీకరించకపోవడంపై, పేదలు వేసుకున్న గుడిసెలను రెవెన్యూ అధికారులు కూల్చడంపై తనదైన శైలిలో పాటల ద్వారా ప్రశ్నించడం వెంకటాచారి నైజం.


చాడ వెంకటరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న వెంకటాచారి (ఫైల్)

జనగామ జిల్లా నుంచి జవహర్‌నగర్‌కు..

జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం దబ్బగుంట పల్లి గ్రామానికి చెందిన వెంకటాచారి బతుకుదెరువు కోసం నగరానికి వచ్చి జవహర్‌నగర్‌లో స్థిరపడ్డాడు. కేవలం నాలుగో తరగతి వరకే చదువుకున్న చారి ఆశు కవిత్వం చెప్పడంలో దిట్ట. 2004లో బాలాజీనగర్‌లో క్రాంతి కళాబృందంను స్థాపించడంతోపాటు ప్రజానాట్య మండలి పేరుతో కళా ప్రదర్శనలు ఇచ్చారు. జవహర్‌లాల్ నెహ్రూ యువజన కేంద్రం తరఫున ఉమ్మడి రాష్ట్రంలో పర్యావరణం, కుటుంబనియంత్రణ, బాల్య వివాహాలు, మానవహక్కుల రక్షణ తదితర అంశాలపై ప్రజలను చైతన్య పరిచాడు. తెలంగాణ ఉద్యమంలో ప్రజా యుద్ధ నౌక గద్దర్, వందేమాతరం శ్రీనివాస్, గోరటి వెంకన్నతో కలిసి పాటలు పాడాడు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో తెలంగాణ పాటలతో ఉర్రూతలూగించాడు.

జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులకు తన పాట ద్వారా చురకలు అంటించాడు. రెవెన్యూ అధికారులు పేదల ఇళ్లను కూల్చుతున్న విధానంపై ప్రత్యేకంగా పాటలను రూపొందించాడు. జవహర్‌నగర్‌లోని డంపింగ్ యార్డు వల్ల ప్రజల ఆరోగ్యం ఎలా దెబ్బతింటున్నదో తన పాటలద్వారా ఎలుగెత్తి చాటాడు.

అవార్డులు

పలువురు ప్రముఖుల ద్వారా సత్కారాలు, అవార్డులను ఎన్నో అందుకున్నాడు వెంకటాచారి. తెలంగాణ పీపుల్స్ మూమెంట్ అనే స్వచ్ఛంద సంస్థ ద్వారా సీపీఐ మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్నాడు. జానపదాలపై అద్భుతమైన గీతాలను ఆలపించిన చారిని సాయి అలేఖ్య సాంస్కృతిక ఫౌండేషన్ అవార్డుతో సత్కరించింది. మద్రాస్‌కు చెందిన ప్రొఫెసర్ ఆర్. కాలేశ్వర్, సికింద్రాబాద్, హైదరాబాద్‌లోని పలు స్వచ్ఛంద సంస్థలు, కళారంగాలు ఆయనకు అవార్డులు అందజేశాయి.


ఉద్యమ సమయంలో పాట చిత్రీకరణ సన్నివేశం (ఫైల్)

కళాబంధు పథకం ఏర్పాటు చేయాలి

తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న కళాకారులకు సబ్సిడీతో రుణాలు ఇవ్వాలి. రైతు బంధు పథకం లాగా పేద కళాకారులకు కళాబంధు పథకం ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

- వజ్రోజు వెంకటాచారి, తెలంగాణ కళాకారుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు

రేపు 'ఆటో ఆకలి కేకలు' మహాసభ

నల్లకుంట, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఆటోడ్రైవర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం విఫలమైందని తెలంగాణ యునైటెడ్ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నేతలు ఆరోపించారు. ఆటోడ్రైవర్ల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం గత నెల 25 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన ఆటో రథయాత్ర పూర్తయి నగరానికి వస్తున్న నేపథ్యంలో ఈనెల 27న ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఆటో ఆకలి కేకలు పేరుతో మహాసభ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆదివారం హైదర్‌గూడలో ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆటో జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్, జేఏసీ ఛైర్మన్ గాజుల ముఖేష్‌గౌడ్, బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య మాట్లాడారు. గ్రేటర్ హైదరాబాద్‌లో ఆటోమీటర్ల రేట్లు పెంచాలని, ఆటోకు స్టేట్ పర్మిట్ ఇవ్వాలన్నారు. ఆటో జేఏసీ నాయకులు మహమ్మద్ హబీబ్, ఆకుల వెంకటేశ్వర్లు, ఉయ్యాల ప్రవీణ్, లింగంగౌడ్, శ్రీకాంత్, ఎం.ఎ.సలీం, రాంరెడ్డి, సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న ఆటో జేఏసీ నేతలు మంద రవికుమార్, గాజుల మహేష్‌గౌడ్, వేముల మారయ్య తదితరులు

ఎర్రకోటపై ఎర్రజెండా ఎగురవేయడానికి
వామపక్ష పార్టీలన్నీ ఏకం కావాలి

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు

ఏఎస్‌రావునగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎర్రకోటపై ఎర్రజెండా ఎగురవేయడమే లక్ష్యంగా వామపక్ష పార్టీలన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. ఆదివారం ఈసీఐఎల్‌లోని బంజారా ఫంక్షన్ హాలులో నిర్వహించిన మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా నాలుగవ మహాసభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ ప్రభుత్వాన్ని అంతమొందించాలంటే ముఖ్యంగా వామపక్ష పార్టీలు ఒకే తాటిపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. పీడిత ప్రజల విముక్తి కోసం, ప్రజా సమస్యల సాధనే లక్ష్యంగా తమ జీవితాలను పణంగా పెట్టి అడవుల్లో కాలం గడుపుతూ పోరాటం చేస్తున్న మావోయిస్టులను ఎన్‌కౌంటర్‌ల పేరిట హతమార్చే హక్కు ప్రభుత్వానికి ఎక్కడిదని ప్రశ్నించారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలు, ఓట్ల కోసం మత వైషమ్యాలను రెచ్చగొట్టే తీరును ప్రజల ముందుకు తీసుకెళ్లడానికి కమ్యూనిస్టులు కృషి చేయాలన్నారు.

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కమ్యూనిస్టులు సమరశీల పోరాటబాట పట్టాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై పోరాడుతూనే, సంక్షేమ పథకాలు అర్హులైన వారికి అందేలా క్షేత్రస్థాయిలో సీపీఐ కార్యకర్తలు కృషి చేయాలన్నారు. సమావేశానికి ముందు పార్టీ శ్రేణులు ఈసీఐఎల్ చౌరస్తా నుంచి సభా ప్రాంగణం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి అమరవీరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ సహాయ కార్యదర్శి జి.దామోదర్‌రెడ్డి, కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్ బోస్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇక ప్రతి డిపోలో
ఈవీ చార్జింగ్ స్టేషన్

(5వ పేజీ తరువాయి)

ఆర్టీసీ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో ప్రతి డిపోలో 20-30 చార్జింగ్ పాయింట్లతో ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. ఇప్పటికే కంటోన్మెంట్, మియాపూర్, బీహెచ్ఈఎల్, హెచ్‌సీయూ, హయత్‌నగర్-2 బస్ డిపోల్లో ఈవీ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసింది. రాణీగంజ్, కూకట్‌పల్లి డిపోల్లో ఏర్పాటు చేస్తున్న చార్జింగ్ స్టేషన్లను త్వరలో ప్రారంభించనున్నారు.

పీఎం ఈ-డ్రైవ్ పథకంలో రెండువేల ఈవీ బస్సులు

పీఎం ఈ - డ్రైవ్ పథకంలో భాగంగా హైదరాబాద్ నగరానికి రెండు వేల ఎలక్ట్రిక్ బస్సులు కేంద్రం కేటాయించనున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్ నుంచి తెలంగాణలోని పలు జిల్లాలకు ఆర్టీసీ ఈవీ బస్సులు నడుపుతోంది. భవిష్యత్‌లో మిగతా జిల్లాలకు కూడా ఎలక్ట్రిక్ బస్సులను పెంచేదిశగా అధికారులు చర్యలు చేపడుతున్నారు.

2 గంటల్లో ఫుల్‌చార్జింగ్

ఎలక్ట్రిక్ బస్సుల చార్జింగ్ కోసం ఒక్కో డిపోలో 20-30 చార్జింగ్ పాయింట్లు ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. ఒక బస్సుకు రెండుగంటల పాటు చార్జింగ్ చేస్తే 100 శాతం బ్యాటరీ ఫుల్ అవుతుంది. తద్వారా బస్సులు 250 కిలోమీటర్లు తిరుగుతాయని అధికారులు తెలిపారు. అయితే, 20 శాతం చార్జింగ్ ఉండగానే బస్సులను డిపోలకు తీసుకువచ్చి మరోసారి వాటికి వందశాతం చార్జింగ్ చేసి రోడ్లపైకి పంపిస్తున్నామన్నారు.

ప్చ్.. బిల్డ్ నౌ!

(5వ పేజీ తరువాయి)

సిటిజన్ సెర్చ్ ఆప్షన్ తీసుకురాకపోవడంపై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో ఫ్లాట్లు, ఓపెన్ ప్లాట్లను కొనుగోలు చేయాలనుకున్న వారు అనుమతులకు సంబంధించిన వివరాలు తెలుసుకోలేకపోతున్నారు.

డాష్‌బోర్డు కరువు

డీపీఎంఎస్, టీజీబీపాస్‌లలో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, డీటీసీపీల వారీగా డాష్‌బోర్డు ఉండేది. ఫలితంగా దరఖాస్తుల ప్రాసెసింగ్, పెండింగ్ వంటి విషయాల్లో పారదర్శకత కనిపించేది. అయితే, బిల్డ్‌నౌలో హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీల వారీగా డాష్‌బోర్డుకు రూపకల్పన చేయలేదు. ఫలితంగా హెచ్ఎండీఏకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి, ఎన్ని తిరస్కరించారు, ఎన్ని అనుమతులిచ్చారు, ఎన్ని ప్రాసెసింగ్‌లో ఉన్నాయి, ఏ అధికారి వద్ద ఎన్ని రోజులుగా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయనే వివరాలు తెలుసుకునే అవకాశం లేకుండా పోయింది. దీంతో బిల్డ్‌నౌలో డాష్‌బోర్డు లేకుండా చేసి పారదర్శకతకు తూట్లు పొడిచారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

లోగోలోనూ స్పష్టత లేదు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన బిల్డ్ నౌ సాఫ్ట్‌వేర్ అప్లికేషన్ ప్రభుత్వ వెబ్‌సైటా.. లేక ప్రైవేటు వెబ్‌సైటా అని గుర్తించడం సామాన్యులకు కష్టంగా మారింది. ఈ వెబ్‌సైట్‌లో ప్రభుత్వ లోగో కూడా ఉండీ ఉండనట్లుగా, స్పష్టత లేకుండా కనిపిస్తోంది. అందులో 'గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ' అనేది కూడా కనిపించదు. ప్రభుత్వ వెబ్‌సైట్‌లో సీఎం ఫొటోతోపాటు సంబంధిత శాఖ సెక్రటరీల, మంత్రుల ఫొటోలుంటాయి. కానీ ఈ వెబ్‌సైట్‌లో సీఎంతో పాటు ఎవరి ఫొటోలు, పేర్లు కూడా కనిపించడం లేదు. వెబ్‌సైట్‌లో పై నుంచి కింది వరకు ప్రైవేటు ప్రకటనల మాదిరిగా వివరాలున్నా క్లిక్ చేస్తే ఏదీ కూడా పని చేయకపోవడం గమనార్హం.

భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న ఆర్‌టీఐ కమిషనర్


భద్రాద్రి రామాలయంలో ఆర్‌టీఐ కమిషనర్ శ్రీనివాస్ దంపతులు

భద్రాచలం, మే 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమాచార హక్కు చట్టం (ఆర్‌టీఐ) కమిషనర్ వీవీ శ్రీనివాసరావు ఆదివారం కుటుంబ సమేతంగా భద్రాచలంలోని సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. దేవస్థానం అధికారులు వారికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారి కండువా, ప్రసాదాన్ని దేవస్థానం వైదిక సిబ్బంది ఆయనకు అందజేశారు. కార్యక్రమంలో భద్రాద్రి దేవస్థానం ఏఈవో శ్రావణ్‌కుమార్, పర్యవేక్షకులు లింగాల సాయిబాబా, ప్రధాన అర్చకులు కోటి రామస్వరూప్ రాఘవాచార్య తదితరులు పాల్గొన్నారు.


ద సీమాస్ కో సంస్థ ఉత్పత్తులను మార్కెట్‌లోకి విడుదల చేస్తున్న కోమటి జయరాం, గరికపాటి మోహన్‌రావు, లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్ రెడ్డి, హన్సిక తదితరులు

సముద్రపు నాచుతో ఉత్పత్తులు

హైదరాబాద్ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): మన శరీరానికి అవసరమైన పోషకాలలో 92 పోషకాలకు పైగా అత్యవసర విటమిన్‌లు, మినరల్స్ అందించే సముద్రపు నాచుతో తాము ఉత్పత్తులను రూపొందించామంటున్నారు ద సీమాస్ కో సంస్థ ప్రతినిధులు. ఆదివారం ఫిలింనగర్‌లోని ఎఫ్ఎన్‌సీసీలో జరిగిన కార్యక్రమంలో లోకాయుక్త జస్టిస్ రాజశేఖర్ రెడ్డి, మాజీ ఎంపీ గరికపాటి మోహన్‌రావు, వ్యాపారవేత్త కోమటి జయరాం ఉత్పత్తులను విడుదల చేశారు. ద సీమాస్ కో సంస్థ వ్యవస్థాపకులు హన్సిక, పూజిత మాట్లాడుతూ ప్రస్తుతం రెండు రకాల ఉత్పత్తులను అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో కాటమనేని రమేష్, పెండ్యాల ప్రసాద్ పాల్గొన్నారు.

ఆఫ్రికా మీడియా బృందానికి ఘన స్వాగతం



తెలంగాణ పర్యటనకు వచ్చిన పశ్చిమ ఆఫ్రికా మీడియా ప్రతినిధులకు ఆదివారం శంషాబాద్ ఎయిర్‌పోర్టులో సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు ఘన స్వాగతం పలికారు. వారు చార్మినార్, సాలార్‌జంగ్ మ్యూజియం, గోల్కొండ కోట, హార్న్‌బిల్ వీఎఫ్ఎక్స్ స్టూడియో, టీ-వర్క్స్, శిల్పారామం ఆర్ట్ అండ్ క్రాఫ్ట్స్ విలేజ్, రామోజీఫిల్మ్ సిటీ, చేనేత హస్త కళల ఉత్పత్తి కేంద్రం పోచంపల్లిని సందర్శిస్తారని అధికారులు తెలిపారు.

- హైదరాబాద్, ఆంధ్రజ్యోతి

ఒమిక్రాన్‌తో భయం వద్దు

(5వ పేజీ తరువాయి)

రాకపోవచ్చు. కొవిడ్ పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

కొత్త వేరియంట్లతో అప్రమత్తం

గుండె, క్యాన్సర్, కాలేయం, ఊపిరితిత్తులు, శ్వాసకోశ వ్యాధులు, కిడ్నీబాధితులు కొత్త వేరియంట్లతో అప్రమత్తంగా ఉండాలి. మహిళలు, గర్భిణులు, బాలింతలు, నెలల శిశువులు, వృద్ధులు, మంచంపై లేవలేని స్థితిలో ఉన్నవారి విషయంలో జాగ్రత్త పడాలి. బాధితులు ఎవరూ వారి దరిదాపుల్లోకి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. కొవిడ్ లక్షణాలు కనిపిస్తే సొంత వైద్యం చేసుకోవద్దు. స్టెరాయిడ్స్, యాంటీ బయాటిక్స్ మెడిసిన్ అసలే వాడొద్దు. ఇబ్బంది, అనుమానం ఉన్న వారు వైద్యులను సంప్రదించాలి. వారి సలహా ప్రకారం సూచించిన మందులను వేసుకోవాలి.

చేతుల శుభ్రతే కీలకం

చేతుల ద్వారానే ఏ వైరస్ అయినా ప్రవేశిస్తుంది. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలి. కన్ను, ముక్కు, నోటి విషయంలో అప్రమత్తంగా ఉండాలి. శుభ్రంగా లేని చేతులను ముఖానికి తాకకుండా జాగ్రత్త పడాలి. వైరస్ నియంత్రణలో ప్రజల పాత్రే కీలకం. ఈ వైరస్‌కు చెక్ పెట్టడం పెద్ద కష్టమేమీ కాదు. వ్యాక్సిన్ వేసుకోవడం, భౌతిక దూరం పాటించడం, మాస్కులు ధరించడం, వ్యక్తిగత పరిశుభ్రత అలవర్చుకోవడం, రద్దీ ప్రాంతాలకు వెళ్లకపోవడం, జనం లేని సమయంలోనే పనులు నిర్వహించుకోవడం అలవర్చుకుంటే ఎన్ని వైరస్‌లు వచ్చినా నియంత్రణలో పెట్టొచ్చు.

వ్యాక్సిన్లు వేసుకోవచ్చు

అవసరమైన వారు కొవిడ్ వ్యాక్సిన్లు వేసుకోవచ్చు. వైరస్, ఇన్‌ఫెక్షన్లను అరికట్టడానికి అనేక వ్యాక్సిన్లు ఉన్నాయి. వాటిని ప్రతి ఏడాది వేసుకోవడం మంచిది. పెద్ద వారికి కూడా ప్రత్యేక వ్యాక్సిన్లు ఉన్నాయి. వైద్యుల సలహా మేరకు వాటిని వేసుకోవాలి.

జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ప్రభుత్వ సలహాదారుడు వేంరెడ్డి నరేందర్‌రెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఐఎన్‌టీయూసీ నేతలు

బర్కత్‌పుర, మే 25(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల పెండింగ్ సమస్యలను ప్రభుత్వం సత్వరమే పరిష్కరించాలని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆదిల్ షరీఫ్, ప్రధాన కార్యదర్శి ఆర్‌డీ చంద్రశేఖర్, ఎం.రాజిరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఆదివారం ప్రభుత్వ సలహాదారుడు వేంరెడ్డి నరేందర్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసినట్టు వారు చెప్పారు. జీహెచ్‌ఎంసీలో పనిచేస్తున్న క్లాస్-4 ఉద్యోగులకు పదోన్నతి కల్పించాలని వారు విజ్ఞప్తి చేశారు. అన్ని అర్హతలు ఉన్నప్పటికీ ఇంతవరకు పదోన్నతులు కల్పించలేదని వారు చెప్పారు. బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నా ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, బదిలీల ప్రక్రియను వెంటనే చేపట్టాలని వారు విజ్ఞప్తి చేశారు. పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు ఇంతవరకు బెనిఫిట్స్ ఇవ్వలేదని వాటిని చెల్లించాలని, ఎన్‌ఎంఆర్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని వారు విజ్ఞప్తి చేశారు. తమ సమస్యలపై వేంరెడ్డి నరేందర్‌రెడ్డి సానుకూలంగా స్పందించారని, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం చేస్తారని వారు తెలిపారు.

యువ క్రీడాకారులకు టీ షర్టులు, బ్యాట్లు అందజేత



క్రీడాకరులకు టీ షర్టులు, బ్యాట్లు అందజేసిన ఆస్పత్రి నిర్వాహకులు

రాజేంద్రనగర్, మే 25(ఆంధ్రజ్యోతి): ములుగు ఘనపూర్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ కోచింగ్‌లో పాల్గొంటున్న బాల్ బ్యాడ్మింటన్ యువ క్రీడాకారులకు ఆదివారం అత్తాపూర్ జర్మన్ ‌ంటైన్ ఆస్పత్రి యాజమాన్యం టీ షర్ట్‌లను, బ్యాట్‌లను బహూకరించారు. ఆస్పత్రి జనరల్ మేనేజర్ సంతోష్‌కుమార్ సమక్షంలోయువ క్రీడాకరులకు టీ షర్టులు, బ్యాట్‌లను బహూకరించారు. మణికొండ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కోశాధికారి హరిహరనాథ్‌రెడ్డి, సంఘ సభ్యుడు సీతారామరాజు ఆధ్వర్యంలో ఈ క్రీడా పోటీలను నిర్వహిస్తున్నారు. యువ క్రీడా కారులు బాగా రాణించాలని జర్మన్‌ంటైన్ ఆస్పత్రి జనరల్ మేనేజర్ సంతోష్‌కుమార్ కోరారు. కార్యక్రమంలో తెలంగాణ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వీవీ రమణ, భూపాలపల్లికి చెందిన తిరుపతి, సాంబయ్య, రవి, నవీన్, స్వామి, రవి పాల్గొన్నారు.

సోమవంశ సహస్రార్జున క్షత్రీయ సమాజ్ అధ్యక్షుడిగా డాక్టర్ ఆనంద్‌రావు మెంగ్జీ



నూతన కమిటీ సభ్యులు

రాజేంద్రనగర్, మే 25(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్ శ్రీ సోమవంశ సహస్రార్జున్ క్షత్రీయ (పట్కార్ ఖత్రీ) సమాజ్ అధ్యక్షుడిగా డాక్టర్ ఆనంద్‌రావు మెంగ్జీ ఎన్నికైనారు. ఆదివారం రాఘవేంద్రకాలనీలో ఎన్నికల అధికారిగా కర్తన్ చంద్రశేఖర్, డాక్టర్ అశ్వినీ కుమార్ మెంగ్జీ, రాజ్‌కుమార్ జ్యోతి ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఉమేశ్ చవాన్, ప్రధాన కార్యదర్శిగా రాజేశ్ హబీబ్, సంయుక్త కార్యదర్శిగా మహేశ్ చవాన్, కోశాధికారిగా రజనీకాంత్ తిర్మల్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈసందర్భంగా సమాజ్ అధ్యక్షుడిగా ఎన్నికైన డాక్టర్ ఆనంద్‌రావు మెంగ్జీ మాట్లాడుతూ, సమాజ్ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వద్ద అన్నదానం



రోగులకు అన్నదానం చేస్తోన్న శంకర్, గంజి శ్రీనివాస్, భానుప్రకాశ్

గన్‌పార్క్, మే 25, (ఆంధ్రజ్యోతి): పేద రోగులు, వారి కుటుంబ సభ్యులకు ఉచితంగా అన్నదానం చేయడం గొప్ప సామాజిక సేవా కార్యక్రమం అని వక్తలు పేర్కొన్నారు. ఆదివారం నాంపల్లిలోని ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వద్ద రెడ్ టూ సర్వ్ ఫౌండేషన్, అమ్మ హెల్పింగ్ ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో 300 మందికి అన్నదానం చేశారు. ఈసందర్భంగా టీఆర్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంజి శ్రీనివాస్, మేకర్స్ ఆఫ్ మిల్క్ షేక్ ఫౌండర్ కన్వీనర్ భానుప్రకాశ్, రెడ్ టూ సర్వ్ ఫౌండేషన్ చైర్మన్ పెద్ది శంకర్, సంస్థ ప్రతినిధులు ప్రవీణ్, లక్ష్మణ్, శివ, రాజు, అబిలాష్, సూర్యబాయ్ తదితరులు పాల్గొన్నారు.

నాంపల్లి జీహెచ్‌ఎంసీలో ఇన్‌చార్జీల పాలన



గన్‌పార్క్, మే 25(ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ నాంపల్లి సర్కిల్ కార్యాలయం పరిధిలో కొన్ని రోజులుగా ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. ఫలితంగా ఆయా ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో ఎక్కడికక్కడ సమస్యలు అక్కడే పేరుకు పోతన్నాయి. సర్కిల్ కార్యాలయానికి చెందిన ఏఎంహెచ్‌ఓ, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ ఇద్దరు అధికారులు ఇద్దరు ఒకే సారి సెలవుపై వెళ్లడంతో అనేక సమస్యలు పేరుకుపోతున్నాయి. పలువురు పౌరులు స్థానిక సమస్యలను విన్నవించేందుకు ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయానికి వెళ్తే ఇద్దరు సార్లు సెలవులో ఉన్నారని సిబ్బంది చెబుతున్నారు. వారి స్థానంలో ఇద్దరు ఇన్‌చార్జిలు అదనపు బాధ్యతలు స్వీకరించారని కార్యాలయ సిబ్బంది సమాధానం చెబుతున్నారు. పారిశుధ్య, ఇంటి నిర్మాణ అనుమతుల సమస్యలను పరిష్కరించకుండా ప్రజలను తిప్పుతున్నారని పలువురు వాపోతున్నారు. తమ సమస్యల పరిష్కారానికి ఇలా ఎన్ని రోజులు కార్యాలయం చుట్టూ తిరగాలని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

పూడిక తీశారు.. బస్టాప్‌లో వేశారు

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పారిశుధ్య కార్మికులు
- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



టీటీ హౌసింగ్ కార్యాలయం ఎదుట బస్టాపుల్లో పారబోసిన మట్టికుప్పలు

గన్‌పార్క్, మే 25(ఆంధ్రజ్యోతి): జలమండలి అధికారుల నిర్లక్ష్యం ప్రజల పాలిట శాపంగా మారుతోంది. నాంపల్లిలోని గాంధీ భవన్ కార్యాలయం ఎదురుగా ప్రధాన రోడ్డు బస్టాపు కేంద్రాల్లో ఇష్టారీతిన మ్యాన్‌హోళ్ల నుంచి తీసిన పూడిక మట్టిని, వ్యర్థాలను పారబోశారు. దీంతో వివిధ ప్రాంతాలకు వెళ్లే మహిళా ఉద్యోగులు, సీనియర్ సిటిజన్స్, పిల్లలు దుర్వాసన భరించలేక పోతున్నారు. వ్యర్థాల కంపులోనే నిలబడి బస్‌ల కోసం వేచి చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఈ బస్టాప్ కేంద్రాల వద్ద టీఎస్ హౌసింగ్ ప్రధాన కార్యాలయంతో పాటు మరిన్ని ప్రభుత్వ కార్యాలయాలు ఉన్నాయి. సాయంత్రం 5గంటల తర్వాత ఉద్యోగులు విధులు ముగించుకొని ఇళ్లకు వెళ్లేందుకు ఇక్కడి బస్టాపులకు చేరుకుంటారు. ఇక్కడా నిలబడలేని పరిస్థితి. జలమండలి ఉన్నతాధికారులు స్పందించి బస్టాప్ కేంద్రాల్లో కుప్పలుగా పారబోసిన మ్యాన్‌హోళ్ల పూడిక మట్టిని సత్వరమే తరలించేందుకు చర్యలు చేపట్టాలని స్థానికులు, ప్రయాణికులు సంబంధిత అధికారులను కోరుతున్నారు.

పూర్తిస్థాయి ఉన్నతాధికారులను నియమించాలి



రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం

రాజేంద్రనగర్, మే 25(ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని పీవీ నర్సింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయంలో పూర్తిస్థాయి విశ్వవిద్యాలయం అధికారులను నియమించాలని విద్యార్థులు, అధ్యాపకులు కోరుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఫిబ్రవరిలో పశువైద్య విశ్వవిద్యాలయానికి వైస్ చాన్స్‌లర్‌గా డాక్టర్ మంధని జ్ఞాన ప్రకాశ్‌ను నియమించింది. ఆయన వర్సిటీ ఉన్నతాధికారుల నియామకాలకు సంబంధించి నోటిఫికేషన్ ఇచ్చి ఇన్‌చార్జీలుగా ఉన్న వర్సిటీ ఉన్నతాధికారుల స్థానంలో పూర్తిస్థాయి అధికారులను నియమించుకోవాలి. అలా చేయకుండా నేటికీ వర్సిటీ ఉన్నతాధికారులుగా ఇన్‌చార్జీల ద్వారానే కొనసాగిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం, శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్స్‌లర్లుగా ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, డాక్టర్ దండ రాజిరెడ్డిను ప్రభుత్వం నియమించగా, వారు వెంటనే నోటిఫికేషన్లు వేసి యూనివర్సిటీ అధికారుల నియామకం చేపట్టారు. ఆ విశ్వవిద్యాలయాలలో పాలన సజావుగా సాగుతోందన్నారు. అలాగే పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయంలో కూడా యూనివర్సిటీ అధికారుల నియామకాలైన రిజిస్ట్రార్, డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్, డీన్ వెటర్నరీ సైన్స్, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, డీన్ స్టూడెంట్స్ అఫైర్స్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, ఎస్టేట్ ఆఫీసర్ నియామకాలను పూర్తి స్థాయి అధికారులతో భర్తీ చేయాలని కోరుతున్నారు. ప్రస్తుతం ఈ పదవుల్లో ఇన్‌చార్జీలే కొనసాగుతున్నారని వాపోయారు.

నియామకాలలో సామాజిక న్యాయం పాటించాలి

ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి వ్యవసాయ, ఉద్యాన విశ్వవిద్యాలయాల ఉన్నతాధికారుల నియామకాలలో సామాజిక న్యాయం పాటిస్తూ నియామకాలు జరిగేలా చొరవ తీసుకున్నారని, వెటర్నరీ విశ్వవిద్యాలయంలో కూడా ఉన్నతాధికారుల నియామకాల్లో సామాజిక న్యాయం, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం కల్పిస్తూ నిర్ణయం తీసుకోవాలన్నారు.

శివరాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద రాకపోకలను పునరుద్ధరించాలి



శివరాంపల్లి రైల్వే స్టేషన్ వద్ద నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

రాజేంద్రనగర్, మే 25(ఆంధ్రజ్యోతి): శివరాంపల్లి రైల్వే స్టేషన్ నుంచి మోహన్‌రెడ్డినగర్ మీదుగా శివరాంపల్లి బస్తీకి వెళ్లేందుకు రహదారి సౌకర్యాన్ని కల్పించాలని కోరుతూ ఆదివారం మైలార్‌దేవుపల్లి డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేశ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. శివరాంపల్లి రైల్వే స్టేషన్ వద్దకు వచ్చిన బాబుల్‌రెడ్డినగర్, సాయిబాబానగర్ బస్తీ వాసులతో కలిసి ఆయన నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఎస్.వెంకటేశ్ మాట్లాడుతూ.. గతంలో బాబుల్ రెడ్డినగర్, సాయిబాబానగర్, వెంకటేశ్వర కాలనీల ప్రజలు శివరాంపల్లి రైల్వే గేటు నుంచి మోహన్‌రెడ్డినగర్ మీదుగా శివరాంపల్లి వైపు వెళ్లేవారని గుర్తు చేశారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి పేరుతో రోడ్డును మూసివేసిన రైల్వే అధికారులు తర్వాత శాశ్వతంగా ప్రహరీ నిర్మించారన్నారు. దీంతో బాబుల్‌రెడ్డినగర్ పరిసర బస్తీల ప్రజలు శివరాంపల్లి వెళ్లాలంటే ఆరాంఘర్ నుంచి వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. దీంతో చాలా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. స్కూల్ పిల్లలు, దినసరి కార్మికులు చుట్టూ రిగి వెళ్లాల్సిన దుస్థితి నెలకొందన్నారు. వేలాది మంది రాకపోకలు సాగించే ఈ ప్రాంతంలో రైల్వే అధికారులు వంతెన నిర్మాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు అక్కెం రాఘవేందర్ యాదవ్, సోమ శ్రీనివాస్ గుప్తా, నోముల రాము యాదవ్, ఎడ్లకాడి సూర్యం, కొంపల్లి జగదీశ్‌తో పాటు స్థానికులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో అక్రమ ఉద్యోగ సంఘాలపై చర్యలు తీసుకోవాలి



అఫ్జల్‌గంజ్ పోలీసులకు ఫిర్యాదు చేసిన పత్రం చూపుతున్న రాష్ట్ర కమిటీ సభ్యులు స్వామి, తిరుపతి

అఫ్జల్‌గంజ్, మే 25(ఆంధ్రజ్యోతి): పది సంవత్సరాలుగా సంఘాన్ని రెన్యువల్ చేయకుండా ఎన్నికలు నిర్వహించకుండా అక్రమంగా సంఘాన్ని కొనసాగిస్తున్న ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గంపై చర్యలు తీసుకోవాలని, రాష్ట్ర కమిటీ సభ్యుడు బట్టు స్వామి, కరీంనగర్ జోనల్ కన్వీనర్ గడ్డం తిరుపతి ఆదివారం ఆర్టీసీ ఎండీ సజ్జనార్, అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈమేరకు, అఫ్జల్‌గంజ్ పోలీస్ స్టేషన్ వద్ద విలేకరుల సమావేశంలో బట్టు స్వామి, తిరుపతి మాట్లాడుతూ.. ఈ సంఘానికి అధ్యక్షుడిగా కొనసాగుతున్న కె.కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా గడ్డం శ్రీనివాస్, కోశాధికారిగా హెచ్.మధుసూదన్, కె.నాగయ్య సంఘాన్ని రెన్యువల్ చేయకుండా ఎలాంటి ఆడిటింగ్ లేకుండా సొసైటీ రిజిస్ట్రేషన్ చట్టాలకు వ్యతిరేకంగా ఈ సంఘాన్ని రాష్ట్ర వ్యాప్తంగా కొనసాగిస్తున్నారని వారు ఆరోపించారు. టీజీ ఆర్టీసీ మేనేజ్‌మెంట్ సైతం ఈ రెన్యువల్ కాని సంఘానికి చెందిన నాయకులకు కార్యక్రమాలకు అనుమతినిస్తున్నారని వారు ఆరోపిస్తున్నారు. 2015 సంవత్సరంలో ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు, ఈ సంఘాన్ని కత్తుల యాదయ్య, తన పేరు మీదుగా రిజిస్ట్రేషన్ చేయించాడని, తెలంగాణ రాష్ట్ర ఏర్పడిన తర్వాత తిరిగి సంఘాన్ని టీఎస్‌గా, మార్చి దాని సంబంధించిన పత్రాలను కృష్ణకు అందజేశానని తెలిపారు. నిబంధన ప్రకారం ప్రతి సంవత్సరానికోసారి సంఘాన్ని రెన్యువల్ చేయాల్సింది. 10 సంవత్సరాలుగా ఎలాంటి రెన్యువల్ చేయకుండా అక్రమ పద్ధతిలో సంఘం కొనసాగించడం సరికాదన్నారు. ఈ విషయమే ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కు, అఫ్జల్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్‌కు పూర్తి ఆధారాలతో లిఖిత, పూర్వకంగా ఫిర్యాదు చేశామని వారు తెలిపారు

మహంకాళి బోనాల ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా రాఘవేందర్



రాఘవేందర్‌ను సన్మానిస్తున్న శ్యామ్ రావు ముదిరాజ్

చాంద్రాయణగుట్ట, మే 25(ఆంధ్రజ్యోతి): శ్రీభాగ్యనగర్ మహంకాళి బోనాల జాతర ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడిగా జి.రాఘవేందర్‌ను హరిబౌలి అక్కన్న మాదన్న మహంకాళి ఆలయ కమిటీ నియమించింది. ఆదివారం ఉమ్మడి దేవాలయల ఊరేగింపు కమిటీ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ మేరకు పలువురు ఆయనను అభినందించారు. పాతబస్తీలోని 8 ప్రధాన ఆలయాలకు చెందిన ప్రతినిధులు రొటేషన్ పద్ధతిలో ఒక్కో ఏడాది ఒక్కొక్కరు చొప్పున కమిటీ చైర్మన్ బాధ్యతలను చేపట్టి వారి ఆధ్వర్యంలో పాతబస్తీలో బోనాల జాతర ఉత్సవాలను కనుల పండువగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో మారుతి యాదవ్, జె.మధుసూదన్ గౌడ్, శశాంక్ తివారి మధుసూదన్ యాదవ్ కె.దినేష్, సతీష్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మన్ కీ బాత్

కవాడిగూడ, మే 25 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ డివిజన్ బండానగర్‌లో ఆదివారం ప్రధాని నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ జి.రచనశ్రీ, నగర నాయకులు ఎంసీ.మహేందర్‌బాబు, డివిజన్ ప్రధానకార్యదర్శి ప్రభాకర్ గంగపుత్ర, ఓబీసీ డివిజన్ మోర్చా అధ్యక్షుడు చిత్రకుమార్‌గౌడ్, రమేష్, అనిల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



- చాంద్రాయణగుట్ట నియోజకవర్గంలో ప్రధాని నరేంద్ర మోదీ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని వీక్షిస్తున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ప్రేమేందర్ రెడ్డి, భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు నిరంజన్ యాదవ్, జిల్లా ప్రధాన కార్యదర్శి కౌడీ మహేందర్, చాంద్రాయణగుట్ట నియోజకవర్గ కన్వీనర్ పందరినాథ్ తదితరులు

- చాంద్రాయణగుట్ట, మే 25(ఆంధ్రజ్యోతి)

గాయత్రి పొదుపు సంఘానికి 25 ఏళ్లు



గాయత్రి పొదుపు సంఘం సభ్యులు

రాజేంద్రనగర్, మే 25(ఆంధ్రజోతి): మైలార్‌దేవుపల్లి డివిజన్ ఆదర్శ కాలనీకి చెందిన గాయత్రి పొదుపు సంఘం 25వ వార్షికోత్సవం ఆదివారం భావనరుషి ట్రస్టు కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించారు. సంఘం అధ్యక్షుడు ఎదిరె శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి ఎర్వ కుమార స్వామి ఆధ్వర్యంలో సంఘం వార్షిక నివేదిక చదివి వినిపించారు. ప్రతి సభ్యుడికి తులం వెండి నాణేంను బహుమతిగా అందజేశారు. ఈసందర్భంగా ఎదిరె శ్రీనివాస్, ఎర్వ కుమారస్వామి మాట్లాడుతూ, 2000 వేల సంవత్సరంలో కేవలం నలుగురితో ప్రారంభమైన సంఘం నేడు 640మంది సభ్యులు ఉన్నారు. 60 సంవత్సరాలు నిండిన సభ్యులకు వృద్ధాప్య పింఛన్లు అందజేస్తున్నామన్నారు. ఎవరైన సభ్యులు మరణిస్తే ఉచిత సహాయం, బీమా సౌకర్యం కల్పించి ఆదుకోవడం జరుగుతోందన్నారు.

నూతన కార్యవర్గం

గాయత్రి పొదుపు సంఘం నూతన కార్యవర్గాన్ని సంఘం సలహాదారులు కుడికాల గుణమ్మ సమక్షంలో ఆడిటర్లు వెంకటేశ్, లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యవర్గంలో ఎదిరె శ్రీనివాస్, దశపతి భిక్షపతి, ఎర్వ కుమార స్వామి, దశపతి రాజు, ఆదేట్ల బాల్‌రాజ్, ఆదేట్ల నరేశ్, గాజుల సురేశ్ యాదవ్, గుర్రం తిరుపతమ్మ, గంజి రాజేశ్వరీ, సగ్గం మహేందర్, ముదిగొండ సత్యనారాయణ, కుడికాల ప్రభాకర్, మేకల సాయి కిషోర్, వర్కాల శ్రీశైలం, మసిని వనజలు ఎన్నికైనారు. మాజీ సభ్యులు పున్న మహేశ్, రాజు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్‌ఎల్ https://ejyothy.com/RMdogkkలో చదవండి.

Note: Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminarలో చూడగలరు.

నోట్: htpps://epaper.andhrajyothy .comలో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.

ప్రణవ భక్త సమాజం సేవలు అందరికీ ఆదర్శం



స్వామీజీలతో ప్రణవభక్త సమాజం సభ్యులు

రాజేంద్రనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): హైదర్‌గూడలో ప్రణవ భక్త సమాజం సభ్యులు చేస్తున్న ఆధ్యాత్మిక, సామాజిక సేవా కార్యక్రమాలు ప్రజలందరికీ ఆదర్శంగా నిలిచాయని బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్‌గౌడ్ అన్నారు. ప్రణవ భక్త సమాజం 105 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన ఏకశత పంచోత్తర మహోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఒక బస్తీ బాగుంటే ఆ ప్రాంతం బాగుంటదని, తద్వారా ప్రజలందరు బాగుంటారన్నారు. ఈ సందర్భంగా పరిశుద్ధానందగిరి, శంకరానందగిరి, వీరానంద బ్రహ్మచారి దివ్య ప్రవచనాలు భక్తులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రణవ భక్త సమాజం అధ్యక్షుడు మొండ్ర నర్సింహ, ప్రధాన కార్యదర్శి పుస్తకాల అశోక్, ఉపాధ్యక్షుడు బర్ల మల్లారెడ్డి, సంయుక్త కార్యదర్శి కొండమీది హరినాథ్, కోశాధికారి ఎస్.బి హరినాథ్, ముఖ్య సలహాదారులు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో పలువురి చేరిక



కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న నాగు నాగేష్

చాంద్రాయణగుట్ట, మే 25(ఆంధ్రజ్యోతి): తెలంగాణలో టీడీపీకి ప్రజాదరణ పెరిగి సభ్యత్వ నమోదు కార్యక్రమానికి విశేష స్పందన లభించిందని టీడీపీ హైదరాబాద్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ నాగు నగేష్ అన్నారు. టీడీపీ పట్ల ఆకర్షితులై సుమారు 50 మంది పార్టీలో చేరారు. ఈమేరకు వారిని నాగు నాగేష్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పాలనను చూసిన ప్రజలు తిరిగి టీడీపీ వైపు వస్తున్నారని, సుదీర్ఘ కాలం సీఎంగా పనిచేసి అపార అనుభవం కలిగిన చంద్రబాబు నాయుడు ఏపీలో ముఖ్యమంత్రిగా, టీడీపీ జాతీయ అధ్యక్షుడిగా ఉండడం, తెలంగాణలో సైతం పార్టీ సభ్యత్వంపై దృష్టి పెట్టడంతో ప్రజలు ముందుకొచ్చి పార్టీలో చేరుతున్నారన్నారు. ప్రజా స్పందన చూస్తుంటే తెలంగాణలో సైతం టీడీపీకి పూర్వ వైభవం వస్తోందని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బి.వై.శ్రీకాంత్, జోగేందర్ సింగ్, కె.డి.దినేష్ పాల్గొన్నారు.

'అధ్యాపకులపై ఆధిపత్యం చెలాయిస్తే సహించం'

రాజేంద్రనగర్, మే 25(ఆంధ్రజ్యోతి): విశ్వ విద్యాలయాల్లో బడుగు, బలహీన వర్గాలకు చెందిన అధ్యాపకులను టార్గెట్ చేసేలా కొందరు మనువాదులైన అధ్యాపకులు వివిధ పద్ధతుల్లో వారిని వేధించాలని, భయపెట్టాలని చూస్తున్నారని, దానిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు శరత్ నాయక్, తెలంగాణ దళిత జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కాంబ్లె ప్రజ్ఞశీల్, ఉస్మానియా విశ్వవిద్యాలయానికి చెందిన వలిగొండ నర్సింహ వేర్వేరు ప్రకటనలో తెలిపారు. ఇటీవల మావోయిస్టుల ఎన్‌కౌంటర్ జరిగిన సందర్భంలో ప్రొఫెసర్ హరగోపాల్ రాసిన వ్యాసాలు, వివిధ దినపత్రిల్లో వచ్చిన కథనాలను పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం టీచర్స్, ఫ్యాకల్టీ గ్రూప్‌లో షేర్ చేసిన ఓ అసోసియేట్ ప్రొఫెసర్‌పై రాజేంద్రనగర్ పోలీసులకు కొందరు అధ్యాపకులు ఫిర్యాదు చేయడం లాంటి సంఘటనలను తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దీనిపై రాజేంద్రనగర్ పోలీసులు సదరు అసోసియేట్ ప్రొఫెసర్‌ను స్టేషన్‌కు పిలిపించి మీ సోషల్ మీడియా ట్రాక్ బాగాలేదని చెప్పి పంపించిన సంఘటనలు తమ దృష్టికి వచ్చాయన్నారు. పత్రికల్లో వచ్చిన కథనాలను కూడా వాట్సాప్ గ్రూపులలో పెట్టవద్దనడం సరైంది కాదన్నారు. ఇది ఒక విధంగా ఎస్సీ, ఎస్టీ అధ్యాపకులను భయపెట్టడం లాంటిదేనన్నారు. ప్రొఫెసర్ల ముసుగులో ఉన్న మనువాదులు తమ పద్ధతి మార్చుకోవాలన్నారు. బడుగు, బలహీన వర్గాలకు చెందిన అధ్యాపకులకు, విద్యార్థులకు తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామన్నారు.

దుకాణంలోకి దూసుకెళ్లిన మినీ బస్సు.. వ్యక్తి మృతి

మదీన, మే 25 (ఆంధ్రజ్యోతి): రోడ్డు పక్కన ఉన్న ఓ ఫర్నీచర్ దుకాణంలోకి మినీబస్సు దూసుకెళ్లిన ఘటనలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బండ్లగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం జరిగింది. ఇన్‌స్పెక్టర్ కె.గురునాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. పోలీస్ స్టేషన్ ఎదురుగా ఉన్న రోడ్డులో మహ్మద్ హసనుద్దీన్(42) అనే వ్యక్తి ఫర్నీచర్ దుకాణాన్ని నడుపుతున్నాడు. రోజు మాదిరిగానే ఆదివారం దుకాణం తెరిచి అతనితో పాటు కార్మికుడు పకీర్ పాష పని చేస్తున్నారు. మధ్యాహ్నం 12:30 గంటల సమయంలో కాటేదాన్ వైపు నుంచి వచ్చిన కర్మన్ ఘాట్ ప్రాంతానికి చెందిన మినీ ప్రైవేట్ బస్సు(టిఎస్08యుఎస్4765) ఒక్కసారిగా మూలమలుపులో ఉన్న దుకాణంలోకి దూసుకొచ్చింది. వేగంగా వచ్చి ఢీకొట్టడంతో దుకాణం షట్టర్, గోడలు కూలి అందులో ఇరుక్కొని యజమాని హసనుద్దీన్ మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని గాయపడ్డ పకీర్ పాషను చికిత్స నివిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనను చూసిన తోటి వాహనదారులు భయకంపితులయ్యారు. ప్రధాన రహదారిపై జరిగిన ఈ ప్రమాదంతో స్తంభించిన ట్రాఫిక్‌ను చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీను నాయక్ సిబ్బందితో కలిసి క్రమబద్ధీకరించారు. తీర్థయాత్రలకు వెళ్లొచ్చే క్రమంలో ప్రయాణికులను పటాన్‌చెరులో దించి.. కర్మన్‌ఘాట్‌కు వస్తుండగా, డ్రైవర్ రాఘవేందర్(28) నిద్రమత్తులో ఉండడంతో ఈ ప్రమాదం జరిగిందని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో బస్సు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. ఈ ఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డూప్లికేట్ యాపిల్ ఫోన్ విక్రయం

- దుకాణాలపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడులు

మంగళహాట్, మే 25(ఆంధ్రజ్యోతి): ప్రముఖ యాపిల్ ఐ ఫోన్ డూప్లికేట్ యాక్సిసరీస్ విక్రయిస్తున్న సెల్‌ఫోన్ దుకాణాలపై సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడులు చేశారు. ఆబిడ్స్ జగదీష్ మార్కెట్లోని మాతాజీ, ఆర్.జి. మొబైల్, రాజారామ్, న్యూ డ్రీమ్స్ సెల్‌ఫోన్ షాపులపై దాడులు నిర్వహించిన పోలీసులు పెద్దఎత్తున డూప్లికేట్ ఐఫోన్ యాక్సిసరీస్‌ను స్వాధీనం చేసుకున్నారు. నకిలీ యాపిల్ బ్యాటరీలు, చార్జర్స్, మదర్ బోర్డు సహా.. పలు పరికరాలను స్వాధీనం చేసుకుని ఐదుగురిని అరెస్ట్ చేశారు. విక్రమ్ సింగ్, సురేష్ కుమార్, మహ్మద్ సర్ఫరాజ్, నాతురామ్ చౌదరి, మహ్మద్ అర్షద్ నకిలీలను ఒరిజినల్ పేరిట విక్రయిస్తున్న ప్రజలను మోసం చేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న యాపిల్, ఐఫోన్ కంపెనీ ప్రతినిధుల సమాచారం మేరకు వారిని అరెస్టు చేసి లక్షల విలువైన నకిలి పరికరాలను సీజ్ చేశారు. కేసు దర్యాప్తు నిమిత్తం ఆబిడ్స్ పోలీసులకు అప్పగించారు. కాపీ రైట్స్ యాక్ట్, ఫోర్జరి సెక్షన్ల కింద కేసును నమోదు చేసిన ఆబిడ్స్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


ఆవిష్కరిస్తున్న తాడేపల్లి శ్రీనివాస్, జి. వసుంధర, ఆకుల రజిత్

29 నుంచి జపాన్‌కు నృత్య కళాకారుల బృందం

● ఆ దేశంతో స్నేహబంధం అపూర్వం

● భారత్ బయోటెక్ గ్రూప్ ఫైనాన్స్ ఆఫీసర్ తాడేపల్లి శ్రీనివాస్

బర్కత్‌పుర, మే 25 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్.. జపాన్‌లోని హికోల్ నగరాల మధ్య స్నేహ సంబంధాలు ఆరు దశాబ్దాలుగా కొనసాగడం అపూర్వమైనదని భారత్ బయోటెక్ గ్రూప్ ఫైనాన్స్ ఆఫీసర్ తాడేపల్లి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం నారాయణగూడలోని తాజ్‌మహల్ హోటల్‌లో నవ్యనాటక సమితి హైదరాబాద్, వైజ్‌మెన్ క్లబ్ నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా జపాన్ పర్యటన వాల్‌పోస్టర్‌ను రాష్ట్ర ఖజానా లెక్కల శాఖ ఉపసంచాలకురాలు జి. వసుంధరతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ నెల 29 నుంచి 10 రోజుల పాటు జపాన్‌లోని నగోయా, ఉట్సునోమియా నగరాలలో కూచిపూడి నృత్యప్రదర్శనకు వెళ్తున్న హైదరాబాద్ నృత్యకళాకారులు కళారత్న మాధవి మాల, రేణి శ్రీజిత్, బీ.ఎస్ మేకలాలను ఈ సందర్భంగా సత్కరించారు. గౌరవ అతిథి వసుధంర మాట్లాడుతూ... విదేశాలలో సైతం భారతీయ శాస్త్రీయ సంగీత నృత్యాలకు ఆదరణ లభించడం అపూర్వమని అన్నారు. కార్యక్రమంలో వేమరాజు విజయ్‌కుమార్, కె. చక్రపాణి, మధుమతి కులకర్ణీ, ఆర్‌ఎస్ సుధారాణి, బి.వి.నారాయణరావు, హెచ్ హరినాథ్‌బాబు, బాలాజీ శర్మ, సి. కృష్ణకన్నారావు తదితరులు పాల్గొన్నారు.

బోర్డు కమిటీల సమావేశం రద్దు చేయాలి

● టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న

హైదరాబాద్ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): టీజీఎస్ ఆర్టీసీ యాజమాన్యం వెల్ఫేర్ బోర్డు మీటింగ్‌పై సర్క్యులర్ జారీ చేయడం ఆర్టీసీ కార్మికులను రెచ్చగొట్టడమేనని, వెల్ఫేర్ బోర్డు కమిటీల సమావేశం రద్దు చేయాలని టీజీఎస్ ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న, కో చైర్మన్‌లు హనుమంత్ ముదిరాజ్‌లు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆర్టీసీ చేపడుతున్న ఔట్ సోర్సింగ్ నియమాకాలను వెంటనే ఆపాలని లేదంటే మళ్లీ సమ్మె బాట పడుతామని హెచ్చరించారు. ఈ నెల 6న తెలంగాణ సచివాలయంలో ఆర్టీసీ జేఏసీ నాయకులతో జరిగిన చర్చల సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ సమస్యల పరిష్కారానికి ఇచ్చిన హామీలలో యూనియన్ల పునరుద్ధరణ కూడా ఉందని గుర్తుచేశారు. విద్యుత్ బస్సులను కేంద్ర ప్రభుత్వంతో నేరుగా కాంగ్రెస్ ప్రభుత్వం ఒప్పందం చేసుకుంటుందని, ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలతో ఈ బస్సులు తీసుకోస్తే సహించబోమని ఆర్టీసీ జేఏసీ నేతలు తెలిపారు. ప్రభుత్వం మీద నమ్మకంతో జేఏసీ సమ్మె వాయిదా వేసుకొని వారు ఇచ్చిన హామీలు పరిష్కారమవుతాయని కార్మిక వర్గం ఎదురు చూస్తోందని పేర్కొన్నారు. ఆర్టీసీ ఎండీ ఇలాంటి సర్క్యులర్ ద్వారా కార్మికులను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడటం సమంజసం కాదన్నారు. జూన్ 2 లోపు జేఏసీకి ఇచ్చిన హామీలు అమలు చేయాలని, లేనిపక్షంలో మళ్లీ సమ్మెకు దిగడానికి వెనుకాడబోమన్నారు. ప్రకటన జారీ చేసిన వారిలో జేఏసీ నేతలు ఎం.థామస్ రెడ్డి, ఎండీ.మౌలానా, కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్‌లు. బి.యాదగిరిలు ఉన్నారు.

చేతివృత్తుల ఆధునికీకరణతోనే ఉపాధి అవకాశాలు

● మాజీ ఎంపీ దేవేందర్‌గౌడ్

బర్కత్‌పుర, మే 25 (ఆంధ్రజ్యోతి): చేతివృత్తుల ఆధునికీకరణతోనే దేశంలో నిరుద్యోగ సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందని, దేశ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతుందని మాజీ ఎంపీ తూళ్ల దేవేందర్‌గౌడ్ స్పష్టం చేశారు. ఆదివారం రాత్రి బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో వెనుకబడిన తరగతుల సాధికారత సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో చేతివృత్తుల ఆధునీకరణ - ప్రత్యామ్నాయం పుస్తకావిష్కరణ సభ జరిగింది. ఈ పుస్తకాన్ని హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి ఈశ్వరయ్య, విశ్రాంత ప్రొఫెసర్ ఇనుకొండ తిరుమళి. రచయిత ఇంద్రవెల్లి రమేష్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. చట్టం చేయకుండానే బీసీ కులగణన సర్వే చేశారని, తెలంగాణ దేనిలో రోల్‌మోడల్‌లో అర్థం కావడం లేదని వక్తలు అన్నారు.

భద్రత గాలిలో దీపమేనా?



● ప్రభుత్వ ఆస్పత్రుల్లో కొరవడిన పర్యవేక్షణ
● ఎవరు వస్తున్నారో? వెళ్లిపోతున్నారో తెలియని దుస్థితి
● తరచూ వెలుగు చూస్తున్న చోరీలు
● గతంలో మారువేషంలో వచ్చి దొంగతనం చేయడమే నిదర్శనం
● మహిళలతో అపరిచితుల అసభ్య ప్రవర్తనపై ఫిర్యాదులు
● నామ్‌కే వాస్తేగా సీసీ కెమెరాలు
● సెక్యూరిటీ సిబ్బంది ఉదాసీనత

ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులు, వారి సహాయకుల భద్రత గాలిలో దీపమేనా? అన్నట్లుగా ఉంది. మారు వేషల్లో లోపలికి చొరబడి దొంగతనాలు, బిడ్డలను ఎత్తుకెళ్లడం వంటి ఘటనలు వెలుగు చూస్తున్నాయి. అపరిచితులు.. వార్డుల్లో ఉన్న మహిళలతో అసభ్యంగా ప్రవర్తించారంటూ ఫిర్యాదులు సైతం అందాయి. ఆ మేరకు ప్రైవేటు సెక్యూరిటీ ఎంత కట్టుదిట్టంగా విధులు నిర్వహిసున్నారో దీన్నిబట్టే అర్థమవుతోంది. ఇక సీసీ కెమెరాలు ఉన్నా పర్యవేక్షణ కొరవడినట్లు తెలుస్తోంది.



హైదరాబాద్ సిటీ, మే 24 (ఆంధ్రజ్యోతి): గాంధీ ఆస్పత్రిలో గతంలో ఓ దొంగ డాక్టర్ వేషంలో ఆస్పత్రిలో చొరబడి రోగి నగలు ఎత్తుకెళ్లాడు. పెద్ద ఆస్పత్రిలో సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ వాటి పర్యవేక్షణ అంతంత మాత్రమే. బాలింతల వార్డులోకి ఆగంతకులు సులువుగా వచ్చి బిడ్డలను ఎత్తుకుపోయే అవకాశముంది. గతంలో బిడ్డలను ఎత్తుకుని పోయిన ఘటనలూ ఉన్నాయి. ఇక నగలు అయితే రోగుల నుంచి తరుచూ అపహరించుకుపోతున్న ఘటనలు అనేకం. ఇక ఉస్మానియా ఆస్పత్రిలో అపరిచితులు ఎక్కువగా సంచరిస్తుంటారు. గ్రామాల నుంచి వచ్చే మహిళల విషయంలో కొంత మంది గుర్తు తెలియని వ్యక్తులు అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారనే ఫిర్యాదులున్నాయి.

నిఘా లేక..

ప్రసూతి ఆస్పత్రుల్లో రెప్పపాటు ఆదమరిస్తే చాలు కన్నబిడ్డను కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. చాలా ప్రసూతి ఆస్పత్రుల్లో శిశువులకు రక్షణ లేకుండా పోతోంది. బిడ్డలను ఎత్తుకు పోయే ఆగంతకులు తిరుగుతున్నా ఆస్పత్రి వర్గాలు ఏ మాత్రం పట్టించుకోవడం లేదని విమర్శలున్నాయి. కనీసం నిఘా కూడా పెట్టకుండా తమకేందుకులే అనే ధోరణిని ఆస్పత్రి వర్గాలు అవలంబిస్తున్నాయి. కేవలం సెక్యూరిటీని ప్రైవేట్ సంస్థలకు అప్పగించి చేతులు దులుపుకొంటున్నారే తప్ప కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం లేదని వినికిడి. కాగా, ఒక్కొక్క ఆస్పత్రిలో పది నుంచి పదిహేను వరకు డెలవరీ కేసులు ఉంటాయి.

ఇలా కట్టుదిట్టం చేస్తే..

● ప్రభుత్వ ఆస్పత్రుల్లో అనుమానాస్పద వ్యక్తులు, అపరిచిత వ్యక్తులను నిత్యం గమనించాలి. అవసరమైతే విచారించాలి.
● రాత్రి పూట ఆస్పత్రుల్లో డ్యూటీలో ఆర్ ఎంను నియమించాలి.
● రోగుల సందర్శించే సాయంత్రం 4 నుంచి 6గంటల సమయంలో నిఘా పెట్టాలి. రోగులు, కుటుంబ సభ్యులు వెళ్లే మార్గాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.
● ప్రభుత్వాస్పత్రికి వచ్చే రోగి సహాయకుడికి ఫొటోతో కూడిన అటెండర్ పాస్ ఇవ్వాలి. పాస్‌పై రోగి వివరాలు, ఫోన్ నంబర్ ఉండి, వారిని మాత్రమే లోపలకు పంపించాలి.
● రోగులు, ఆస్పత్రుల్లో చేరేముందు రోగులు, గర్భిణుల పూర్తి చిరునామా పొందుపర్చాలి.

5 నిమిషాలు ఆలస్యం.. పరీక్షకు దూరం

● వేడుకున్నా అనుమతి నిరాకరణ
● యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్ష రాయకుండానే వెనుదిరిగిన ఆరుగురు
● బేగంపేట ప్రభుత్వ మహిళా కాలేజీ వద్ద ఘటన వెలుగులోకి..


పరీక్ష కేంద్ర వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

బేగంపేట, మే 25 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ (ప్రిలిమినరీ) పరీక్షకు ఆరుగురు అభ్యర్థులు ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చారు. అయితే వేడుకున్నా.. లోపలికి వెళ్లేందుకు అనుమతి నిరాకరించడంతో వెనుదిరిగారు. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలోని పరీక్ష కేంద్రం వద్ద ఆదివారం ఈ సంఘటన వెలుగు చూసింది. సాయంత్రం 2.30 నుంచి 4.30 గంటల వరకు జరిగే ఎగ్జామ్‌కు 5 నిమిషాలు ఆలస్యంగా ఆరుగురు అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి చేరుకున్నారు. అయితే మధ్యాహ్నం 2.30 పరీక్షకు అరగంట ముందే కేంద్రంలోకి అనుమతిస్తారు. నిర్వాహకులు 2గంటల వరకు ఎదురు చూసి అనంతరం గేటుకు తాళం వేశారు. దీంతో అక్కడున్న పోలీసులను వారు బతిమిలాడినా అనుమతించలేదు. దీంతో పలువురు కన్నీటిపర్యంతరమయ్యారు. చేసేది లేక ఇంటిబాట పట్టారు.

యూపీఎస్సీ ప్రిలిమినరీ పరీక్షకు పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. ఆదివారం ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30నుంచి 4.30 గంటల వరకు నిర్వహిస్తున్న నేపథ్యంలో నార్త్‌జోన్, వెస్ట్‌జోన్ ట్రాఫిక్, సివిల్ పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేశారు. నార్త్‌జోన్‌లో 8పరీక్ష కేంద్రాలు ఉండగా, వెస్ట్‌జోన్‌లో 7 సెంటర్లు ఉన్నాయి. వీటిలో సుమారు 6,651 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరవుతున్నారు. ముఖ్యమైన జంక్షన్లు, పరీక్ష కేంద్రాలకు వెళ్లే రహదారులపై తగినంత ట్రాఫిక్ సిబ్బందిని ఉంచి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు.

అంగన్‌వాడీకి కుళ్లిన గుడ్లు

ఉడకబెడితే వెదజల్లిన దుర్వాసన

దయాబాగ్ సెంటర్ నుంచే సరఫరా

లబ్ధిదారురాలి కుటుంబసభ్యుల ఆరోపణ


కుళ్లిపోయిన గుడ్లు

కార్వాన్, మే 25 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కోడిగుడ్లు ఉడకబెడితే కుళ్లిపోయిన దుర్వాసన వెదజల్లిందని బాలింత కుటుంబసభ్యులు ఆరోపించారు. ఆసీఫ్‌నగర్ దయాబాగ్ అంగన్‌వాడీ సెంటర్ నుంచే బాలింతకు గుడ్లు సరఫరా జరిగాయని వెల్లడించారు. వివరాల ప్రకారం.. దయాబాగ్ ప్రాంతంలో నివసిస్తున్న సాయిచంద్ భార్య అశ్విని కొద్ది రోజులు క్రితం ఇద్దరు కవల పిల్లలకు జన్మనిచ్చారు. ఈ సందర్భంగా బాలింత పేరు రిజిస్ట్రర్‌లో నమోదు చేసుకుని ఆమెకు కోడిగుడ్లను అంగన్‌వాడీ సెంటర్ నిర్వాహకురాలు అందజేస్తోంది. శనివారం కూడా 24 గుడ్లను ఇచ్చింది. ఆదివారం వాటిని ఉడకబెడితే ఉడికిపోవడంతో పాటు దుర్వాసన వెదజల్లిందని సాయిచంద్ తెలిపారు. అంగన్‌వాడీ టీచర్‌కు ఫోన్ చేస్తే స్పందించడం లేదని మండిపడ్డారు. నిల్వ ఉన్న గుడ్లు పంపిణీ చేయడం వల్లే కుళ్లిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు.

బాధితురాలి ఇంటికెళ్లి విచారిస్తాం : గోల్కొండ సీడీపీవో రేణక

ఈ విషయమై సోమవారం సంఘటన స్థలానికి వెళ్లి గుడ్లు కుళ్లిపోయాయా? లేదా? అన్న విషయం తెలుసుకుంటాను. ఇప్పటికే సమాచారం అందింది. బాధితురాలు ఇంటికి వెళ్లి మరింత సమాచారం తెలుసుకుంటాం.

ఆర్కాన్‌లో.. అరుదైన ఆపరేషన్


ఆర్కాన్ ఆస్పత్రిలో కృష్ణకు ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ల బృందం

రోగి ఛాతిలోని క్యాన్సర్ గడ్డ తొలగింపు

శంషాబాద్ రూరల్, మే 25(ఆంధ్రజ్యోతి): పురుషుడి ఛాతిలో ఉన్న క్యాన్సర్ గడ్డను తొలగించే అరుదైన ఆపరేషన్‌ను రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మున్సిపల్.. ఆర్కాన్ ఆస్పత్రి వైద్యబృందం విజయవంతంగా నిర్వహించింది. ఆదివారం వైద్యులు వివరాలను వెల్లడించారు. మొయినాబాద్ మండలం మేడిపల్లికి చెందిన కృష్ణ(40) వారం రోజుల క్రితం ఛాతిలో నొప్పి అంటూ ఆర్కార్‌లో చేరారు. పరీక్షలు నిర్వహించి గుండె, లంగ్స్ పైన క్యాన్సర్ గడ్డ ఉన్నట్లు గుర్తించారు. డాక్టర్ అరుణ్‌కల్లా ఆధ్వర్యంలో ఎనిమిది మంది వైద్య బృందం శనివారం సాయంత్రం నుంచి ఆదివారం తెల్లవారుజాము వరకు ఆపరేషన్ చేశారు. దేశంలో లక్షలాది మందిలో ఒకరికే ఇలాంటి ఆపరేషన్ జరుగుతుందని డాక్టర్ అరున్ కల్లా, డైరెక్టర్ డాక్టర్ చంద్రకాంత్‌రెడ్డి చెప్పారు. అనంతరం బాధితుడు కృష్ణ మాట్లాడుతూ.. డాక్టర్ల దయ వల్ల తనకు పునఃజన్మ దక్కిందన్నారు. ఆపరేషన్‌లో డాక్టర్లు మధు వినయ్, వంశీ మోహన్, ఖాదీర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.


దీక్షలో శివశంకర్ పటేల్, కార్మికులు

చిత్రపురి కమిటీని రద్దు చేయాలి

నవోదయం పార్టీ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు శివశంకర్

ఇందిరా పార్కు వద్ద బాధిత సినీకార్మికుల దీక్ష

కవాడిగూడ, మే 25 (ఆంధ్రజ్యోతి): కోట్లాది రూపాయల అవినీతిలో కూరుకుపోయిన చిత్రపురి కమిటీని రద్దు చేయాలని, ఆ స్థానంలో అడహక్ కమిటిని నియమించి సినీకార్మికులకు న్యాయం చేయాలని నవోదయం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు శివశంకర్‌పటేల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిత్రపురి కమిటీ అధ్యక్షుడు వల్లభనేని అనిల్‌కుమార్ చేసిన అవినీతిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆదివారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో చిత్రపురిలో జరిగిన 3వేల కోట్ల స్కామ్ (భూమివిలువతో) అవినీతిని బయటపెట్టి, నిజమైన సినీ కార్మికులకు న్యాయం చేయాలని దీక్ష చేపట్టారు. అవినీతికి పాల్పడ్డ కమిటీ సభ్యులను కాపాడుతున్న కో ఆపరేటివ్ ప్రిన్సిపల్ సెక్రటరీ రఘునందన్‌రావును వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వారితో చేతులు కలిపిన రంగారెడ్డి డీసీఓ సుధాకర్‌ను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దీక్షలో సినీ దర్శకులు మద్దినేని రమేష్, కస్తూరి శ్రీనివాస్, నటి రమావేణి, నాగరాజు. మల్లేష్, శ్రీను. రాజు. జగన్, రాములు, సీహెచ్ శ్రీనివాస్, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.


తమిళనాడు సౌత్ జట్టుకు కప్పును అందిస్తున్న ఇంటర్నేషనల్ క్రికెట్ అంపైర్ రామస్వామి

క్రికెట్ టోర్నీ విజేత తమిళనాడు సౌత్ జట్టు

హయత్‌నగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ సత్యసాయి జోనల్ స్థాయి క్రికెట్ టోర్నీ విజేతగా తమిళనాడు సౌత్ జట్టు నిలిచింది. ఆదివారం రంగారెడ్డి తుర్కయంజాల్‌లోని జేబీ క్రికెట్ గ్రౌండ్‌లో తెలంగాణ, తమిళనాడు సౌత్ జట్లు మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. దీంతో తమిళనాడు సౌత్ జట్టు గెలిచింది. కాగా, సత్యసాయి జాతీయ సేవా సంస్థల ఆధ్వర్యంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి టోర్నీ విజయవంతంగా ముగిసింది. ఈ పోటీలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు సౌత్, తమిళనాడు నార్త్, కర్ణాటక సౌత్, కర్ణాటక నార్త్, కేరళ రాష్ట్రాల నుంచి జట్లు పాల్గొన్నాయి. సత్యసాయి బాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఈ టోర్నీ నిర్వహించినట్లు తెలిపారు. మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ఆంధ్రప్రదేశ్‌కు జట్టుకు చెందిన వెంకట్రావు కు దక్కింది. ఫైనల్ మ్యాచ్ ముగింపు కార్యక్రమానికి ఇంటర్ నేషనల్ క్రికెట్ అంపైర్ కె. రామస్వామి హాజరయ్యారు. గెలుపొందిన జట్టుకు కప్‌ను అందజేశారు. జాతీయ స్థాయి పోటీలను ఆగస్టు 15 నుంచి 17 వరకు పుట్టపర్తిలో నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సత్యసాయి సేవా సంస్థల తెలంగాణ అధ్యక్షుడు వెంకట్రావు, హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సభ్యుడు ఆగమరావు, బీసీసీఐ సెలక్షన్ కమిటీ మాజీ చైర్మన్ ఎంఎస్‌కే ప్రసాద్, తెలంగాణ కార్యదర్శి శేషసాయి, కేఎంరావు, మీడియా కోఆర్డినేటర్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వారంలో 252 డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు

హైదరాబాద్ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వారం రోజుల వ్యవధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో ఏకంగా 252 మందిపై కేసులు నమోదయ్యాయి. కీలక ప్రాంతాల్లో నిర్వహించిన డ్రైవ్‌లో 199 మంది ద్విచక్ర వాహనదారులు, 10 మంది త్రిచక్ర వాహనాలు, 43 మంది ఫోర్ వీలర్ వాహనాలను నడుపుతున్న వారు పట్టుబడ్డారు. మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 44 మంది, చేవెళ్ల ట్రాఫిక్ పీఎస్ పరిధిలో 32, షాద్‌నగర్‌లో పీఎస్‌పరిధిలో 23, శంషాబాద్‌లో 22 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు. మద్యంతాగి వాహనాలను నడపడం ప్రమాదకరమని, తనిఖీల్లో పట్టుబడితే కోర్టులో శిక్షతో పాటు జరిమానా ఉంటుందని వారు చెబుతున్నా మందుబాబుల్లో మార్పు రావడం లేదు.

నేటి నుంచి భారతీయ సాంస్కృతిక, సంగీత సదస్సు

● గవర్నర్ జిష్ణుదేవ్‌శర్మ చేతులమీదుగా ప్రారంభోత్సవం

కంది, మే 25 (ఆంధ్రజ్యోతి): భారతీయ సంస్కృతిపై యువతకు అవగాహన, సంప్రదాయ శాస్త్రీయ సంగీతం ప్రోత్సహించేందుకు, భారత నృత్య, కళా రీతులను స్పిక్ మకాయ్-10 అంతర్జాతీయ సదస్సులో ప్రదర్శించనున్నారు. ఈ కార్యక్రమం సంగారెడ్డి జిల్లా కంది ఐఐటీ హైదరాబాద్‌లో ఏడు రోజులపాటు (సోమవారం నుంచి జూన్ 1 వరకు) నిర్వహించనున్నారు. ఇదేరోజు సాయంత్రం గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ తన చేతులమీదుగా కార్యక్రమాన్ని ప్రారంభిస్తారు. సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఇండియన్ క్లాసికల్ మ్యూజిక్ అండ్ కల్చర్ అమాంగ్స్ యూత్(స్పిక్‌మకాయ్) స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో యేటా దేశంలో ఏదొక ప్రాంతంలో ఈ సదస్సు నిర్వహిస్తారు. ఈసారి ఐఐటీ హైదరాబాద్‌లో నిర్వహిస్తున్నారు.

ఉత్తమ సమాజానికి బాల సాహిత్యం దోహదం

అఫ్జల్‌గంజ్, మే 25 (ఆంధ్రజ్యోతి): సమాజానికి ఉత్తమ పౌరులను అందించేందుకు బాల సాహిత్యం దోహదపడుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. శాంతా వసంతా ట్రస్టు సౌజన్యంతో తెలంగాణ సారస్వత పరిషత్తు ఆదివారం హైదరాబాద్ ఆబిడ్స్ తిలకోడ్లోని డా. దేవులపల్లి రామానుజరావు కళామందిరంలో నిర్వహించిన కోడూరు శాంతమ్మ స్మారక బాల సాహిత్య సమ్మేళనం సందడిగా సాగింది. పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి అధ్యక్షతన రోజంతా సాగిన సమ్మేళనంలో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సుమారు 150 మంది ప్రతినిధులు, 65 మంది వక్తలు పాల్గొన్నారు.

ప్లీజ్.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

(5వ పేజీ తరువాయి)

చేసినట్లు తెలిసింది. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, బాధితులతో మర్యాదగా మాట్లాడుతూ, వారికి తగిన సహాయ సహకారాలు అందించాల్సిన పోలీసులు.. అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. పోలీస్ సిబ్బంది అందిస్తున్న సేవలపై ప్రజాభిప్రాయం తెలుసుకోవడానికి ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిన క్యూఆర్ కోడ్‌లపై అవగాహన కల్పించక పోవడంలో పోలీస్ సిబ్బంది పూర్తిగా విఫలమవడంతో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

బాధితుల గోడు వినడానికే..

పోలీస్ స్టేషన్‌లలో ఇన్‌స్పెక్టర్‌లు, ఎస్సైలు పలుకుబడి ఉన్నవారికే పెద్దపీట వేస్తున్నారు. సాధారణ ప్రజలు పోలీస్ స్టేషన్‌కు వెళ్తే పట్టించుకునే నాథుడే ఉండట్లేదు. అలాంటి వారి గోడును, బాధలను పట్టించుకోవడానికి పోలీస్ ఉన్నతాధికారులు ప్రతి పోలీస్ స్టేషన్‌లో.. పోలీస్ ఫీడ్‌బ్యాక్ క్యూఆర్ కోడ్‌లను అందుబాటులోకి తెచ్చారు. వాటిని స్కాన్ చేసి, పోలీస్‌స్టేషన్‌లలో బాధితులకు ఎదురైన అనుభవాలు ఉన్నతాధికారులకు తెలిసేలా అందులో వివరంగా నమోదు చేయవచ్చు. దాంతో ఆయా పోలీస్ స్టేషన్‌లలో ఏం జరుగుతోంది..? సిబ్బంది ఎలా ప్రవర్తిస్తున్నారు..? వారి పనితీరు ఎలా ఉంది...? అనేది ఉన్నతాధికారులకు తెలుస్తోంది. కానీ, ఆ క్యూఆర్ కోడ్‌ల గురించి పోలీసులు ప్రజలకు అవగాహన కల్పించకపోయారు. ఒకవేళ స్కాన్ చేసి ఫిర్యాదు చేస్తే.. ఆ తర్వాత పోలీసులు మరింత ఎక్కువగా వేధిస్తారేమోనని బాధితులు వాటిని స్కాన్ చేయడానికి ముందుకు రాలేకపోయినట్లు తెలుస్తోంది.

ప్రకృతిని పరిరక్షించే ఉద్యమాలు రావాలి

● ప్రకృతి కవి జయరాజు


మాట్లాడుతున్న ప్రకృతి కవి జయరాజ్

హైదరాబాద్ సిటీ, మే 25 (ఆంధ్రజ్యోతి): ప్రకృతిని పరిరక్షించే ఉద్యమాలు రావాలని ప్రకృతి కవి జయరాజ్ అన్నారు. సిద్ధార్థ ఆరోగ్య కేంద్రం తరపున నలభై రోజులుగా నిర్వహిస్తున్న ఆహార దీక్షల ముగింపు సందర్భంగా ఆదివారం ఓయూ ఇంజనీరింగ్ కాలేజీలోని ఈసీఈ ఆడిటోరియంలో ప్రకృతి ఆరోగ్య మహాసభ జరిగింది. ఆరోగ్య కేంద్రం నిర్వాహకులు, ప్రకృతి వైద్యుడు టి.వెంకన్న సభాధ్యక్షత వహించిన ఈ సభకు ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడారు. సహజసిద్ధమైన, స్థిరమైన ఆరోగ్యానికి ప్రకృతి ఔషధాలు ముఖ్యమైనవన్నారు. వాటిని అందించే అడవి అత్యంత ముఖ్యమైందన్నారు. అడవులను, ఆదివాసులను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతో ఉందని పిలుపునిచ్చారు. లాభాపేక్ష ప్రధాన ధ్యేయంగా ప్రకృతి వనరులను బడా వ్యాపారులకు కట్టబెడుతూ, దాన్ని వ్యతిరేకిస్తున్న ఆదివాసీలను పొట్టన పెట్టుకుంటున్నారంటూ విమర్శించారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ డాక్టర్ యాదయ్య, ప్రముఖ పర్యావరణవేత్త జడ్చర్ల సత్యనారాయణ, ఆదర్శ రైతు లావణ్యారెడ్డి ప్రసంగించారు. ప్రముఖ ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ స్వామి, డాక్టర్ సుగుణరావు, డాక్టర్ ఎల్ వెంకన్న, డాక్టర్ ఆరూర్ సుధాకర్, కళ్లెం శ్రీనివాస్‌రెడ్డి, పర్యావరణవేత్త పద్మారెడ్డి, ఉస్మానియా వర్సిటీ ఆర్ట్స్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండా నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టుల మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించాలి

● ప్రజాసంఘాల నేతలు ● అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న లక్ష్మణ్, ప్రజా సంఘాల నేతలు

కవాడిగూడ, మే 25 (ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మావోయిస్టు మృతదేహాలను వారి కుటుంబసభ్యులకు అప్పగించాలని పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం లోయర్ ట్యాంక్‌బండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద తెలంగాణ పౌర హక్కుల సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా పౌరహక్కుల సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ మాట్లాడుతూ, నారాయణపూర్ జిల్లా ఇంద్రావతి నదిఒడ్డున జరిగిన ఎన్‌కౌంటర్‌లో 28 మంది మావోయిస్టులు చనిపోయారన్నారు. వారి మృతదేహాలన్నీ నారాయణపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో గుట్టలుగా పేరుకుపోయాయని చెప్పారు. ఏపీకి చెందిన మావోయిస్టు కేంద్రకమిటీ ప్రధానకార్యదర్శి నంబాల కేశవరావు, నవీన్,సంగీత, తెలంగాణలోని వరంగల్‌లోని చింతగట్టుకు చెందిన రాకేష్, షాద్‌నగర్ లోని వేములకు చెందిన భూమిక మృతదేహాలను అప్పగించకపోవడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం నారాయణరావు. ఓయు రీసెర్చ్ స్కాలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆజాద్, దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమ నాయకులు చంద్రమౌళి, కుల నిర్మూలన పోరాట సంఘం నాయకులు అభినవ్ పాల్గొన్నారు.

'బొగ్గు రవ్వలు' ఆవిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ జి.హరగోపాల్, డాక్టర్ తిప్పర్తి యాదయ్య

రాంనగర్, మే 25 (ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత అనుభవాలతో పాటు నాటి విప్లవోద్యమ తీరు తెన్నులు నేటి తరానికి తెలియజేసేలా ఎంబర్స్ ఆఫ్ కోల్ (బొగ్గు రవ్వలు) పుస్తకంలో రచయిత ఆవిష్కరింపజేశారని ప్రొఫెసర్ జి.హరగోపాల్ పేర్కొన్నారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో తెలంగాణ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో రచయిత రవీందర్‌రావు రచించిన బొగ్గు రవ్వలు ఆంగ్ల అనువాదం ఎంబర్స్ ఆఫ్ కోల్ పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. విప్లవోద్యమాల్లో అప్పటికి ఇప్పటికి మారిన తీరుపై ప్రతిఒక్కరూ అవగాహన చేసుకోవాలని సూచించారు. పాలకుల ఆధీనంలో ఉండాల్సిన మన ఖనిజ సంపద కార్పొరేట్ శక్తులకు ధారదత్తం చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వాల తీరు మారకుంటే రానున్న కాలంలో విప్లవోద్యమాలు ఏ రూపం దాలుస్తాయోనని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి పుస్తకాలు భవిష్యత్ తరాలకు అందించాల్సిన అవసరం ఉందన్నారు.

నిల్వ పచ్చళ్లు తాజాగా

మనం మామిడి, ఉసిరి, నిమ్మ, పండు మిరప కాయలతో సహా ఎన్నో రకాల నిల్వ పచ్చళ్లు పెడుతూ ఉంటాం. ఒక్కోసారి అవి బూజు పడుతూ తినడానికి వీలులేకుండా పాడవుతూ ఉంటాయి. అలా కాకుండా మనం పెట్టిన పచ్చళ్లు చాలా రోజులపాటు నిల్వ ఉండాలంటే ఏ జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుందాం...

- పచ్చళ్లు పెట్టడానికి తాజాగా ఉన్న కాయలను ఎంచుకోవాలి. మెత్తగా ఉన్నవాటిని, నల్లని మచ్చలతో పాడవడానికి ప్రారంభదశలో ఉన్నవాటిని తీసి పక్కన పెట్టాలి. నాణ్యమైన కాయలను ఎంపిక చేసుకుంటేనే పచ్చళ్లు ఎక్కువ కాలం నిల్వ ఉంటాయి.
- నిల్వ పచ్చళ్ల కోసం తెచ్చిన కాయలను మంచి నీటితో శుభ్రంగా కడగాలి. పరిశుభ్రమైన పలుచని బట్టతో వాటిని తుడిచి నీడలో బాగా ఆరనివ్వాలి. ఏ మాత్రం తేమ లేకుండా చూసుకోవాలి.
- కాయలను ముక్కలుగా తరగడానికి ఉపయోగించే కత్తిపీట, చాకు లాంటి వాటిని; పచ్చడి కలిపే గిన్నెలు, గరిటెలను శుభ్రం చేసి తడి లేకుండా ఆరబెట్టాలి.
- పచ్చళ్లను తయారు చేయడానికి నాణ్యమైన దినుసులనే ఉపయోగించాలి. పచ్చళ్ల కోసం ప్రత్యేకించిన ఉప్పును మాత్రమే వాడాలి. ఇందులో అయొడిన్ లాంటి మూలకాలు ఉండవు. ఇది పచ్చళ్లను చాలాకాలంపాటు తాజాగా ఉంచుతుంది.



- పచ్చళ్లలో కలపడానికి నువ్వుల నూనె లేదా వేరుశనగ నూనెను మాత్రమే ఉపయోగించాలి. మిగిలిన నూనెలు పనికిరావు. పచ్చడి మునిగేవరకూ నూనె పోయాలి. దీనివల్ల పచ్చడి ఎండిపోకుండా రంగు మారకుండా ఉంటుంది.
- సాధారణంగా పచ్చళ్లు పెట్టిన మూడు రోజులకు మరల వాటిని కలిపి ఉప్పు, నూనె తదితరాలను సరిచూస్తారు. అప్పుడు కూడా తడి తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- పచ్చళ్లను జాడీల్లో లేదంటే గాజు సీసాల్లో మాత్రమే నిల్వ చేయాలి. ఇవి పొడిగా శుభ్రంగా ఉండాలి. పచ్చడిని నింపిన తరవాత జాడీ లేదా సీసా మీద రెండు వరుసల పలుచని బట్టని వేసి తాడుతో గట్టిగా బిగించాలి. దీని మీద మూత పెట్టాలి. గాలి చొరబడకుండా ఇలా జాగ్రత్తగా నిల్వ చేస్తే పచ్చళ్లు చాలాకాలం నిల్వ ఉంటాయి.
- నిల్వ పచ్చళ్లను తేమ, ఎండ తగలకుండా చీకటిగా ఉండే పొడి ప్రదేశంలో ఉంచాలి. వీలైతే వీటిని ఫ్రిజ్‌లో కూడా పెట్టవచ్చు.
- పచ్చడిని జాడీ లేదా సీసా నుంచి తీసేటప్పుడు పొడిగా ఉండే గరిటెను మాత్రమే ఉపయోగించాలి. గరిటెను ఒకసారి వేడిచేసి చల్లార్చి వాడితే మంచిది.
- తరచుగా జాడీ లేదా సీసా మూతను తెరకూడదు. కనీసం రెండు నెలలకు అవసరమైన పచ్చడిని మరో చిన్న జాడీ లేదా సీసాలోకి తీసుకుని వాడుకోవాలి.

సంకల్ప శిఖరం

ఒకప్పుడు బ్యాంకింగ్ రంగంలో సేవలు. ఇప్పుడు కేక్‌ల తయారీలో సిద్ధహస్తురాలు. పిల్ల తల్లి... కళాకారిణి అయిన సఫ్రినా లతీఫ్... 37 ఏళ్ల వయసులో ప్రపంచంలోనే ఎత్తయిన ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించారు. మంచు తుపానులు... ప్రతికూల వాతావరణ పరిస్థితులు... అడుగడుగునా సవాళ్లు. అన్నిటినీ దాటుకొని... సగర్వంగా జాతీయ జెండా ఎగురవేశారు. ఈ ఘనత సాధించిన తొలి కేరళ మహిళగా చరిత్ర సృష్టించారు. సంకల్పానికి పట్టుదల తోడైతే ఎంతటి శిఖరమైనా అందుకోవచ్చనే జీవిత సత్యాన్ని ఈ విజయం నేర్పిందంటున్న సఫ్రినా జర్నీ ఇది.



“ఉద్వేగం, ఆనందం, ఆశ్చర్యం... ఎవరెస్టు పర్వతాన్ని అధిరోహించిన ఆ క్షణం నా మదిలో ఎన్నో భావనలు. అంతెత్తున నిలుచున్నప్పుడు ప్రపంచాన్నే జయించిన అనుభూతి. దాన్ని వర్ణించడానికి ఇప్పటికీ మాటలు సరిపోవడంలేదు. కేరళలోని కన్నూర్ జిల్లా వెంగాడ్ మాది. పెళ్లి తరువాత నా నివాసం కతార్‌లోని దోహాకు మారింది. మావారు డాక్టర్ షమీల్ ముస్తఫా దోహా 'హమద్ మెడికల్ కార్పొరేషన్'లో సర్జన్. నేను 'ఇఫ్రిన్ బెస్పోక్ సుగర్‌టేల్స్' బ్రాండ్‌తో కేక్‌లు తయారు చేస్తాను. పలు అవార్డులు కూడా అందుకున్నాను. కొవిడ్ సమయంలో అందరూ ఇళ్లకే పరిమితమైతే... నేను, మావారు ఫిట్‌నెస్ కోసం జిమ్‌లో చేరాం. అప్పుడు అర్థమైంది... పని ఒత్తిడి పేరుతో మమ్మల్ని మేము ఎంత అశ్రద్ధ చేశామనేది. ఆరంభంలో ట్రెడ్‌మిల్ లాంటి సాధారణ వ్యాయామాలు చేయడానికి కూడా శక్తి సరిపోయేది కాదు. నేనైతే జిమ్‌లో అరగంట సెషన్ కూడా పూర్తికాకుండానే అలసిపోయేదాన్ని. క్రమంగా ఆహారపు అలవాట్లు కూడా మార్చాను. వర్కవుట్స్‌తో శరీరం కాస్త స్వాధీనంలోకి వచ్చాక నాపై నాకు నమ్మకం పెరిగింది. అప్పుడే పర్వతాలు ఎక్కాలనే చిన్ననాటి కోరిక నా మదిలో మెదిలింది. మావారికి చెబితే, ఆయన కూడా ఆసక్తి చూపారు.

అలా మొదలైంది...

ఇద్దరం మౌంటెనీరింగ్ శిక్షణలో చేరాం. ఒక్కో లక్ష్యం నిర్దేశించుకొంటూ ముందుకు సాగాను. తొలి ప్రయత్నంగా టాంజానియాలోని కిలిమంజారో ఎక్కాను. ఆ ఉత్సాహంతో అర్జెంటీనాలోని అకోన్‌కాగువా, తరువాత రష్యాలోని ఎల్‌బ్రస్ పర్వతాలను విజయవంతంగా అధిరోహించాను. వీటిల్లో అకోన్‌కాగువా ఎత్తయిన (6,961 మీటర్లు) పర్వతం. ఈ పర్వతారోహణ నాలో ఎనలేని ఆత్మవిశ్వాసం నింపింది. ఎవరెస్టు శిఖరాన్ని ముద్దాడాలన్న బలమైన ఆకాంక్ష రగిల్చింది. దాంతో కజకిస్తాన్ వెళ్లి మంచు పర్వతాల అధిరోహణలో ప్రత్యేక శిక్షణ తీసుకున్నా.

ఫిట్‌నెస్ ఉంటేనే సరిపోదు...

ఎవరెస్టు అధిరోహణ అంటే కేవలం ఫిట్‌నెస్, శిక్షణ మాత్రమే సరిపోవు. పట్టుదల, అంకితభావంతో ఉండాలి. భావోద్వేగాలపై నియంత్రణ సాధించాలి. అన్నిటికీ మించి ఆర్థిక వనరులు సమకూర్చుకోవాలి. ఈ సాహస యాత్రకు దాదాపు డెబ్బై లక్షలు ఖర్చు అవుతుంది. దీని కోసం బెంగళూరులో ఉన్న మా ఇంటిని అమ్మేశాం. కష్టపడి కొనుక్కున్న ఇల్లు. ఎంతో బాధ కలిగింది. యాత్ర కోసం మొదటి దఫా సొమ్ము చెల్లించినప్పుడు అనుకున్నా... 'ఎట్టి పరిస్థితుల్లోనూ వెనకడుగు వేయకూడదు' అని. ఈ ఏడాది జనవరిలో దృఢ సంకల్పంతో కఠోర సాధన మొదలుపెట్టాను. ముందుగా అనుకున్నది నేను, మావారు కలిసి వెళ్లాలని. కానీ ఆఖరి నిమిషంలో ఆయన గాయంతో తప్పుకున్నారు. తరువాత దోహాలోనే పర్వతారోహణలో నైపుణ్యంగల ట్రైనర్ వద్ద శిక్షణ తీసుకున్నా.

అడుగడుగునా సవాళ్లే...

ఏప్రిల్ మాసం... 12వ తేదీ... గడ్డ కట్టే చలి. ఈదురు గాలులు. ఎవరెస్టు బేస్ క్యాంప్ వైపు నడక మొదలైంది. అంటే నా సాహస యాత్రలో తొలి అడుగు. దట్టంగా మంచు కప్పిన పర్వతంపై... సన్నని దారిలో పదహారు గంటలపాటు సాగింది ప్రయాణం. ఒక క్యాంపు నుంచి మరో క్యాంపునకు. మధ్యలో చిన్నపాటి విరామం. శరీరం ఆ భయంకర వాతావరణానికి కాస్త అలవాటు పడింది. కానీ అసలైన పరీక్ష రెండు రోజుల తరువాత ఎదురైంది. క్యాంపు 2 నుంచి మరింత కఠినంగా ఉంటుంది. అది చూసి మావారికి ఫోన్ చేశాను... 'నేను వెనక్కి వచ్చేస్తా' అని. ఆయన ఒప్పుకోలేదు. 'ఇది మనిద్దరి కల. నువ్వు నెరవేర్చాలి' అని ధైర్యం చెప్పారు. మనసులో వేరే ఆలోచనలు లేకుండా ముందుకు సాగాను. క్యాంపు 3, అంటే 7,100 మీటర్ల ఎత్తుకు వెళ్లాక ఆక్సిజన్ అత్యవసరమైంది. నిదానంగా క్యాంపు 4 వైపు ప్రయాణం మొదలైంది. దాన్ని 'డెత్ జోన్' అని కూడా అంటారు. కొంత దూరం వెళ్లాక ఫిలిప్పీన్ దేశానికి చెందిన పర్వతారోహకుడి శవం కనిపించింది. రెండు రోజుల కిందటే మరణించాడని తెలిసింది. ముందుకు వెళితే మరికొన్ని శవాలు. నా గుండె కొట్టుకొనే వేగం అమాంతం పెరిగింది. చాలా భయం వేసింది. అయితే మా గైడ్ ఇచ్చిన ధైర్యంతో అంతిమ ఘట్టానికి చేరువ అయ్యాం. కానీ వాతావరణం భయంకరంగా ఉంది. మంచు తుపానులు, చల్లని గాలులు, అత్యంత కఠినమైన మార్గం... అన్నిటినీ దాటుకొని మే 18న ఎవరెస్టు అంచుకు చేరాం.

నన్ను నేను నమ్మలేని క్షణం...

ఎవరెస్టు పర్వతం ఎత్తు 8,848 మీటర్లు. అంత ఎత్తుకు వెళ్లి నిలుచున్నప్పుడు నన్ను నేను నమ్మలేకపోయాను. ప్రపంచంలోకెల్లా ఎత్తయిన పర్వతం అధిరోహించానన్న వాస్తవం నన్ను ఉక్కిరిబిక్కిరి చేసింది. ఎంతో భావోద్వేగానికి లోనయ్యాను. కన్నీళ్లు ఆగలేదు. అక్కడ భారత్, కతార్ పతాకాలు ఎగురవేశాను. అయితే పైకి వెళ్లగానే గాగుల్స్ లేకుండా ఎవరెస్టును చూడాలనుకున్నాను. కళ్లద్దాలు తీయగానే మంచు తుపాను తాకిడికి ఉన్నట్టుండి నా చూపు మందగించింది. ఏదీ స్పష్టంగా కనిపించలేదు. ఒళ్లంతా నొప్పులు. చేతులు వాచిపోయాయి. కళ్లు మండుతున్నాయి. కిందకి దిగడం ఒక పీడకలలా మిగిలిపోయింది. దారిలో నాకు నేను చెప్పుకున్నాను... 'ఎలాగైనా సరే శవంగా కాకుండా బతికి ఇంటికి వెళ్లాలి' అని. మా గైడ్ సాయంతో పది గంటలు ఆలస్యంగా క్యాంపు 4కు చేరుకున్నాను. తరువాత హెలికాప్టర్‌లో కఠ్మండూ ఆసుపత్రికి తీసువెళ్లి చికిత్స అందించారు. అప్పుడు మరో జన్మ ఎత్తిన అనుభూతి కలిగింది.”

మా అమ్మాయికి స్ఫూర్తినవ్వాలి...

నిజానికి ఇంటి నుంచి వెళ్లేముందే నా భర్తకు, కూతురుకు ఇక సెలవని చెప్పాను. ఎందుకంటే నాకు తెలుసు... ఎవరెస్టు పర్వతారోహణ ఎంత ప్రమాదకరమో. అయితే ఆత్మవిశ్వాసంతో అన్నిటినీ జయించాను. తిరిగి ఇంటికి రాగలిగాను. అది కూడా సజీవంగా. ఇప్పుడు నా కూతురుకు చెప్పడానికి నా దగ్గర ఎన్నో కథలు ఉన్నాయి. అవి విని తను ప్రేరణ పొందాలి. తనకు నేను అతిపెద్ద స్ఫూర్తిమంత్రం అవ్వాలి. ఎందుకంటే నేను ఒక తల్లిని. కేక్ ఆర్టిస్టుని. ఒకప్పటి బ్యాంకర్‌ని. ఇప్పుడు పర్వతారోహకురాలిని. ఒక సాధారణ వ్యక్తిని ఎన్నో సాధించాను. నాలాంటి మహిళలకు చెప్పేది ఒక్కటే... మీరు ఎక్కే పర్వతం ఎవరెస్టు కాకపోవచ్చు... కానీ సాధించాలనే తపన, పట్టుదల, బలమైన సంకల్పం ఉంటే జీవితంలో ఎంతటి ఎత్తయిన శిఖరాన్నయినా అధిరోహించవచ్చు.



క్విజ్ క్వీన్



శరణ్య జయకుమార్... కాటన్ చీరలో, పూర్తిగా తెల్లబడిపోయిన జుట్టుతో ఎంతో నిరాడంబరంగా... పక్కింటి బామ్మలా కనిపిస్తారు.కానీ క్విజ్ పోటీకి దిగితే యువతను మించిన ఉత్సాహం ఆమెలో కనిపిస్తుంది. '85 ఏళ్ల వయసులోనూ ఇంకా నేర్చుకుంటున్నా'నంటున్న ఈ శరణ్య చెబుతున్న సంగతులివి.

“క్విజ్‌లకే నా జీవితం అంకితం చేశానని అందరూ అనుకుంటారు. కానీ నాకు అంతకన్నా ఇష్టమైన అభిరుచి ఉంది... పుస్తకాలు చదవడం. నిజానికి కాలేజీ రోజుల వరకూ క్విజ్ అనే పదం కూడా నాకు పెద్దగా పరిచయం లేదు. ఇది 1950ల్లో మాట. అప్పట్లో మాకు ఎక్కువ మాధ్యమాలు అందుబాటులో లేవు. కాబట్టి పుస్తకాలే లోకంగా ఉండేది. ఎప్పుడు ఖాళీ దొరికినా లైబ్రరీలోనే ఉండేదాన్ని. నా ఆసక్తిని మా ఇంగ్లీష్ ప్రొఫెసర్ గమనించారు. “నగరంలో క్విజ్ పోటీలు జరుగుతున్నాయి. పేరు ఇవ్వొచ్చు కదా?” అన్నారు. అదేంటో తెలుసుకోవాలనే ఆసక్తి కలిగింది. పోటీలో పాల్గొన్నాను. అది నన్ను ఒక వ్యసనంలా అంటుకుంది. ఎనభై అయిదేళ్ల వయసులో కూడా నేను చురుగ్గా, ఉత్సాహంగా ఉండేలా చేస్తోంది.

గెలుపు మీదే దృష్టి

చెన్నై నగరం నా స్వస్థలం. అక్కడి క్వీన్ మేరీ కాలేజీ, ప్రెసిడెన్సీ కాలేజీల్లో చదివాను. ఆంగ్ల సాహిత్యంలో మాస్టర్స్ చేశాను. మరోవైపు క్విజ్ పోటీల్లో పాల్గొనడం కొనసాగించాను. ఆ రోజుల్లో చెన్నైలో రెండు ప్రధాన పోటీలు మాత్రమే జరిగేవి. వాటిలో ఒకటి మద్రాస్ స్టూడెంట్స్ యూనియన్ క్విజ్. మరొకటి బాగా పేరున్న 'జాన్సన్ కప్'. అయితే పాల్గొనేవారు మరీ ఎక్కువగా ఉండేవారు కాదు. మహిళల సంఖ్యయితే బాగా తక్కువ. కానీ దాన్ని ఆడ, మగ మధ్య పోటీగా భావించేవాళ్లం కాదు. మా పరిజ్ఞానాన్ని ప్రదర్శించి గెలవడం మీదే దృష్టి ఉండేది. జాన్సన్ కప్‌ను చాలాసార్లు గెలిచాను. చదువు పూర్తయ్యాక... జయకుమార్‌తో వివాహం జరిగింది. కోల్‌కతాకు మారాల్సి వచ్చింది. కుటుంబ బాధ్యతలు, నలుగురు పిల్లల సంరక్షణలో నిమగ్నమైపోయాను. క్విజ్‌ల మీద నాకున్న ఆసక్తిని పక్కన పెట్టేశాను. అలా పదహారేళ్ళు గడిచాయి... అప్పుడే ఊహించని విధంగా నా రీఎంట్రీ జరిగింది.

ఆ సంఘటన కళ్లు తెరిపించింది...

ఒక రోజు మా ఆడపడుచు కొడుకు పేపర్‌లో ఒక ప్రకటన చూపించాడు. అప్పట్లో దేశంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన ఓపెన్ క్విజ్... 'నార్త్ స్టార్ క్విజ్' పోటీ ప్రకటన అది. పూర్వం క్విజ్‌లలో పాల్గొన్న అనుభవం నాకుంది కాబట్టి పాల్గొంటే బాగుంటుందన్నాడు. నేనూ సరేనన్నాను. కానీ దానికోసం ఏదీ చదవకుండానే పోటీకి వెళ్లాను. బెల్జియం జాతీయ గీతం ఏమిటనే ప్రశ్న ఎదురైంది. దానికి పద్నాలుగేళ్ళ కుర్రాడు జవాబిచ్చాడు. ఆ సంఘటన నా కళ్లు తెరిపించింది. అలాంటి పోటీలో పాల్గొనాలంటే ఇంకా ఎంతో తెలుసుకోవాలని అర్థమైంది. అక్కడ నాకు కొందరు ఔత్సాహికులు పరిచయం అయ్యారు. మేము 'మోటెలీ క్రూ' అనే కొత్త టీమ్ ఏర్పాటు చేశాం. కొద్దికాలంలోనే మా టీమ్ కోల్‌కతాలో జరిగిన పలు క్విజ్ పోటీల్లో తన ఉనికిని బలంగా చాటుకుంది. నీల్ ఓబ్రెయిన్ లాంటి దిగ్గజాలతో కూడా మా జట్టు పోటీ పడింది. ఆ తరువాత ఆయన మార్గదర్శకత్వంలో మేము మరింత పదును తేలాం. ఎన్నో విజయాలు సాధించాం. అవన్నీ మరపురాని రోజులు. అలా దాదాపు ఏడేళ్ళు గడిచాక... కోల్‌కతా అధ్యాయాన్ని ముగించాల్సి వచ్చింది.

క్విజ్జింగ్ ఫ్యామిలీ...

మా కుటుంబం 1986లో చెన్నైకి తిరిగి వచ్చింది. అప్పటికి నా పిల్లలు పెద్దవారయ్యారు. మా పెద్దబ్బాయి నవీన్, అతని మెడికల్ కాలేజీ మిత్రులతో 'మెమొరీ బ్యాంక్' అనే టీమ్ ఏర్పాటు చేశాను. అలాగే 1987లో చెన్నైలో 'క్విజ్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' స్థాపనకు దోహదం చేశాను. 1990ల ప్రారంభంలో మా టీమ్ 'ఆల్ ఇండియా నార్త్ స్టార్ ట్రోఫీ'ని గెలిచింది. ఆ ప్రతిష్ఠాత్మకమైన టైటిల్ కోల్‌కతాను దాటి వెళ్లడం అదే మొదటిసారి. అలాగే 'ఆల్ ఇండియా రౌండ్ టేబుల్ క్విజ్'లోనూ టైటిల్ సాధించాం. ఈ విజయాలు ఎన్నో ఏళ్ళు కొనసాగాయి. ఆ తరువాత క్విజ్ మాస్టర్‌గా కూడా వ్యవహరించాను. భారత దేశంలో మొదటి మహిళా క్విజ్ మాస్టర్ కూడా బహుశా నేనే కావచ్చు. అంతేకాదు, మా పెద్దబ్బాయి డాక్టర్ నవీన్ కూడా సుప్రసిద్ధ క్విజ్ మాస్టర్, చాలా ప్రజాదరణ పొందిన 'ల్యాండ్‌మార్క్ క్విజ్'కు హోస్ట్ కూడా. అలాగే మరో ఇద్దరు అబ్బాయిలు నిరంజన్, శ్రీకాంత్, నవీన్ కొడుకు ఈశ్వర్ కూడా ఈ అంశంలో నిష్ణాతులే. ఇది అరుదైన విషయం అందుకే 'భారతదేశంలో తొలి క్విజ్జింగ్ ఫ్యామిలీ'గా మాకు గుర్తింపు లభించింది. అంతేకాదు, క్విజ్‌లలో పాల్గొంటున్న వయోధికురాలైన మహిళను కూడా నేనే.

వయసుతో నిమిత్తం లేదు...



ఇప్పటికీ ఇందులో కొనసాగడానికి కారణం నాకు దీనిపై ఉన్న ఆసక్తితో పాటు నిరంతరం ఏదో తెలుసుకోవాలనే తపన. కొత్త పుస్తకాలను నిరంతరం చదువుతూ ఉంటాను. క్విజ్‌లపై కొన్ని పుస్తకాలు కూడా రాశాను. వాటిలో మతానికి సంబంధించిన వెయ్యి ప్రశ్నలతో రూపొందించిన 'థౌజండ్ రెలిజియస్ క్వశ్చన్స్'కు మంచి పేరు వచ్చింది. ఎంతోకాలంగా ఈ రంగంలో కొనసాగుతూ, దీని అభివృద్ధి కోసం నేను చేసిన కృషికి గుర్తింపుగా ఈ ఏడాది మార్చిలో జీవితకాల సాఫల్య పురస్కారాన్ని 'క్విజ్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా' అందజేసింది. ఈ తరం వాళ్ళు నన్ను ఎన్నో ప్రశ్నలు వేస్తూ ఉంటారు. మేము అప్పట్లో అన్నీ గుర్తు పెట్టుకోవాల్సి వచ్చేది. ఏది ఎక్కడుందో వెతుక్కోవాల్సి వచ్చేది. ఇది ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్ల యుగం. కాబట్టి సమాచారం దొరకడం సులువయింది. కానీ క్విజ్‌లో భౌగోళిక శాస్త్రం, సంప్రదాయ సాహిత్యం, చరిత్ర లాంటి అంశాలు మాత్రం ఎప్పటికీ మారవు. క్విజ్‌లో పాల్గొనేవారికి కుతూహలం ముఖ్యం. దానికి వయసుతో నిమిత్తం లేదు. నేర్చుకోవడం ఆపకూడదు. నేను ఇప్పటికీ చేస్తున్నది అదే.”

వంటగది సింక్‌లో నీళ్లు పోవడం లేదా...?



మనం సాధారణంగా వంటగది సింక్‌లో వంట పాత్రలు, భోజనం చేసిన పళ్లాలు కడుగుతూ ఉంటాం. దీంతో ఒక్కోసారి సింక్‌లో దాని కింద ఉన్న పైప్‌లో వ్యర్థ పదార్థాలు పేరుకుని నీళ్లు పోకుండా అడ్డుపడుతుంటాయి. క్రమంగా సింక్ మురికి నీళ్లతో నిండి దుర్వాసన వస్తూ ఉంటుంది. ఇలా కాకుండా సింక్‌ను, దాని పైప్‌నూ ఎలా శుభ్రం చేసుకోవాలో తెలుసుకుందాం....

- సింక్ పూర్తిగా మురికి నీళ్లతో నిండిపోతే వెంటనే ప్లంజర్‌ను రంధ్రాలపై ఉంచి గట్టిగా నొక్కి తీయాలి. చిన్నపాటి అడ్డంకులు ఉంటే అవి తొలగి నీళ్లు వేగంగా మోరీలోకి పోతాయి. తరవాత వేడినీళ్లతో సింక్‌ను శుభ్రం చేసుకోవాలి.
- సింక్‌లో అర కప్పు బేకింగ్ సోడా చల్లాలి. దాని మీద అరకప్పు వెనిగర్‌ను స్ప్రే చేయాలి. ఈ మిశ్రమం మెల్లగా సింక్ పైప్‌లోకి జారి అక్కడి వ్యర్థాలను కరగిస్తుంది. పావు గంట తరవాత ఒక గ్లాసు వేడి నీళ్లను సింక్‌లో పోస్తే వ్యర్థాలన్నీ తొలగి సింక్ శుభ్రపడుతుంది. ఇలా నెలకి ఒకసారి చేస్తూ ఉంటే సింక్‌లో సమస్యలు రావు.
- ఒక్కోసారి సింక్ పైప్‌లో, అలాగే మోరీలో నూనెలు ఇతర వ్యర్థాలు గడ్డలా పేరుకోవడంతో సింక్‌లో నీళ్లు నిలిచిపోతుంటాయి. ఇలాంటప్పుడు మూడు గ్లాసుల వేడివేడి నీళ్లలో కొద్దిగా సర్ఫ్ లేదా షాంపూ వేసి బాగా కలిపి సింక్‌లో పోయాలి. ఇలా పది నిమిషాల వ్యవధితో రెండు సార్లు చేస్తే వ్యర్థాలన్నీ కరగిపోతాయి. సింక్ పైప్, మోరీ శుభ్రమవుతాయి.
- ఒక గిన్నెలో అర కప్పు ఉప్పు వేసి అందులో నాలుగు చెంచాల నిమ్మరసం కలపాలి. రాత్రి పడుకునే ముందు ఈ మిశ్రమాన్ని సింక్ లోపల పరచాలి. ఉదయం లేవగానే సింక్‌లో వేడి నీళ్లు చల్లాలి. అయిదు నిమిషాల్లో సింక్ పూర్తిగా శుభ్రమవుతుంది. దుర్వాసన కూడా పోతుంది. వారానికి రెండు సార్లు ఇలా చేస్తూ ఉంటే సింక్‌లో నీళ్లు నిలవవు.
- గిన్నెలు, పళ్లాలు కడిగిన వెంటనే సింక్‌లో మిగిలిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి. బ్రష్‌తో సింక్‌ను రుద్ది నీళ్లు పోస్తూ శుభ్రం చేయాలి.
- సింక్ కింద ఉన్న మోరీలో తరచూ ఒక బకెట్ వేడి నీళ్లు పోస్తూ ఉంటే సమస్యలు రావు.

మామిడి తొక్క మంచిదేనా?



మామిడి పళ్లను ఇష్టపడని వారు ఉండరు. కానీ చాలామంది మామిడి తొక్కను తినకుండా పడేస్తారు. అయితే ఆ తొక్కలో కూడా పోషకాలు ఉన్నాయని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఆ వివరాలు తెలుసుకుందాం..

- మామిడి తొక్కలో ఫైబర్, విటమిన్ సి, ఇ, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఫైబర్ జీర్ణ సమస్యలను తగ్గించడంతో పాటు ఆకలిని నియంత్రిస్తుంది. తొక్కలోని కెరోటినాయిడ్‌లు చర్మాన్ని ఆరోగ్యవంతంగా ఉంచడంలో సహాయపడతాయి. మామిడి తొక్కలోని పాలిఫెనాయిల్స్ కెరోటినాయడ్స్ వలన గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. మామిడి తొక్క మధుమేహాన్ని నియంత్రించడంలోనూ సహాయపడుతుందని కొన్ని పరిశోధనల్లో తేలింది.
- **పురుగుమందుల అవశేషాలు:** మామిడి తొక్కలో ఎన్నో పోషకాలు ఉన్నప్పటికీ దానిని తినడం వలన కొన్ని సమస్యలు వచ్చే అవకాశాలున్నాయి. మామిడి తొక్కలోని ఉరుషియోల్ వలన కొందరికి చర్మంపై దద్దుర్లు, దురద వంటి సమస్యలు తలెత్తే ప్రమాదముంది. మామిడి తోటల్లో వాడే క్రిమి సంహారక మందుల అవశేషాలు మామిడి తొక్కపై ఉంటాయి. వాటి వలన అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. కొన్ని రకాల క్యాన్సర్లు వచ్చే ప్రమాదం కూడా పెరుగుతుంది.
- **సేంద్రీయ పళ్లు మేలు:** ఎలాంటి పురుగు మందులు వాడకుండా పెంచే సేంద్రీయ(ఆర్గానిక్) పళ్లు తినడం మంచిది. అవి దొరకని పక్షంలో పళ్లను బాగా శుభ్రం చేసుకొని తినాలి.
- **ఇలా శుభ్రం చేద్దాం :** నీళ్లలో ఉప్పు, పసుపు కలిపి పావు గంటసేపు పళ్లను అందులో నానబెట్టాలి. ఆ తరువాత తీసి బాగా రుద్దుతూ కడగాలి. ఇలా చేయడం వలన పళ్ల మీద ఉన్న పురుగు మందుల అవశేషాలు తొలగిపోతాయి.
- నీళ్లతో వెనిగర్ లేదా బేకింగ్ సోడా వేసి ఓ ఇరవై నిమిషాల పాటు మామిడి పళ్లను వాటిలో నానబెట్టాలి. తరువాత మంచినీటితో శుభ్రంగా కడగాలి.

దిక్సూచి
DIKSUCHI



ఐఐటీ మినహా మిగిలిన ఇంజనీరింగ్ కోర్సుల్లో చేరేందుకు ఉద్దేశించిన ప్రవేశ పరీక్షల ఫలితాలు వెల్లడయ్యాయి. ఐఐటీ, ఎన్ఐటీ లేదంటే రాష్ట్ర స్థాయి సెట్‌లో సాధించిన ర్యాంకుతో కోరుకున్న కాలేజీలో సీటు వచ్చే విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేదు. మంచి ర్యాంకు పొందిన వారికి పేరున్న సంస్థలోనే సీటు వస్తుంది. మధ్యస్థంగా ర్యాంకు వచ్చిన విద్యార్థులకే అసలైన కష్టం. కాలేజీ ఎంపికలో వారంతా చాలా జాగ్రత్తగా వ్యవహరించాలి. అలాగే ఒకసారి చేరిన తరవాత నాలుగేళ్లు చదవాలి. ఆపై సమున్నత కెరీర్ నిర్మించుకోవాలి. భావి జీవితం బాగా ఉండాలంటే, ముందస్తు కసరత్తు చాలా అవసరం. అసలు తెలుగు రాష్ట్రాల్లో ఉన్న ఇంజనీరింగ్ కాలేజీల్లో ఏది మంచిదన్న ప్రశ్నతో ఈ ప్రక్రియ మొదలవుతుంది.

ఇంజనీరింగ్ కాలేజీ ఎంపికలో ఏవి కీలకం?

సాధారణంగా చాలా మంది విద్యార్థులు ఎంపిక విషయానికి వచ్చే సరికి ఓ పది ఇంజనీరింగ్ కాలేజీలను ఉజ్జాయింపుగా ఎంచుకొంటారు. ఆ క్రమంలోనే అక్కడి క్యాంపస్ రిక్రూట్‌మెంట్లు జరిగిన తీరుతెన్నులు, వార్షిక ప్యాకేజీ వివరాలు తెలుసుకుంటారు. వాటికితోడు మరో రెండు అంశాలనూ పరిశీలించాలి. పేరున్న కాలేజీల్లో నాణ్యమైన విద్య లభిస్తుంది. ఏ కాలేజీలో ఎలాంటి విద్యను అందిస్తున్నారో, వాటి ప్రమాణాలు ఏమిటో క్యాంపస్ ప్లేస్‌మెంట్ కోసం వచ్చే సంస్థలకు స్పష్టమైన అవగాహన ఉంటుంది. అసలు అలాంటి కాలేజీలకే వారు వెళ్తారు.

బ్రాండ్ ఇమేజ్

సాధారణంగా పేరున్న కాలేజీలు(బ్రాండ్ ఇమేజ్) అనగానే ఐఐటీ లాంటివి గుర్తుకు వస్తాయి. అక్కడ నాణ్యమైన విద్య లభిస్తుంది. పూర్వ విద్యార్థుల ప్రతిభ, అక్కడి ప్రొఫెసర్లు - విద్యార్థుల పరిశోధనలు ప్రామాణికంగా ఉంటాయి. మరికొన్ని కాలేజీలకూ బాగానే పేరుంటుంది. అవి ప్రామాణికాంశాలతో కాకుండా తమ ప్రచారంతో సంపాదించినవి. చిన్న కాలేజీలు, కొత్తగా ఏర్పాటైనవి ఆ స్థాయిలో ప్రచారానికి వ్యయం చేయలేవు. అందుకే కొన్ని చిన్న కాలేజీలు నాణ్యమైన విద్యను అందించినా ఆ స్థాయి ప్రచారాన్ని అందుకోలేక 'వెనుకబాట' పడతాయి. అందువల్లే కొత్త, చిన్న కాలేజీలు రిక్రూటర్లను పెద్దగా ఆకర్షించలేవు.

ఫ్యాకల్టీ

ఒక కాలేజీలోని ఫ్యాకల్టీ విద్యార్హతలు ఏమిటన్నది తప్పక పరిశీలించాలి. మొత్తం అధ్యాపకుల్లో పిహెచ్‌డి ఎంత మందికి ఉందన్నది తెలుసుకోవాలి. ఆ డిగ్రీ లేనప్పటికీ కొందరు మంచి అధ్యాపకులు ఉంటారు. అయితే, వారి సంఖ్య స్వల్పం. ఎం.టెక్ పూర్తి చేసిన వారు ఎందరున్నారన్నదీ పరిశీలించాలి. ఎందుకంటే, ఇటీవల చాలా కాలేజీల్లో బీ.టెక్ లేదంటే ఎమ్మెస్సీ పూర్తి చేసిన వారిని అధ్యాపకులుగా నియమిస్తున్నారు. అలాంటి కాలేజీల్లో నాణ్యమైన విద్యను ఆశించలేం. అధ్యాపకులు వారి ఉన్నత విద్యను ఎక్కడ పూర్తి చేశారన్నదీ చూడాలి. ప్రముఖ సంస్థల్లో విద్యాభ్యాసం చేసిన వారి నుంచి నాణ్యమైన విద్య తప్పకుండా లభిస్తుంది. అలాగే ఆ కాలేజీలో బీటెక్ వరకు చదివి, తదనంతరం ఉన్నత విద్యను ప్రతిష్ఠాత్మక సంస్థల్లో పూర్తి చేసుకొని ఉంటే ఆలోచించాల్సిన అవసరం లేదు.

అధ్యాపకుల సంఖ్య

నాణ్యమైన విద్యను పొందేందుకు అధ్యాపక- విద్యార్థి నిష్పత్తి అతి ముఖ్యమైంది. విద్యార్థుల సగటు సంఖ్య తక్కువగా ఉండే తరగతి గదుల్లో నాణ్యమైన విద్య లభిస్తుంది. అంటే సరిపడా అధ్యాపకులున్న కాలేజీల్లో మాత్రమే తరగతి గదిలో విద్యార్థుల సగటు సంఖ్య తక్కువగా ఉంటుంది. అలా కాకుండా విద్యార్థుల సంఖ్యతో పొంతన లేకుండా అధ్యాపకులు తగ్గిన పక్షంలో అది వారి పని భారాన్ని పెంచుతుంది. దాంతో వారు స్వీయ పరిశోధనకు సమయం కేటాయించుకోలేరు. సరైన రీతిలో అసైన్‌మెంట్లను, ప్రాజెక్టు వర్క్‌ను విద్యార్థులకు ఇవ్వలేరు. అలాగే వాటికి గ్రేడింగ్ ఇవ్వడమనేది వారికి అత్యంత భారంగా మారుతుంది.

పరిశోధనల తీరుతెన్నులు..

కాలేజీ అధ్యాపకులు ఎవరైనా పరిశోధన చేస్తుంటే వారికి సదరు రంగాల్లో వస్తున్న మార్పులపై సరైన అవగాహన ఉంటుంది. వారు మంచి బోధనను అందిస్తారు. గొప్పగొప్ప సంస్థల్లో పరిశోధన కొనసాగిస్తున్న వారే కానవసరం లేదు. పరిశోధన రంగంలో ఉంటే బాగా బోధిస్తారని అంచనా వేయవచ్చు. పరిశోధనకు పూర్తిగా దూరంగా ఉండే వారి నుంచి మాత్రం ఉత్తమ బోధనను ఆశించడం కష్టమే. వీలైతే మొత్తం కాలేజీ కార్యక్రమాలను లేదా కనీసం తాము ఎంచుకోవాలని భావించే శాఖ పనితీరును చూడాలి. సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహిస్తున్నారా అవి విషయాన్నీ చూడాలి.

వసతులు

ఇది మరో ముఖ్యమైన అంశం. చేరాలనుకునే విభాగంలో ల్యాబ్‌ల పరిస్థితి ఎలా ఉందో తెలుసుకోవాలి. ఆధునిక పరికరాలు ఉన్నాయా? ఉంటే విద్యార్థులంతా ఒకేసారి ప్రయోగాలు చేసేందుకు సరిపడా ఉన్నాయా? లేకుంటే ఏదో మొక్కుబడిగా డిమాన్‌స్ట్రేటర్ చేసి చూపిస్తారా అన్నవి తెలుసుకోవాలి. మొత్తంగా కాలేజీలో వసతులు ఎలా ఉన్నాయో పరిశీలించాలి. విద్యార్థుల సంఖ్యతో పోల్చినప్పుడు సగటున ఎన్ని పుస్తకాలు లైబ్రరీలో ఉన్నాయో కనుక్కోవాలి. లైబ్రరీకి 'ఈ-జర్నల్స్' ఎన్ని అందుబాటులో ఉన్నాయి? ఎంత తలసరి బ్యాండ్ విడ్త్ ఉంది? తరగతి గదిలో కంప్యూటర్లు, ప్రొజెక్టర్లు, స్క్రీన్‌లు, ఆడియో సౌకర్యం ఉందా? క్రీడల నిర్వహణ ఎలా ఉంది లాంటి అంశాలను కేవలం ఆ కాలేజీల వెబ్‌సైట్ల నుంచి మాత్రమే పొందలేం. అందుకోసం ప్రస్తుత లేదా తెలిసిన నమ్మకమైన పూర్వ విద్యార్థులతోనైనా సంభాషించడం ఉత్తమం. వీలైతే వాటి పరిశీలనకు ఆ కాలేజీని సందర్శించడం మరో మార్గం.

ఇవీ ముఖ్యమే

సంస్థ స్థితి: ఆ సంస్థకు యూనివర్సిటీ స్థాయి ఉండే పక్షంలో అక్కడ కొత్త ఆలోచనలకు, అకడమిక్ స్వేచ్ఛకు ఎక్కువ అవకాశం ఉంటుంది. ఎంతకాలంగా మనుగడలో ఉందన్నదీ ముఖ్యమే.

క్యాంపస్: పూర్తి రెసిడెన్షియల్ క్యాంపస్ అయితే నేర్చుకొనే వాతావరణం అధికంగా ఉంటుంది.

కరికులమ్: సిలబస్‌ను తరచుగా మారుస్తున్నారా? అక్కడ ఎన్ని కోర్సులు అందుబాటులో ఉన్నాయి? వంటివీ తెలుసుకోవాలి. కొన్ని సంస్థల్లో అనేక కోర్సులుంటాయి. అయితే బోధన బాగా ఉండకపోవచ్చు.

పాఠ్య ప్రణాళిక ఎంపిక: అక్కడ ఎన్ని ఎలక్టివ్స్ అందుబాటులో ఉన్నాయి? అవి ఉద్యోగాలకు పనికి వచ్చేవా లేక ఉన్నత విద్యాభ్యాసానికి ఉపకరించేవా? ఆ సంస్థలోని విద్యార్థులు ఎక్కువగా ఉన్నత విద్యకు వెళ్తున్నారంటే - అక్కడ మంచి అభ్యసన వాతావరణం ఉన్నట్లే!

పోటీ పరీక్షలు: అక్కడి విద్యార్థులు గేట్/క్యాట్ లాంటి పరీక్షల్లో చూపిన ప్రతిభనూ గమనించాలి.

మనుగడ: ఆ కాలేజీ పది పదిహేనేళ్లుగా మనుగడలో ఉంటే, దాని పూర్వ విద్యార్థుల సంఘం ఉందా? ఉంటే మంచిది. లేదంటే.. ఆ కాలేజీని వారే పట్టించుకోనప్పుడు మనం ఎంచుకోవాల్సిన అవసరం ఉందా? అనేది నిర్ణయించుకోవాలి.

క్యాంపస్ ప్లేస్‌మెంట్: దీనిని పరిగణించాల్సిందే. కానీ ఈ ఒక్కదాన్నే పరిగణనలోకి తీసుకోవడం మాత్రం సరికాదు.

విద్యార్థుల కార్యక్రమాలు: నాలుగేళ్లు కేవలం తరగతి గది, ల్యాబ్‌లకే అంకితం కాలేము. కాబట్టి ఆ కాలేజీలో ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీస్ ఎలా నిర్వహిస్తున్నారో తెలుసుకోవాలి.

విద్యార్థి భాగస్వామ్యం: కళాశాల నిర్వహణలో విద్యార్థులకు భాగస్వామ్యం కల్పిస్తే - అది వారిలోని నాయకత్వ లక్షణాలను వెలికితీస్తుంది. కాబట్టి దానినీ పరిశీలించాలి.

- ఇంత సమాచారం కనుగొనడం చాలా కష్టమని మీరు భావించవచ్చు. అయితే అన్ని కాలేజీల సమాచారం సేకరించాల్సిన అవసరం లేదు. కేవలం మీరు ఎంచుకోవాలని భావించే కాలేజీల గురించి సేకరిస్తే చాలు. అప్పుడు అదంత కష్టం కాబోదు. కాలేజీ వెబ్‌సైట్ కూడా ఈ విషయంలో తోడ్పడుతుంది. అందులో సమాచారం మరీ తక్కువగా ఉంటే ఆలోచించాలి. ప్రతి ఒక్కరిలో సహజ మేధస్సు అంతర్లీనంగా ఉంటుంది. అది వికసించేందుకు భౌతిక వాతావరణం తోడవ్వాలి. కుటుంబ నేపథ్యం, ఉత్తమ సహచర్యం, లక్ష్యం, ఆ దిశలో పయనం లాంటివి వికాసానికి తోడ్పడుతాయి తప్ప ఏదో ఒక కాలేజీలో విద్యాభ్యాసం చేయడం మూలంగానే అన్నీ సాధ్యం కావు. అలా అని కాలేజీ ప్రాధాన్యం తగ్గించలేం. మంచి కాలేజీలోనే విద్యార్థి ప్రతిభ వికసిస్తుందన్నది నిగ్గుతేలిన నిజం. విద్యార్థి దశలోనే అవగాహన, విశ్లేషణ, అన్వయం అనేవి అలవడతాయి.

చిత్రజ్యోతి
SINCE 1965

పదవుల కోసం రాజకీయాల్లోకి రాలేదు

-కమల్ హాసన్



పదవుల కోసమో, ముఖ్యమంత్రిని అవ్వాలనే కోరికతోనో రాజకీయాల్లోకి రాలేదని సినీ నటుడు, మక్కల్ నీది మయ్యం (ఎంఎన్ఎం) అధ్యక్షుడు కమల్ హాసన్ స్పష్టంచేశారు. మణిరత్నం దర్శకత్వంలో ఆయన హీరోగా నటించిన 'థగ్‌లైఫ్' చిత్రం ఆడియో రిలీజ్ కార్యక్రమంలో మాట్లాడుతూ, 'సీఎం కావాలన్న ఉద్దేశంతో రాజకీయాల్లోకి రాలేదు. రాష్ట్ర ప్రజలకు, నా అభిమానులకు సేవ చేయాలన్న ఉద్దేశంతో వచ్చాను. అనుకున్న లక్ష్యాన్ని నిదానంగా సాధిస్తాం. ఈ ప్రయాణంలో నాతో భాగమైన వారికి ధన్యవాదాలు. 'థగ్‌లైఫ్'ను ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారన్న నమ్మకం ఉంది. మేము ఒక మంచి చిత్రాన్ని నిర్మించాం. అందుకే శాటిలైట్, ఓటీటీ హక్కులు మాత్రమే విక్రయించాం. సినిమాపై ఉన్న నమ్మకంతో మేమే డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నాం. ఇలాంటి మంచి చిత్రాన్ని ప్రేక్షకులు ఆదరిస్తే, మా బేనరులో ఎన్నో గొప్ప చిత్రాలను రూపొందిస్తాం' అని పేర్కొన్నారు. -చెన్నై, ఆంధ్రజ్యోతి

ఆ నలుగురిలో నేను లేను

- అల్లు అరవింద్

"రెండు రోజుల నుంచి మీడియాలో 'ఆ నలుగురు... ఆ నలుగురు' అంటూ కొంచెం నెగిటివ్ టచ్ ఇచ్చి పదే పదే చెబుతున్నారు. 'కబంధ హస్తాలతో థియేటర్లను గుప్పిట పట్టారని అంటున్నారు. ఆ నలుగురిలో నేను లేను. ఆ నలుగురితో నాకు సంబంధం లేదు" అని నిర్మాత అల్లు అరవింద్ అన్నారు. పర్సంటేజీ విధానం అమలు చేయకుంటే జూన్ 1 నుంచి థియేటర్ల మూసివేస్తాం అంటూ ఎగ్జిబిటర్లు కొన్ని రోజుల క్రితం ప్రకటించిన విషయం తెలిసిందే. ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమా విడుదలను అడ్డుకోవడానికి తెరవెనుక కొందరు సినీ పెద్దలు ప్రయత్నిస్తున్నారనీ, ఈ నిర్ణయం వెనుక ఉన్న ఆ నలుగురిలో అల్లు అరవింద్ హస్తం ఉందంటూ మీడియాలో ఉధృతంగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తనపై వస్తున్న ఆరోపణలపై వివరణ ఇచ్చేందుకు అల్లు అరవింద్ ఆదివారం మీడియా ముందుకొచ్చారు.

"ఆ నలుగురు' అని అనడం 15 ఏళ్ల క్రితం మొదలుపెట్టారు. కొవిడ్ సమయంలోనే ఆ నలుగురి వ్యాపారంలోంచి నేను బయటకు వచ్చాను. తెలంగాణలో నాకు ఉన్న ఏకైక థియేటర్ 'ఏఏఏ'. అది తప్ప నాకు మరో థియేటర్ లేదు. అలాగే ఒక్క థియేటర్ కూడా తెలంగాణలో నాకింద లీజులో లేదు. ఆంధ్రాలో 15 థియేటర్లు లీజులో నడుపుతున్నాం. గడువు తీరాక వాటిని కూడా వదులుకోవాలనుకుంటున్నాం. పాత అలవాటు ప్రకారం అందరూ నన్ను కూడా ఆ నలుగురిలో కలుపుతున్నారు. ఇకపై దయచేసి ఆ నలుగురి గురించి చెప్పేటప్పుడు అందులో నన్ను కలపొద్దు' అని అల్లు అరవింద్ కోరారు.



ఆ సమావేశాల్లో నేను పాల్గొనలేదు

'థియేటర్ల మూసివేతపై నిర్వహించిన సమావేశాల్లో నేను పాల్గొనలేదు. 'మేం థియేటర్లు మూసేస్తున్నాం, మీరు చర్చలకు రండి' అని అనడం నాకు నచ్చలేదు. అది ఏకపక్ష నిర్ణయం. మా వాళ్లకు కూడా వెళ్లొద్దు అని చెప్పాను. ఏదైనా సమస్య ఉంటే ముందు ఛాంబర్‌లో, గిల్డ్‌లో చర్చించి పరిష్కరించుకోవాలి. కుదరకపోతే ప్రభుత్వాన్ని కూడా కలవాలి. అన్నీ దారులు మూసుకుపోతే అప్పుడు థియేటర్ల బంద్ నిర్ణయం తీసుకొని ఉండాల్సింది. అలాగే క్యూబ్‌లో నేను, యూఎఫ్‌ఓలో సురేశ్‌బాబు భాగస్వాములం కాదు' అని అల్లు అరవింద్ వివరణ ఇచ్చారు.

> మాది ప్రైవేట్ వ్యాపారం. ప్రభుత్వంతో మాకు సంబంధం లేదని కొందరు అంటున్నారు. అలాంటప్పుడు మనలో పెద్దపెద్దవాళ్లందరూ గత ప్రభుత్వంలో సీఎంను మాత్రం ఎందుకు కలవాల్సి వచ్చింది?

పవన్‌కల్యాణ్ ఆవేదనలో అర్థం ఉంది


"పవన్‌కల్యాణ్ ఆవేదనలో అర్థం ఉంది. ఆయన సినిమా వస్తుంటే మేం థియేటర్లు మూసేస్తున్నాం అనడం పవన్ కల్యాణ్‌ను బెదిరించడమే. ఆయన సినిమా విడుదలవుతున్న సమయంలో థియేటర్లను మూసేస్తాం అనే దుస్సాహసం చేయకూడదు. థియేటర్ల మూసివేతపై ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేశ్ స్పందన సమంజసమే. పవన్ కల్యాణ్ మన ఇండస్ట్రీ నుంచి వెళ్లారు. ఎవరికి ఏ సహాయం కావాలన్నా చేస్తున్నారు. అశ్వనీదత్ గారి సినిమా విడుదలైన సమయంలో టికెట్ ధరలను పెంచమని అడగడానికి మేం వెళ్లాం. 'ఛాంబర్ తరఫున వచ్చి సీఎం చంద్రబాబునాయుడు గారిని ఒకసారి కలవండి' అని ఆ సమయంలో పవన్ కల్యాణ్ చెప్పారు. ఆ తర్వాత ఏం జరిగిందో కానీ ఎవరూ ఆ విషయాన్ని పట్టించుకోలేదు. వెళ్లి కలసి ఉంటే బావుండేది" అని హితవు పలికారు.

ఓజీ విడుదల తేదీ వచ్చేసింది



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా సుజీత్ తెరకెక్కిస్తున్న చిత్రం 'ఓజీ'. డి.వి.వి.దానయ్య నిర్మిస్తున్నారు. ప్రియాంక మోహన్ కథానాయిక. బాలీవుడ్ నటుడు ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడు. ఇందులో ఓజాస్ గంభీరా అనే శక్తిమంతమైన గ్యాంగ్‌స్టర్ పాత్రలో కనిపించనున్నారు పవన్. రాజకీయాల్లో బిజీగా ఉన్న ఆయన ఇటీవలె ఈ సినిమా షూట్‌లోకి అడుగుపెట్టారు. తాజాగా, ఈ సినిమా విడుదల తేదీని ఖరారు చేశారు మేకర్స్. దసరా సందర్భంగా సెప్టెంబర్ 25న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు తెలిపారు.

ట్రాన్స్ ఆఫ్ కుబేర



నాగార్జున, ధనుశ్, రష్మిక ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'కుబేర'. శేఖర్ కమ్ముల దర్శకత్వంలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్‌రావు నిర్మిస్తున్నారు. తాజాగా, ఈ చిత్ర టీజర్‌ను 'ట్రాన్స్ ఆఫ్ కుబేర' అనే పేరుతో విడుదల చేశారు మేకర్స్. ప్రధాన పాత్రధారుల శక్తిమంతమైన లుక్స్, విజువల్స్, సంగీతం ఆకట్టుకున్నాయి. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రం పాన్ ఇండియా రేంజ్‌లో జూన్ 20న విడుదలవుతోంది.

ముగిసిన కేన్స్ వేడుక.. విజేతగా ఇరానియన్ చిత్రం



ఈ నెల 13న అట్టహాసంగా ప్రారంభమైన 78వ కేన్స్ చిత్రోత్సవం శనివారం ముగిసింది. కేన్స్‌లో అత్యుత్తమ సినీ పురస్కారమైన 'గోల్డెన్ పామ్'ని అందుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా పలు సినిమాలు పోటీపడగా... ఈ ఏడాది ఆ ఘనతను ఇరానియన్ దర్శకుడు జాఫర్ పనాహీ తెరకెక్కించిన 'ఇట్ వజ్ జస్ట్ యాన్ ఆక్సిడెంట్' చిత్రం అందుకుంది. ఈ చిత్రంలో వహీద్ మొబస్సెరీ, మరియమ్ అఫ్షారీ ప్రధాన పాత్రల్లో నటించారు. ఓ రోడ్ ట్రిప్ నేపథ్యంలో పలు మలుపులతో ఆసక్తికరంగా సాగే చిత్రమిది. 'అన్ సర్టెన్ రిగార్డ్' విభాగంలో 'మిస్టీరియస్ గేజ్ ఆఫ్ ది ఫ్లెమింగో' చిత్రం అవార్డు దక్కించుకుంది. 1980ల కాలంలో ఎయిడ్స్ వ్యాధిపై సమాజంలో ఉన్న మూఢనమ్మకాలపై పోరాడే 12 ఏళ్ల బాలిక కథాంశంతో తెరకెక్కిన ఈ సినిమా వీక్షకులను కదిలించింది. ఫ్రాన్స్ దర్శకుడు డియెగో సస్పెడెస్ తెరకెక్కించారు. అలాగే, మన దేశం నుంచి 'హోమ్ బౌండ్' అనే చిత్రం అన్‌సర్టెన్ రిగార్డ్‌లో ప్రదర్శితమైన సంగతి తెలిసిందే. ఈ ఏడాది భారత్ నుంచి ప్రదర్శనకు ఎంపికైన ఏకైక సినిమా ఇదే కావడం విశేషం. అయితే ఈ చిత్రానికి పురస్కారం దక్కలేదు. ఫ్రెంచ్ నటి జూలియట్ బినోచే.. భారతీయ దర్శకురాలు, 'ఆల్ వియ్ ఇమాజిన్ ఆజ్ లైట్' ఫేమ్ పాయల్ కపాడియా తదితరులు ఈ ఏడాది జ్యూరీ సభ్యులుగా వ్యవహరించారు.

ఈ వేడుకల ప్రారంభోత్సవంలో అలియా భట్ పాల్గొనాల్సి ఉండగా, భారత్-పాక్ ఉద్రిక్తతల నేపథ్యంలో ఆగిపోయారు. చివరి రోజు గూచి బ్రాండ్ చీరలో మెరిసి ప్రత్యేకాకర్షణగా నిలిచారు.



విజేతలు వీరే:

గోల్డెన్ పామ్: ఇట్ వజ్ జస్ట్ యాన్ ఆక్సిడెంట్ (జాఫర్ పనాహీ)
గ్రాండ్ ప్రిక్స్: ద సెంటిమెంటల్ వాల్యూ (జొవాచిమ్ ట్రియర్)
ఉత్తమ దర్శకుడు: క్లెబర్ మెన్‌డోన్సా ఫిల్హో (ద సీక్రెట్ ఏజెంట్)
ఉత్తమ నటుడు: వాఘ్నర్ మౌరా (ది సీక్రెట్ ఏజెంట్)
ఉత్తమ నటి: నదియా మెలిటీ (ది లిటిల్ సిస్టర్)
అన్‌సర్టెన్ రిగార్డ్: మిస్టీరియస్ గేజ్ ఆఫ్ ది ఫ్లెమింగో (డియెగో సస్పెడెస్)

కొత్తగా..

ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది



నూతన నటీనటులతో దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కిస్తున్న చిత్రం 'యుఫోరియా'. భూమికా చావ్లా, సారా అర్జున్, రోహిత్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇటీవలే చిత్రబృందం నిర్వహించిన కార్యక్రమంలో 'యుఫోరియా' నుంచి హై హై అంటూ సాగే గీతాన్ని విడుదల చేశారు. కిట్టు విస్సాప్రగడ సాహిత్యానికి కాలభైరవ స్వరాలు సమకూర్చడంతో పాటు పృథ్వీచంద్ర, గాయత్రీ నటరాజన్‌తో కలసి ఆలపించారు. ఈ సందర్భంగా గుణశేఖర్ మాట్లాడుతూ 'ప్రేక్షకులు చూపించే ఎనర్జీయే 'యుఫోరియా'. ఇదే ఎనర్జీ సినిమాలోనూ ఉంటుంది. యూత్‌ఫుల్ బ్యాక్‌డ్రాప్‌లో ఈ సినిమా తీస్తున్నాను. తప్పకుండా ప్రేక్షకుల్ని మెప్పిస్తుంది' అన్నారు. నిర్మాత నీలిమ గుణ మాట్లాడుతూ 'హై హై పాట అందరికీ నచ్చుతుంది. ఇదొక విభిన్న చిత్రం' అన్నారు.

థియేటర్లలో చూడాల్సిన చిత్రం



అందమైన ప్రేమకథకు మిస్టరీ ఎలిమెంట్స్ జోడించి తీసిన చిత్రం 'ఘటికాచలం'. నిఖిల్ దేవాదుల హీరోగా అమర్ కామెపల్లి దర్శకత్వం వహించారు. ఒయాసిస్ ఎంటర్‌టైన్‌మెంట్ బేనర్‌పై ఎంసీ రాజు నిర్మిస్తున్నారు. దర్శకుడు మారుతి, నిర్మాత ఎస్‌కేఎన్ విడుదల చేస్తున్నారు. ఈ నెల 31న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. శుక్రవారం ఎస్‌కేఎన్ చేతుల మీదుగా యూనిట్ ట్రైలర్‌ను ఆవిష్కరించింది. థ్రిల్లింగ్ అంశాలతో ఆద్యంతం ఉత్కంఠభరితంగా సాగే చిత్రం ఇది, థియేటర్లలోనే చూడండి అని ఎస్‌కేఎన్ కోరారు.

మ్యూజికల్ లవ్ డ్రామా



సౌమిత్‌రావు, శ్రేయాసి సేన్ జంటగా నటించిన 'నిలవే' చిత్రం పోస్టర్‌ను మేకర్స్ విడుదల చేశారు ఈ సందర్భంగా సౌమిత్ రావు మాట్లాడుతూ 'ఇది ఓ మంచి మ్యూజికల్ డ్రామా. కొత్తవాళ్లు కూడా మంచి చిత్రాలు తీస్తారు అని నిరూపించాలని మా ప్రయత్నం' అన్నారు. 'ఓ వ్యక్తి జీవితంలో జరిగే ప్రయాణమే 'నిలవే'. సంగీతాన్ని ప్రేమతో చూపించాలని అనుకున్నాం. మా సినిమాను సపోర్ట్ చేయండి అని దర్శకుడు సాయి వెన్నం కోరారు.

'బలగం' అంజన్న కన్నుమూత



బలగం సినిమాలోని అంజన్న పాత్రతో ప్రజల మనసులు గెలుచుకున్న నటుడు గుడిబోయిన బాబు అనారోగ్యంతో వరంగల్‌లోని సంరక్ష ఆస్పత్రిలో శనివారం రాత్రి ఒంటి గంటకు తుదిశ్వాస విడిచారు. రామన్నపేటలోని ఆయన నివాసంలో పలువురు నాటక, సినిమా, సాంస్కృతిక కళాకారులు, నాయకులు, స్థానికులు ఆదివారం నివాళులర్పించారు. కమెడియన్ యెల్దండి వేణు దర్శకుడిగా, దిల్ రాజు నిర్మించిన బలగం సినిమాలో హీరో ప్రియదర్శి తాతగా బాబు నటించి ఆకట్టుకున్నారు. కొంత కాలంగా కిడ్నీ సంబంధింత వ్యాధితో బాధపడుతూ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇప్పటి వరకు ఆయన 20కు పైగా సినిమాల్లో నటించారు.

-వరంగల్, (ఆంధ్రజ్యోతి)

ఆఖరాటలో అదరగొట్టినా

అట్టడుగునే..

గుజరాత్‌పై చెన్నై భారీ గెలుపు



అహ్మదాబాద్: ఐపీఎల్‌ను చెన్నై సూపర్ కింగ్స్ విజయంతో ముగించింది. ఆదివారం జరిగిన ఆఖరి లీగ్ మ్యాచ్‌లో 83 పరుగులతో టేబుల్ టాపర్ గుజరాత్ టైటాన్స్ చిత్తు చేసింది. అన్ని లీగ్ మ్యాచ్‌లను పూర్తి చేసిన ఐదుసార్లు చాంపియన్ చెన్నై కేవలం 8 పాయింట్లతో పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచింది. కాగా ఈ సీజన్‌లో నాకౌట్‌కు చేరడంలో విఫలమైన జట్టు ప్లే ఆఫ్స్‌కు చేరిన టీమ్‌ను ఓడించడం వరుసగా ఇది నాలుగోసారి.

ఇక_డెవాల్డ్ బ్రేవిస్ (23 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 57) మెరుపులకు కాన్వే (35 బంతుల్లో 6 ఫోర్లు, 2 సిక్సర్లతో 52), ఆయుష్ మాత్రే (17 బంతుల్లో 3 ఫోర్లు, 3 సిక్సర్లతో 34), ఉర్విల్ పటేల్ (19 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 37) ధనాధన్ బ్యాటింగ్ తోడవడంతో తొలుత చెన్నై 20 ఓవర్లలో 230/5 స్కోరు చేసింది. ఈ ఐపీఎల్‌లో చెన్నైకిదే అత్యధిక స్కోరు. భారీ ఛేదనలో గుజరాత్ 18.3 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌటైంది. సాయి సుదర్శన్ (41), అర్షద్ ఖాన్ (20) మాత్రమే ఓ మోస్తరుగా ఆడారు. అన్షుల్ కాంబోజ్ (3/13), స్పిన్నర్ నూర్ అహ్మద్ (3/21) చెరో 3 వికెట్లు పడగొట్టారు. బ్రేవిస్ 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచాడు.

పవర్ ప్లేలోనే తేలిపోయింది: ఫామ్‌లో ఉన్న కెప్టెన్ గిల్ (13), బట్లర్ (5), హార్డ్ హిట్టర్ రూథర్‌ఫోర్డ్ (0) విఫలమవడంతో పవర్ ప్లేలో 35/3తో గుజరాత్ ఓటమి అంచున నిలిచింది. సుదర్శన్, షారుఖ్ (19) నాలుగో వికెట్‌కు 55 రన్స్ జోడించినా.. వారిద్దరినీ జడేజా 4 బంతుల తేడాతో పెవిలియన్ చేర్చడంతో గుజరాత్ కోలుకోలేకపోయింది.

బ్యాటర్లు 'సూపర్': ఆఖరి మ్యాచ్‌లో చెన్నై బ్యాటర్లు ప్రత్యర్థి బౌలర్లను ఆడేసుకున్నారు. బ్రేవిస్, ఆయుష్ మాత్రే, ఉర్విల్ పటేల్ మెరుపు ఇన్నింగ్స్‌తో అలరించారు. మాత్రే, కాన్వే జోరుకు 3.4 ఓవర్లలోనే 44 పరుగులు చేసిన చెన్నై తిరుగులేని స్థితికి చేరింది. అర్షద్ ఖాన్ వేసిన ఇన్నింగ్స్ నాలుగో ఓవర్లో మాత్రే 2, 6, 6, 6, 4, 4తో 28 పరుగులు కొల్లగొట్టాడు. ఇదే ఓవర్లో మాత్రే నిష్క్రమించినా..కాన్వే, ఉర్విల్ ఏమాత్రం తగ్గకుండా రెండో వికెట్‌కు 63 పరుగులు జోడించారు. 10వ ఓవర్లో రషీద్ ఖాన్ బౌలింగ్‌లో ఉర్విల్ కొట్టిన సిక్సర్ మ్యాచ్‌కే హైలైట్. ఆ వెంటనే ఉర్విల్ అవుటైనా కాన్వే ఎదురు దాడి కొనసాగించి హాఫ్ సెంచరీ పూర్తి చేశాడు. కాన్వేను రషీద్ బౌల్డ్ చేయగా అనంతరం గుజరాత్ బౌలర్లకు చుక్కలు చూపిన బ్రేవిస్ ఐదో వికెట్‌కు జడేజా (21)తో కలిసి 39 బంతుల్లోనే 74 పరుగులు జత చేశాడు. ఈ క్రమంలో బ్రేవిస్ 19 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు.

నేటి మ్యాచ్ — వేదిక: జైపూర్
పంజాబ్ x ముంబై — రా.7.30 నుంచి

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	నె.రరే
గుజరాత్	14	9	5	0	18	0.254
పంజాబ్	13	8	4	1	17	0.327
బెంగళూరు	13	8	4	1	17	0.255
ముంబై	13	8	5	0	16	1.292
ఢిల్లీ	14	7	6	1	15	0.011
హైదరాబాద్	14	6	7	1	13	-0.241
లఖ్‌నవూ	13	6	7	0	12	-0.337
కోల్‌కతా	14	5	7	2	12	-0.305
రాజస్థాన్	14	4	10	0	8	-0.549
చెన్నై	14	4	10	0	8	-0.647

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; ఫ.తే: ఫలితం తేలనివి; పా: పాయింట్లు; నె.రరే: నెట్ రన్‌రేట్

స్కోరుబోర్డు

చెన్నై: ఆయుష్ మాత్రే (సి) సిరాజ్ (బి) ప్రసిద్ధ్ 34, కాన్వే (బి) రషీద్ 52, ఉర్విల్ పటేల్ (సి) గిల్ (బి) సాయికిషోర్ 37, శివమ్ దూబే (సి) కొట్జీ (బి) షారుఖ్ 17, బ్రేవిస్ (సి) బట్లర్ (బి) ప్రసిద్ధ్ 57, జడేజా (నాటౌట్) 21, **ఎక్స్‌ట్రాలు : 12 ; మొత్తం 20 ఓవర్లలో 230/5 ; వికెట్ల పతనం :** 1-44, 2-107, 3-144, 4-156, 5-230 ; **బౌలింగ్:** సిరాజ్ 4-0-47-0, అర్షద్ ఖాన్ 2-0-42-0, ప్రసిద్ధ్ 4-0-22-2, కొట్జీ 3-0-34-0, సాయి కిషోర్ 2-0-23-1, రషీద్ ఖాన్ 4-0-42-1, షారుఖ్ ఖాన్ 1-0-13-1

గుజరాత్: సాయి సుదర్శన్ (సి) శివమ్ దూబే (బి) జడేజా 41, గిల్ (సి) ఉర్విల్ (బి) అన్షుల్ కాంబోజ్ 13, బట్లర్ (సి) అన్షుల్ (బి) ఖలీల్ 5, రూథర్‌ఫోర్డ్ (సి) మాత్రే (బి) అన్షుల్ 0, షారుఖ్ ఖాన్ (సి) పథిరన (బి) జడేజా 19, తెవాటియా (సి) శివమ్ దూబే (బి) నూర్ అహ్మద్ 14, రషీద్ (సి) ఉర్విల్ (బి) నూర్ అహ్మద్ 12, కొట్జీ (బి) పథిరన 5, అర్షద్ ఖాన్ (బి) నూర్ అహ్మద్ 20, సాయి కిషోర్ (సి) ధోనీ (బి) అన్షుల్ 3, సిరాజ్ (నాటౌట్) 3, **ఎక్స్‌ట్రాలు : 12 ; మొత్తం 18.3 ఓవర్లలో 147 ఆలౌట్ ; వికెట్ల పతనం :** 1-24, 2-29, 3-30, 4-85, 5-86, 6-105, 7-110, 8-126, 9-142 ; **బౌలింగ్:** జడేజా 3-0-17-2, ఖలీల్ అహ్మద్ 3-0-17-1, అన్షుల్ కాంబోజ్ 2.3-0-13-3, శివమ్ దూబే 2-0-33-0, నూర్ అహ్మద్ 4-0-21-3, పథిరన 3-0-29-1, దీపక్ హుడా 1-0-15-0.

స్పోర్ట్స్

విజయంతో.. వీడ్కోలు

● చివరి పోరులో సన్‌రైజర్స్ విజృంభణ
● క్లాసెన్, హెడ్ సుడిగాలి ఇన్నింగ్స్
● 110 పరుగులతో కోల్‌కతా చిత్తు



న్యూఢిల్లీ: క్లాసెన్ (39 బంతుల్లో 7 ఫోర్లు, 9 సిక్సర్లతో 105 నాటౌట్) విధ్వంసక శతకంతో.. ఐపీఎల్ చరిత్రలో మూడో అత్యధిక స్కోరు నమోదు చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్.. ఈ సీజన్‌ను ఘన విజయంతో ముగించింది. ఆదివారం జరిగిన తమ ఆఖరి, నామమాత్రపు మ్యాచ్‌లో సన్‌రైజర్స్ 110 పరుగుల తేడాతో డిఫెండింగ్ చాంప్ కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను చిత్తు చేసింది. తొలుత సన్‌రైజర్స్ 20 ఓవర్లలో 278/3 స్కోరు చేసింది. ట్రావిస్ హెడ్ (40 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 76) దూకుడైన హాఫ్ సెంచరీ నమోదు చేశాడు. నరైన్ రెండు వికెట్లు పడగొట్టాడు. ఛేదనలో కోల్‌కతా 18.4 ఓవర్లలో 168 పరుగులకే ఆలౌటైంది. మనీష్ పాండే (37), హర్షిత్ రాణా (34), నరైన్ (31) మినహా ఎవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేదు. ఉనాద్కట్, మలింగ, హర్ష్ దూబే తలో మూడు వికెట్లు పడగొట్టారు. క్లాసెన్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

బాదుడే.. బాదుడు..: ఆరంభంలో హెడ్.. ఆ తర్వాత క్లాసెన్ ఊచకోతతో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న సన్‌రైజర్స్ కొండంత స్కోరు చేసింది. ఓపెనర్ అభిషేక్ (32)తో కలసి తొలి వికెట్‌కు 92 పరుగులు జోడించిన హెడ్.. క్లాసెన్‌తో కలసి రెండో వికెట్‌కు 83 పరుగుల భాగస్వామ్యంతో భారీ స్కోరుకు బాటలు వేశాడు. ఆ తర్వాత క్లాసెన్, ఇషాన్ కిషన్ (29) మూడో వికెట్‌కు 36 బంతుల్లో 83 పరుగులు జతచేర్చి ఫినిషింగ్ టచ్ ఇచ్చారు. పవర్‌ప్లేలో హెడ్ శివాలెత్తడంతో స్కోరు బోర్డు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. ఆరు ఓవర్లకు సన్‌రైజర్స్ 79/0తో నిలిచింది. అయితే, ఏడో ఓవర్‌లో నరైన్ బౌలింగ్‌లో అభిషేక్ అవుటయ్యాడు. హెడ్‌కు తోడు క్లాసెన్ కూడా ఆకాశమే హద్దుగా చెలరేగడంతో 8వ ఓవర్‌లోనే జట్టు స్కోరు సెంచరీ దాటింది. దూకుడుగా ఆడుతున్న హెడ్‌ను నరైన్ అవుట్ చేసినా.. జోరు తగ్గని క్లాసెన్ 15వ ఓవర్‌లో రెండు సిక్సర్లతో స్కోరును 200 దాటించాడు. డెత్ ఓవర్లలో క్లాసెన్, ఇషాన్ కోల్‌కతా బౌలర్లకు చుక్కలు కనిపించాయి. అయితే కిషన్‌ను అరోరా అవుట్ చేశాడు. సెంచరీ పూర్తి చేసుకొన్న క్లాసెన్ బౌండ్రీతో టీమ్ స్కోరును 280 మార్క్‌కు చేరువ చేశాడు. 37 బంతుల్లో సెంచరీ పూర్తిచేసిన క్లాసెన్.. 2010 సీజన్‌లో ఇన్నే బంతుల్లో శతకబాదిన యూసుఫ్ పఠాన్ రికార్డును సమం చేశాడు. ఐపీఎల్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ క్రిస్ గేల్ (30) పేరిట ఉంది.

స్కోరుబోర్డు

సన్‌రైజర్స్: అభిషేక్ (సి) రింకూ (బి) నరైన్ 32, హెడ్ (సి) రస్సెల్ (బి) నరైన్ 76, క్లాసెన్ (నాటౌట్) 105, ఇషాన్ (సి) నోకియా (బి) అరోరా 29, అనికేత్ (నాటౌట్) 12, **ఎక్స్‌ట్రాలు: 24; మొత్తం: 20 ఓవర్లలో 278/3; వికెట్ల పతనం:** 1-92, 2-175, 3-258; **బౌలింగ్:** వైభవ్ 4-0-39-1, నోకియా 4-0-60-0, హర్షిత్ 3-0-40-0, నరైన్ 4-0-42-2, వరుణ్ 3-0-54-0, రస్సెల్ 2-0-34-0.

కోల్‌కతా: డికాక్ (సి) మనోహర్ (బి) మలింగ 9, నరైన్ (బి) ఉనాద్కట్ 31, రహానె (సి) అభిషేక్ (బి) ఉనాద్కట్ 15, రఘువంశీ (సి) నితీశ్ (బి) మలింగ 14, రింకూ (సి) నితీశ్ (బి) హర్ష్ దూబే 9, రస్సెల్ (ఎల్బీ) హర్ష్ దూబే 0, మనీష్ పాండే (సి) మనోహర్ (బి) ఉనాద్కట్ 37, రమణ్‌దీప్ (బి) హర్ష్ దూబే 13, హర్షిత్ రాణా (సి అండ్ బి) మలింగ 34, వైభవ్ అరోరా (రనౌట్) 0, నోకియా (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 6; మొత్తం: 18.4 ఓవర్లలో 168 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-37, 2-55, 3-61, 4-70, 5-70, 6-95, 7-110, 8-162, 9-162, 10-168; **బౌలింగ్:** కమిన్స్ 2-0-25-0, ఉనాద్కట్ 4-0-24-3, హర్షల్ 2-0-21-0, మలింగ 3.4-0-31-3, హర్ష్ దూబే 4-0-34-3, నితీశ్ 1-0-6-0, అభిషేక్ శర్మ 2-0-25-0.

రన్నరప్.. శ్రీకాంత్

మలేసియా మాస్టర్స్ ఫైనల్లో ఓటమి



కౌలాలంపూర్: ఆరేళ్ల తర్వాత తొలిసారి బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్‌లో ఫైనల్ చేరిన భారత వెటరన్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్.. టైటిల్ ఫైట్‌లో తడబడ్డాడు. మలేసియా మాస్టర్స్ సూపర్-500 టోర్నీలో శ్రీకాంత్ రన్నరప్‌గా నిలిచాడు. ఆదివారం జరిగిన ఫైనల్లో శ్రీకాంత్ 11-21, 9-21తో వరల్డ్ నెం:4 లి షి ఫెంగ్ (చైనా) చేతిలో చిత్తయ్యాడు.

నార్వే చెస్ నేటి నుంచే

న్యూఢిల్లీ: చదరంగ క్రీడలో ప్రతిష్ఠాత్మకమైన నార్వే చెస్ టోర్నమెంట్ సోమవారం మొదలవనుంది. పురుషులు, మహిళల విభాగాల నుంచి ఆరుగురు అత్యుత్తమ క్రీడాకారుల మధ్య ఈ టోర్నీ జరగనుంది. భారత్ తరఫున పురుషుల కేటగిరిలో ప్రపంచ చాంపియన్ గుకేష్‌తో పాటు అర్జున్.. మహిళల్లో హంపి, వైశాలి తలపడుతున్నారు.

'ఫ్రెంచ్‌మ్యాన్'లా ఆదరించారు

సన్మాన వేడుకలో నడాల్ భావోద్వేగం





పారిస్: దాదాపు రెండు దశాబ్దాల పాటు అద్భుతమైన ఆటతో అభిమానులను ఉర్రూతలూగించి, గతేడాదే టెన్నిస్‌కు వీడ్కోలు పలికిన రఫెల్ నడాల్‌కు తనకు అచ్చొచ్చిన ఎర్రమట్టిలో ఘన సన్మానం జరిగింది. మరెవరికీ సాధ్యంకాని రీతిలో, ఏకంగా 14 సార్లు ఫ్రెంచ్ ఓపెన్ కిరీటాన్ని అందుకున్న ఈ మట్టి వీరుడికి రోలాండ్‌గారోస్ నిర్వాహకులు అద్భుతరీతిలో సత్కరించారు. ఫ్రెంచ్ ఓపెన్ తొలిరోజు పోటీల సందర్భంగా ఆదివారం 'రఫా..రఫా' అంటూ ప్రేక్షకుల హర్షధ్వానాల మధ్య నడాల్ మెయిన్ కోర్టులోకి అడుగుపెట్టాడు. అనంతరం తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్న రఫా..'అందరికీ నమస్కారాలు. 20 ఏళ్లపాటు ఈ కోర్టులో ఆడిన నాకు ఇప్పుడు ఎక్కడి నుంచి మొదలుపెట్టాలో కూడా తెలియడం లేదు. నిస్సందేహంగా ఈ వేదిక నాకెంతో ప్రత్యేకమైనది. థాంక్యూ ఫ్రాన్స్.. థాంక్యూ పారిస్.. నేనెన్నడూ ఊహించలేని మరపురాని క్షణాలు, మధురమైన అనుభూతులు ఇక్కడ నాకు పంచారు. మీ ఫ్రెంచ్‌మ్యాన్‌లా నన్ను ఆదరించారు' అని అన్నాడు. అనంతరం తన సమకాలీనులైన ఫెడరర్, జొకోవిచ్, ముర్రేలతో కలిసి నడాల్ ఫొటోలకు పోజిచ్చాడు. కార్యక్రమంలో నడాల్ తల్లిదండ్రులు, భార్య, రెండేళ్ల కుమారుడు హాజరయ్యారు.

సబలెంక శుభారంభం

ఫ్రెంచ్ ఓపెన్

పారిస్: ఫ్రెంచ్ ఓపెన్‌లో తొలిరోజు స్టార్ ప్లేయర్లు శుభారంభం చేశారు. మహిళల టాప్‌సీడ్ సబలెంక, 8వ సీడ్ కిన్వెన్ జెంగ్, 11వ సీడ్ డయానా ష్నిదెర్, 13వ సీడ్ స్విటోలినా రెండోరౌండ్‌లో ప్రవేశించారు. క్లే కోర్టులో తొలి గ్రాండ్‌స్లామ్ కోసం ఎదురుచూస్తున్న సబలెంక 6-1, 6-0తో రఖిమోవాను చిత్తుచేసింది. చైనా స్టార్ కిన్వెన్ 6-4, 6-3తో పావ్ల్యుచెన్‌కోవాపై, ష్నిదెర్ 7-6 (3), 6-2తో సాబొలెవాపై, స్విటోలినా 6-1, 6-1తో సోమ్నెజ్‌పై నెగ్గారు. క్విటోవా 6-3, 0-6, 4-6తో గోల్‌బిచ్ చేతిలో పోరాడి ఓడింది.

25400 పైన బుల్లిష్

(మే 26-30 తేదీల మధ్య వారానికి)


డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

అస్ట్రో ట్రెండ్

గత వారం నిఫ్టీ: 24853 (-167)

నిఫ్టీ గత వారం 24450-25009 పాయింట్ల మధ్యన కదలాడి 167 పాయింట్ల నష్టంతో 24853 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 25400 కన్నా పైన ముగిస్తే స్వల్పకాలానికి బుల్లిష్ అవుతుంది.

- 20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 24737, 24828, 24647, 23279 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి.

బ్రేకౌట్ స్థాయి: 25250 **బ్రేక్‌డౌన్ స్థాయి:** 24550
నిరోధ స్థాయిలు: 25050, 25150, 25250 (24950 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు: 24650, 24550, 24450 (24750 దిగువన బేరిష్)

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	120	విజయవాడ	119
వరంగల్	120	గుంటూరు	122
కరీంనగర్	120	ఒంగోలు	122
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	100
కర్నూలు	120	నెల్లూరు	105
విశాఖపట్నం	116	అనంతపురం	105
గోదావరి	119		

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



26వ తేదీ			
హైదరాబాద్	505	విజయవాడ	510
వరంగల్	507	గోదావరి	495
చిత్తూరు	603	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	

సైబర్ కేటుగాళ్లపై ఉమ్మడి యుద్ధం

టెల్కోలకు ఎయిర్‌టెల్ ప్రతిపాదన



న్యూఢిల్లీ: సైబర్ నేరాల కట్టడికి టెలికం కంపెనీలు ముందుకొస్తున్నాయి. తమ నెట్‌వర్క్‌ల ద్వారా జరిగే సైబర్ నేరాలు, మోసాలు, కుంభకోణాలను కట్టడి చేసేందుకు రిలయన్స్ జియో, వొడాఫోన్ ఐడియాతో కలిసి పని చేసేందుకు ఎయిర్‌టెల్ సంసిద్ధత వ్యక్తం చేసింది. దీనికి సంబంధించి ఈ రెండు కంపెనీలకు ఒక ప్రతిపాదన చేసినట్టు టెలికం శాఖ (డాట్), ట్రాయ్‌కు తెలిపింది. సైబర్ కేటుగాళ్ల చేతుల్లో మోసపోతున్న వినియోగదారుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ఇందుకోసం అందరం కలిసి పని చేద్దామని రెండు కంపెనీలకు విడి విడిగా లేఖలు రాసింది. గత ఏడాది తొలి తొమ్మిది నెలల్లోనే సైబర్ కేటుగాళ్లు వివిధ రకాల మోసాలతో అమాయక వినియోగదారుల నుంచి రూ.11,000 కోట్లకుపైగా కొల్లగొట్టడంతో దేశవ్యాప్తంగా పోలీసుల వద్ద 17 లక్షలకుపైగా కేసులు నమోదైన విషయాన్ని ఎయిర్‌టెల్ ఆ లేఖలో గుర్తు చేసింది.

తెలివి మీరిన మోసగాళ్లు

డిజిటల్ పేమెంట్స్ పెరిగిపోవడంతో సైబర్ నేరగాళ్లు మరింతగా రెచ్చిపోతున్నారు. టెక్నాలజీ కూడా ఇందుకు కలిసి వస్తోంది. టెలికం ఖాతాదారుల ఇమెయిల్స్, మొబైల్ నంబర్లు సేకరించి ఫిషింగ్, స్పామ్‌ల ద్వారా వారి బ్యాంకు ఖాతాలు కొల్లగొడుతున్నారు. ఇంకొందరు నకిలీ లోన్ ఆఫర్లు, మోసపూరిత పేమెంట్స్ పేరుతో టోపీ పెడుతున్నారు. కృత్రిమ మేధ (ఏఐ) కూడా వీరికి తోడవడంతో అచ్చం ఖాతాదారుల వాయిస్‌ను అనుకరిస్తూ బంధుమిత్రులతో మాట్లాడుతూ అందినకాడికి దోచుకుంటున్నారు. దీంతో ఎయిర్‌టెల్ ఇటీవల తన ఫ్రాడ్ డిటెక్షన్ సొల్యూషన్స్‌ను పటిష్ఠం చేసింది. ఓటీటీ యాప్స్, వాట్సప్, టెలిగ్రాం, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రాం వంటి ప్లాట్‌ఫామ్స్ ద్వారా వచ్చే అనేక నకిలీ వెబ్‌సైట్లను బ్లాక్ చేసింది. అయితే సైబర్ నేరగాళ్లు రోజు రోజుకీ అధునాతన టెక్నాలజీతో రెచ్చిపోతున్నందున టెల్కోలన్నీ కలిసికట్టుగా వారి ఆటకట్టించడం మేలని ఎయిర్‌టెల్ తన లేఖలో పేర్కొంది.

జీతం తక్కువైనా నో ఫికర్

» దీర్ఘకాలిక ప్రయోజనాలుంటే ఓకే
» ఉద్యోగుల మనోగతం

ముంబై: వేతనం కాస్తంత తక్కువైనా సరే..దీర్ఘకాలిక ప్రయోజనాలు కల్పించినట్టయితే మాకు ఓకే అంటున్నారు ఇప్పుడు ఉద్యోగులు. ఒక పక్క జీవన ప్రమాణ ఒత్తిడులు నానాటికీ పెరిగిపోతుంటే మరో పక్క ఉద్యోగులపై కంపెనీల అంచనాలు కూడా పెరిగిపోయిన నేపథ్యంలో వారి ప్రాధాన్యతల్లో మార్పు వచ్చినట్టు ఒక సర్వేలో తేలింది. హెచ్ఆర్ సర్వీసులందించే జీనియస్ కన్సల్టెంట్స్ నిర్వహించిన సర్వేలో 74 శాతం మంది ఇదే అభిప్రాయం ప్రకటించారు. ఆరోగ్యబీమా, రిటైర్మెంట్ ప్లానింగ్, పిల్లల విద్యకు మద్దతు వంటి దీర్ఘకాలిక ప్రయోజనాలున్నట్టయితే వేతనం కాస్తంత తక్కువైనా తమకు సమ్మతమేనని వారు తేల్చి చెప్పారు. 1139 మంది ఉద్యోగులను సర్వేలో భాగంగా ప్రశ్నించారు. వారిలో కేవలం 32 శాతం మంది తమకు అందిస్తున్న ప్రయోజనాలు తమ సంక్షేమానికి మద్దతు ఇచ్చేవిగా ఉన్నాయని చెప్పగా 61 శాతం మంది ఆ ప్రయోజనాలు చాలవన్న అభిప్రాయం ప్రకటించారు. అయితే 54 శాతం మంది తమ కంపెనీ ఉద్యోగుల మానసిక, ఆర్థిక స్వస్థతకు ప్రాధాన్యం ఇవ్వడంలేదన్నారు. పని తీరు ఆధారిత బోనస్‌లు, ప్రోత్సాహకాలు తమ ఆర్థిక ఒత్తిడులు తగ్గేందుకు దోహదపడతాయని 73 శాతం మంది అంగీకరించారు.

అపోలో మైక్రో సిస్టమ్స్ రికార్డు లాభం

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): అపోలో మైక్రోసిస్టమ్స్ కంపెనీ 2025 ఆర్థిక సంవత్సరంలో రికార్డు ఆదాయం, లాభాలు ప్రకటించింది. ముందు ఏడాదితో పోల్చితే ఆదాయం 51 శాతం పెరిగి రూ.372 కోట్ల నుంచి రూ.562 కోట్లకు చేరింది. నికరలాభం అయితే 81 శాతం వృద్ధితో రూ.56 కోట్లుగా నమోదయింది. మార్చి 31వ తేదీతో ముగిసిన నాలుగో త్రైమాసికంలో రూ.162.50 కోట్ల మొత్తం ఆదాయంపై రూ.13.96 కోట్ల నికరలాభం ఆర్జించింది. 2025 ఆర్థిక సంవత్సరం తమ కంపెనీ చరిత్రలో ప్రత్యేకమైనదని కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ బద్దం కరుణాకర్ రెడ్డి అన్నారు. ప్రధానంగా ఐడీఎల్ ఎక్స్‌ప్లోజివ్స్ కొనుగోలు ఒక కీలక మైలురాయి అని చెప్పారు. ఇది తమను రక్షణ రంగానికి చెందిన సమీకృత టయర్-1 ఓఈఎంగా మార్చుతుందన్నారు. రాబోయే రెండేళ్ల కాలంలో తాము ఆదాయంలో 45-50 శాతం సంచిత వార్షిక వృద్ధిని (సీఏజీఆర్) ఆశిస్తున్నామని చెప్పారు.

బిజినెస్

ఈ వారం నాలుగు ఐపీఓలు

రూ.6,600 కోట్ల సమీకరణ

న్యూఢిల్లీ: ఐపీఓ మార్కెట్ మళ్లీ పుంజుకుంటోంది. ఈ వారం రూ.6,600 కోట్లు సమీకరించేందుకు నాలుగు కంపెనీలు ఐపీఓలు జారీ చేస్తున్నాయి. ఇందులో లీలా ప్యాలెస్ హోటల్స్, ఏజీస్ ఒపాక్ టెర్మినల్స్, ప్రోస్టార్ ఇన్ఫోసిస్టమ్స్, స్కోడా ట్యూబ్స్ ఉన్నాయి. ఇవి గాక గత వారం ఐపీఓలు జారీ చేసిన బొరానా వేవ్స్, బెల్‌రైస్ ఇండస్ట్రీస్ కంపెనీల షేర్లు ఈ నెల 28, 29 తేదీల్లో లిస్టు కాబోతున్నాయి. మొత్తంమీద గత ఏడాదితో పోలిస్తే ఈ సంవత్సరం ఐపీఓ మార్కెట్ జోరు తగ్గిందనే చెప్పాలి.

డాక్టర్ రెడ్డీస్‌కు ఎఫ్‌డీఏ అభ్యంతర పత్రం

న్యూఢిల్లీ: డాక్టర్ రెడ్డీస్ తెలంగాణ ప్లాంట్‌పై అమెరికన్ ఎఫ్‌డీఏ ఫారం 483 జారీ చేసింది. మిర్యాలగుడాలో ఉన్న ఈ ఏపీఐ ప్లాంట్‌ను ఎఫ్‌డీఏ బృందం గత సోమవారం నుంచి శనివారం వరకు తనిఖీ చేసి కొన్ని ఉల్లంఘనలను గుర్తించింది. వారు గుర్తించిన లోపాలను నిర్దిష్ట గడువులోగా సరిదిద్దుతామని డాక్టర్ రెడ్డీస్ తెలిపింది.

ఎన్ఎస్‌డీఎల్ లాభం రూ.83 కోట్లు

న్యూఢిల్లీ: త్వరలో పబ్లిక్ ఇష్యూకి రానున్న నేషనల్ సెక్యూరిటీస్ డిపాజిటరీ లిమిటెడ్ (ఎన్ఎస్‌డీఎల్) ఈ ఏడాది మార్చితో ముగిసిన నాలుగో త్రైమాసికానికి రూ.83.3 కోట్ల కన్సాలిడేటెడ్ నికరలాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో నమోదు చేసిన రూ.79.5 కోట్లతో పోలిస్తే ఇది 4.77 శాతం ఎక్కువ. ఇదే సమయంలో కంపెనీ ఆదాయం 9.94 శాతం పెరిగి రూ.394 కోట్లకు చేరింది.

ఆచితూచి వ్యవహరించడమే మేలు

ఈ వారం సైతం దేశీయ స్టాక్‌మార్కెట్‌లో ఆటుపోట్లు తప్పేలా లేవు. సూచీల గమనానికి అంతర్జాతీయ సంకేతాలే కీలకం కానున్నాయి. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మళ్లీ సుంకాల హెచ్చరికలకు దిగడం మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో మదుపరులు ఆచితూచి వ్యవహరించడమే మంచిది. గత వారం రియల్టీ, పీఎస్‌యూ, డిఫెన్స్, బ్యాంకింగ్ షేర్లు బాగా రాణించాయి. ఎఫ్ఎంసీజీ, ఆటో, టూరిజం, ఐటీ, చమురు కంపెనీల షేర్లు మాత్రం నిరాశపరిచాయి. దీంతో గత వారం నిఫ్టీ సగం నష్టాలను మాత్రమే పూడ్చుకుంది.

స్టాక్ రికమండేషన్లు

యాక్సిస్ బ్యాంక్: గత మూడు నెలల్లో యాక్సిస్ బ్యాంక్ షేర్లు 18 శాతం మేర పెరిగాయి. ప్రస్తుతం కన్సాలిడేషన్ దశలో ఉన్నాయి. ఆటుపోట్లు కూడా క్రమంగా తగ్గి, ప్రైస్ యాక్షన్, మూమెంటం పుంజుకుంది. గత వారం రూ.1,210 వద్ద ముగిసిన ఈ షేరు 21 రోజుల ఈఎంఏ వద్ద మద్దతు తీసుకుంది. రూ.1,260/1,320 టార్గెట్ ధరతో ఈ కౌంటర్లో రూ.1,200 స్థాయిలో పొజిషన్లు తీసుకోవచ్చు.

స్టాప్‌లాస్: రూ.1,175

ఎస్‌బీఐ లైఫ్: ప్రస్తుతం ఈ కౌంటర్ చాలా బలంగా కనిపిస్తోంది. షార్ట్, మీడియం, లాంగ్ టర్మ్ మూమెంటం బాగుంది. నిఫ్టీతో పోలిస్తే మెరుగ్గా రాణిస్తోంది. గత వారం 2.2 శాతం లాభంతో రూ.1,798 వద్ద ముగిసింది. రూ.1,885 టార్గెట్‌తో రూ.1,780-1,790 మధ్య మదుపరులు ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు.

స్టాప్‌లాస్: రూ..1,760

సీడీఎస్ఎల్: గత వారం సీడీఎస్ఎల్ షేర్లు రూ.1,462 వద్ద ముగిశాయి. గత ఏడాది డిసెంబరు నుంచి దిద్దుబాటులో ఉన్న ఈ షేర్లు ప్రస్తుతం కన్సాలిడేషన్ చివరి దశకు చేరుకున్నాయి. గత ఐదు సెషన్స్‌లో ప్రైస్ యాక్షన్ టైట్‌గా సాగింది. రిలెటివ్ స్ట్రెంత్, మూమెంటమ్ బాగున్నాయి. రూ.1,520/1,580 టార్గెట్‌తో మదుపరులు రూ.1,450 స్థాయిలో ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు.

స్టాప్‌లాస్ : రూ.1,425ను

హెచ్‌సీఎల్ టెక్: జనవరి నుంచి దిద్దుబాటులో ఉన్న ఈ కంపెనీ షేర్లు ప్రస్తుతం కీలక స్థాయికి చేరాయి. 20, 50 రోజుల ఈఎంఏ వద్ద మద్దతు తీసుకుని అక్కడే చలిస్తున్నాయి. మూమెంటం సైతం బాగుంది. గత వారం రూ.1,648 వద్ద ముగిసిన ఈ కౌంటర్లో మదుపరులు రూ.1,690/1,729 టార్గెట్‌తో రూ.1,640 వద్ద పొజిషన్లు తీసుకోవచ్చు.

స్టాప్‌లాస్ : రూ.1,610

కోల్ ఇండియా: గత ఏడాదిగా పతనమవుతున్న ఈ కంపెనీ షేర్లు ఈ ఏడాది జనవరి నుంచి అక్యుములేషన్ దశకు చేరుకున్నాయి. గత వారం రూ.401 వద్ద ముగిశాయి. ప్రస్తుతం 20, 50 రోజుల ఈఎంఏ పై స్థాయిలో ట్రేడవుతున్నాయి. మూమెంటం కూడా బాగుంది. రూ.440/470 టార్గెట్‌తో మదుపరులు రూ.380/390 మధ్య ఈ కౌంటర్లో పొజిషన్లు తీసుకోవచ్చు.

స్టాప్‌లాస్ : రూ.360

- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్
+91 98855 59709
niftymasterlive@gmail.com



నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.

25,000 పైన నిలకడ తప్పనిసరి

టెక్ వ్యూ


వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం తీవ్ర ఊగిసలాటల మధ్యన ట్రేడయి 24,850 వద్ద ముగిసింది. గత కొద్ది వారాలుగా 25,000 స్థాయిలో సైడ్‌వేస్, ఆటుపోట్ల ధోరణిలో ట్రేడవుతోంది. గత రెండు వారాలుగా 25,000 స్థాయిలో ఎన్నో రియాక్షన్లు సాధిస్తున్నప్పటికీ దిగువ స్థాయిల్లో పునరుజ్జీవం కూడా సాధిస్తోంది. ఇది పాజిటివ్ ట్రెండ్ సంకేతం. ప్రధాన ట్రెండ్ ఇప్పటికీ పాజిటివ్‌గానే ఉంది. ఈ వారంలో మార్కెట్ అప్రమత్తంగా ప్రారంభమై కీలక మానసిక అవధి 25,000 స్థాయిలో పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: గత వారం మార్కెట్లో కదలికలు పరిమిత పరిధిలోనే ఉన్నాయి. స్వల్పకాలిక అప్‌ట్రెండ్ మరింతగా కొనసాగించాలంటే ఈ వారంలో 25,000 కన్నా పైన నిలదొక్కుకోవడం తప్పనిసరి. ఆ పైన మరో నిరోధం 25,250.

బేరిష్ స్థాయిలు: బలహీనతకు లోనైనా మైనర్ మద్దతు స్థాయి 24,700 వద్ద నిలదొక్కుకుని తీరాలి. ప్రధాన స్వల్పకాలిక మద్దతు స్థాయి 24,500. గత వారం ఇక్కడే మద్దతు తీసుకున్నందు వల్ల ఇక్కడ విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశించే ముప్పు ఏర్పడుతుంది.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత ఐదు వారాలుగా కీలక స్థాయి 55,000 వద్ద సైడ్‌వేస్ ధోరణి ప్రదర్శించింది. అయితే గత వారం కేవలం 45 పాయింట్ల లాభంతో 55,400 వద్ద ముగిసింది. తదుపరి నిరోధం 55,700. ప్రధాన నిరోధం 56,100 (ఆల్‌టైమ్ గరిష్ఠం). ఆ పైన మాత్రమే మరింత అప్‌ట్రెండ్ ఉంటుంది. ప్రస్తుత మద్దతు స్థాయి 55,000 వద్ద విఫలమైతే మరింత బలహీనపడుతుంది.

పాటర్న్: గత రెండు వారాల్లో 25,000 స్థాయిలో డబుల్ టాప్ పాటర్న్ ఏర్పడడం సానుకూల సంకేతం. గత వారంలో మార్కెట్ 25 డీఎంఏ కన్నా పైన నిలదొక్కుకుంది. ప్రస్తుతం 25,000 స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన రెసిస్టెన్స్ ట్రెండ్‌లైన్" కన్నా పైన నిలదొక్కుకోవాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం మంగళవారం మైనర్ రివర్సల్ ఉండవచ్చు. అలాగే ఈ వారంలో స్వల్పకాలిక రివర్సల్‌కు కూడా ఆస్కారం ఉంది.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24940, 25000
మద్దతు	24770, 24700

పదవుల కోసం విలువలు వదిలేస్తున్న కాలమిది

- ఎవరినైనా తొక్కుకుంటూ ముందుకు వెళ్లడానికి సిద్ధపడుతున్న రోజులివి
- కవి నందిని సిధారెడ్డి అభినందన సభలో హరీశ్ రావు

హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మే 25(ఆంధ్రజ్యోతి): పదవులు, హోదాల కోసం విలువలను వదిలేసి, అవసరమైతే ఎవరినైనా తొక్కుకుంటూ ముందుకు వెళ్లడానికి సిద్ధపడుతున్న ఈ రోజుల్లో తెలంగాణ ఉద్యమం కోసం ప్రిన్సిపాల్ పదోన్నతిని త్యాగం చేసిన నిజాయితీ నందిని సిధారెడ్డి సొంతమని మాజీ మంత్రి హరీశ్ రావు కొనియాడారు. కవి, తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు నందిని సిధారెడ్డి 70 వసంతాల సందర్భంగా ఏడు పదుల వెన్నెల పేరుతో ఆదివారం నగరంలోని ఓ హోటల్‌లో జరిగిన అభినందన సభకు హరీశ్ రావు ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేసీఆర్ హయాంలో సిధారెడ్డి నేతృత్వంలో తెలంగాణకు వన్నె తెచ్చేలా ప్రపంచ తెలుగు మహా సభలు నిర్వహిస్తే, రేవంత్ పాలనలో ప్రపంచ అందగత్తెల పోటీలు జరుగుతున్నాయంటూ హరీశ్ రావు ఎద్దేవా చేశారు. తెలంగాణ తల్లి స్వరూపాన్ని మార్చడాన్ని నిరసిస్తూ... సాహిత్య పురస్కారంగా కోటి రూపాయల నగదు, హైదరాబాద్‌లో 300 గజాల స్థలాన్ని రేవంత్ ప్రభుత్వం ఇస్తామంటే కూడా వద్దని తెగేసి చెప్పిన అరుదైన వ్యక్తిత్వం సిధారెడ్డిదన్నారు. ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అధ్యక్షతన సాగిన ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీలు దేవీ ప్రసాద్, నారదాసు లక్ష్మణరావుతో పాటు వాసిరెడ్డి నవీన్, నాళేశ్వరం శంకరం, శీలా సుభద్రా దేవి, ఆశారాజు, పెద్దింటి అశోక్ కుమార్, విరాహత్ అలీ, ఇందిరా పరాశరం తదితర పాత్రికేయ, సాహిత్య, సాంస్కృతిక రంగాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


కవి నందిని సిధారెడ్డి అభినందన సభలో ప్రసంగిస్తున్న హరీశ్ రావు

సాగునీటి రంగంలో రేవంత్ సర్కార్ విఫలం

కాంగ్రెస్ హయాంలో రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయని, సాగునీటి ప్రయోజనాలు కాపాడటంలో సీఎం రేవంత్ ప్రభుత్వం విఫలమైందని హరీశ్ ఆరోపించారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం వల్ల తెలంగాణకు నష్టం వాటిల్లుతుందని, గోదావరి జలాలను ఏపీకి తరలించుకుపోయే కుట్ర జరుగుతుంటే రేవంత్ మౌనంగా ఉండటం తగదన్నారు. రాష్ట్రానికి నష్టం కలిగించే విధంగా జలదోపిడీకి ప్రయత్నిస్తుంటే కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, సంజయ్ ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు.

ఆదాయం వచ్చే పరిశ్రమలు రాష్ట్రం దాటొద్దు

- ప్రతి శనివారం ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ సబ్ కమిటీ భేటీ: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క
- హ్యుందాయ్ రీసెర్చ్ డెవలప్‌మెంట్ సెంటర్‌కు ఆమోదం

హైదరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ యువతకు పెద్ద సంఖ్యలో ఉపాధి, ఖజానాకు ఆదాయం సమకూర్చే పరిశ్రమలు రాష్ట్రం దాటకుండా అధికారులు అవసరమైన అన్ని చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఆదివారం సాయంత్రం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం అధ్యక్షతన ఇండస్ట్రియల్ ప్రమోషన్ సబ్ కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో ఇండస్ట్రియల్ ప్రమోషన్, ఇప్పటికే చేసుకున్న ఎంవోయూల అమలులో ప్రగతి, కొత్త యూనిట్ల స్థాపనకు సంబంధించిన అంశాలపై చర్చించారు. ఒక పరిశ్రమ స్థాపిస్తే దానికి అనుబంధంగా పెద్ద సంఖ్యలో పరిశ్రమలు వచ్చే అవకాశం ఉన్న అంశాలపై దృష్టి పెట్టాలని, వాటిని త్వరితగతిన ఆచరణలోకి తీసుకురావాలని డిప్యూటీ సీఎం అధికారులకు సూచించారు. ఇకనుంచి ప్రతి శనివారం ఇండస్ట్రియల్, ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ సమావేశాన్ని నిర్వహిద్దామని చెప్పారు. జహీరాబాద్ నిమ్జ్ ప్రాంతంలో హ్యుందాయ్ గ్లోబల్ ఇన్నోవేషన్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ స్థాపనకు సబ్ కమిటీ ఆమోదం తెలిపింది. 675 ఎకరాల్లో రూ.8528 కోట్ల పెట్టుబడితో ఈ కంపెనీ రాష్ట్రానికి రావడం గొప్ప విజయంగా సబ్ కమిటీ అభిప్రాయపడింది. రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుతో 4276 మంది రాష్ట్ర యువతకు ఉపాధి లభిస్తుందని కంపెనీ ప్రతినిధులు సమావేశంలో వివరించారు.

ఈడీ కేసు వల్లే రేవంత్ మోదీని కలిశారా?

- మిస్ ఇంగ్లండ్ ఆరోపణలపై దర్యాప్తు చేయాలి: కేటీఆర్

హైదరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): కేంద్రం పరిధిలోని నీతి ఆయోగ్ సమావేశాన్ని తెలంగాణ ప్రభుత్వం బహిష్కరిస్తుందన్న సీఎం రేవంత్ రెడ్డి మొన్నటి భేటీకి హాజరుకావడం వెనుక అంతర్యం ఏమిటని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదివారం 'ఎక్స్' వేదికగా ప్రశ్నించారు. నేషనల్ హెరాల్డ్ కేసులో ఈడీ చార్జిషీట్‌లో రేవంత్ పేరును చేర్చడంవల్లే ఆయన మోదీని ప్రత్యేకంగా కలుసుకున్నారా? అని అనుమానం వ్యక్తం చేశారు. నీతి ఆయోగ్ సమావేశానికి హాజరుకావడమే కాకుండా.. ప్రధానితో రేవంత్ రెడ్డి సరదాగా గడుపుతూ కనిపించారని, ఏం అద్భుతం జరిగిందో? అని వ్యాఖ్యానించారు. ఇదిలా ఉండగా... ప్రపంచ సుందరి అందాల పోటీల నేపథ్యంలో మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు చేయించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒక ఆడపిల్ల తండ్రిగా ఇలాంటి అనుభవాలు జరగకూడదని తాను కోరుకుంటున్నట్లు చెప్పారు. తెలంగాణలో మహిళలను గౌరవించే గొప్ప సంస్కృతి ఉందని, వారికి అవమానం జరిగితే ఈ రాష్ట్రం అంగీకరించదన్నారు.


మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేస్తున్న ముస్లిం మహిళలు

వక్ఫ్ సవరణకు వ్యతిరేకంగా మజ్లిస్ నిరసన

- కంచన్‌బాగ్ వద్ద పాల్గొన్న అక్బరుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగానికి వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం కొత్తగా చేసిన వక్ఫ్ చట్టాన్ని ఉపసంహరించాలని డిమాండ్ చేస్తూ ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు (ఏఐఎంపీఎల్‌బీ), మజ్లిస్ పార్టీల పిలుపు మేరకు హైదరాబాద్‌లో ఆదివారం పలుచోట్ల మానవ హారాలు జరిగాయి. ఇందులో పాల్గొన్న వేలాది మంది ముస్లింలు నిరసన తెలిపారు. ఒక చేత్తో జాతీయ జెండా, మరో చేతిలో నల్లజెండాలు ప్రదర్శించారు. 'వక్ఫ్ బచావో దస్తూర్ బచావో (వక్ఫ్‌ను కాపాడాలి- రాజ్యాంగాన్ని కాపాడాలి)' అన్న ప్లకార్డులతో యువకులు నినాదాలు చేశారు. కంచన్‌బాగ్ నుంచి చాంద్రాయణ గుట్ట వరకూ ఏర్పాటైన మానవ హారంలో అసెంబ్లీలో ఎంఐఎం పక్ష నేత అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టాన్ని పూర్తిగా ఉపసంహరించే వరకూ పోరాడతామని స్పష్టం చేశారు.

కొవిడ్ సేవలకు ఫీవర్ హాస్పిటల్ సిద్ధం

బర్కత్‌పుర, మే 25 (ఆంధ్రజ్యోతి): కరోనా కేసులు నమోదవుతున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్య శాఖ అప్రమత్తమైంది. ఈ క్రమంలోనే కరోనాను ఎదుర్కోవడానికి నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో అన్ని ఏర్పాట్లు చేశామని హాస్పిటల్ ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ.. కరోనా పట్ల ప్రజలు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఆస్పత్రిలో 216 పడకలను, ఆక్సిజన్ సిలిండర్లను అందుబాటులో ఉంచామని తెలిపారు. కరోనా లక్షణాలతో హాస్పిటల్‌కు వచ్చిన వారికి వెంటనే ఆర్టీపీసీఆర్ టెస్టులను నిర్వహిస్తున్నామని చెప్పారు. ప్రజలు రద్దీ ప్రాంతాలకు దూరంగా ఉండాలని, మాస్కులు ధరించాలని ఆయన సూచించారు.


గృహప్రవేశ సందర్భంగా హోమంలో పాల్గొన్న చంద్రబాబు కుటుంబం

కొత్తింట్లోకి ఏపీ సీఎం చంద్రబాబు

- కుప్పంలో వేడుకగా గృహప్రవేశం

కుప్పం, మే 25 (ఆంధ్రజ్యోతి): మూడున్నర దశాబ్దాలుగా తాను ప్రాతినిథ్యం వహిస్తున్న చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గంలో ఏపీ సీఎం చంద్రబాబు ఓ ఇంటివారయ్యారు. శాంతిపురం మండలం శివపురంలో నూతనంగా ఇల్లు నిర్మించుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం తెల్లవారుజామున చంద్రబాబు, భువనేశ్వరి దంపతులు, ఆయన తనయుడు లోకేశ్, బ్రాహ్మణి దంపతులు నూతన గృహప్రవేశం చేశారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటికీ ఆహ్వానం అందడంతో పెద్దఎత్తున ప్రజలు, టీడీపీ కార్యకర్తలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. చంద్రబాబు కుటుంబం రాత్రి ఆ ఇంట్లోనే బస చేసింది. గృహ ప్రవేశ కార్యక్రమం పూర్తయ్యాక.. కడ (కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ), కుప్పం టీడీపీ సమన్వయ కమిటీ సమావేశాల్లో సీఎం పాల్గొన్నారు.

36 ఏళ్ల తర్వాత సొంతిల్లు

నూతన గృహ ప్రవేశం సందర్భంగా నారా లోకేశ్, బ్రాహ్మణి సామాజిక మాధ్యమాల్లో ఫొటోలు, సమాచారాన్ని పంచుకున్నారు. '36 ఏళ్లుగా మా కుటుంబానికి అండగా నిలుస్తూ, ప్రతి అడుగులోనూ తోడుగా ఉన్న కుప్పం ప్రజల సమక్షంలో నేడు మా సొంతింటి గృహ ప్రవేశం జరిగింది. మీరు చూపించే ప్రేమ, ఆత్మీయతలు మరువలేని అనుభూతిగా మిగిలిపోతుంది. ఇది మా కుటుంబ పండుగ కాదు, మనందరి పండుగ. మీ ఆశీస్సులు ఎల్లప్పుడూ మాకు దీవెనగా నిలుస్తాయి. మీ అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు' అని లోకేశ్ పోస్టు పెట్టారు.


శిక్షణ పొందుతున్న మహిళలతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరి క్రాంతి (ఫైల్)

డ్రోన్ దీదీలు

(మొదటిపేజీ తరువాయి)

నిలిచారు. పంటలకు పురుగు మందులు, ఎరువులు చల్లడం కోసం డ్రోన్లనను అత్యంత నేర్పుగా ఉపయోగించడం ద్వారా దేశంలో ఇతర మహిళలకు ఆదర్శంగా నిలిచారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళల ఘనతను మోదీ ప్రత్యేకంగా ప్రస్తావించిన నేపథ్యంలో డ్రోన్ల ఉపయోగంలో అక్కడి మహిళల శిక్షణ సాగిన తీరుపై 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనమిది!


డ్రోన్ ఎగురవేయడంలో శిక్షణనిస్తున్న నిపుణులు

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన 'నమో డ్రోన్ దీదీ' పథకం కింద సంగారెడ్డి జిల్లాలోని 10 మండలాలకు చెందిన 50 మంది ఎస్‌హెచ్‌జీ మహిళలు డ్రోన్ల ద్వారా పురుగుమందులను పిచికారి చేయడం, ఎరువులను చల్లడంపై శిక్షణ పొందారు. మార్చి 20న జోగిపేటలో ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి ప్రారంభించారు. తొమ్మిది రోజుల పాటు ఈ శిక్షణ సాగింది. డ్రోన్ ఆపరేటింగ్‌లో ఫ్లయింగ్ వెడ్జ్ సంస్థ సహాయం చేయగా, సింక్రో సంస్థ సాంకేతిక సహకారాన్నిచ్చింది. శిక్షణ ముగిశాక ఆ మహిళలు మే నెలలో జిల్లాలో 50 ఎకరాలకు పైగా వివిధ పంటలకు డ్రోన్ ద్వారా పురుగు మందులను పిచికారి చేశారు. కాగా డ్రోన్ ధర రూ.10 లక్షలు! శిక్షణ పొందిన మహిళలు మొత్తం ధరలో 20శాతం చెల్లిస్తే.. 80శాతం సబ్సిడీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. సబ్సిడీ పోనూ మిగిలిన రూ.2లక్షలను వాయిదాల్లో చెల్లించాల్సి ఉంటుంది. కలెక్టర్ క్రాంతి చొరవతో ప్రభుత్వ నిధులతో రెండు విడతల్లో 10 డ్రోన్లు కొనుగోలు చేసి మహిళలకు ఇచ్చారు.

ఏడాది పొడవునా ఆదాయమే

ఒక డ్రోన్‌తో ఒకరు ఆపరేటర్‌గా మరొకరు సహాయకురాలిగా ఉపాధి పొందొచ్చు. వరి సీజన్ లోనే కాకుండా ఏడాదంతా ఈ డ్రోన్లతో పండ్ల తోటలు, కూరగాయలు, పత్తి తదితర పంటలకు మందులు పిచికారి చేయడమో.. ఎరువులు వేయడమో చేయొచ్చు. తద్వారా సంవత్సరం మొత్తం ఆదాయం పొందొచ్చు.

- మాణిక్యం, ఇందిరా క్రాంతి పథం ఏపీఎం-అందోల్

నెలకు రూ. 2 లక్షలు రాబడి

డ్రోన్ నడపడం ఎంతో ఉత్సాహాన్ని, ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తోంది. డ్రోన్ నడపడం ద్వారా నెలకు రూ.2 లక్షల వరకు ఆదాయం పొందొచ్చు. డ్రోన్ ద్వారా ఒక ఎకరా పొలంలో మందులు పిచికారి, ఎరువులు చల్లడం వంటి పనులను 5 నుంచి 8 నిమిషాల్లో పూర్తి చేయొచ్చు. డ్రోన్‌తో పిచికారి చేయడానికి గంటకు రూ. 500 ధరను నిర్ణయించారు. ఈలెక్కన రోజుకు కనిష్ఠంగా 20 ఎకరాల చొప్పున కనిష్ఠంగా 20 రోజుల పని దొరికినా రూ. 2 లక్షల ఆదాయం వస్తుంది.

-బేగరి అనిత, అల్మాయిపేట, అందోల్ మండలం

8 లక్షల సబ్సిడీ.. సంతోషకరం

మహిళా సంఘ సభ్యులను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.8 లక్షల సబ్సిడీతో డ్రోన్‌ను అందజేయడం సంతోషం కలిగిస్తోంది. డ్రోన్ ఆపరేటింగ్‌పై 9 రోజులపాటు శిక్షణనిచ్చారు. డ్రోన్ల ద్వారా పిచికారి చేస్తే విషపూరితమైన రసాయనాల ప్రభావం మనపై ఉండదు.

- చంద్రకళ, దిగ్వాల్, కోహీర్ మండలం

మహిళలకు లాభదాయకం

ప్రభుత్వం సబ్సిడీ కింద డ్రోన్లను అందించడం మహిళా సంఘాలసభ్యులకు ఎంతో లాభదాయకంగా ఉంటుంది. మేమందరం తొమ్మిది రోజుల పాటు డ్రోన్ ఆపరేటింగ్‌లో శిక్షణ పొందాం. పంటల సాగులో అవసరమయ్యే మందుల పిచికారి కోసం డ్రోన్లను వినియోగించడం ద్వారా మా గ్రూపును ఆర్థికంగా బలోపేతం చేసుకుంటాం.

- సురేఖ, కోహీర్ మండల కేంద్రం

టీజీఈసెట్‌లో 93.87% ఉత్తీర్ణత

హైదరాబాద్, హైదరాబాద్ సిటీ, వికారాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ డిగ్రీలో నేరుగా ద్వితీయ సంవత్సరంలో ప్రవేశాలకు ఉద్దేశించిన టీజీఈసెట్ ఫలితాలు విడుదలయ్యాయి. ఆదివారం ఉస్మానియా వర్సిటీలోని కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టా రెడ్డి, ఉస్మానియా వర్సిటీ వీసీ ఆచార్య ఎం.కుమార్, టీజీఈసెట్ కన్వీనర్ ఆచార్య పి.చంద్రశేఖర్ ఫలితాలను విడుదల చేశారు. మొత్తం 18,928 మంది పరీక్షకు హాజరుకాగా 17,768 (93.87%) మంది ఉత్తీర్ణులయినట్టు బాలకిష్టారెడ్డి తెలిపారు. ఈసీఈలో 4,774 మంది, సీఎస్ఈలో 4,522 మంది, ట్రిపుల్‌ఈలో 3,719, సివిల్ 2389, మెకానికల్‌లో 1,813, మైనింగ్‌లో 232, కెమికల్ ఇంజనీరింగ్‌లో 85 మంది ఉత్తీర్ణత సాధించినట్టు పేర్కొన్నారు. కాగా టీజీఈసెట్-2025లో వికారాబాద్ ప్రభుత్వ పాలిటెక్నిక్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ బ్రాంచ్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరిచారు. కళాశాల విద్యార్థులు గొల్ల శ్రీశైలం రాష్ట్ర స్థాయిలో మూడో ర్యాంకు, గొల్ల స్వావి ం 62వ ర్యాంకు, పి.అక్షయ 95వ ర్యాంకు, డి.అక్షయ్ రెడ్డి 103వ ర్యాంకు, ఎం.పృధ్వీరాజ్ 158వ ర్యాంకు సాధించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ కె.రవీందర్, లెక్చరర్లు అభినందించారు.

డీఈఈసెట్‌కు 77.5% హాజరు

డిప్లొమా ఇన్ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఈఈ), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) కోర్సులకు సంబంధించిన డీఈఈసెట్ పరీక్ష రాష్ట్రవ్యాప్తంగా ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం, సాయంత్రం రెండు విడతల్లో జరిగిన ఈ పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 183 పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. 43,615 మంది దరఖాస్తు చేసుకోగా 33,821 (77.54%) మంది హాజరైనట్టు కన్వీనర్ జి.రమేష్ తెలిపారు. పరీక్షలకు తెలుగు మీడియం విద్యార్థులు 15,476, ఇంగ్లిష్, ఉర్దూ మీడియం విద్యార్థులు 18,345 మంది హాజరయ్యారయ్యారని, పరీక్ష ఫలితాలను జూన్5లోపు ప్రకటిస్తామన్నారు.

పుష్కర భక్తుల అరిగోస

- త్రివేణి సంగమంలో భారీగా రద్దీ
- 11వ రోజు 3.50 లక్షల మంది రాక
- 15 కి.మీ. మేర స్తంభించిన ట్రాఫిక్
- మంచినీరు, నిలువ నీడ లేక ఇక్కట్లు
- అధికారులపై శ్రీధర్‌బాబు ఆగ్రహం
- పుణ్యస్నానం ఆచరించిన గవర్నర్




కాళేశ్వరంలో భక్తజన ప్రవాహం; నదిలో పుష్కరస్నానం చేసి పూజలు చేస్తున్న గవర్నర్ దంపతులు

భూపాలపల్లి, మే 25(ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమమైన కాళేశ్వర క్షేత్రం ఆదివారం భక్తులతో కిక్కిరిసిపోయింది. ఊహించని రీతిలో భక్తులు పోటెత్తడంతో సరస్వతీ పుష్కరాల 11వ రోజున ఘాట్లతో పాటు కాళేశ్వరం వీధులు జనమయమయ్యాయి. ఆదివారం సుమారు 3.50 లక్షల మంది భక్తులు పుష్కర స్నానాలు ఆచరించినట్లు ప్రాథమికంగా అంచనా వేశారు. అయితే వరుసగా రెండో రోజు కూడా ట్రాఫిక్ సమస్యలు తలెత్తడంతో పుష్కరస్నానాల కోసం వచ్చిన భక్తులకు ఇక్కట్లు తప్పలేదు. తాత్కాలిక బస్టాండ్ నుంచి పుష్కర ఘాట్లు, ముక్తీశ్వరాలయం వరకు అరిగోస పడ్డారు. వీఐపీల తాకిడి అధికం కావడంతో అధికార యంత్రాంగమంతా వారి సేవలో తరించడం, సామాన్య భక్తుల ఇక్కట్లను పట్టించుకునేవారు లేకపోవడంతో అంతా గందరగోళంగా మారింది. చాలా మంది భక్తులు పుష్కర స్నానానికి పరిమితమై శివయ్యను దర్శించుకోకుండానే అసంతృప్తితో ఇంటి ముఖం పట్టారు. పుష్కరాల గడువు మరో 24 గంటల్లో ముగియనున్న నేపథ్యంలో ఆదివారం భక్తుల సంఖ్య భారీగా ఉండవచ్చని అధికార యంత్రాంగం ముందుగానే అంచనా వేసినా తాగునీరు, నీడ వసతిని కూడా కల్పించలేకపోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు శివయ్య దర్శనం కోసం నిరీక్షించిన చాలామంది భక్తులు ఆకలితో వెనుదిరిగారు. అన్నప్రసాద వితరణలోనూ దేవాదాయ శాఖ విఫలమైందని భక్తులు మండిపడ్డారు. మరోవైపు.. మహదేవపూర్ నుంచి కాళేశ్వరం వరకు దాదాపు 15కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయింది. దీనికి తోడు ప్రైవేటు వాహనాలను ప్రధాన రహదారి నుంచి ఆలయం వరకు, పుష్కర ఘాట్ల వరకు అనుమతించడం సమస్య తీవ్రతను మరింత పెంచింది. చాలా మంది భక్తులు మహారాష్ట్ర వైపు పుణ్యస్నానాలు చేసి శివుడిని దర్శించుకోకుండానే తిరిగి వెళ్లిపోయారు. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో వీఐపీల సేవలో తరించిన అధికారులు.. సామాన్యులను పట్టించుకోకపోవడం విమర్శలకు దారి తీసింది. ట్రాఫిక్ నియంత్రణలో వైఫల్యంపై మంత్రి శ్రీధర్‌బాబు జిల్లా ఎస్పీపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

గవర్నర్ దంపతుల పుష్కరస్నానం

రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు పుష్కర స్నానమాచరించి సరస్వతీ మాతకు చీర, సారె సమర్పించారు. అనంతరం కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో పూజలు నిర్వహించారు. వారి వెంట మంత్రి శ్రీధర్‌బాబు, కలెక్టర్ రాహుల్‌శర్మ ఉన్నారు. ప్రముఖ సినీ నటుడు తనికెళ్ల భరణి, మహారాష్ట్రలోని గడ్చిరోలి ఎంపీ నామ్‌దేవ్‌రావు, ఎమ్మెల్సీ సురభి వాణీదేవి తన కుటుంబసభ్యులతో కలిసి పుష్కరస్నానాలు ఆచరించారు.

క్వార్ట్జ్ కేసులో కాకాణి అరెస్టు



నెల్లూరు, మే 25(ఆంధ్రజ్యోతి): ఏపీ మాజీ మంత్రి, వైసీపీ నెల్లూరు జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. సర్వేపల్లి నియోజకవర్గం పొదలకూరు మండలం రుస్తుం మైన్స్‌లో అక్రమంగా క్వార్ట్జ్ ఖనిజం కొల్లగొట్టిన కేసులో పోలీసులకు దొరక్కుండా రెండు నెలలుగా పరారీలో ఉన్న ఆయన్ను ఆదివారం బెంగళూరు శివార్లలో అదుపులోకి తీసుకున్నారు. ఆయన కోసం నెల్లూరు జిల్లా పోలీసులు నాలుగు రాష్ట్రాల్లో గాలించారు. విమానాశ్రయాలకు లుక్ అవుట్ నోటీసులు జారీ చేశారు. నాలుగు ప్రత్యేక పోలీసు బృందాలు గాలించాయి. ఎట్టకేలకు ఆయన దొరికిపోయారు. వైసీపీ హయాంలో నెల్లూరు జిల్లా పరిధిలోని క్వార్ట్జ్ ఖనిజాన్ని ఆ పార్టీ నాయకులు విచ్చలవిడిగా కొల్లగొట్టారు. ఆ క్రమంలో మంత్రి హోదాలో కాకాణి కూడా తన నియోజకవర్గం పరిధిలోని పొదలకూరులో ఒక మైన్‌ను ఆక్రమించుకుని వందల కోట్ల రూపాయల ఖనిజాన్ని అక్రమంగా తరలించారని టీడీపీ నేతలు ఫిర్యాదులు చేశారు. అప్పట్లో వైసీపీ ప్రభుత్వం ఉండడంతో వాటినెవరూ పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక సోమిరెడ్డి, టీడీపీ నాయకులు అప్పట్లో చేసిన ఫిర్యాదుల్లో కదలిక వచ్చింది. ఈ దోపిడీపై విచారణ జరిపిన అధికారులు సుమారు రూ.250 కోట్ల విలువైన క్వార్ట్జ్‌ను అక్రమంగా తరలించినట్లు గుర్తించారు. 10 మందిపై మార్చి 24న కేసు నమోదు చేశారు. కాకాణిని ఏ-4గా చేర్చారు. ఈ కేసులో విచారణకు హాజరు కావాలని మార్చి 25న నెల్లూరు పోలీసులు కాకాణికి నోటీసులు ఇచ్చారు. అయితే అప్పటికే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. కాకాణి పరారీలో ఉన్నారని నిర్ధారణకు వచ్చిన తర్వాత ఎయిర్‌పోర్టులకు లుక్‌అవుట్ నోటీసులు జారీ చేశారు. కాకాణిని పట్టుకోవడం కోసం నాలుగు ప్రత్యేక బృందాలను నియమించారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం కాకాణి శతవిధాలా ప్రయత్నించారు. హైకోర్టు బెయిల్ పిటిషన్ తిరస్కరించడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించినా.. అక్కడా చుక్కెదురైంది. కాగా, క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు జరిపే క్రమంలో క్వారీ కింద కాపురం ఉంటున్న పల్లెలను ఖాళీ చేయించడం, ఆ సందర్భంగా ఎస్టీలను భయభ్రాంతులకు గురిచేశారన్న అభియోగాలతో ఆయనపై అట్రాసిటీ కేసు నమోదైంది. సోమవారం ఆయన్ను జిల్లాకు తీసుకొస్తారని తెలుస్తోంది. దీంతో నగరంలోని ప్రధాన కూడళ్లతోపాటు కోర్టు ప్రాంగణాన్ని పోలీసులు తమ అదుపులోకి తీసుకోనున్నట్లు సమాచారం.

యాదగిరీశుడి క్షేత్రంలో అపశ్రుతి

- వేర్వేరు ఘటనల్లో ఇద్దరు భక్తుల మృతి


యాదగిరిగుట్ట కొండపైన స్పృహ తప్పి పడిపోయిన ఓ భక్తుడు

యాదాద్రి, మే 25 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో అపశ్రుతి చోటుచేసుకుంది. స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల్లో ఆదివారం వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతిచెందారు. కుటుంబసభ్యులు, స్థానికుల వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న రామసాహు(60) కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మీనృసింహుడిని దర్శించుకునేందుకు యాదగిరిగుట్ట క్షేత్రానికి వచ్చారు. క్యూలైన్లో వేచిఉన్న రామసాహు ఒక్కసారిగా అస్వస్థతకు గురై.. స్పృహ కోల్పోయారు. వెంటనే కొండపైనే ఉన్న ఆస్పత్రికి ఆయన్ను తరలించి ప్రథమ చికిత్స చేశారు. అనంతరం అంబులెన్స్‌లో భువనగిరిలోని ఏరియా ఆస్పత్రికి తరలించగా అప్పటికే ఆయన మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మరో ఘటనలో.. హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం.. గుట్ట కింద గల లక్ష్మీపుష్కరిణిలో స్నానం చేస్తుండగా ఆవీర్ అనే ఏడేళ్ల బాలిక ప్రమాదవశాత్తు నీళ్లలో మునిగింది. కొద్దిసేపటికి చిన్నారిని గమనించిన కుటుంబసభ్యులు ఆమెను బయటకు తీశారు. తొలుత యాదగిరిగుట్టలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి, అక్కడి నుంచి భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే బాలిక మృతి చెందినట్లు చెప్పారు. కాగా ఆదివారం కావడంతో యాదగిరి గుట్టకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కొండపైన, కింద పార్కింగ్ ప్రదేశాలు నిండిపోయాయి. ఆదివారం 67వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకోగా, వివిధ విభాగాల ద్వారా ఆలయ ఖజానాకు రూ.74,33,486 ఆదాయం సమకూరిందని ఈవో వెంకట్రావు తెలిపారు.

పీఎస్ఆర్ పిలిస్తే వచ్చా..!

- గ్రూపు-1 పేపర్లను ఆయనే అప్పగించారు
- డిజిటల్ మూల్యాంకనం చేయాలని చెప్పారు
- పోలీసు కస్టడీలో మధుసూదన్ సమాధానాలు
- కొన్ని ప్రశ్నలకు మౌనం దాల్చిన పీఎస్ఆర్

విజయవాడ, మే 25(ఆంధ్రజ్యోతి): 'పీఎస్ఆర్ పేషీ నుంచి నాకు ఫోన్ వచ్చింది. ఒకసారి వచ్చి కలవమని చెప్పారు. వచ్చిన తర్వాత గ్రూపు-1 జవాబు పత్రాలను డిజిటల్ మూల్యాంకనం చేయాలంటూ ఈ ప్రాజెక్టును ఆయనే నాకు అప్పగించారు' అని విచారణాధికారులకు మధుసూదన్ జవాబిచ్చారు. ఏపీపీఎస్సీ గ్రూపు-1 పత్రాల డిజిటల్ మూల్యాంకనం కేసులో విజయవాడ జిల్లా జైల్లో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులు, కామ్‌సైన్ సంస్థ డైరెక్టర్ పమిడికాల్వ మధుసూదన్‌ను న్యాయస్థానం రెండురోజుల పాటు కస్టడీకి ఇచ్చిన విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం 6 గంటలకు జైలు నుంచి వారిద్దరినీ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు. ప్రభుత్వాస్పత్రిలో వైద్య పరీక్షలు చేయించిన తర్వాత సూర్యారావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. నందిగామ డీఎస్పీ ఏబీజీ తిలక్, మహిళా పోలీస్‌స్టేషన్ ఏసీపీ లతాకుమారి వారిని విచారించారు. ముందుగా పీఎస్ఆర్‌ను విచారించిన తర్వాత మధుసూదన్‌ను ప్రశ్నించినట్టు సమాచారం. ఈ విచారణలో మధుసూదన్ కొన్ని ప్రశ్నలకు సమాధానాలు చెప్పగా, పీఎస్ఆర్ మాత్రం అడిగిన ప్రశ్నలకు డొంక తిరుగుడు జవాబులు చెప్పారని తెలిసింది. పరీక్షాపత్రాల మూల్యాంకనం శాస్త్రీయ పద్ధతిలో చేయకుండా డిజిటల్‌గా ఎందుకు చేశారని పీఎస్ఆర్‌ను ప్రశ్నించారు. అప్పుడున్న పరిస్థితులను బట్టి ఆ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అయన సమాధానంఇచ్చినట్టు తెలిసింది. కాగా, డీజీ స్థాయి అధికారి అయిన పీఎస్ఆర్ ఆంజనేయులు ఇప్పటి వరకు పోలీసుస్టేషన్‌లో నిద్రపోయిన దాఖలాలు లేవు. ఒకవేళ ఏదైనా స్టేషన్‌లో తెల్లవార్లూ ఉన్నా అది ఖాకీ దుస్తులు ధరించిన విధి నిర్వహణలో భాగంగానే ఉన్నారు. ఇప్పుడు తొలిసారిగా ఒక నిందితుడిగా పోలీస్‌స్టేషన్‌లో గడిపారు.

మహోన్నత ఆదర్శమూర్తి పూలే

» వెనుకబడిన వర్గాల వికాసానికి స్ఫూర్తి ప్రదాత: పొన్నం

హైదరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): సామాజిక సంస్కరణలు, సమానత్వం, విద్యావ్యాప్తికి ఎనలేని కృషి చేసిన మహోన్నతమైన ఆదర్శమూర్తి మహాత్మ జ్యోతిరావు పూలే అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హైదరాబాద్‌లోని ప్రసాద్ ల్యాబ్‌లో బీసీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన మహాత్మా జ్యోతిరావు పూలే సినిమాను వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ.. సామాజిక మార్పు, సంస్కరణలు, సమానత్వం, మహిళా సాధికారత కోసం జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే దంపతులు అమూల్యమైన సేవలను అందించారని కొనియాడారు. ప్రముఖ సామాజిక వేత్త కంచె ఐలయ్య సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం పూలే సినిమాను తెలుగులో డబ్బింగ్ చేయించనున్నట్లు తెలిపారు. పూలే సినిమా వీక్షించిన వారిలో ప్రభుత్వ సహలదారు కేశవ రావు, సామాజిక వేత్త కంచె ఐలయ్య, ఎంపీలు సురేష్ షెట్కర్, అనిల్ కుమార్ యాదవ్, బీసీ కమిషన్ ఛైర్మన్ నిరంజన్ తదితరులు ఉన్నారు.

ఉగ్రవాదం మానవాళికి పెద్ద శత్రువు

» ప్రపంచమంతా ఏకమై అంతం చేయాలి: వెంకయ్య

» లండన్‌లో తెలుగు వారి ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగం

హైదరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉగ్రవాదం మానవాళికి పెద్ద శత్రువు అని, దానిని తుద ముట్టించడానికి ప్రపంచ దేశాలన్నీ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఆదివారం ఆయన లండన్‌లోని వీహెచ్‌పీ హిందూ సెంటర్‌లో బ్రిటిష్- భారత తెలుగు సంస్కృతి సంఘం నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ముఖ్య అతిథిగా ప్రసంగించారు. పహల్గాం ఉగ్రదాడి ప్రపంచ మానవాళి చరిత్రలోనే అత్యంత దుర్మార్గమైన, హేయమైన చర్య అని అన్నారు. దీనికి ఉగ్రవాదులు తగిన మూల్యం చెల్లించుకున్నారని, భారతదేశం ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్థాన్‌లోని తొమ్మిది ఉగ్రవాద శిబిరాలను నేలమట్టం చేసిందని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ కేవలం సైనిక చర్య మాత్రమే కాదని, అది 145 కోట్ల మంది భారతీయుల సంకల్పం, ఐక్యతకు నిదర్శనమని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఉగ్రవాద నిర్మూలనకు ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని కోరారు.

మరోసారి పోలీసు కస్టడీకి శ్రవణ్‌రావు?

» ఫోన్ ట్యాపింగ్ కేసులో పిటిషన్ దాఖలు చేసిన సిట్

హైదరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో కీలక నిందితుడైన శ్రవణ్‌రావును ప్రిజనర్స్ ట్రాన్సిట్(పీటీ) వారెంట్‌పై కస్టడీలోకి తీసుకోవడానికి సిట్ అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. ఇందుకు సంబంధించి నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిసింది. ఈ కేసులో తనను అరెస్టు చేయొద్దంటూ సుప్రీంకోర్టు నుంచి మధ్యంతర రక్షణ పొందిన శ్రవణ్‌రావును అనూహ్యంగా ఇనుప ఖనిజం చీటింగ్ కేసులో హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే..! ఆ తర్వాత శ్రవణ్‌రావును ఐదు రోజుల పాటు కస్టడీకి ఇవ్వాలని సీసీఎస్ పోలీసులు కోర్టును ఆశ్రయించగా.. ఒక రోజు కస్టడీకి కోర్టు అనుమతించింది. ఈ క్రమంలో గత శుక్రవారం శ్రవణ్‌రావును సీసీఎస్ పోలీసులు కస్టడీకి తీసుకుని విచారించారు. అయితే.. తనపై అక్రమంగా చీటింగ్ కేసు నమోదు చేశారని ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉండడంతో.. ఫోన్ ట్యాపింగ్ కేసుకు సంబంధించి శ్రవణ్‌రావును కస్టడీకి తీసుకోవాలని సిట్ పోలీసులు ప్రయత్నాలను ప్రారంభించారు. వీలైనంత త్వరగా శ్రవణ్‌రావును పీటీ వారెంట్‌పై అదుపులోకి తీసుకునే దిశలో అడుగులు వేస్తోంది. మరోవైపు ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న ఎస్‌ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు వచ్చేనెల 20న జరగనున్న విచారణకు నాంపల్లి కోర్టులో హాజరు కావాల్సి ఉంది. ఒకవేళ ఆయన న్యాయస్థానంలో హాజరవ్వకపోతే.. కోర్టు అతణ్ని 'ప్రకటిత నేరస్థుడు'గా పేర్కొనే అవకాశాలున్నాయి.

బాసర ఆర్జీయూకేటీ అడ్మిషన్లలో జాప్యం

» టెన్త్ ఫలితాలు వచ్చినా వెలువడని నోటిఫికేషన్

బాసర, మే 25(ఆంధ్రజ్యోతి): నిర్మల్ జిల్లా బాసర ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్ ప్రక్రియలో తీవ్ర జాప్యం జరుగుతోంది. పదవ తరగతిలో వచ్చిన మార్కులు, గ్రేడ్‌ల ఆధారంగా నేరుగా ఆర్జీయూకేటీలో ప్రవేశం కల్పిస్తుండగా ఫలితాల కంటే ముందుగానే ప్రతీసారి నోటిఫికేషన్ విడుదల అయ్యేది. హాల్‌టికెట్ నెంబర్‌తో దరఖాస్తులు తీసుకొని ఫలితాల జాబితాతో పోల్చి విద్యార్థులను ఎంపిక చేస్తారు. కానీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా గత ఏడాది లాగే ఈ సారి కూడా అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదలలో తీవ్ర జాప్యం జరుగుతోంది. గతంలో మార్చి, ఏప్రిల్ నెలలో నోటిఫికేషన్స్ ఇచ్చి, జూన్‌లో కౌన్సెలింగ్ ప్రక్రియ పూర్తి చేసి జూలైలో తరగతులు ప్రారంభించేవారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడం వల్లే ఆలస్యమవుతోందని యూనివర్సిటీ అధికారులు తెలిపారు.

ప్రాజెక్టుల గడువు పెంపునకు అనుమతి తప్పనిసరి

» ఆర్ అండ్ బీ శాఖ నిర్ణయం

హైదరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): కొత్తగా చేపట్టనున్న, పాత ప్రాజెక్టులు నిర్దేశిత సమయంలో పూర్తి కాకుంటే సర్కారు ఆమోదం పొందిన తర్వాతే గడువు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ నిర్ణయించింది. ఆయా ప్రాజెక్టులు సమయానికి పూర్తి కాకుంటే.. వాటికి సంబంధించిన ఫైళ్లను ప్రభుత్వానికి సమర్పించాలని, ఆ ఫైళ్లు పరిశీలించి, ఆమోదించిన తర్వాతే గడువు పొడిగింపు ఉత్తర్వులు జారీ చేయాలని రోడ్లు, భవనాలశాఖలో అంతర్గతంగా జారీ చేసిన సర్క్యులర్.. తీవ్ర చర్చనీయాంశమైంది. కాగా, ఎన్నడూ లేని ఈ నిబంధన తెర మీదకు తేవడం వల్ల కలిగే లాభ నష్టాలపై ప్రభుత్వానికి ఒకటి, రెండు రోజుల్లో నివేదిక సమర్పించాలని చీఫ్‌ఇంజినీర్ల కమిటీ భావిస్తున్నట్లు సమాచారం. కాగా, ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కాంట్రాక్టర్లు విజ్ఞప్తి చేసినా.. ప్రభుత్వం స్పష్టత ఇవ్వలేదని తెలుస్తోంది. ప్రభుత్వానికి ప్రాజెక్టు పనుల పొడిగింపు ఫైల్స్ పంపితే, సమయానికి తిరిగి రాకపోగా, పనులు మరింత జాప్యం జరిగే అవకాశం ఉందని కాంట్రాక్టర్లు చెబుతున్నారు.

రేపు బంగాళాఖాతంలో అల్పపీడనం

» నేడు, రేపు తెలంగాణకు భారీ వర్షసూచన



విశాఖపట్నం/హైదరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతుపవనాలు ఆదివారం మహారాష్ట్రలోనికి ప్రవేశించాయి. రానున్న మూడు రోజుల్లో కర్ణాటక, మహారాష్ట్రతోపాటు ఏపీ, తెలంగాణలో కొన్ని భాగాలు, తమిళనాడులో మిగిలిన భాగాలు, ఈశాన్యభారతంలో మరిన్ని ప్రాంతాలకు రుతుపవనాలు విస్తరించనున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. అయితే ఆదివారంనాటికి మధ్యమహారాష్ట్రలో కొనసాగుతున్న తీవ్ర అల్పపీడనం బలహీనపడిన తర్వాత దాని అవశేషాలు (ఉపరితల ఆవర్తనం) తెలంగాణ, కోస్తాంధ్ర మీదుగా పశ్చిమమధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించి అక్కడ అల్పపీడనంగా మారుతుందని పలు వాతావరణ మోడళ్లు అంచనా వేస్తున్నాయి. ఇది తర్వాత బలపడి ఉత్తర వాయువ్యంగా ఉత్తర ఒడిశా వైపు పయనించనుంది. దీనివల్ల రుతుపవనాలు మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఏపీ, దానికి ఆనుకుని ఒడిశా పరిసరాల వరకు ఈ నెల 27వ తేదీనే విస్తరించనున్నాయని కొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు.

నేడు, రేపు భారీ వర్షాలు

రాష్ట్రంలో సోమ, మంగళ వారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఈ నెల 29 వరకు యెల్లో అలెర్ట్ జారీ చేసింది. కాగా ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లందు, మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట్, జనగాం జిల్లా నర్మెట, సిద్దిపేట జిల్లా హుస్నాబాద్, నిర్మల్ జిల్లా సారంపల్లి, మహబూబాబాద్ జిల్లా కొత్తగూడలో 3సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు తెలిపింది. మరోవైపు ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీశైలం, జూరాల జలాశయాల్లో నీటి మట్టం పెరుగుతోంది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా, ప్రస్తుతం 818అడుగుల మేర నీటి నిల్వ ఉంది.

టీపీసీసీకి.. నలుగురు వర్కింగ్ ప్రెసిడెంట్లు..!

(మొదటిపేజీ తరువాయి)

అవకాశం ఉన్నట్లు కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలిసింది. కేసీ వేణుగోపాల్‌తో భేటీ సందర్భంగా కొత్తగా మంత్రివర్గంలో ఐదుగురికి చోటు కల్పించడంపై చర్చించినట్లు వర్గాలు చెబుతున్నాయి. కుల గణన, బీసీ రిజర్వేషన్లకు పెద్దపీట వేస్తున్న కాంగ్రెస్ పార్టీ, అదేబాటలో మంత్రివర్గ విస్తరణలోనూ సామాజిక న్యాయాన్ని పాటించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఐదు మంత్రి పదవుల్లో రెడ్డి సామాజిక వర్గానికి ఒకటి ఇవ్వాలని ఇప్పటికే నిర్ణయించగా, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అవకాశం కల్పించాలని యోచిస్తున్నట్టు సమాచారం. అయితే.. ఓ సామాజిక వర్గానికి సంబంధించిన పదవిపై మాత్రం సందిగ్ధత నెలకొన్నట్టు ఏఐసీసీ వర్గాలు చెబుతున్నాయి. ఓసీ కేటగిరీలో రెడ్డి సామాజిక వర్గం నుంచి ఇద్దరికి అవకాశం కల్పించే అంశంపైనా చర్చించినట్లు తెలిసింది. కాగా, తెలంగాణ రాజకీయాల్లో ప్రధాన చర్చగా నిలిచిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కేసీఆర్ కుమార్తె కల్వకుంట్ల కవిత లేఖపైనా ఈ భేటీలో చర్చ జరిగినట్లు తెలిసింది. కవిత లేఖపై కేసీఆర్ ఎలా స్పందిస్తున్నారు? తెలంగాణ రాజకీయాల్లో కవిత ప్రభావం ఎంత? కాంగ్రెస్ పార్టీకి కలిసొచ్చే అంశాలు ఏమైనా ఉన్నాయా? అనే కోణాలపై చర్చించినట్లు సమాచారం. కవిత లేఖ రాయాల్సిన అవసరం ఏముంది? ఇందులో బీజేపీ ప్రమేయం ఏమైనా ఉందా? అని చర్చ జరిగినట్లు కాంగ్రెస్ వర్గాల ద్వారా తెలిసింది. బీఆర్ఎస్ పార్టీలో ఆమె చెప్పే దయ్యాలు ఎవరు? భవిష్యత్తులో బీఆర్ఎస్ పరిస్థితి ఏమిటి? అనేదానిపై కేసీ ఆరా తీసినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

నేడు, రేపు బిజీబిజీ

కేసీ వేణుగోపాల్ విదేశీ పర్యటనను ముగించుకుని ఆదివారమే ఢిల్లీకి చేరుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి సైతం ఆదివారమే హైదరాబాద్‌కు చేరుకోవాల్సి ఉంది. చివరి నిమిషంలో కేసీతో రేవంత్, మహేశ్ కుమార్ భేటీ అయ్యారు. అయితే, మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గంపై ఇప్పటికే తుది జాబితాను ఖరారు చేయగా, దాన్ని రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే ఆమోదించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో సోమవారం రాహుల్ గాంధీతో రేవంత్ రెడ్డి, మహేశ్ కుమార్ భేటీ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. వీరిద్దరూ మంగళవారం ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసే అవకాశం ఉంది. ఈ క్రమంలో కేసీ వేణుగోపాల్ సూచనతో ముఖ్యమంత్రి హైదరాబాద్ పర్యటనను వాయిదా వేసుకున్నట్లు సమాచారం.

ఎవరూ స్పందించొద్దు!

ఆలోచించి అడుగులు వేయాలి.. కవిత వ్యవహారంపై కేటీఆర్‌కు కేసీఆర్ దిశానిర్దేశం

తనయుడిని ఫామ్‌హౌస్‌కు పిలిపించుకున్న తండ్రి

ఇద్దరి మధ్య మూడు గంటలపాటు సుదీర్ఘ చర్చ



హైదరాబాద్/సంగారెడ్డి, మే 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్‌లో ఎమ్మెల్సీ కవిత వ్యవహారం రాష్ట్రంలో రాజకీయ దుమారం రేపుతుండగా.. ఈ అంశంపై పార్టీ నేతలెవరూ స్పందించవద్దని అధినేత కేసీఆర్ ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సూచించినట్లు తెలిసింది. పార్టీలో వ్యక్తమవుతున్న భిన్నాభిప్రాయాలపై.. అంతర్గత విభేదాలంటూ ప్రచారం జరుగుతోందని, దీనిపై తొందరపడి స్పందించాల్సిన అవసరంలేదని అన్నట్లు సమాచారం. కేసీఆర్‌కు కవిత రాసిన లేఖ, తదనంతర పరిణామాలపై మూడు రోజులుగా చర్చ జరుగుతున్నా మౌనంగా ఉన్న కేసీఆర్.. ఆదివారం తన కుమారుడు కేటీఆర్‌ను ఎర్రవల్లిలోని ఫామ్‌హౌస్‌కు పిలిపించుకున్నారు. మధ్యాహ్నం 2గంటలకు ఫామ్‌హౌస్‌కు చేరుకున్న కేటీఆర్.. నేరుగా పై అంతస్తులో కేసీఆర్ ఉన్న గదికి వెళ్లినట్లు తెలిసింది. వీరి మధ్య దాదాపు 3గంటలపాటు సుదీర్ఘ చర్చ జరిగింది. ప్రధానంగా కవిత వ్యవహారంపైనే చర్చ జరిగినట్లు తెలుస్తోంది. దీంతోపాటు కాళేశ్వరం కమిషన్ నోటీసులు, పార్టీ అంతర్గత అంశాలు, త్వరలో చేపట్టాల్సిన కార్యక్రమాలపైనా ఇరువురు చర్చించినట్లు సమాచారం. కాగా, పార్టీలో అంతర్గతంగా మాట్లాడుకోవాల్సిన అంశాలను బహిరంగపరచడంతో క్యాడర్‌లో గందరగోళం నెలకొందని వారు అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. కవిత లేఖ గురించి ప్రెస్‌మీట్లు, ఇతర సమావేశాల్లో చర్చించవద్దని, సున్నితమైన విషయంపై ఆలోచించి అడుగులు వేయాలని కేసీఆర్ హితబోధ చేసినట్లు తెలిసింది.

పార్టీ బలోపేతంపై దృష్టి పెట్టాలి..

వివిధ రకాలుగా జరుగుతున్న దుష్ప్రచారాలపై కాకుండా.. పార్టీని బలోపేతం చేయడంపైనే దృష్టి పెట్టాలని, ఇందుకు అనుగుణంగా కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని కేటీఆర్‌ను గులాబీ బాస్ ఆదేశించినట్లు తెలిసింది. త్వరలో పార్టీ విస్తృతస్థాయి సమావేశం ఏర్పాటుచేసి సభ్యత్వ నమోదుకు సంబంధించిన మార్గదర్శకాలు ఇవ్వాలని పేర్కొన్నట్లు సమాచారం. జూన్ రెండో వారంలో పార్టీ సభ్యత్వ నమోదు, సంస్థాగత కమిటీల ఏర్పాటు తదితర అంశాలకు సంబంధించిన షెడ్యూల్‌ను ప్రకటించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. డిజిటల్ సభ్యత్వ నమోదుకు సాంకేతికంగా జరుగుతున్న ఏర్పాట్లు, రూపొందిస్తున్న యాప్ వివరాలపై కేసీఆర్ ఆరా తీశారని, పటిష్ఠంగా అమలు చేయాలని ఆదేశించారని తెలిసింది. కాగా, అమెరికాలోని డల్లా‌స్‌లో జూన్ 1న జరిగే పార్టీ రజతోత్సవ సభకు హాజరయ్యేందుకు కేటీఆర్ ఈ నెల 28న హైదరాబాద్ నుంచి బయలుదేరి వెళ్లనున్నారు. ఈ నేపథ్యంలో డల్లాస్ సభలో ప్రసంగించాల్సిన అంశాలు, సభ అనంతరం అక్కడి తెలంగాణ వారితో భేటీ కావడం వంటి అంశాలు కూడా ఇరువురి మధ్య చర్చకు వచ్చినట్లు తెలుస్తోంది. జూన్ 2న జరిగే తెలంగాణ ఆవిర్భావ వేడుకలను తెలంగాణ భవన్‌లో నిర్వహించాలన్న కేసీఆర్.. ఆ రోజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే బాధ్యతను శాసనమండలి ప్రతిపక్ష నేత, పార్టీ సీనియర్ నాయకుడు మధుసూదనాచారికి అప్పగించాలని నిర్ణయించినట్లు తెలిసింది.

జూన్ 5న కాళేశ్వరం కమిషన్ విచారణకు హాజరు కావాలని కేసీఆర్‌కు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో.. దీనిపై ఏం చేయాలన్న అంశంపై కూడా చర్చించినట్లు సమాచారం. న్యాయ నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకోవాలని యోచించినట్లు తెలిసింది. బీఆర్ఎస్ రజతోత్సవ సభ అనంతరం.. జాతీయ స్థాయిలో, రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న రాజకీయ పరిణామాలు, వాటిపై

నోటీసులపై ఏం చేద్దాం?

బీఆర్ఎస్ స్పందిస్తున్న తీరుపై కూడా కేసీఆర్‌తో కేటీఆర్ భేటీలో చర్చకు వచ్చినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. సుదీర్ఘ చర్చ అనంతరం సాయంత్రం 6గంటల సమయంలో కేటీఆర్ తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు. కాగా, కేటీఆర్ రాక సందర్భంగా ఫామ్‌హౌస్‌లో సిబ్బంది అప్రమత్తమయ్యారు. పై అంతస్తులో కేసీఆర్‌తో మాట్లాడుతున్న సమయంలో ఎవరూ దరిదాపుల్లోకి వెళ్లలేదు. పైకి ఎవరూ రాకుండా ముందే హెచ్చరించినట్లు తెలిసింది.

పార్టీ మీ జాగీరా?

(మొదటిపేజీ తరువాయి)

సామాన్య కార్యకర్తల పరిస్థితేంటని నిలదీశారు. వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మీకు ఎలాంటి బాధ్యతలు లేవా? అని ఆ పోస్టులో ప్రశ్నించారు. పార్టీలో కుట్రలు చేసే వారిని, అంతర్గత విషయాలను బహిర్గతం చేసేవారిని వదిలి.. లేఖ రాసిన వారిని, కుట్రలు ఎదుర్కొంటున్న వారిని అనడంలో కేటీఆర్ ఉద్దేశమేంటో చెప్పాలన్నారు. "కేటీఆర్ చాలా హుషారుగా వ్యవహరిస్తున్నారు. పార్టీ ఏమైనా మీ జాగీరా? గుత్త పట్టారా? అక్కకు హక్కులు లేవా?" అని నిలదీశారు. ఈ పోస్టును ఉద్యమకారులు, కవితకు అత్యంత సన్నిహితులైన వారందరికీ పంపించారు. 'తెలంగాణ విత్ కవితక్క', 'వియ్ స్టాండ్ విత్ కవితక్క' పేరుతో సర్క్యులేట్ చేశారు. చివరిగా 'జై తెలంగాణ.. జై కేసీఆర్' నినాదంతో ముగించారు. కాగా, ఈ పోస్టుపై కూడా బీఆర్ఎస్ వర్గాలు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. కవిత ప్రమేయం లేకుండా, ఆమె అనుమతి లేకుండా పోస్టు చేసే ధైర్యం అత్యంత సన్నిహితులు చేయబోరని అంటున్నారు. మరోవైపు కవిత ధోరణి, వ్యవహారశైలి చూస్తుంటే.. పార్టీలో ఇక కొనసాగలేరేమోనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆమె మాత్రం కేసీఆర్ నాయకత్వంలోనే పనిచేస్తానని చెబుతున్నారు. తాను రాసిన లేఖపై కవిత స్పష్టత ఇచ్చి రెండు రోజులైనా.. ఈ అంశంపై పార్టీ అధినేత కేసీఆర్ ఇంతవరకు స్పందించలేదు. దీంతో ఈ పరిణామాలు ఎటువైపునకు దారి తీస్తాయోనని గులాబీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయి. అసలు కవితను కేసీఆర్ పిలిచి మాట్లాడతారా? లేదా? అన్న సందేహాలు కూడా వ్యక్తమవుతున్నాయి. రోజులు గడుస్తున్న కొద్దీ శ్రేణుల్లో ఈ ఆసక్తి ఎక్కువగా పెరుగుతోంది. అయితే 'సామాజిక తెలంగాణ రావాలి' అంటూ కవిత గతంలో చేసిన వ్యాఖ్యలపై కేసీఆర్ కొంత ఆగ్రహంతో ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఏదైనా విషయంలో తనతో విభేదిస్తే కేసీఆర్‌కు నచ్చదని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. అటువంటి వ్యక్తుల ముఖం చూడటానికి కూడా ఇష్టపడరని అంటున్నారు. ప్రస్తుతం కవితకు కూడా బహుశా అదే పరిస్థితి ఉండవచ్చని చెబుతున్నారు. కొన్ని సందర్భాల్లో కేసీఆర్ వేచిచూసే ధోరణి అవలంబిస్తుంటారని, తొందరపడి స్పందించరని అంటుంటారు. స్పందిస్తే వారికి అనవసర ప్రచారం కల్పించినట్లు అవుతుందని, వారిని ప్రజల్లో పెద్దవాళ్లను చేశామన్న భావన కలుగుతుందన్న ధోరణిలో కేసీఆర్ ఉంటారని చెబుతుంటారు. మరోవైపు శనివారం ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్‌తో ఆయన కుమారుడు, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ అయ్యారు. మధ్యాహ్నం అక్కడికి వెళ్లిన కేటీఆర్.. సాయంత్రం వరకు కేసీఆర్‌తోనే ఉన్నారు. ఆ సందర్భంలో పార్టీలో వ్యక్తమయ్యే భిన్నాభిప్రాయాలకు తొందరపడి స్పందించాల్సిన అవసరం లేదని కేసీఆర్ చెప్పినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇంటి పరువు రచ్చకెక్కడంతో డ్యామేజ్ కంట్రోల్ ఎలా చేస్తారా.. అని పార్టీ శ్రేణులు ఎదురుచూస్తున్నాయి. కవిత అంశంపై ఎక్కడో ఒకచోట ఫుల్‌స్టాప్ పెట్టకపోతే అనవసరంగా విపక్షాలకు ఆయుధాలను ఇచ్చినట్లవుతుందని పార్టీ సీనియర్ నేతలు అభిప్రాయపడుతున్నారు. త్వరగా డ్యామేజ్ కంట్రోల్ చేయకుంటే ముున్ముందు ఈ అంశాన్ని అధికార, విపక్షాలు సీరియల్‌గా సాగదీసే అవకాశం ఉందని అంటున్నారు.

కేసీఆర్‌ను దేవుడంటూనే

ఆయన కొంప ముంచుతున్నవ్

బీజేపీకి బలం చేకూరుస్తున్నవ్.. నీ లేఖలు.. లీకులతో బీఆర్ఎస్‌లో గందరగోళం

- » పార్టీ నేతలను బీజేపీలోకి పంపే యత్నం
- » ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యలపై తూర్పు జగ్గారెడ్డి
- » ఆమె సొంతంగా రాజకీయాల్లో ఎదగలేదు
- » ఈ ఎపిసోడ్‌తో కాంగ్రెస్‌కు నష్టమేమీ లేదు
- » బీజేపీకి లాభం జరగకుండా అప్రమత్తం కావాలి
- » రాహుల్ ప్రధాన శత్రువు బీజేపీ
- » మీడియాతో చిట్‌చాట్‌లో జగ్గారెడ్డి



హైదరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత.. కేసీఆర్‌ను దేవుడంటూనే ఆయన కొంప ముంచుతోందని, రాష్ట్రంలో బీజేపీకి బలం చేకూరేలా చేస్తోందని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. లేఖలు, లీకులతో బీఆర్ఎస్ నాయకులను గందరగోళానికి గురి చేస్తున్న ఆమె.. వారిని బీజేపీ వైపునకు మళ్లేలా చేస్తున్నదన్నారు. కవిత రాజకీయాల్లో నేరుగా ఎదిగిన వ్యక్తి కాదని, కేసీఆర్ పేరుతోనే ఆమె ఎదిగిందని చెప్పారు. ఆదివారం ఇక్కడ ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు.. ఇప్పుడు ప్రభుత్వంలో ఉన్నప్పుడూ కాంగ్రెస్ రాష్ట్రంలో బలంగానే ఉందని, కవిత ఎపిసోడ్‌తో తమ పార్టీకి వచ్చిన నష్టం ఏమీ లేదని చెప్పారు. రాష్ట్రంలో మొదటి నుంచీ బలంగా లేని పార్టీ బీజేపీనేనన్నారు. అయితే ఈ ఎపిసోడ్‌తో కాంగ్రెస్ శత్రువైన బీజేపీకి లాభం చేకూరకుండా తాము అప్రమత్తం అవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. కవిత లేఖలతో కేసీఆర్ కుటుంబంలో కలకలం చోటు చేసుకుందని, ఏదో జరుగుతోందన్న చర్చ వారం రోజులుగా నడుస్తోందని, ఆమె కొత్త పార్టీ పెట్టనుందన్న చర్చా నడుస్తోందన్నారు. కేసీఆర్‌కు రాష్ట్ర విభజన అంశంతో ప్రజలు ఓటేస్తే.. కాంగ్రెస్ పార్టీకి పరిపాలనను చూసి ఓటేస్తారని చెప్పారు. మతం పేరుతో రాజకీయం చేసే పార్టీ బీజేపీ అని అన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఒకటి, రెండు స్థానాల్లో వరుసగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఉంటే.. బీజేపీ మూడో స్థానంలో ఉందన్నారు. ఈ తరుణంలో కేసీఆర్ కుటుంబంలో పంచాయతీ.. రాజకీయంగా బీఆర్ఎస్‌కే నష్టమని పేర్కొన్నారు. కుటుంబ తగాదాతో ఆ పార్టీ నేతలు గందరగోళానికి గురై.. బీజేపీ వైపునకు మళ్లే ప్రమాదం ఉందని అభిప్రాయపడ్డారు. "ఎవరికి వారు తాము ఏదో అనే ఫీలింగ్ మంచిది కాదు. ఎవరు ఒప్పుకున్నా.. ఒప్పుకోకున్నా కేసీఆర్.. కేసీఆరే..! ఆయనతోనే బీఆర్ఎస్ పార్టీకి ఉనికి. కేటీఆర్, హరీశ్, కవితల వల్ల ఏమీ కాదు. కవిత ఏ చెట్టు నీడలో అయితే బతుకుతున్నదో.. ఆ చెట్టునే నరికివేస్తున్నది. కూర్చున్న చెట్టు కొమ్మనే నరుకుతున్నట్లుగా ఆమె వ్యవహారం ఉన్నది" అని వ్యాఖ్యానించారు. డిప్రెషన్‌లో తొందరపడి లేఖలు రాసిన కవిత.. బీజేపీని పెంచి పోషించే పనిలో పడ్డారని ఆరోపించారు. ఈ మాత్రం రాజకీయ అవగాహన ఆమెకు లేదా అని అన్నారు. కేసీఆర్‌ను దేవుడు అంటూనే ఆయనను రాజకీయ సమాధి చేస్తోందన్నారు. దేశ రాజకీయాల్లో రాహుల్‌గాంధీ ప్రధాన శత్రువు బీజేపీనే అని గుర్తు చేశారు. గందరగోళంలో ఉన్న బీఆర్ఎస్ శ్రేణులను కాంగ్రెస్ వైపునకు తెచ్చుకునే ప్రయత్నం చేయాలన్నారు. సమయం వచ్చినప్పుడు ఈ విషయాలు సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌గౌడ్ దృష్టికి తీసుకెళ్తానని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తోనూ తన అభిప్రాయాలు పంచుకుంటానని చెప్పారు. కేసీఆర్.. రాజకీయంగా లోతైన ఆలోచన చేస్తారని, ఆయన గురించి కవితకు పూర్తిగా అవగాహన లేకపోవడం దురదృష్టకరమన్నారు. ఆమె వల్ల ఏదీ కాదని, రాజకీయాలను ఆమె మలుపు తిప్పేదీ, ఆమె వల్ల రాజకీయాలు తారుమారు అయ్యేదీ లేదన్నారు. కేసీఆర్ కూతురు కాబట్టే మీడియాలో ఆమెకు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

ఉగ్రదాడులకు ప్రతి దాడి తప్పదు

రాహుల్ ఎవరి వైపు మాట్లాడుతున్నారు?: కిషన్‌రెడ్డి



బేగంపేట/హైదరాబాద్/న్యూఢిల్లీ, మే 25 (ఆంధ్రజ్యోతి): ఉగ్రదాడుల్లో ప్రజలు చనిపోతే నివాళులర్పించే విధానానికి ప్రధాని మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం స్వస్తి పలికిందని.. దాడి చేస్తే ప్రతి దాడి తప్పదని.. కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. ఒకరిని చంపితే వంద మందిని చంపుతామని చూపించామని తెలిపారు. ప్రధాని మోదీ మన్ కీ బాత్ 122వ ఎపిసోడ్‌ను ఆదివారం సనత్‌నగర్ నియోజకవర్గంలో ప్రజలు, బీజేపీ నాయకులతో కలిసి ఆయన వీక్షించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడారు. 46 ఏళ్లుగా పాక్ ఉగ్రవాదాన్ని భారత్‌పై ఎగదోస్తూ అనేక మంది ప్రాణాలను బలితీసుకుంటోందని అన్నారు. ఈ దాడులు జరిగినప్పుడు నివాళులర్పించి సరిపెట్టుకునే వాళ్లమని.. కానీ 2014లో మోదీ ప్రభుత్వం వచ్చాక సర్జికల్ స్ట్రైక్స్, ఆపరేషన్ సిందూర్ ద్వారా ఉగ్రవాదాన్ని, ఉగ్రవాదాన్ని పెంచి పోషించే దేశాన్ని కూడా మట్టి కరిపిస్తామనే గట్టి సందేశాన్ని ఇచ్చారని పేర్కొన్నారు. కాగా, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రకటనలను చూస్తే.. ఆయన మన సాయుధ దళాల స్థైర్యాన్ని బలహీనపరచడానికి, స్వదేశీకరణ ప్రయత్నాలకు అడ్డంకులు సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని అర్థమవుతోందని కిషన్‌రెడ్డి విమర్శించారు. ఇతర దేశాల డ్రోన్లను ప్రశంసించడం నుంచి రాఫెల్ కొనుగోలును ఒక కుంభకోణంగా మాట్లాడటం వరకు.. అగ్నివీర్‌ను విమర్శించడం నుంచి మేక్ ఇన్ ఇండియా ప్రయత్నాలను దెబ్బతీయడం వరకు రాహుల్ ఎప్పుడూ భారత్ తరఫున మాట్లాడలేదని స్పష్టం చేశారు. మరి ఆయన ఎవరి తరఫున మాట్లాడుతున్నారని కిషన్‌రెడ్డి ఎక్స్ వేదికగా ప్రశ్నించారు.

కేటీఆర్ ఆధిపత్యంపైనే కవిత లేఖాస్త్రం

బీఆర్ఎస్‌లో కేటీఆర్ ఆధిపత్యాన్ని అడ్డుకునేందుకు కవిత లేఖాస్త్రాన్ని సంధించిందని ఎంపీ లక్ష్మణ్ తెలిపారు. కేసీఆర్ ప్రతిపాదిస్తున్న కేటీఆర్‌ను కవిత సవాలు చేస్తూ, కేటీఆర్ నాయకత్వాన్ని అంగీకరించనని చెప్పకనే చెబుతున్నారని అన్నారు. ఆదివారం ఢిల్లీలోని తన నివాసంలో లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. కవిత స్థాపించే రాజకీయ పార్టీతో ఒరిగేదేమీ ఉండదని, అస్తిత్వం కోసమే ఆమె ఆరాటపడుతోందని తెలిపారు. కాగా, 'కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ, మరమ్మతుల ఖర్చు ప్రభుత్వమే భరిస్తుందా..?' నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ స్పష్టం చేయాలని బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్ బాబు డిమాండ్ చేశారు. ఈ ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై ఒకవైపు చర్చ జరుగుతుంటే, మరోవైపు ప్రాజెక్టు పునరుద్ధరణ ఖర్చును ప్రభుత్వమే భరించాలని కాంట్రాక్టు సంస్థలు లేఖ రాయడం అనుమానాలకు తావిస్తోందన్నారు.

రేపటి నుంచే టీడీపీ మహానాడు

- » తొలిసారి కడపలో నిర్వహణ
- » ఏర్పాట్లు పూర్తి చేసిన టీడీపీ శ్రేణులు
- » తొలి రెండు రోజులు వివిధ అంశాలపై చర్చలు.. తీర్మానాలు



సిద్ధమవుతున్న ప్రతినిధుల సభా వేదిక

అమరావతి, మే 25 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ జిల్లాల నడిబొడ్డున కడప వేదికగా తెలుగుదేశం పార్టీ మహానాడు నిర్వహణకు సర్వం సిద్ధమైంది. మంగళవారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ కార్యక్రమం.. కార్యకర్తలకు పెద్దపీట వేయడంతో పాటు పలు చరిత్రాత్మక నిర్ణయాలకు వేదికగా నిలవనుంది. తొలిరోజు 27న పార్టీ ప్రతినిధుల సభ, సంస్థాగత నిర్మాణం, భవిష్యత్తు కార్యాచరణతో పాటు టీడీపీ మౌలిక సిద్ధాంతాలు, మంత్రి లోకేశ్ ప్రతిపాదించిన 6 సూత్రాల ఆవిష్కరణ, పార్టీ నియామవళిలో సవరణలపై ప్రధాన చర్చ జరగనుంది. అలాగే పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికకు నోటిఫికేషన్ ఇవ్వనున్నారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు ప్రతినిధుల నమోదుతో పసుపు పండగ ప్రారంభమవుతుంది. అనంతరం ఫొటో ఎగ్జిబిషన్, రక్తదాన శిబిరాలు ప్రారంభించనున్నారు. తొలి రోజు స్వర్ణాంధ్ర సాధన, పార్టీ నిర్వహణ, మారుతున్న కాలానికి అనుగుణంగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ రూపొందించిన 6 సూత్రాల ఆవిష్కరణ, పార్టీ నియమావళిలో సవరణలపై ప్రధానంగాచర్చ జరుగుతుంది. మండల స్థాయిలో మూడు విడతలు ఒకే పదవి చేసిన వారిని అంతకన్నా పెద్ద పదవికి పంపాలన్న నిర్ణయంతో పాటు పలు కీలక అంశాలపై చర్చ జరగనుంది. రెండో రోజు బుధవారం ప్రతినిధుల సభతో పాటు పార్టీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ 102వ జయంతిని పురస్కరించుకుని ఆయనకు ఘన నివాళి అర్పించనున్నారు. అనంతరం ఆరు సూత్రాల్లో మూడోదైన 'తెలుగుజాతి- విశ్వఖ్యాతి' అంశంపై చర్చిస్తారు. ఇందులో భాగంగా సంస్కరణల్లో మేటి ఎన్టీఆర్, చంద్రబాబు పాలనలో ప్రగతిపథంలో రాష్ట్రం, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు, తెలుగుదేశం ఘన విజయాలు- 40ఏళ్ల టీడీపీ ప్రస్థానంపై చర్చతో పాటు కేడర్‌కు నేతలు దిశానిర్దేశం చేయనున్నారు. భోజన విరామం అనంతరం 6 సూత్రాల్లో నాలుగోదైన 'స్త్రీ శక్తి' అంశంపై చర్చలో భాగంగా మహిళా సంక్షేమం, సాధికారత, పటిష్ఠంగా శాంతిభద్రతలు అంశాలపై చర్చ జరుగుతుంది.మూడో రోజు మధ్యాహ్నం 2 నుంచి 5 గంటల వరకు 5 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నారు.

కేశవరావు మృతదేహం తరలింపులో అడ్డంకులు!

- ఆయన బంధువులను శ్రీకాకుళం ఎస్పీ వేధిస్తున్నారు
- ఏపీ సీఎం, హోంమంత్రిలకు పౌరహక్కుల సంఘం లేఖ
- భూమిక మృతదేహం అప్పగింతకు పోలీసుల నిరాకరణ

విజయవాడ/కేశంపేట, మే 25(ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గఢ్‌లో గత వారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో మరణించిన మావోయిస్టు కేంద్ర కార్యదర్శి నంబాల కేశవరావు మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురానివ్వకుండా శ్రీకాకుళం జిల్లా ఎస్పీ మహేశ్వర్‌రెడ్డి అడ్డుపడుతున్నారని పౌరహక్కుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వి.చిట్టిబాబు, చిలుకా చంద్రశేఖర్ ఆరోపించారు. ఈ మేరకు ఆదివారం సీఎం చంద్రబాబు, హోంమంత్రి అనితకు లేఖ రాశారు. కేశవరావు మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు ఆయన బంధువులు చేస్తున్న ప్రయత్నాలకు ఎస్పీ ఆటంకాలు సృష్టిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ వెళ్లిన కేశవరావు సోదరుడిని ఎస్పీ బలవంతంగా వెనక్కి రప్పించారని తెలిపారు. అంతేకాకుండా అప్పటి నుంచి వారిపై నిఘా పెట్టడంతో పాటు గృహ నిర్బంధం విధించినట్లు తెలిపారు. కేశవరావు బంధువులు కోర్టును ఆశ్రయించారని తెలిసిన ఎస్పీ.. కిందిస్థాయి పోలీసు అధికారుల ద్వారా ఛత్తీస్‌గఢ్‌లోనే అంత్యక్రియలు నిర్వహించాలని ఒత్తిడి చేస్తున్నట్లు ఆరోపించారు. కాగా, అబూజ్‌మడ్ ఎన్‌కౌంటర్‌లో మృతిచెందిన మవోయిస్టు భూమిక అలియాస్ వన్నాడ విజయలక్ష్మి (38)మృతదేహాన్ని అప్పగించేందుకు ఆ రాష్ట్ర పోలీసులు నిరాకరించారు. ఆదివారం భూమిక తండ్రి వన్నాడ సాయిలుతో పాటు సమీప బంధువులు ఛత్తీస్‌గఢ్‌లోని నారాయణపూర్ జిల్లా ఆస్పత్రికి వెళ్లారు. అయితే భూమిక మృతదేహం అప్పగింతపై ఉన్నతాధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పోలీసులు చెప్పారని వారు తెలిపారు.

ఎన్‌కౌంటర్ మృతుల్లో కర్నూలు మహిళ లలిత

కర్నూలు/ఆస్పరి, మే 25(ఆంధ్రజ్యోతి): అబూజ్‌మడ్‌లో ఈ నెల 21న జరిగిన ఎన్‌కౌంటర్‌లో చనిపోయిన మావోయిస్టుల్లో ఏపీలోని కర్నూలు జిల్లాకు చెందిన గోనెగండ్ల లలిత (45) అలియాస్ సంగీత కూడా ఉన్నారు. ఆమె మృతిపై ఆలస్యంగా సమాచారం రావడంతో కుటుంబ సభ్యులు మృతదేహం కోసం ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నర్సు ఉద్యోగం కోసం వెళ్లిన లలిత.. దళిత హక్కుల కోసం కుల నిర్మూలన పోరాట సమితి (కేఎన్‌పీఎస్)లో పనిచేశారు. ఆ తర్వాత మావోయిస్టు ఉద్యమానికి ఆకర్షితురాలై అజ్ఞాతంలోకి వెళ్లారు. 20ఏళ్లకు పైగా కుటుంబ సభ్యులతో ఆమెకు ఎలాంటి సంబంధాలు లేవని, మావోయిస్టు పార్టీ పిలుపుతో దండకారణ్యంలో ఆదివాసీలకు నర్సుగా సేవలు చేసేందుకు అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు సమాచారం.

కదులుతున్న రైలు ఎక్కబోతూ మహిళ మృతి

- చర్లపల్లి రైల్వే టర్మినల్‌లో ఘటన

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, కుషాయిగూడ, మే 25 (ఆంధ్రజ్యోతి): కదులుతున్న రైలులో ఎక్కబోతూ.. ప్రమాదవశాత్తు కిందపడి ఓ మహిళ అక్కడికక్కడే మృతి చెందారు. ఈ దారుణ ఘటన చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో ఆదివారం జరిగింది. లింగంపల్లికి చెందిన మట్టల వెంకటేశ్, శ్వేత దంపతులు వారి ఇద్దరు పిల్లలతో కలిసి ఏపీలోని అనకాపల్లికి బయలుదేరి లింగంపల్లి రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. వారు ప్రయాణించాల్సిన జన్మభూమి ఎక్స్‌ప్రెస్‌లో రద్దీ కారణంగా డీ-8 బోగీకి బదులు డీ-3 బోగీలోకి ఎక్కారు. ఈలోగా రైలు కదలడంతో చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో దిగి బోగీ మారుదామనుకున్నారు. స్టేషన్‌లో రైలు ఆగడంతో దిగిన వారిలో భర్త ఇద్దరు పిల్లలు డీ-8 బోగీలోకి ఎక్కారు. కానీ శ్వేత ప్లాట్ ఫారంపైనే ఉండిపోయింది. ఈలోగా రైలు కదలడంతో భయపడిపోయిన శ్వేత రైలు ఎక్కబోతుండగా జారి కింద పడిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అక్రమంగా నివసిస్తున్న రోహింగ్యాలపై కేసు

పెనమలూరు, మే 25 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా పెనమలూరు నియోజకవర్గం తాడిగడపలో గురువారం అర్ధరాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్న యువకులను రోహింగ్యాలుగా గుర్తించారు. ఈ సందర్భంగా వారి వివరాలను పోలీసులు ఆదివారం తెలిపారు. వారు హైదరాబాద్ శరణార్థి శిబిరం నుంచి తప్పించుకుని వచ్చి వివిధ ప్రాంతాల్లో వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నారన్నారు.అనుమానాస్పదంగా తిరుగుతున్న 15 మందిపై బైండోవర్ కేసు నమోదు చేశామని, వీరిలో ముగ్గురు హైదరాబాద్‌లోని శరణార్థి శిబిరానికి చెందినవారు కాగా, మిగిలిన 12 మంది మయన్మార్ నుంచి అక్రమంగా మన దేశంలోకి ప్రవేశించినట్టుగా గుర్తించామన్నారు.

ఏ రాష్ట్రాల్లో పేలుళ్లకు కుట్ర చేశారు?

- టార్గెట్ ఏంటి? శిక్షణ ఎక్కడ తీసుకున్నారు?
- సిరాజ్, సమీర్‌లపై కొనసాగిన విచారణ

విజయనగరం, మే 25(ఆంధ్రజ్యోతి): ఉగ్రవాద సానుభూతిపరులు సిరాజ్ ఉర్ రెహ్మాన్, సయ్యద్ సమీర్‌లపై మూడో రోజు ఆదివారం విచారణ కొనసాగింది. ఎన్ఐఏ, యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ (ఏటీఎస్), స్థానిక పోలీసులు వారిని ప్రశ్నించారు. ఉగ్రవాద విదేశీ లింకులు, ఏయే రాష్ట్రాల్లో పేలుళ్లకు కుట్ర చేశారు? ఆర్థిక లావాదేవీలు, సహకారం అందించిన వారి వివరాల గురించి ప్రశ్నించినట్లు తెలిసింది. సోషల్ మీడియాలో ఫేక్, ఒరిజనల్ ఖాతాలు, కాల్‌డేటా, ఇంటర్నెట్ కాల్స్‌పై ఆరా తీశారు. సౌదీ అరేబియా నుంచి వచ్చిన నిధులు, అవి ఏయే బ్యాంకు ఖాతాల్లోకి వెళ్లాయనే విషయాలపై బ్యాంకు అధికారులతో కూడా చర్చించినట్లు తెలిసింది. అయితే విచారణలో సిరాజ్, సమీర్‌లు చాలా వరకు నోరు మెదపడం లేదని తెలుస్తోంది. అనేక ప్రశ్నలకు 'మాకు సంబంధం లేదు' అనే సమాధానమే చెబుతున్నట్లు తెలిసింది. అధికారులు మాత్రం వారి వద్దనున్న పక్కా సమాచారంతో లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. ఆదివారం 10గంటల పాటు ఇద్దరిని విచారించారు. ఇందులో ఎన్ఐఏ, కర్ణాటక, తమిళనాడు, మహారాష్ట్ర, ఏపీ, తెలంగాణ కౌంటర్ ఇంటెలిజెన్స్, ఏటీఎస్ అధికారులు పాల్గొన్నారు.

కియోస్క్‌తో టీటీడీ సేవలు సులువు

- ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో 20 కియోస్క్‌ల ఏర్పాటు

తిరుమల, మే 25 (ఆంధ్రజ్యోతి): రానున్న రోజుల్లో టీటీడీలో కియోస్క్ (సెల్ఫ్ ఆపరేటెడ్ మిషన్) యంత్రాలు కీలక పాత్ర పోషించనున్నాయి. కియోస్క్‌ల సాయంతో భక్తులకు టీటీడీ సేవలు సులభంగా అందుతున్నాయి. పైగా బోలెడంత సమయం కూడా ఆదా అవుతోంది. దీంతో ఈ కియోస్క్‌లను విరివిగా వినియోగించేందుకు టీటీడీ సిద్ధమవుతోంది. రూ.లక్షలోపు విరాళాలిచ్చే భక్తులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో తొలిసారిగా వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఈ కియోస్క్ మిషన్‌ను ఏర్పాటు చేశారు. భక్తులు దీనిలోని క్యూఆర్ కోడ్‌ను తమ సెల్‌ఫోన్‌తో స్కాన్ చేసి యూపీఐ ద్వారా రూ.లక్షలోపు ఎంతైనా విరాళంగా అందించవచ్చు. ఇది మంచి ఫలితాలను ఇవ్వడంతో టీటీడీ ఇప్పటికే వివిధ ప్రాంతాల్లో 20 కియోస్క్‌లు ఏర్పాటు చేసింది. వీటి ద్వారా ఇప్పటివరకు రూ.4 కోట్ల విరాళాలు రావడం గమనార్హం. ఈక్రమంలో టీటీడీ అందిస్తున్న మరికొన్ని సేవల్లోకి వీటిని ప్రవేశపెట్టాలని అధికారులు భావిస్తున్నారు. త్వరలోనే లడ్డూలు పొందే భక్తులకూ కియోస్క్‌లు అందుబాటులోకి తీసుకొచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. అలాగే, వీఐపీ బ్రేక్ టికెట్లను కూడా సులభతరంగా పొందేలా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రస్తుతం యూపీఐ పేమెంట్లు అధికంగా ఉన్న క్రమంలో కియోస్క్ వినియోగం కూడా భక్తులకు ప్రయోజనకరంగా ఉంటుందని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

అందాల బొమ్మలు.. కన్నీటి చెమ్మలు!

(మొదటిపేజీ తరువాయి)

వచ్చేసరికి తమ దేశంలో ఇలాంటివి సర్వసాధారణంగా జరుగుతున్నాయనే విషయం ఆమెను తీవ్ర ఆందోళనకు గురి చేసింది. ఇలాంటి వాటిని రూపుమాపాలనే లక్ష్యంతో ఒక సంస్థను ప్రారంభించి ప్రజలను చైతన్యం చేస్తోంది. పైన చెప్పిన అతివలు ఎవరో సామాన్య మహిళలు కాదు.. మిస్ వరల్డ్ కిరీటం కోసం పోటీ పడుతున్న సుందరీమణులు. ప్రస్తుతం అందాల పోటీల్లో మెరుస్తున్న అనేక మంది జీవితంలో ఈ స్థాయికి రావడానికి ఎన్నో కష్టాలు, వేధింపులను ఎదుర్కొన్నారు. అలాంటి కొంత మంది అతివల ఆవేదనాభరిత గాథలు వారి మాటల్లోనే..

లైంగిక వేధింపులపై పోరాడుతున్నా..



మా దేశంలో పిల్లలపై లైంగిక వేధింపులు చాలా ఎక్కువగా జరుగుతున్నాయి. ఒక్క పనామాలో మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఈ ఘటనలు పెరుగుతున్నాయి. అయినప్పటికీ ఏ ఒక్కరూ మాట్లాడటం లేదు. ఈ తరహా వేధింపులు నేనూ ఎదుర్కొన్నాను. నిజానికి ఈ వేధింపుల బారిన పడ్డానని కూడా తెలియని వయసులో నేను ఆ అనుభవాన్ని ఎదుర్కొన్నాను. ఈ తరహా లైంగిక వేధింపుల పట్ల అవగాహన కల్పిస్తే ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చు. అందుకే ఫన్‌డియాంగ్ యునిడోస్ (యునైటెడ్ ఫర్ చిల్డ్రన్) ఫౌండేషన్ అధికార ప్రతినిధిగా ఈ అంశాల పట్ల అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తున్నాను. నాకు తెలిసి మనలో చాలామంది ఏదో ఒక వయసులో లైంగిక వేధింపుల బారిన పడిన వారే. అది మనకు ఊహ తెలిసినప్పుడు కావచ్చు లేదంటే అంతకంటే ముందు కావచ్చు. అది ఎందుకు తెలియదంటే, నిశ్శబ్దం. దీని గురించి చర్చించడానికి ఎవరూ ఇష్టపడకపోవడం. ఆ నిశ్శబ్దాన్ని ఛేదించాల్సిన ఆవశ్యకత ఉంది. ఎందుకంటే, మన సమాజంలో అతిపెద్ద సమస్య ఈ లైంగిక వేధింపులు. ఈ తరహా వేధింపుల గురించి మాట్లాడటం కష్టమే, కానీ, ఎక్కడో ఓ చోట ముగింపు పలకాలంటే, మాట్లాడాల్సిందే.

- మిస్‌వరల్డ్ పనామా, కరోల్ రోడ్రిగ్జ్

రేపటిని మార్చగలం..

నిన్నటిని మార్చలేం. కానీ, ప్రయత్నిస్తే రేపటిని మార్చగలం. ఆ ప్రయత్నమే నేను చేస్తున్నాను. మాది సోమాలియా. కూడు, గూడు కోసం మా అమ్మానాన్నలు, నేను ఒంటెపై తిరుగుతూనే ఉండేవాళ్లం. మా దురదృష్టం, మేం ఎక్కడ ఉన్నా ఆ ప్రాంతాన్ని ఖాళీ చేయించేవారు. అలా తిరుగుతూ చివరకు బ్రిటన్ వెళ్లి స్థిరపడ్డాం. అయినా, సోమాలియా అమ్మాయిగా ఆ దేశంలో బాలికల దుస్థితిని మార్చడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాను. సోమాలియాతో పాటు ఆఫ్రికా, మధ్యప్రాచ్య దేశాల్లో ఫీమేల్ జెనిటల్ మ్యుటిలేషన్(ఎఫ్‌జీఎం)(ఆడవాళ్లకు సున్తీలాంటిది(ఖత్నా) ఓ దురాచారంగా కొనసాగుతోంది. సోమాలియాలో 98% మంది మహిళలకు ఇది జరిగింది. మిగిలిన వారికి ఎందుకు కాలేదంటే, వారింకా ఆ వయసుకు రాలేదంతే. ఆ బాధితుల్లో నేనూ ఒకరిని. చాలా మందికి ఈ ఎఫ్‌జీఎం అంటే ఏమిటో తెలియదు. అలాంటి వారికోసమే నా అనుభవం చెప్పాలనుకుంటున్నాను. అప్పుడు నాకు ఏడేళ్ల వయసు. నేను ఆరు బయట ఆడుకుంటుండగా ఓ గదిలోకి తీసుకువెళ్లి బట్టలన్నీ విప్పేశారు. అక్కడ ముగ్గురు ఆడవాళ్లు నా కోసమే బ్లేడ్లు, కత్తెరలతో వేచి చూస్తున్నారు. వారేమీ డాక్టర్లు కాదు. వైద్య పరంగా శిక్షణ కూడా తీసుకోలేదు. వారు నా జననేంద్రియంపై చర్మాన్ని పూర్తిగా తొలగించారు. లోపలి చర్మం కూడా కొంత తీసేశారు. అరుస్తూనే ఉన్నాను. పట్టించుకునే వారే లేరు. పైగా నోర్మూసుకో.. అయిపోయింది.. ధైర్యంగా ఉండు.. ఇది జరుగుతున్నందుకు గర్వపడు.. ఇది మన సంప్రదాయం.. అంటూ చెప్పారు. కోత పూర్తయిన తర్వాత మందపాటి దారంతో కుట్టేశారు. కేవలం, మూత్రం, రక్తం పోవడానికి ఓ సన్నటి ద్వారం మాత్రమే ఉంచారు. నన్ను ఓ చీకటి గదిలో కాళ్లు చేతులు కట్టేసి వదిలేశారు. ఏడుస్తూనే ఉన్నాను. నేను బతికిబయటపడ్డానంటే అది నా అదృష్టం. ఎందుకంటే, ఈ ప్రక్రియ తర్వాత చాలా మంది బాలికలు చనిపోతారు కూడా. మా అమ్మ, బామ్మ అందరూ ఈ ఎఫ్‌జీఎం చేయించుకున్న వారే. ఆడవారికి ఈ బాధలు తప్పవనే వారు చెప్పేది. ఇది సంప్రదాయం, పాటించాలనే చెబుతుంటారు. అదెలా..? మూఢాచారాలు ఇంకెంత కాలం. అందుకే నేను పోరాటాన్ని ప్రారంభించాను. పర్యవసానాలు ఎలా ఉంటాయో తెలుసు. అయినా ఫౌండేషన్‌ను ప్రారంభించాను. చిన్నారుల శరీరం, ఆత్మను దెబ్బతీసేలా సంప్రదాయాలు ఉండకూడదు. మహిళలకూ హక్కులుంటాయని, వారి శరీరంపై వారికి నియంత్రణ ఉండాలనే 'ఫీమేల్ ఇనీషియేటివ్ ఫౌండేషన్' ప్రారంభించాను. నేను పడిన బాధలు మరే బాలికా పడకూడదనే పోరాటం సాగిస్తున్నాను.

- మిస్‌వరల్డ్ సోమాలియా, జైనాబ్ జామా

పదహారేళ్లప్పుడు రేప్‌కు గురయ్యాను

మనం చిన్నతనంలో ఎలా ఉన్నామన్నది కాదు.. యుక్త వయసుకు వచ్చాక మన ఆశలు, ఆశయాలను చేరుకోగలిగామా..? మనం కోరుకున్న జీవితాన్ని పొందగలిగామా..? అన్నది ప్రశ్నగానే మిగిలిపోతుంది. మరీ ముఖ్యంగా ఆఫ్రికా దేశాల్లో. నేను పుట్టి పెరిగిందంతా జాంబియాలోనే. యుక్తవయసుకు వచ్చాకే ఈ ప్రపంచం ఎలా ఉంటుందో తెలిసింది. నాకు 16 ఏళ్లు వచ్చేసరికి నాలోని స్వేచ్ఛను లాగేసుకున్నారు. పదహారేళ్లకే పెళ్లి చేశారు. పదహారేళ్లకే మానభంగానికీ గురయ్యాను. ఇన్నేళ్లుగా ఆ క్షోభను భరిస్తూనే గడిపేశాను. ఎందుకంటే, నాకు జరిగిన అన్యాయం గురించి మాట్లాడే శక్తి నాకు లేదు. ఈ రోజు ఆ శక్తిని పొందగలిగాను. అందుకే ఎనిమిదేళ్ల తర్వాత ఈ సంఘటన గురించి చెబుతున్నాను. ఎందుకంటే, నేను జాంబియాలో అభాగ్యుల ప్రతిబింబంగా భావిస్తున్నాను. వారి కలలు కూడా ఛిద్రమయ్యాయి. వారిని కలల తీరాలకు చేర్చాలన్నదే నా ప్రయత్నం. మన నుంచి ఏదైనా తీసుకోగలరమో కానీ, విద్య, నైపుణ్యాలను మాత్రం తీసుకువెళ్లలేరు. చాలా మంది చెబుతుంటారు, ఈ ప్రపంచాన్ని ఎవరూ మార్చలేరని. నిజమే, మనం పరిపూర్ణత కోసం వెంపర్లాడుతున్నాం కానీ, మనం చెప్పాల్సిన కథనం మార్చాల్సి ఉంది. విద్యతోనే జ్ఞానం వస్తుంది. ఆ జ్ఞానం మనకు శక్తినిస్తుంది. ఆ శక్తే మనం కోరుకున్న సమాజానికి నాంది పలుకుతుంది. దానికోసమే నా తపనంతా.

- మిస్ వరల్డ్ జాంబియా, ఫెయిత్ బ్వాల్యా

వివక్ష, వేధింపులపై పోరాడుతున్నా



సంగీతం మొదలు స్కేటింగ్, మోడలింగ్, మిలటరీ, టీచర్.. ఇప్పుడు మిస్ వరల్డ్ స్వీడన్.. ఎన్నో రంగాల్లో ప్రతిభ చాటాను. కానీ, ఓ అమ్మాయిగా నా జీవితం ఏమైనా మారిందా..? లేనే లేదు. అదే వివక్ష, వేధింపులు. 14 ఏళ్లప్పుడే నా కెరీర్ ప్రారంభమైంది. స్వీడిష్ ఫెడరేషన్ ఆఫ్ వాలెంటరీ డిఫెన్స్ ఎడ్యుకేషన్ అండ్ ట్రైనింగ్‌లో కెరీర్ ప్రారంభమైంది. మగవారితో పోలిస్తే 10 రెట్లు ఎక్కువగా నేను కష్టపడాలని వెంటనే అర్థమైంది. ఎందుకంటే అమ్మాయిని. అయితే అదంతా కూడా స్వీడిష్ నేవీతో కలిసి యూరప్ అంతటా తిరిగినంత వరకే. అప్పుడే పురుషాధిక్య సమాజంలో ఓ మహిళకు ఏం కావాలో అర్థమైంది. ఆ నౌకలో 36 మంది సిబ్బంది ఉంటే ముగ్గురమే మహిళలం. ఓ రోజు మా కమాండింగ్ ఆఫీసర్ నన్ను పక్కకు లాక్కెళ్లి బలవంతం చేయబోయాడు. అప్పుడు నా వయసు 17 ఏళ్లు. అప్పుడే అనుకున్నాను నేను కాకపోతే ఇంకెవరు మార్పు తీసుకువస్తారని. అప్పుడే స్వీడిష్ సాయుధ దళాలలో అధికారాన్ని ఎంతగా దుర్వినియోగం చేస్తున్నారో ఓ పరిశోధనా వ్యాసం రాశాను. అలాగే 'బూట్స్ టు హీల్స్' అంటూ నా కథనే ఓ పుస్తకంగానూ రాయబోతున్నాను. నా లాంటి అమ్మాయిల రక్షణ కోసమే స్వీయ రక్షణ తరగతులను ప్రారంభించాను. పురుషాధిక్య సమాజంలో మహిళలు తమను తాము రక్షించుకోవాలంటే, లింగ సమానత్వం కావాలంటే ఇది తప్పనిసరి.

- మిస్ వరల్డ్ స్వీడన్, ఇసాబెల్ ఆస్

లింగ వివక్షకు వ్యతిరేకంగా గళమెత్తాను..



మిస్ వరల్డ్ గెలుస్తానా..? లేదా..? అన్నది అప్రస్తుతం. కానీ, తరతరాలుగా మహిళలు తీర్చిదిద్దుతున్న ఓ మహిళగా విశ్వ వేదికపై నా వాణిని వినిపించాలనుకున్నాను. మన అమ్మ, అమ్మమ్మ అందరూ తమ బాధను ఓ శక్తిగా మలచుకున్నారు. వారే తనను ఈ రోజు మీ ముందు ఇలా నిలిపారు. వారు ఎన్నో ఆకలి రాత్రులు గడిపారు. వారు తిన్నా తినకపోయినా నా కడుపు నింపేవారు. వారు మేల్కొన్నప్పటికీ నేను తనవితీరా నిద్రపోయే అవకాశం కల్పించేవారు. అయినప్పటికీ అకస్మాత్తుగా, ఓ రాత్రి వేళ తలుపులు గట్టిగా కొట్టిన శబ్దాలు.. తర్వాత మూగ రోదనలు. నాకేమీ అర్థమయ్యేది కాదు. పొద్దుట చూసే సరికి అంతా నిశ్శబ్దం.. అది గృహ హింస. ఇక్కడ ప్రేమకూ నియమాలుంటాయి. భద్రతకు మాత్రం ఎలాంటి హామీ ఉండదు. అప్పుడే నేను అనుకున్నాను మహిళలకూ సాధికారిత కల్పించాలని. లింగ పరమైన వివక్షకు వ్యతిరేకంగా గళమెత్తాను. ఇంటి నుంచే మార్పు మొదలవ్వాలని మా సొంత పట్టణంలో ఈ కార్యక్రమం ప్రారంభించాను. ప్రతి మహిళకూ ఈ ప్రపంచంలో రక్షణ ఉందనే భావన కల్పించాలి. అదే నా ప్రయత్నం.

- మిస్ వరల్డ్ జమైకా, తజే లౌరికా బెన్నెట్

ఆదివాసీ ఆత్మ గౌరవ ప్రతీక..



కెనడా నుంచి ఓ ఆదివాసీ మహిళ మిస్‌వరల్డ్ వేదిక పైకి రావడం ఇదే తొలిసారి. ఇది నాకెంతో సంతోషాన్ని కలిగించే అంశం. నేను కెనడాలోని మారుమూల ప్రాంతంలో ఆదివాసీ తెగలో పుట్టాను. జనాభా మహా అయితే 600 ఉంటుంది. కెనడాలో మా తెగ అమ్మాయిలు, మహిళలు ఎదుర్కొనే కష్టాలు వర్ణనాతీతం. నేను దాదాపు 12సార్లు హత్య చేయబడి ఉండాలి. ఇప్పటికీ మా జాతి ప్రజలు కెనడాలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరీ ముఖ్యంగా రెసిడెన్షియల్ స్కూల్ వ్యవస్థ కారణంగా. మా ఇళ్ల నుంచి బలవంతంగా పిల్లలను తీసుకువెళ్లి ఈ స్కూల్స్‌లో చేర్పిస్తారు. మా భాష, సంస్కృతి అన్నింటినీ నాశనం చేస్తున్నారు. దాదాపు పదివేలకు పైగా మా జాతి ప్రజల సమాధులు ఈ రెసిడెన్షియల్ పాఠశాలల్లో ఉండి ఉంటాయి. మా ఆంటీ, అంకుల్ సమాధులు కూడా దానిలో భాగం. ఇవన్నీ చూస్తూ పెరిగిన నాకు అమ్మే స్ఫూర్తి. మనం పడే బాధకు కూడా ఓ మహోన్నత కారణం ఉండాలని ఆమె నూరిపోశారు. క్షమాగుణం గురించి తెలిపారు. ఇవే నన్ను ధైర్యంగా ముందుకు వెళ్లేందుకు, మా ఇంటిని ఓ వసతి గృహంలా మార్చేందుకు ప్రోత్సహించాయి. మేము ఓ 15 మంది పిల్లలకు వసతి కల్పించడంతో పాటుగా వారి జీవితాల్లో మార్పు తీసుకు వచ్చాము. మిస్ వరల్డ్ పోటీలకు రావడానికి కారణం కూడా ఓ మహోన్నత లక్ష్యం కోసమే. మా జాతి సాధికారతకు కృషి చేయడానికి ఇక్కడి వరకూ వచ్చా. 'రీ కనెక్టింగ్ విత్ రిబ్బన్స్' అంటూ ఓ ప్రాజెక్టును ప్రారంభించాను. మా తెగలో రిబ్బన్ స్కర్ట్ ధరించడం సంప్రదాయం. ఈ ప్రాజెక్టుకు 10వేల డాలర్ల వరకు నిధులను సేకరించాను. ఒకవేళ మిస్ వరల్డ్ కిరీటం గెలిస్తే, అది ఓ చరిత్ర కావొచ్చు కానీ, ఇతరులు ఆ బాటలో నడిచేలా నేను మార్గం వేయలేకపోతే అది నిష్ఫలమేగా.

- ఎమ్మా మారిసన్, మిస్ వరల్డ్ కెనడా

చావు అంచుల వరకూ వెళ్లా..



కేమాన్ ఐల్యాండ్ చాంబర్ ఆఫ్ కామర్స్‌లో ఉద్యోగిగా నేను అన్ని కార్యక్రమాలనూ నిర్వహిస్తుంటాను. మరీ ముఖ్యంగా యువత సమాజంలో మిళితమయ్యేందుకు తోడ్పడే రీతిలో ఈ కార్యక్రమాలుంటాయి. వారికి నైపుణ్యాలను నేర్పిస్తుంటాను. నేనో బాడీ బిల్డర్‌ను. జిమ్‌లో లేకపోతే ఓ మంచి పుస్తకంతో ఉంటా. లిటరేచర్ అభ్యసించిన నేను జర్నలిస్టుగానూ సేవలనందించాను. ఇవేవీ చేయనప్పుడు గాయనిని. ముఖ్యంగా కరావోకే. మా నగరంలో కరావోకే రాణిగా నాకు పేరుంది. అయితే ఇవన్నీ ఓ వైపు మాత్రమే. నేను డిప్రెషన్(కుంగుబాటు) బాధితురాలిని. కేమాన్ ద్వీపంలో ప్రతి ముగ్గురు విద్యార్థుల్లో ఒకరు తమ జీవితాలను అర్థంతరంగా ముగిస్తున్నారు. అంతేనా, 13% మంది ఆ ప్రయత్నాలను చేస్తున్నారు. నేను కూడా వారిలో ఒకరిని. పదహారేళ్ల వయసులో యాంగ్జైటీ(ఆందోళన), డిప్రెషన్ బాధితురాలిని. నా చుట్టూ మనుషులు ఉండేవారు, కానీ ఒంటరిగానే భావించేదాన్ని. నేను అందరినీ చూసి నవ్వేదాన్ని. కానీ, లోలోపల ఏడుస్తూనే ఉండేదాన్ని. ఎన్నో నిద్రలేని రాత్రులు. జీవితమంతా విషాదమేనా అని భావిస్తున్న వేళ కుటుంబసభ్యులు అందించిన తోడ్పాటు, చికిత్స నన్ను ఆ ఆందోళనల నుంచి బయటపడేసింది. మన నిశ్శబ్దం మన జీవితాలకు ముగింపు పలకవచ్చేమో, ఆ నిశ్శబ్దాన్ని ఛేదిస్తేనే వెలుగులు ప్రసరిస్తాయి అన్న ఆలోచన నేను కొత్త జీవితాన్ని ప్రారంభించడానికి కారణమైంది. ఒకప్పుడు నేను మా దేశంలోని ఎంతోమంది డిప్రెషన్ బాధితులలో ఒకరిని. ఇప్పుడు శారీరకంగా, మానసికంగానూ యువత ఫిట్‌గా ఉండేలా తోడ్పడుతున్నాను.

- జాడా రామూన్, మిస్ కేమాన్ ఐల్యాండ్

మిల్లా మాగీ ఆరోపణలు అబద్ధం

- ఆమెతో ఎవరూ అసభ్యంగా ప్రవర్తించలేదు
- మిస్ ఇంగ్లండ్ వివాదంపై జయేష్ రంజన్

హైదరాబాద్, మే 25 (ఆంధ్రజ్యోతి): మిస్ వరల్డ్ పోటీలపై మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ చేసిన ఆరోపణల్లో ఒక్క శాతం కూడా నిజం లేదని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ స్పష్టం చేశారు. మిల్లా మాగీ పాల్గొన్న ప్రతి కార్యక్రమం వీడియోను తాను ప్రత్యక్షంగా వీక్షించానని, ఆమెతో ఎవరూ అసభ్యంగా ప్రవర్తించలేదని తెలిపారు. ఆదివారం ఆయన ప్రపంచ సుందరి పోటీదారులను కలసి మాట్లాడారు. హైదరాబాద్‌లో అడుగుపెట్టినప్పటి నుంచి ఇప్పటివరకు ఏమైనా ఇబ్బందులు ఎదుర్కొన్నారా.. అని ఆరా తీశారు. చౌమహల్లా ప్యాలెస్‌లో జరిగిన డిన్నర్‌లో మిల్లా మాగీతో కలిసి టేబుల్ వద్ద కూర్చున్న మిస్ వేల్స్ మిల్లీ మే ఆడమ్స్‌తో జయేశ్ రంజన్ ప్రత్యేకంగా మాట్లాడి వివరాలు సేకరించారు. హైదరాబాద్‌కు వచ్చిన తొలిరోజు నుంచి ప్రతీ క్షణాన్ని ఆస్వాదిస్తున్నానని, ఎక్కడా ఎలాంటి ఇబ్బందీ అనిపించలేదని జయేశ్ రంజన్‌తో మిస్ వేల్స్ చెప్పినట్టు తెలిసింది. అనంతరం కొందరు మీడియా ప్రతినిధులతో జయేశ్ రంజన్ మాట్లాడారు.

మిల్లా మాగీని ఎవరూ ఇబ్బంది పెట్టలేదు..

మిస్ ఇంగ్లండ్ మిల్లా మాగీ ఆరోపణలు అబద్ధమని జయేశ్ రంజన్ స్పష్టం చేశారు. "స్పాన్సర్లతో కలివిడిగా ఉండాలని నిర్వాహకులు చెప్పారనడంలో ఒక్కశాతం కూడా నిజం లేదు. ఆమె చౌమహల్లా ప్యాలెస్ డిన్నర్‌లో మాత్రమే పాల్గొన్నారు. ఆమె కూర్చున్న టేబుల్ వద్ద మిస్ వేల్స్ కూడా ఉన్నారు. కొందరు అధికారులు, వారి కుటుంబ సభ్యులు ఉన్నారు. ఆమెను ఎవరూ ఇబ్బంది పెట్టలేదు. ఆ వీడియోలను నేను స్వయంగా పరిశీలించాను" అని చెప్పారు. పేదరికాన్ని చూసి బాధ కలిగిందని మిల్లా మాగీ చెప్పడంలోనూ వాస్తవం లేదని.. హైదరాబాద్‌లో అన్నం దొరకని వారిని చూశానన్న ఆమె మాటలు తనకు ఆశ్చర్యంగా అనిపించాయని జయేశ్ రంజన్ పేర్కొన్నారు. ఆమె ఇంటర్వ్యూ ఇచ్చిన బ్రిటన్ పత్రికకు.. సంచలనం కోసం డబ్బులిచ్చి తప్పుడు ప్రకటనలు చేయించే చరిత్ర ఉందని ఆరోపించారు. ఈ విషయంలోనూ అదే జరిగి ఉండవచ్చన్నారు. ఉద్దేశపూర్వకంగా విమర్శలు చేసేవారిని పట్టించుకోబోమని చెప్పారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Medchal-Malkajgiri District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: N. Rahul Kumar. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.